


సాయంసంధ్యాశోభ

చిత్రలేఖకుడు : శ్రీ. రామమూర్తి

బహుధాన్య ఫాల్గుణము · భారతి · మార్చి-1939 · సంపుటము-16 · సంచిక-3



సంపుటం. ౧౬ బహుధాన్య, ఫాల్గునమాసము (మార్చి 1939) సంఖ్య. 3

'శ్రావణం'

[ఈ పద్యాలు నాకు ఏవిధంగా లభించినవో, ఇవి ఎవరు రచించినవో నేను చెప్పను. అసలీపద్యాలకూ పాఠకునికీ నడుమ నేను అడ్డురావలసిన అవసరమే లేకపోయి ఉండును. కవి తనపేరిటనే వీటిని ప్రకటిస్తే. ఊహూం. అందు కతడు ఒప్పుకోలేదు. మళ్లీ అన్నిపద్యాలలోనూ తన వ్యక్తిత్వాన్ని ఉల్లిపొరకాగితంలో కప్పి ఉంచాడు. ఒకరచనావిధానంలో ఇదివరకే ఇతనికి సుప్రసిద్ధి వచ్చింది. ఈ పద్యాలు ఇంకొకక్రొత్తమార్గం తెరుస్తున్నవి. వీటికి ఒకరి సిఫారసు అక్కరలేదు. అనేకులను అనేకవిధాలుగా ఇవి ఆకర్షించకతప్పదు.—శ్రీ. శ్రీ.]

(ఖైదులో పడకమునుపు వరదాకి)

అసలు శ్రావణమాసమధ్యమ్మునందు
కురిసితీరాలి వర్షాలు; కొంచె కొంచ
మేని రాలాలి తుంపరలేని; కాని
ఉక్కమాత్ర మేమాత్రమూ ఉండరాదు.

ఇపుడు నావొళ్లు కొంత లావెక్కె, సుంత
కదిలితే చెమటవానలు కక్కుతుంది;
నేనె వర్షపుమేఘమైతేను, పైని
ఒట్టిపోయింది కొండపై ఉత్తమబ్బు.

ఓసి నీయిల్లు బంగారమో మరేమొ
కనపడ వదేమె పడమటిగాలి, మాకు
అవసరములేని చలివేళలందె మొగసి
మొగసిపడతావు మామీద వేడిపించి.

ఆంధ్రసాహిత్యపరిషదధ్యక్షు నడుగు
తేను నీమాట వెంటనే యిట్లు చెప్పె,
"అలసి సొలసి దాగెను వరుణావరోధ
భామినీగండకర్పూరపాళులందు".

నాకుమాత్ర మాభావము నచ్చలేదు
భావకవిని కాబట్టి; "ప్రియావియోగ
నిబిడనిశ్వాసములు రేగి నేడు మునర
వందరూ గుండెలేసివా రగుటచేత."

వారికీ మాకు ఉన్న చావంత తేడ,
లేని మేనకతో వారు ప్రేమలేని
ఉపరతుల మున్గిపోతారు; ఉన్న చెలియ
సోయగము మాకు ఊర్వశీయదనము.

(ఖైదులోపడ్డాక)

అపుడు మబ్బంటెచాలు, అనార్తనంపు
నర్తనముచేసె పురివిచ్చి నాయెడంద;
ఇంక శ్రావణమాసమంటేన, గుండె
నీలగగనమ్ము గాలియుయ్యాల రెక్క.

ఒక మొయిలు మేకపిల్ల, వేరొకటి ముసలి,
మరియొకటి ముసుగిడ్డ బ్రాహ్మణవితంతు,
వొకటి తెరచాపగుండె విప్పుకొనుపడవ,
ఒకటి వెన్న, ఒకటి దూది, ఒకటి నురుగు.

కారుమబ్బులబారు సవారిచేయు
నాదులో, సామజసమాజమో, దిగంత
ముఖకు విడబారి సాంబ్రాణిపొగల పాయ
పాయసందుల నుమియు నప్సరసకురులో!

ప్రతిపదార్థమ్ములోని రూపమ్మువరకు
అసలుతత్వమ్ముకొరకు ప్రయాణమా మ
నస్సునకు వొక్క ఆవరణమ్ము లేదు;
అపుడు మేఘము మేఘమే యెపుడు కాదు.

నేను కళ్లెత్తి కాస్త చూశానో, అపుడు
నాకు కనపడుతుండేది ఆకసమున
ప్రేయసీమేఘమేఖలయో యెదురుగ,
ఊర్వశీకైశికచ్ఛాయయో కదులుతు.

అప్పుడప్పుడు ఆరోజులందె కొన్ని
కొన్ని రాత్రుల్లు పాకుతూ కుములుతూ వ
గర్చుతూ మూల్గుతూ మింట కనపడేవి
చెలియనిట్టూర్పునల్లపొగలగుబుర్లు.

ఎప్పుడో ఎప్పుడో పైకి ఎగిరి ఎగిరి
నేను ఋషినై పొడుపుకొండసాను పెక్కి—
తూర్పువాకిటికేసి చూస్తూంటె, కాస్త
తేలుతుండేవి పీతాంబరాలకొనలు.

ఇపుడు మారింది బ్రతుకు; మునుపటిగొప్ప
రోజు లన్నీ గతించాయి; బూజుపట్టి
బూజుపట్టి రాయై చచ్చిపోయినాను—
నన్ను చెరసాలలో పెట్టినారులెండి.

నవాభరణం

ఉభయభాషాప్రవీణ, శివరామకృష్ణశాస్త్రి

ఆనాటి ఔన్నత్యమే ఈనాటికీ హిమవత్పర్వతానికి ఉంది. ఆపవిత్రతే ఈనాటి గంగాప్రవాహాన్ని వదలలేదు. అప్పటిమాదిరిగానే ఇప్పటికి భూమి పండుతున్నది. ఆట్టికవులుమాత్రం ఇప్పు డెందు కుండరు? ఉన్నారు. కాని సహృదయులు వారిని కనిపెట్టడం లేదు. అతిసాన్నిధ్యం, అతివ్యవధానం, పదార్థాలను మాటుచేస్తుంది. కాలంచేత అతిసాన్నిధ్యం ఉన్నందున మనము మన సమకాలికులను గుర్తించడంలేదు. ఈబాధ పూర్వంనుండీ కవులు అనుభవించిందే. కనుకనే కాళిదాసు "పురాణ మిత్యేవ నసాధు సర్వం" అన్నాడు.

అది బంగారమే అయితే, ఆకారమేదైనా విలువకు లోపంలేదు. కవికి ప్రతిభ ఉంటే, ప్రబంధం ఎట్లా ఉన్నా అది తప్పక చిరస్థాయిగా ఉంటుంది. సంస్కృత పండితులు, ఇంగ్లీషు పండితులుకూడా కొన్నాళ్లక్రిందట "తెలుగులో వ్రాస్తే అదీ కవిత్వమేనా?" అన్నారు. వాళ్లే ఇప్పుడు తెలుగుతల్లి మెడకు ఉచ్చు తగిలించి "ఈ తల్లి మాదంటే మాద"ని పోట్లాడటంలేదా! అట్లాగే వాడుకభాషలో వ్రాసినా దానికి స్థానం లేకపోదు. సంస్కృతకవిత్వ ముంటే ప్రాకృతకవిత్వాన్ని వదిలివేశామా? మహాప్రబంధా లుంటే అమరుకాదిఖండకావ్యాలను పారేశామా? మనుచరిత్ర గౌరవం మనుచరిత్రదే, లాలిపాట సొగసు లాలిపాటదే. రెంటిలో దేన్నీ పరిత్యజించడానికి వీలులేదు.

నన్నయనాటినుండీ ప్రతిభావంతులైన కవులు తెలుగుదేశంలో పుడుతూనే ఉన్నారు. సమకాలికులు గుర్తించినా లేకపోయినా వారివారి కవిత్వాల్లో ఒక నవ్యత, ఒక అపూర్వభవ్యత ఉంటూనేఉంది. ఎన్ని కట్టలు వేసినా నన్నయనాటి తెలుగుకవిత, జాలుతప్పకుండా వాటిమార్గాన నేడు ప్రవహించడంలేదు. ప్రవాహం కట్టలను నిర్మించుకొంటుందిగాని కట్టలు ప్రవాహాన్ని నిర్మిస్తవా?

మన మిప్పుడు ఒక నవ్యయుగంలో ఉన్నాము. నవ్యత అనేది సాపేక్షధర్మం. ప్రాచీనయుగానికి ఇది నవ్యం; రాబోయే నవ్యతకు ఇది ప్రాచీనము; కోడలుకూడా అత్తఅయినట్లు. కనుకనే పురాణయుగానికి నవ్యమైన ప్రబంధయుగం మనకు ప్రాచీనమైంది. నవ్యత లేకపోతే జీవితమే లేదు. నవ్యతను తృణీకరించడం తగదు.

ఇది ఆంధ్రభారతికి ఒకపర్వమేకాని పూర్వమున్నంతమాత్రాన కవు లందరు రససిద్ధులు కాని, నీరసులుకాని ఎట్లా కారో అట్లాగే నేటికాలపువా రైనంతమాత్రాన కవులందరు నవ్యతకలవారుకూడా కారు. రసవంతములైన పూర్వపు గ్రంథాలను ఆదరించడం, ఈ కాలానివైన నీరసగ్రంథాలను కొన్నింటిని పరిత్యజించడం దీనికి తార్కాణము. కనుక ప్రతిభావిశేష మే హానోపాదాన హేతువు. ఈలాటి ప్రతిభావిశేషముండే గ్రంథాలు ఎప్పటికీ నవ్యాలే. "క్షణే క్షణే యన్నవతాముపైతి తదేవ రూపం రమణీయతాయాః" అనికాదూ పెద్ద లన్నారు.

పనిపడితే శాసనోల్లంఘనం చెయ్యాల్సిందేకాని, శాసనోల్లంఘనంకోసమే శాసనోల్లంఘనం అనడంగాని, శాసనోల్లంఘనమే నవ్యతను సంపాదిస్తుం దనడంగాని, సమ్మతించని ఆధునిక ప్రతిభావత్కవులలో శ్రీ సుబ్బారావుగా రొకరు. అశోకవనికాన్యాయాన నవ్యకవిత్వానికి వీరికవిత్వాన్ని ఉదాహరణంగా తీసుకొని పరిశీలిద్దాము.

కవి అంటే దూదికంటె తేలిక. కాంచనాచలంకంటే బరువు. ఛందోబద్ధంగా వాక్కును ఉచ్ఛ

రించినవా డల్లా కవి అయితే మృగాలుకూడా కవులు కావాలె; ఎందుకంటే వాటి వాక్కులలోకూడా ఒక విధమైన క్రమ ముంటుంది. అర్థమంటారా సజాతీయా లకు తెలుస్తుంది. ఇక నిజమైనకవి కావాలంటే చాలా కొద్దిమంది ఆనోము నోచిఉంటారు. నిజమైన కవి అయితే తనకవిత్వమనే విమానంలో సహృదయులను కూర్చో పెట్టుకుని తాను తిరిగే చతుర్దశభువనాలు దేశకాల భేదం లేకుండా తిప్పి, అక్కడ ఉండే సృష్టిచిత్రాలను చూపించి, ఆనందింపచేయ్యాలె. కవి తనమనస్సులో ఇంద్రుడల్లె భోగా లనుభవిస్తాడు. కనుక కవీంద్రు డన్నారు. చంద్రు డల్లె లోకాలను సంతోషపెడతాడు. కనుక కవి చంద్రు డైనాడు. బ్రహ్మవలె లోకాలను సృష్టించి కవి బ్రహ్మ యినాడు. కనుకనే వేదాలు "కవయో వదంతి" అని అన్ని చోట్ల కవిని గౌరవించినవి. పండితులు అక్కడ కవి అంటే ఇంకో అర్థం చెప్పినారు. కవులకు చాలా అన్యాయం జరిగింది. కర్మఠులు వేదానికి కర్మపరంగాను, వేదాంతులు బ్రహ్మపరంగాను అర్థం చెప్పినట్లు ఏనాటికన్నా పుణ్యాత్ముడైనకవి ఒకడు పుట్టి వేదాలకు కవిత్వపరంగా అర్థం చెప్పకపోడు. పండితరాయలు మొదలయిన మహాత్ములిదివరకే "రసగ్గ్ హ్యేవాయగ్ం" అన్నప్పుడు రస మంటే శృంగారాదు లని అర్థం చెప్పారు. ఆమార్గాన భాష్యం పూర్తిచేస్తే కవిత్వంకూడ ఒకదర్శనం అవుతుంది. కవుల మనస్సు శాంతి పొందుతుంది.

అసలు కవే లేకపోతే వేదా లెట్లా వచ్చినవి? వేదంలో సూర్యచంద్రులు దేవు లెట్లా అయినారు? (వేదాల కర్తృకా లనేవాళ్లను అట్లా ఉంచండి.) భావనాప్రపంచంలో ఆయావస్తువులను చూచి వాటిసౌందర్యాన్ని వర్ణించి, ఉపాసించి ఋషులు కవు లయినారు. కవే లేకపోతే ఉపాసన లేదు. కవి క్రాంతదర్శి. దేశము, కాలము, భావ, మతము, అనేభేదాలు లేకుండా అన్ని వస్తువులను ప్రత్యక్షంగా చూడగలడు. అపూర్వ రహస్యాలను కనిపెట్టగలడు. "రవి కాంచనిచో కవి కాంచు నేకదా!" పండితుడు అతని వాక్కులను వ్యాఖ్యానిస్తాడు. పండితుడివిజ్ఞానం కవిపెట్టినభిక్ష. ఇట్టి అపూర్వవస్తు నిర్మాణ చాతుర్యం కలవానికి, కాంచనాచలానికి పోలి కేమిటి?

కవులను పంక్తిబాహ్యులని ధర్మశాస్త్రాలు బహిష్కరించినవి. కావ్యాలాపాలను వేదాలు నిషేధించినవి. ఎవరిని ఇవి నిషేధించింది? అసత్కవులను, అసత్కావ్యాలను; అంటే కళాకౌశలము లేనికవులను, భావనా సంపత్తిలేని కావ్యాలను. అంతే కాని వ్యాకరణాది దోషా లున్నంత మాత్రాన కాని, నీతి బోధించలేదనికాని అసత్కావ్యం కాదు. సాధుశబ్దాలను సత్ప్రవర్తనను బోధించేవల్లా కావ్యాలయితే అమరం, మనుస్మృతి ఉత్తమకావ్యాలు కావాలె. సాధుశబ్దాలను బోధించడం వ్యాకరణం పని. సత్ప్రవర్తన తెల్పడం ధర్మశాస్త్రంపని.

కావ్యాలలో సదసత్తులను నిర్ణయించడానికై ఆలంకారికులు పూనుకొని కావ్యజీవితాన్ని తెలుసుకొనేటందుకు తంటాలుపడ్డారు. కొందరు అలంకారమే కావ్యజీవితమని, మరికొందరు రీతిఅని, ఒకరు ధ్వనిఅని, ఇంకోరు రసమని గందరగోళపడ్డారు. "ఏదైతేనేం సహృదయుడిని ఆకర్షించిందే కవిత్వం, పరుడిని అకర్షించిందే విలాసిని" అన్నారు తిరుపతికవులు. "అ దెట్లా తెలుస్తుందంటే" "పద్యంమంచిదైతే చివరంగానే నోటికి వస్తుం" అన్నారు. లక్షణవేత్తలు వారివారి లక్షణాలతో మహాకవుల వాక్కులను బంధించాలని చూశారు. ఆకాశాన్ని ఎవరు బంధించగలరు.?

ఆలక్షణవేత్తలే ఈనా డుంటే రాయప్రోలువారి పుస్తకాలు తమలక్షణాలకు సరైన లక్ష్యాలని సంతోషించే వారేమో!

కవి కావడానికి కావాలిసిన సామగ్రి పూర్తిగా వివరించడం కష్టమే కాని ఈకవిమాత్రం అప్పుడప్పుడు ఆనందలోకంలో ప్రవేశిస్తేనేగాని కవి కాలేడని అనంగా విని నే నిట్లా అర్థం చేసుకొన్నాను. కవి తనభావనా బలంచేత చిన్మయలోకంలో ప్రవేశించి జడప్రపంచాన్ని మరచిపోతేనేగాని కవిత్వం చెప్పలేడని. దీనికి సాధనంగా లంపటలేని భోగము, లలిత సౌందర్యోపాసనము వీరికి ముఖ్యగుణాలు. సాధనకూడా అదే! దీనివలన వీరికవిత్వంలో సుకుమారత మాత్రమే కాకుండా ఒకవిధమైన వేదాంతం మొదటినుండి చివరదాకా ఉంటుంది. దానినే బ్రహ్మశ్రీ కురుగంటి సీతారామయ్యగారు, "కొంతమంది కవిత్వం చదువుతుంటే నిరుత్సాహం,

జీవనంమీద విషాదం కలుగుతుంది. సుబ్బారావుగారి కవిత్వం చదువుతుంటే ఉత్సాహము, జీవితంమీద ఆసక్తి కలుగుతుంది" అని వివరించారు.

ఇతరకవులవలె కాకుండా "కవిభూషణుడు" కవిత్వం ఒకఉపాసన అని నమ్ముతాడు. సారస్వతం ఉపాసనంచేసే నవ్వేవాళ్లు కొందరు లేకపోలేదు. భక్తుడికి లోకమంతా భగవంతుడే! కవికి లోకమంతా సౌందర్యమే! సౌందర్యమే దేవతైతే కవి ఎవరవుతాడు? కవి భక్తుడైతే కవిత్వం ఏమవుతుంది? రాముడు దేవుడై హరనాథబాబా దేవుడైతే సౌందర్యం ఎందుకు దేవత కాదు? అన్నట్లు త్రిపురసుందరి అని ఒక దేవత ఉందిగా. ఆవిడ కావ్యాలాపవినోదినికూడానట. అందుకనేనేమో, కాళిదాసాదికవు లందరూ దేవిని ఉపాసించినట్లు కథలు చెపుతారు. అహంకార మమకారాలు పోతేనేగాని నిశ్చలభక్తి కుదురదు. నిశ్చలభక్తి లేంది అలౌకికానందం దొరకదు. అలౌకికానందం ఎరుగనివాడు కవి కాడు. అలౌకికానంద మిచ్చే కవిత్వం ఉపాసన ఎందుకు కాదు?

ప్రపంచంలో శబ్దార్థాలు రెండే పదార్థాలని కొందరిమతం. అందులో శబ్దము శక్త్యంశ, అర్థము శివాంశ. అందుకనే కాళిదాసు "వాగర్థావివ" అన్నాడు. ఆ శబ్దబ్రహ్మను సాధుత్వాసాధుత్వ నిర్ణయం చేసి వైయాకరణులు, నాదాన్ని ఆశ్రయించి గాయకులు, శబ్దార్థాలను రెంటిని ఆశ్రయించి కవులు, పరావాక్కును ఉపాసించి ఋషులు కామ్యములను పొందినారు. అందుకనే "గౌః కామదుఘా సమ్యక్ ప్రయుక్తా స్మర్యతే బుధైః" అని దండియు, "ఏకశ్శబ్దః సమ్యక్ జ్ఞాతః సుప్రయుక్తః సకృదుచ్చరితః స్వర్గే లోకే కామధుక్ భవతి" అని అభియుక్తులును అన్నారు.

శబ్దములో అట్టి అపూర్వశక్తి ఉన్నందుననే రాజులు రత్నాలిస్తే, కవిరాజులు పద్యరత్నాలిచ్చి వారిని సంతోషపెట్టారు. రాజులిచ్చిన రత్నాలు, అగ్రహారాలు ఇతరులు అపహరించారు. పద్యరత్నాలు శాశ్వతంగా ఉన్నవి. రత్నాలు మంచివా? పద్యరత్నాలు మంచివా? కఱ్ఱతో శరీరముమీద కొట్టి మృదువైన వాక్కుతో "క్షమాపణ" కోరితే మహాత్ముడు క్షమిస్తాడు. వెయ్యిరత్నాలిచ్చి ఒక్కతిట్టు తిట్టితే వీరుడు కోపించి వాటిని తిరస్కరిస్తాడు. శరీరానికి సంబంధించిన పదార్థాలకంటే మనస్సుకు, లేక, ఆత్మకు సంబంధించిన వాక్కులోని శక్తి పెద్దది. అట్లాగే కవివాక్కులో ఇమిడిఉన్న భువనాలు ఇతరభువనాలకంటే విలక్షణమైనవి. అభువనాల్లో అన్నీ చేతనాలే. అచేతనాలంటూ లేనేలేవు. పనిపడ్డప్పుడుమాత్రం చేతనాలు అచేతనాలుగానూ, అచేతనాలు చేతనాలుగానూ మారిపోతవి. ఇట్టి విచిత్రలోకాలను సృష్టించే శక్తి సుబ్బారావుగారి సరస్వతికి అపారం — దీనికి ఒకటి రెండు పద్యాలు ఉదాహరణముగా ఇవ్వటముకంటె "తెలుగుతోట" అంతా ఉదాహరణ మంటే బాగుంటుంది.

ఇంకోటి విషయనిగరణం; అంటే ఉపమానోపమేయాలలో ఉపమానాన్ని చెప్పి దానిచేతనే ఉపమేయస్ఫురణ కలిగించడం. ముఖచంద్రు డనటానికి బదులు చంద్రు డనడం. ప్రాచీనులు ఇది ఒక అలంకారమన్నారు. బహుశా ముఖచంద్రుడు ముఖచంద్రుడని వర్ణించంగా, వర్ణించంగా విసుగుపుట్టి కొందరు కవులు చంద్రవాచకపదాన్ని వదిలితే సొగసుపోతుందని ముఖవాచకపదాన్నే వదిలివేయగా, ఈ అలంకారం ఏర్పడి ఉంటుంది. లోకంలో ఎక్కడ ఉపమానోపమేయభావం ప్రసిద్ధిగా ఉంటుందో అక్కడే ఈ అలంకారముంటుంది. లేనిచోట్ల ఈ అలంకారమువల్ల శీఘ్రంగా విషయప్రతీతి కలుగదు. ఈ అలంకారం ఎవరు కనిపెట్టారోకాని, ఇది రాయప్రోలువారి సొమ్మయింది. పూర్వము "రెండర్థంబుల పద్య మొక్కటి చెప్పడమే కష్టం. నేను రెండుకథలనే జోడిస్తా" నని సూరన్న చెప్పినట్లు, ఈ కవి తన కవిత్వమంతా ఆమూలాగ్రం విషయనిగరణంతో నింపేసాడు. విషయనిగరణాన్ని తెలుసుకోలేనివారికి వీరికావ్యాలు మహారణ్యాలు. చూడండి గిరివిషయనిగరణంలో సొగసు:

కావలెనంచుకోరిన యొకానొకపచ్చని నిమ్మపండు చెం
గావిపయంటకొంగు బెడగాబడ పందిలి నెక్కికోసి తీ

లావతి నా కొసంగినటులక్ పలుస్వప్నము లెందుకంటివో
యావిషమప్రదేశము కటా తిలకించితివో పునర్వ్యథన్.

తనకు కావాలెనని కోరిన పచ్చని నిమ్మపండును తాను ప్రేమించిన లీలావతి పమిటచెంగు తొలగ పంది లెక్కకొసి తనచేతులలో పెట్టింది. ఇదికూడా జాగ్రదవస్థలో కాదు, స్వప్నములో. స్వప్నంలోకూడా కవి విషయనిగరణాన్ని వదలలేదు. కాని మేల్కొని చూస్తే అక్కడ ఏమీ లేదు. విషమప్రదేశం తప్ప. ఏమీ లేనిచోట ఎంతశృంగారం ముందో చూడండి! అన్ని రసాల్లోకీ శృంగారాన్ని వర్ణించడం కష్టం. ఎందుకంటే అది కొంచెం ముదురైనా లేతైనా పాకం చెడుతుంది. అర్థాన్ని వివరిస్తే అశ్లీలమయ్యే అంత ముదురుశృంగారాన్ని విషయనిగరణంలో మాటి ఎంత సొగసు, తెచ్చారో చూడండి! కళాకాళల మంటే ఇది.

'మిస్టిసిజమ్' అంటారు ఇంగ్లీషులో. దానిలక్షణాలేవోనాకు బాగా తెలియవు. అది కొంచెము మనస్వనికి సన్నిహితజ్ఞాతి. వాచామగోచరమై అనుభవైకవేద్యమైన బ్రహ్మవలె ఈకవులభావాలు అర్థాన్ని వివరించడానికి అందక అనుభవానికిమాత్రం లొంగుతవి. ఈజాతి కవుల గ్రంథాలు చదివేటప్పుడు కలిగేపర్యుత్సుకభావమే కవిభూషణుడి కావ్యాల్లోను కలుగుతుంది. దాన్ని వివరించుకోలేక సహృదయుడు 'రమ్యాణి వీక్ష్య' అనే కాళిదాసుపద్యం చదువుకొని పుస్తకం అవతల పడేసి కొంతసేపు రసతన్మయుడై ఆనందసమాధిలో మునిగి ఉంటాడు.

ఇంతమృదువుగా తెలుగులో శృంగారరసాన్ని పోషించిన కవులు చాలా తక్కువ. రసమే కాదు భావము మృదువే. భావ మేమిటి భాషా అంతే. భాషేమిటి వారి ఉపాస్య దైవమే అల్లాంటిది. ఆలలితమైన భావాలను సేవించడంలో ఈశైలి పతివ్రత. సహృదయులను ఆకర్షించడంలోమాత్రం అదే విలాసిని. వీణానినాదమల్లే ఆశైలి మిక్కిలి మృదువు. గట్టిగా చదివితే ఆపద్యాలు నోట్లో నలిగి పోతవేమో! ఈలక్షణాలను పట్టే ఇది రాయప్రోలు వారి పద్యమని కొంచె మనుభవం కలవాడు చెప్పగలడు. ఇట్టి స్వతంత్ర శైలికల కవులు మన తెలుగులో పదిమందికంటే ఎక్కువగా లేరు.

పతికట్టురాళ్లవలె ప్రసిద్ధమైన ఉపమానాలను ప్రయోగించడం సులభమే కాని నూతనమైన ఉపమానాలను కల్పించడం ప్రతిభాహీనునకు కష్టం.

ఆతరుచ్ఛాయ లొలసిన పంతవంకు
స్నిగ్ధ సికతాతలమ్ములు చెన్నమీఱు
ఎండ కన్నెఱుగక వానయేపుకనక
అలరు, కలవారి ఇంటిబిడ్డల విధాన.

క్రొత్తక్రొత్త ఉపమానాలు సృష్టించే నేర్పు చూడండి ఎంత చక్కగా ఉందో!

కొన్ని శబ్దాలు గౌణంగా ప్రయోగిస్తే చాలా సొంపుగా ఉంటవన్నారు ఆలంకారికులు. ఆ శబ్దాలను ఈకవి ఎంత కమ్మగా ప్రయోగించాడో చూడండి.

తన గుణలతలు పూచిన శోభలో యన
  చిగునవ్వు వెన్నెల చెండ్లు విసర
తన మనో లీల గాంచిన రాగమధువన
  పలుకుకొమ్మలు పూలపాలు పిదుక
తన భావబంధ మందిన విభ్రమం బన
  జాపులు వలపుటుచ్చులను పన్న
తన ప్రేమభావనల్ గను నూత్నకళ లన
  నవలు ప్రాయంపు మన్ననలు చూప
కనుల నఱవాల్చి పాతితాక్షులతోడ
కాంచియును కాంచలేని క్రీగంటికొనలు
పెనల వాలికల్ రాల నిల్చెను త్వదీయ
మార్గ్య మెనబాయలేదు నామది లతాంగి.

శాంతం రసమే కాదని చాలామంది అంటారు. కాని శాంతమే అన్ని రసాలకు మూలమని, దానినుండి అద్భుతము మొదలయిన ఇతర రసాలు క్రమంగా పుట్టిన వని మహర్షుల మతం —. ఈకవి సాధకుడు. సాధనలో తనకు కలిగిన అనుభవాలను ప్రకటించడానికి కవిత్వం వ్రాస్తాడు కాని, కవి కావాలని కవిత్వం వ్రాయడు. అందువల్ల ఈకవి శృంగారం లోకంలో ఇతర నాయికా నాయకుల ప్రేమవలె సంభోగంలో సమాప్తి చెందక, మాతృభక్తిగానో,

సోదరిస్నేహముగానో మారి సహృదయుణ్ణి జోల పాడుతూ తీసుకువెళ్లి శాంతిరసం ఒడిలో నిద్దర పుచ్చుతుంది. కనుకనే వీరి కావ్యాలు చదువంగానే ఒకవిధమైన సంతృప్తి దొరకుతుంది. సంభోగ పర్యవసన్నాలు కావు కనుకనే వీరి గ్రంథాలలో నాయికలు ఇతర కవుల నాయికలవలె కరభోరులు, శైలస్తనులు కారు.

రాయప్రోలువారి కవితాకన్య చాలా గడుసు పిల్ల. ఒక చేతిలో తృణకంకణం ఇంకో చేతిలో మధుకలశం పట్టుకొని స్వయంవరానికి దేశదేశాలు తిరిగి నిజమైన సహృదయుణ్ణి తెలుగు తోటలోకి తీసుకొనిపోయి స్నేహలతానికుంజములో చేరుస్తుంది. దారిలో తుంటరిపిల్లలు పరిహాసంచేస్తే వినిపించుకోదు. మాట్లాడితే పరువు పోతుందని కాబోలు మాట్లాడదు. అడిగిన మాటకు జవాబు చెప్పకపోవడంకంటె అవమాన మేమిటి ?

ఒక తెలుగుకవిరాయుడు ఢిల్లీరాజు చేతుల్లో పెరిగినాడు. మరొకడు గోల్కొండరాజు చేతులలో పెరుగుతున్నాడు. తృణకంకణంలాంటి గ్రంథాలను సరైనవాళ్లు ఇంగ్లీషు చేసి పంపిస్తే వాటికిమాత్రం గీతాంజలికిమల్లే నోబిల్ ప్రైజు ఎందుకు రాకూడదు ? తెలుగుదేశం ఎడారి కాదు. ఇక్కడా మొదటి నుండి మహాకవులు పుడుతూనే ఉన్నారు !...

ఈకవికవిత్వం భావంలో ఎంత క్రొత్తపోకడ పోతుందో భాషలో అంత ప్రాతపోకడ పోతుంది. ప్రాతంటే ప్రాత ! షుమారు ౨౦౦ సంవత్సరాల నాటి ప్రాత సరుకుగా కనబడుతుంది. తెలుగుజాతీయాలు ఆయనహృదయంలోనుంచి దొర్లుతవో కలంచివరనుండి దొర్లుతవో తెలియదు. అదిచూచి ఈజాతీయరత్నాలన్నీ వీరే అపహరిస్తే తమకు లేకపోతవనేమో కొందరసూయపడతారు.

ప్రబంధకవులు పెక్కుమంది తెలుగుతల్లికి గీర్వాణం కల్పించారు. నవ్యకవులు కొందరు ఆమెకు ఇంగ్లీషు గౌను తొడిగారు. రానురాను సంస్కృతం, ఇంగ్లీషు రానిది తెలుగు తెలియడంలేదు. కొందరి పుస్తకాలలో సంస్కృతం ఛాయలు, కొందరి గ్రంథాలలో ఇంగ్లీషు ఛాయలు కనపడతవి కాని తెలుగుతల్లి స్వస్వరూపం కనబడదు. స్వస్వరూపం కనబడే త్యాగయ్యగారి గీతా లంటే గాయకుల సొత్తు అయినవి. తాళ్లపాకవారి మువ్వగోపాలుడు శాసనోల్లంఘనంవల్ల జైలులో పడ్డాడు. తత్వాలంటే దమ్ముగాళ్ల నోళ్లలో దాగాయి. పాటలన్నీ ఆడవాళ్ల పాలైనవి. ఇటువంటి కష్టకాలంలో చెంపకు చేరడు కళ్లతో కళ్లకింబడి కంకణాలతో పచ్చటి మొహాన పట్టెడు కుంకుమతో కలంకారిచీర కట్టుకొని లాలిపాటలు పాడుతూ మన తెలుగుతల్లి రాయప్రోలువారి కవిత్వంలో ఎలా ప్రతిఫలిస్తుందో చూడండి. తెలుగుతల్లి మాదంటే మాదని పోట్లాడే సాహిత్య పరిషత్తు ఈతల్లి పూజ చేయ్యాలెనో, నవ్య సాహిత్య పరిషత్తు ఈతల్లిపూజ చేయ్యాలెనో తెలియదు.

మాతృత్వంలో విషయనిగరణమే ప్రౌఢదశకు వస్తే ఇతివృత్తనిగరణ మవుతుంది. అభిజ్ఞులు 'మిస్టిసిజమ్' అనేదానికి తెలుగుపేరు పెట్టేదాక దాన్ని "ఇతివృత్తనిగరణ" మనిగాని, "గుప్తకథ" అనిగాని అందాము. స్త్రీలకు పయ్యెదవలెనే ఇది కవిత్వానికి ఒక శోభ అయితే, ఈశృంగారాన్ని తెలుగు కవితాకన్యకు మొదట కూర్చింది రాయప్రోలువారే. ఇంతకు పూర్వం ఇది లేదని కాదు. పదాల్లో ఉంది కాని ప్రబంధాల్లోకి రాలేదు. నన్నయ్యకాలంలో పుట్టి, తిక్కన్నతో ఔచిత్యం నేర్చుకొని, ప్రబంధకవులతో పల్లకి ఎక్కి, తిరుపతికవులతో నాట్యం నేర్చి, తెలుగుకవితాకన్య వయస్సు రాగానే ఆభిజాత్యంతో రాయప్రోలువారిదగ్గర పమిట వేసుకొంది.

వీరి గ్రంథాలలో కథల భాగాలుమాత్రమే కాని సంపూర్ణకథలు లేవు. అది గుణమో దోషమో కాని కాళిదాసు మేఘసందేశంలో కథ ఇట్లాగే తీసుకొన్నాడు. ఆ తీసుకొన్న కొంచెము భాగంలోకూడా కథ మధ్యనించీ ప్రారంభ మౌతుంది. ఆ గ్రంథాలలో మొదటి పద్యాన్ని ఎవరైనా ఒక చిత్రకారుడు చిత్రంగా సృష్టిస్తే అది ఒకరమ్యమైనచిత్రం కావడమే కాకుండా దాంట్లోనే కథ అంతా కూడా ఇమిడి ఉంటుంది. చూడండి ఒక పుస్తకంలో ఒక పిల్ల "దోసెడు మల్లెమొగ్గల నధోముఖయై కొనివచ్చి వాసవచూడ మంచు బలవంతము" చేసింది. ఇంకో దానిలో మరియొక పిల్ల తలంటి పోసుకొనేటందుకు సొమ్ములు తీసి బోసిముఖంతో తొందరతొందరగా ఒక ఉత్తరం

చదవడానికి పెరట్లోకి వచ్చింది. మరొకచోట్లో మరియొక కన్య సంధ్య వార్చుకొనే తండ్రిని, "చీకటి వేళయింది బయటికి పోవద్ద"నే తల్లిని మరపించి చెలికత్తెతో గంగాతీరానికి పోతున్నది. కంకణంలో ఒకశాల ఆడుగులు బొబ్బలెత్త మధ్యాహ్నపు ఎండలో తోటకు నడిచింది. అందరు కన్యకలే, కన్యకల సొగసు అలా కవిని ఆకర్షించింది.

ఇవి లిరికవిత్వంలో కొన్ని సామాన్య గుణాలు. ఇక తృణకంకణంలో విశేషాలు.

గాంధీటోపీ పాశ్చాత్య వ్యామోహాన్ని తగ్గించినట్లు తృణకంకణము ప్రబంధవ్యామోహాన్ని తగ్గించింది. ప్రబంధ మంటే అష్టాదశవర్ణనా లుండాలెనని, అందులో కూడా శ్లేషలు, యమకాలు కలిసి వసుచరిత్రలు, పిల్లవసుచరిత్రలు బయలుదేరినవి. వాటివల్ల కావ్యశిల్పం పరిపుష్ట మైనదిగాని కావ్యజీవితం కృశించింది. ఖండకావ్యాలు నశించినవి. భాష తెలుగైనా తెలుగువాళ్లకు తెలియకుండా పోయింది. కథ అలంకారాలు, శ్లేషలూ అన్నింటిలోను ఒకటే. ఇల్లాంటి వాఙ్మయసంక్షోభంలో తిరపతికవులు వచ్చి ఆ అరణ్యాన్నంతా కొట్టివేసి సేద్యం ప్రారంభించారు. అప్పుడే స్నేహలతలు తృణకంకణాలు మొలిచినవేమో! నిజంగా తృణకంకణం వ్రాసేనాటికి నేను పుట్టినానో లేదో. అందువల్ల దీనికి బీజమేమో నాకు తెలియదు. ఆ పరీక్ష తాటాకులు వెతికేవాళ్లకు వదులుదాము. నవ్యత అంటే అభూతపూర్వం కానవసరం లేదు; కాలంలో మారుమూల దాగినవాటిని బయటికి తీసుకొని రావడముకూడా నవ్యతే. అటువంటి వాఙ్మయారణ్యంలోనుండి ఒకత్రోవ తీయడము కష్టము. తృణకంకణం వస్తే దానివెంబడి ఇంకొక సువర్ణకంకణమో రత్నకంకణమో బయలుదేరవచ్చును. కాని మొదట్లో కవి తన భావనాబలంతో ఈలాటి త్రోవ త్రొక్కడం నేర్పు కాదూ! అందరు రత్నకంకణాలమీద మోజు పడే కాలంలో తృణకంకణం ఎవడికి కావాలె!

ఇంతే కాదు. ఈ పేరులో కూడా ఒకవిశేషమున్నది. అదొక్కటి వివరిస్తే గ్రంథాన్ని అమూలాగ్రం విమర్శించినట్లే. అసలు ఈ గ్రంథం వ్రాయడానికి కారణం అన్వేషించితేనేగాని అమెలికె పట్టదు. కవి ఒక ప్రబంధం వ్రాయా లనుకొంటే ఒకరాజు వచ్చి కర్పూరపుతాంబూల మిచ్చి అది తనకు అంకిత మిమ్మంటే దానికోసం ఈ గ్రంథాన్ని వ్రాయలేదు. "కావ్యం యశసేర్థకృతే" అని వ్రాయలేదు. ఇతని సాధనలో స్త్రీపురుషులు ఒకరి నొకరు ఎందుకు ప్రేమించు కుంటారు? అని శంక కలిగినది. కామోద్రేకం తీర్చుకొందుకేనా? లేక ప్రేమ అంటూ ఇంకొకటి ఉంటుందా? అని. ఇంగ్లీషు మాటలలో చెప్పితే **love, passion** అనే వాటికి భేదం చూపించడానికి. ఈ ప్రణాళికమీదనే కాళిదాసుశాకుంతలం నడిచింది. శకుంతలా దుష్యంతుల అనురాగం శాకుంతలంలో పూర్వోత్తరభాగాలలో ఇలాగే ఉంటుంది చూడండి. ఆ సమస్యను ఈ పుస్తకంలో మాటుపెట్టి కవి, సహృదయు లందరికి, పంపుకొన్నాడు. అటువంటి వివాదాస్పదాలయిన విషయాలలో ఈకవి తన అభిప్రాయం చెప్పడు. కాని గంభీరంగా సూచిస్తాడు.

నాయకులు తమ నాయికలను "కుంభస్తనీ" అని ఏమేమో పిలుచుకొన్నారు కాని 'నా ప్రాణమా' అని, 'విద్యావతీ' అని, 'సోదరీ' అని పిలిచినట్లు ఎక్కడా కనబడదు. తృణకంకణంలో నాయకుడు నాయికను అట్లా పిలిచినాడు. ఆపిలుపులో కవిహృదయ మున్నది. నాయకుడికి కామోద్రేక మున్నప్పుడు 'నా ప్రాణమా' అన్నాడు. అంటే నాయిక లేకపోతే కామోద్రేకంతో తాను బ్రతుక లేనన్నమాట. తరువాత 'విద్యావతీ' అన్నాడు. కామోద్రేకం కొంచెంగా తగ్గి ఆశాభంగం వల్ల క్రమముగా అది ప్రేమగా మారే సామ్యావస్థలో ఆమె విద్యావతి కను కామించకపోయినా ప్రేమించుతూ వన్నాడు. తర్వాత కామోద్రేకం సంపూర్ణంగా పోయింది. ప్రేమమాత్రమే నిలిచింది. అప్పుడు 'సోదరీ' అన్నాడు. సోదరిని ప్రేమించక ఏమిచేస్తాడు? ఇప్పుడు ప్రేయసి, విద్యావతి, సోదరి అనే ముగ్గురి విషయాలలో ఉండే ప్రేమభేదం వ్యాఖ్యానింప బనిలేదా?

కవి తనసమస్య కోసం నాయికా నాయకులను సృష్టించినాడు. వాళ్ల ఊరేదో, పేరేదో, ఆ ఊళ్లో మేడలు ఎంత ఎత్తున్నవో, ఆవిడకళ్లు ఎంత వెడల్పు ఉన్నవో ఈ కొలతలు అవసరము లే దనుకొన్నాడు. ఊరూ పేరూ లేని నాయికా నాయకులతో ఇదివరకు ఎవరు ప్రబంధం వ్రాసినట్లు లేదు. ప్రతిభ తక్కువైనా ఏరాముడినో కృష్ణుడినో ఆశ్రయించి అలోపాన్ని కప్పి

పుచ్చుకొన్నారు. అంతమాత్రాన రామకృష్ణుల కథలు వ్రాసినవా రందరు ప్రతిభాహీను లనిమాత్రం నా ఆశయం కాదు. మన కవికి ప్రతిభ తక్కువై లేగా అల్లాటి కొడ్డిత్రోవ త్రొక్కడానికి—.

కర్మం జాలక ఎవరైనా ఈప్రశ్న లడుగుతా రేమో అని మట్టమధ్యాహ్నపు ఎండలో ఆనాయికను ఒక తోటలోకి ప్రవేశపెట్టినారు. అడుగులు బొబ్బ లెక్క చెమట ముత్యాల సరులతో చెట్టునీడనైనా ఆగకుండా తొందరగా పారేట్ల ఆ పిల్లను ఈప్రశ్న లెవ రడుగుతారు? అడిగితేమాత్రం ఆమె నిలబడి జవాబు చెప్పేటుందా?

ఇంతలోకే ఒక లేడి వచ్చింది. ఇంగ్లీషు లేడీ కా దది! అడవిలేడి. నాయిక ఆలేడి చెల్లెలిని తృణ పరిమళము లుగుల్కొనగా ముద్దాడి పరామర్శ చేసింది. కవిసృష్టికి తిర్యఙ్మనుష్యభేదానికి చాలా దూరము.

ఇంతలోకే నాయకుడు మిసమిసలాడు జవ్వనపు మేలిమితో వచ్చినాడు. వీ రందరు ఒక సెలయేటి గట్టున చెట్టునీడన చేరినారు.

'వకుళవాటీగంధవహులకు పైకొనుచోట
చదలేరు తుంపురుల్ చల్లుచోట'

వరూథినీ ప్రవరాఖ్యులు చేరిన విధంగా! ఆ నాయకులు చేసినపని వేరు. వీరిపని వేరు. దేవలోకం కంటే భూలోకమే ఎక్కువ నీతిమంతముకాబోలు. సూరన్న గారి శాలీనుడు మంచివాడే కాని చేసుకొన్న పెండ్లాముతో తిన్నగా ఉండేడు. కొడవటిగంటివారిపిల్లవాడు బుద్ధిమంతుడే కాని, వానప్రస్థుడైనాడు.

ఇంతకు వీరెవరు? చిన్నప్పుడు ఒక కంచంలో తిన్న నేస్తగాండ్రు. ఆదిన్నారి నేస్తములో ముగ్ధులై ఉన్నందున అప్పుడు ఏఘోషా ఎరుగరు. పిమ్మట ఒకరి నొకరు కామించుకొన్నారు. కొన్నాళ్లకు విడదీసిన తీగల పూవు చందంగా విడిపోయి నేటికి కలసినారు. విడిపోయేటప్పుడు నాయకుడు ఆమె చేతికి ఒక పట్టుతోరం కట్టినాడు. ఇన్నాళ్లనుండీ దానిని ఆమె భద్రంగా కాపాడుకొన్నది.

కాంతు నశియింపని వియోగకాలమందు
సర్పమును గాంచి భ్రమియించు సఖులపాలి
పూలదండ యటంచును, పూలదండ
కాంచి కాలపాశంబను కాంతు తెగిన—

ఈ గ్రంథానికి ఇదో కీలకం. సర్పమునే పూలదండగా తలచువాళ్లు పట్టుతోరం పారేసుకొంటారా?

'కామోద్రేకంతో ఇదివరకు ఒకరి నొకరు వలచుకొన్నాము. నైమిత్తికములకు అస్ఖలవృత్తి లేదు. (కడలితరగల నిలకడలేదు. సంజకెంజాయ రక్తికాళ్ళతము కాదు.) పడుచుతనములో ఉదయించు వలపులు కడుకొసలి కృశించు జరాక్రాంతదశల ఆ ప్రేమ తృణకంకణమువలె క్షణికము. అది నిజమైన ప్రేమ కాదు. అది ధర్మము కాదు. ఇకమీదట ఒకరి నొకరు పవిత్రమైన ప్రేమతో చూచుకొందాము. ప్రేమకు సంభోగమే అవధి కాదు. "మూఢాః సంభోగ మిచ్ఛంతి". కనుల నొండొరుల చూచుకొన్నను, కొసరి ఏమోయి అని పిలుచుకొన్నను చాలు — 'సౌందర్యార్చనల్' దోసము కాదు. వలపునకు, ప్రేమకు స్వర్గానికి నరకానికి ఉన్నంతభేద మున్నది. మనోవాక్కాయకర్మములచేత వలపు కలుషిత మౌతుంది. తపస్సు తితిక్ష ధ్యానముచేత పవిత్రప్రేమ భగవంతునితో ఐక్య మౌతుంది' అని తెలుసుకొన్నారు. ఇక్కడితో కాంతు తెగింది. కాంతు తెగినాక పూలదండే అయినా తృణకంకణమైనా బంధమే. ఏ బంధమైతే నేమని తృణకంకణము చేసి నాయకుడు నాయికచేతికి కట్టినాడు. అశ్రుధారలతో, వాడిపోకుండా దానిని ప్రేమచిహ్నముగా కాపాడుకొమ్మన్నాడు.

"సౌందర్యార్చనల్ దోసమా!" అని కవి కిరిని అవినీతిపాలు చేయలేదు. దైవస్సు చేయించలేదు. పాశ్చాత్యకవులవలె నాయకులచేత ఆత్మహత్యచేయించ లేదు. కాలచపలునకు నియతి లేదు.

ఉదయలక్ష్మికి నరుల నొప్పిదము తెలుపు
మంచి ముత్యాలదండలౌ మంచుబొట్లు
సాంధ్యకాంతావియోగబాష్పములుగ—

మార్చివేస్తాడు. "ఇట్టి ఆశాభంగాలతో నిత్యం మీరు ఎన్నిసార్లు ఆత్మహత్యలు చేసుకొంటారు? ధీరులై నిగ్రహించుకొనండి" అంటాడు కవి. ఇదే జీవితంలో ఉత్సాహం కల్పించే నేర్పు—

వీరికి ఎందుకు ప్రేమ కలిగింది? ఎందుకు భగ్నమైనది? అని ఎవరైనా అడగవచ్చును. నాయికానాయకుల ఊరూ పేరూ చెప్పని కవి ఆ విషయము మనకు చెప్పుతాడా? కాని ఆమెను పెద్దలు వేరొకని కిచ్చి ఒక్క శుభముహూర్తాన పెండ్లిచేసి ఉంటారని మనమే ఊహించుకొందాము.

ఇప్పుడు కవి అనుసరిస్తాడూ "ఆశాబంధః కుసుమసదృశం ప్రాయశో హ్యంగనానాం, సద్యఃపాతి ప్రణయిహృదయం విప్రయోగే రుణద్ధి" అని కాళిదాసు చెప్పినట్లు "ఆశ ఉన్నన్నాళ్లూ విప్రయోగంలోకూడా ప్రేమ నశించకుండా ఉంటే ఉండవచ్చును. కాని ఆశ పోయినాకకూడా ఆ ప్రేమ ఉంటుందా?" అని దాన్నే విషయనిగరణం చేస్తే పట్టుతోరం అంటే చిరకాలం ఉండే స్వభావము కలది కనుక ఆమె కాపాడుకోకలిగినది కాని సద్యఃపాతి ఐన తృణకంకణమును వాడిపోకుండా కాపాడుకొనకలదా? అని సమస్య ఇచ్చారు. దాన్నే సంక్షేపం చేసి తృణకంకణం అని పేరుపెట్టారు. తృణకంకణం పరిమాణంలో చిన్నదే కాని పరిణామ.లోమాత్రం పెద్దది.

తృణకంకణము పేరులో ఇంకొక విశేష మున్నది. తృణం అంటే గడ్డి. కంకణ మంటే నీటిబొట్టు. హేమంతప్రభాతములో పచ్చిగడ్డిమీద మంచు బిందువులు సూర్యకిరణములతో మిశ్రమయి వింతవింత రంగు లీనుతవి. కనుకనే ఈ కవి "మినుకు మెఱుంగు లీనవె నిమేషము రాలు తుషారబిందువుల్" అన్నాడు. దానిలో సొగసు నవరత్నాలలో లేదు. ఆ కంకణం లేకపోతే తృణానికి శోభ లేదు. ఆ తృణము లేనిది కంకణానికి శోభలేదు. ఆ రెంటి సంపర్కము ఎట్లా శోభాదాయకమో అలాగే ఇద్దరు వ్యక్తులలో ఉండే పవిత్రమైన ప్రేమకూడా చాలా రమణీయముగా ఉంటుంది. అది ఎలా క్షణకాల ముంటుందో జీవితము కూడా అలాగే అనంతకాలంలో క్షణం ఉంటుందని గ్రహించి ఆ క్షణంలోను మెఱమెఱా మెఱవండి, రాలిపొండి, రాళ్లవలె నీరసముగా ఉండవద్దు అని బోధిస్తుంది. ఆ నీటిబిందువు ఎలా ముట్టుకుంటే నశించిపోతుందో అల్లాగే తృణకంకణంలో సొగసుకూడా కర్కశతర్కాలతో విమర్శిస్తే చెడుతుందని.

అయినాకూడా కృతి వ్రాసేదాక కవి అధికారం గాని అది సహృదయుని చేతిలోకి వెళ్లినాక కవి వద్దంటే ఊరుకొంటాడా? అత్తగారింటికి వెళ్లిన పిల్లమీద తండ్రి అధికార మేమిటి? కర్కశంగానే దీంట్లో రస మేమిటో విమర్శించుదాము. నాయికానాయకులలో ఉండే ప్రేమనుపట్టి శృంగార మే రసమంటం పొరపాటు. అది రసావస్థను పొందకుండానే వాత్సల్యంచేత తిరస్కృతమైనది. వాత్సల్యమే చిన్ననాటినుండి ఉంది కనుక అదే రసం — వయస్సువలన కలిగే కామవికారము దానిని తిరస్కరించబోయింది. కాని ధర్మముచేత అదే తిరస్కరింపబడింది. కనుక స్నేహము స్థాయి, వాత్సల్యము రసము. ధీరశాంతుడు నాయకుడు. పరదారపరాఙ్ముఖత నీతి. పవిత్రప్రేమోపాసన మతము. ఈ దృష్టితో తృణకంకణముమీద తెరతీస్తే ఏం కనబడుతుంది? పండితులు నిత్యం పారాయణచేసే గీతగోవిందమో శుకరంభాసంవాదమో కనబడుతుంది. రంభమాత్రం శుకుడు చెప్పినా తన వృత్తి మానలేదు. మనరంభమాత్రం పాతివ్రత్యం విడువలేదు. కనుక పండితులు నవ్యకవిత్వమంటే భయపడనూవద్దు. ఈ క్రొత్తమద్యాన్ని ప్రాతసీసాలలో పోశానని నవ్యసాహిత్య పరిషత్తువాళ్లు నన్ను దూషించనూ వద్దు. ప్రాచీన నవ్యతలను పరిత్యజించి గుణగ్రహణం చేయడం మేలు.

చివరకు తృణకంకణము ఏమి బోధిస్తుం దంటే:

వపు నశియించినను ప్రేమ నిలువగలద
యేని కలనైన కలుషముకాని స్నేహ
మృదుమధురసానుభవరక్తి పొదలి మనము
నీడలట్టుల నైక్య మెందెదము గాక—.

తృణకంకణంలో ఇదే సిద్ధాంతము, ఇదే సందేశము, ఇదే ఆదేశము, ఇదే ఆశీస్సు.

శాస్త్రం - కళ

భమిడిపాటి కామేశ్వరరావు

వాదించిన మీదటగాని ఏవిషయానికీ సారాంశం స్థిరపడదు. వాదన మాటల్లో జరిగితీరాలి. మాటలకి అర్థా లుండాలి' ఉంటూంటాయి. ఒకమాటకి ఒకేస్పష్టార్థం ఉండాలి. కాని సాధారణంగా అల్లా ఉండదు. ఒక్కొక్కప్పుడు ఒకేమాటకి చాలా అర్థాలుంటాయి, లేక దైవాద్వా ఒకేఅర్థం ఉన్నా ఆఒకటే స్పష్టంగా ఉండదు. ఒకేలాటి అర్థంతో చాలామాట లుంటాయి. అటువంటి మాటల్లో వాదన్లు జరిపినన్నాళ్లు, పర్యవసానం మస్తుఆటలా ఉంటుంది. అందుకని అథమం వాదప్రతివాదం చేసేజనమేనా, తమరు మిక్కిలి తరుచుగా వాడకంచెయ్యవలసొచ్చే ముఖ్యపదాలకి, ఇటువంటి ఇటువంటి స్పష్టార్థం పుచ్చుకుందాం, లేకపోతే ఆరోపించుకుందాం అని ముందు ఒడంబడిక చేసుగున్నమీదటగాని వాదన చెయ్యనేకూడదు. పదం చిన్నచిన్న దైనకొద్దీ దాన్ని నిర్వచించడానికి, అనగా ఇతరమాటలు లేవదీసి వాటిసరిహద్దులమధ్య దాని అర్థం యావత్తూ ఇమిడేటట్టు చెయ్యడానికి చిక్కులు ఎక్కువైపోతూంటాయి. ఎంచేతంటే అందులో మళ్లీ మాట లుంటాయి. ఒకొక్కప్పుడు ఒకపదాన్ని నిర్వచించకపూర్వమే నయం, కొంతేనా తెలిసిన ట్టుంటుంది. నిర్వచనం చేసిన తరవాత లోగడ మనకి తెలిసినట్టున్న ఆకాస్తాగుడా ఏష్యం అయి చక్కాపోతుంది. సాధారణంగా సులభపదాన్ని నిర్వచనం చేసేటప్పుడు - ఆమాట రాకూడదాయిరిగనక - కొన్ని కఠినపదాలు వచ్చి తీరతాయిగనక. అంచేత, అటువంటిపదాల నిర్వచనం తలపెట్టుగోకపోవడమే ఉత్తమం. పోనీ అందుబాటైనపదాలకేనా నిర్వచనం ఉండితీరాలి. లేకపోతే భావానికి సమగ్రత ఉండదు, ఆలోచనకి అభివృద్ధి ఉండదు, భావనకి నమ్మకమైన విచారణస్థలం ఉండదు. 'శాస్త్రం' 'కళ' అనే రెండుమాటలూ అల్లాంటివే. ఈరెండింటికీ ఏమీ తేడా లేదనిన్నీ, ఒక వేళ ఏమాత్రమేనా ఉన్నా "ఉంది!" అని పట్టట్టడం ఆంధ్రధర్మం కాదనిన్నీ, అది ఇంగ్లీషులు నేర్పడంవల్ల తత్సంప్రదాయాన్ని అనుసరించి పుట్టిన విపరీతజ్ఞానమనిన్నీ - పట్టిన వెఱ్ఱి అనిన్నీ - కొందరిమతం. వాట్లభావాల్లో తేడా లున్నట్టున్నూ, వేర్వేరు అర్థాలు సూచించడం నిమిత్తమే అవి పుట్టినట్టున్నూ కొందరు తలుస్తారు. ప్రస్తుతం వాటినిర్వచనం ప్రయత్నించి, వాట్ల ప్రత్యేకలక్షణాలు కేటాయించి, అవి తిన్నగా గమనించి చూసుగోపోడంలో ఉండే తగాయిదాలు చూసి వాటి అవసరాలు గమనించుదాం.

మరొక్కసంగతికూడా ముందే అనడం కొంచెం అవసరం. ఈరచనలో ఉన్నది చాలావరకు పాతది. శబ్దరూపంగూడా ఇతరులదే అయినప్పుడు ఆయా అభిప్రాయాలు కేటాయించి గుర్తించాను. తక్కిన, నా అభిప్రాయాలు అని నే ననుకునేవికూడా ఇంతకంటె

రసవత్తరంగా ఎక్కడో ఈవరకే రూపం దాల్చి ఉండవచ్చు. ఆమూలాలన్నీ వెదకి చూసుగో జాలకపోయిన నాఅజ్ఞానాన్ని పండితులు సైరించాలి; "అపూర్వకల్పనాశక్తి చాలవరకు ఎల్లప్పుడూ ససంబంధమే" కదా! అదీకాక పాతలెఖ్ఖ-ప్రకారం, శాస్త్రాలు ఆరు, కళలు అరవైనాలుగూ, ఉన్నాయి. ఎన్నెన్ని ఏరీతిగా గమనించీ, లక్షణాలు కేటాయించడం? అని అడిగినా నాకు సమాధానం లేదు. "అసలు జ్ఞాని మాటాడ్డు, రచించడు, ఏమీ చెయ్యడు! రచనలు రచయిత స్వంతానికి జ్ఞానార్జన చేసుగునేటప్పుడు పడేతంటాలు. అందువల్ల అవి అజ్ఞానాన్ని వెల్లడిస్తాయిగాని, జ్ఞానాన్ని కాదు" అని ఒక సాహసుడు అన్నాడు. ఆయన అన్నట్టు తెలుపుడు చెయ్యడానికి ఎల్లాగో, అల్లాగే తెలుసుగోవలిసిన పనున్నప్పుడుకూడా రచన తప్పదు. ఈరచనకి సెపం అంతే.

జ్ఞాను లన్నదాన్నిబట్టి: బుద్ధి ప్రయోగించి ప్రకృతినీ, మానవుణ్ణీ, ప్రకృతిసంభవాల్నీ, మానవకల్పితప్రయోగాల్నీ జాగ్రత్తగా గమనించి, మననంచేసి, అనుభవానికి వచ్చిన సంగతులు సేకరించి, వాటిని పౌర్వాపర్యప్రకారం పేర్చి, పరిశోధించి, పరీక్షించి, తేర్చి, తీర్చి, భావనాశక్తి సాహాయ్యంవల్ల వాటిల్లో - మణిహారంలో సూత్రంలాగ - ఉన్నజ్ఞానాన్ని గ్రహించి, ప్రసాదశయ్యాది లక్షణాలుగల స్పష్టపదాలలో సిద్ధాంతంచేసి, సూత్రించి, అమర్చిఉంచితే అప్పుడు ఏర్పడేది శాస్త్రము.

ఇక, కళ: "మందు తాను పూర్తిగా అనుభవించి లీనమైపోయిన తన చిత్తవృత్తుల్ని, బుద్ధిపూర్వకంగా కొన్నికొన్ని బాహ్యచిహ్నాల ద్వారా [—చలనములతోనో: అది, నాట్యం;—గీతలతోనో: అది, చిత్రలేఖనం; - రాళ్లతోనో: అది, శిల్పం; - రంగులతోనో: అది, చిత్రరచన; - స్వరములతోనో: అది. గానం; - పదములతోనో: అది, కవిత్వం] ప్రకటించి, ఆ చిత్తవృత్తుల్ని ఇతరమానవుల హృదయాలకి పాకించి, వాళ్లచేత తనచిత్తవృత్తులవంటివి అనుభవింపచెయ్యడానికి ఒకమానవుడు చూపెట్టే పనివాడితనం - సృజించినకృతి - కళ" అని.

వీటినే కొంచెం విడగొట్టి, కొంచెం వ్యాఖ్యానంచేసి చూస్తే, వీటిల్లోఉండే లక్షణాలూ వాటి భేదాలూ గోచరిస్తాయి.

శాస్త్రం, తర్కవితర్కాలతో ఆరిందాగా చెప్పి ఉన్న పలువుర అనుభవజ్ఞానసారమైన కబుర్లు — కళ, అలంకారశోభతో ఒప్పుతూండే ఒక్కడిస్వానుభవంతో కూడిన పని. శాస్త్రంలో పదాలు అర్థాలతోటీ, పరమార్థాలతోటీ, సంగతులతోటీ, వృత్తాంతాలతోటీ, నిండిఉండి గ్రాహకుడి బుద్ధికి బోధపడి దాన్ని వికసింపచేస్తాయి. కళలోని సాధనాలు అర్థాన్ని దాటి భావాన్ని దాటి రసమయమై, హృదయానికి ఆనందం కలిగిస్తాయి. శాస్త్రం కేవలకృషికి సుసాధ్యం కాకపోయినా దుస్సాధ్యం అని అనిపించదు - కళ కేవల కృషికాక, మనం చెప్పకోలేనిదేదో ఉంటేగాని, అసాధ్యం అనిపిస్తుంది. శాస్త్రం పూర్వప్రమేయం గనక అక్కడ ధారణ ఉపచరిస్తుంది — కళలో భావన కణకణలాడుతుంది. శాస్త్రంయొక్క అపారత్వగభీరత్వాలు దాన్ని అపౌరుషేయం అనిపిస్తాయి - కళ, కేవలదైవికం అని తోపిస్తుంది. శాస్త్రం బోధనీయం — కళ నేర్చ

తగ్గదేగాని, నేర్పవీలైంది కాదు. సత్యమే శాస్త్రానికి గమ్యస్థానం (-అదీ శుద్ధంకాదు, నిత్యం కాదు!) - ఆనందమే కళకి గమ్యస్థానం (-అది శుద్ధం, నిత్యం!). శాస్త్రం పరిభాషతో నిండిఉండి, అది నేర్చినవాళ్లనిగాని చేర్చుకోదు - కళలో పరిభాష అల్పతమంగా ఉండడంవల్లనున్నూ, ప్రవేశం ఏకొంతో ప్రతీవాడికీ ఉండడంవల్లనున్నూ, అందర్నీ చేర్చుగోడానికి ప్రయత్నిస్తుంది. శాస్త్రలక్షణం ఔన్నత్యం కళాలక్షణం వైశాల్యం. మానవుడు శ్రద్ధతో శాస్త్రంగురించి వెళ్లాలి - కళ దానంతట అదే మానవుణ్ణి తనకేసి ఆకర్షించుకుంటుంది. శాస్త్రంలో ఏ ఒక్క మనిషియొక్క ప్రత్యేకలక్షణాలూ కనిపించక, అదంతా యంత్రవతు అయిపోతుంది - కళాకారుడు కృతిలో ప్రతిఫలిస్తూ ఉంటాడు. శాస్త్రంలో ప్రసాదం ప్రధానం - కళలో ధ్వనిప్రధానం. శాస్త్రం భయం పుట్టిస్తుంది - కళ ఆంతర్యపరిచయం కలిగిస్తుంది. శాస్త్రం నిర్బంధించి నమస్కారం కోరుతుంది - కళ మనఃపూర్వకమైన ఆత్మార్పణ పొందుతుంది. శాస్త్రంలో విచక్షణా, కారణం, విచారణా, ముఖ్యం— కళలో భావన, ఫలితం, క్రియ, ముఖ్యం. శాస్త్రం జ్ఞానభాగాల్ని పుచ్చుగుని, ముక్క ముక్కలు చేసి మూలాని కెళ్లి, సకారణంగా వీలైనంతవరకు సూత్రిస్తుంది. అందుకని శాస్త్రంలో విడగొట్టడం ఉంది. - కళ, అక్కడా అక్కడా పడిఉండే ముక్కలన్నింటినీ ఒకచోటికి చేర్చి, చిత్రప్రకారం వాటిని పేర్చి, ఆ సాంగత్యంతో మనస్సుని హరిస్తుంది. అందుకని కళలో కూడిక ఉంది. శాస్త్రం ఎప్పటికప్పుడు అసంపూర్ణమే - కళ ఎప్పటికప్పుడు సమగ్రమే. శాస్త్రం కట్టె - కళ ప్రాణం. 'శాస్త్రం ఊపిరితిత్తి - కళ హృదయం'. శాస్త్రం సాధనం - కళ సాధ్యం.

కాబట్టి, శాస్త్రం - కళ అని మనం వాడుతూండే సందర్భాలు వేరువేరని నిరూపించుగోవచ్చు. ఇవి ఫలానాశాస్త్రాలూ ఇవి ఫలానాకళలూ అని అనేసి ఊరుకోనేఅక్కర్లేదు. ఏవిషయంలోనైనా సరే, జ్ఞానభాగాన్ని శాస్త్రం అనీ, ఆచరణవల్ల పుట్టే క్రియని కళ అనీ అనచ్చు. పాకవిషయంలో పాకశాస్త్రం వేరు, పాకకళ వేరు. గానవిషయంలో, గానశాస్త్రం వేరు, గానకళ వేరు. పదరచనవిషయంలో ఛందశ్శాస్త్రం వేరు, కవిత్వం వేరు. తక్కిన అన్నివిషయాల్లోనూ అంతే. రైలు నడిచేశాస్త్రం వేరు, రైలు నడపడం వేరు. ఎదేనా శాస్త్రంలో కూడా ఆచరణభాగం కళ; ఎదేనా కళలోకూడా జ్ఞానభాగం శాస్త్రం. ఒకవిషయంలో - మాటవరసకి గానంలో - ఎవరికేనా అమితమైన శాస్త్రం తెలిసిఉండవచ్చు, వారిదగ్గిర గానకళ లేకపోవచ్చు. గాన క్రియమాత్రమే అనుభవింపగల అనేకులు వారిని మెచ్చలేకపోగా, శాస్త్రజ్ఞులు ఒకరిద్దరు వారిని బ్రహ్మరథం పట్టవచ్చు. మరొకరిదగ్గిర గానకళ ఉండి, గానశాస్త్రం దొరకకపోవచ్చు. వాళ్లు జనాదరణ పొందినా శాస్త్రప్రియులు వాళ్లని తీసిపారేస్తూనే ఉంటారు. ఒకప్రదేశంలో మానవులు ఒకనూతనవిషయం పరిశోధించడం ప్రారంభిస్తే, అది లోకానికి ఎందుకేనా కావలిసింది అయితే, కాలక్రమాన్ని అది ఒక శాస్త్రం అవుతుంది. ఆరీతిగా చూస్తే శాస్త్రాలు అనంతం. పైగా ప్రతిశాస్త్రం ఎప్పటికప్పుడు అసంపూర్తి. ఆప్రకారంగానే మానవులకి అవసరం అయిన పను లన్నీ

కళలే, అవీ అనంతమే. కాని, మానవచిత్త వృత్తుల్లో ప్రమేయం ఉన్నవాటినే సార్థకంగా కళలనీ - లలితకళలనీ - అంటారు. అయితే శాస్త్రాలన్నీ - ఏభావంలో అయితేం! - మాటల్లో ఉండితీరాలి. మాటల్లో ఉండగల లలితకళ కవిత్వం. అందువల్ల ఆదిని శాస్త్రాలన్నీ (వైద్య, జ్యోతిష, వ్యాకరణ, నిఘంటువగైరాలు) పద్యరూపంలోనే పడిపోయి శాస్త్రకళలు కలిసిపోయి ఉన్నాయి.

పై నిర్వచనాలు ప్రయోగించి చాలా సంగతులు చూడవచ్చును. రెండు మూడు చూద్దాం. శాస్త్రం బోధనీయం గనక గురువూ శిష్యుడు ఉండగలరు. కళ అనేదాల్లో గురువూ శిష్యుడూ ఉందాం అని బయల్దేరినా, ఆట్టేకాలం ఉండరు. కవిత్వంలో అంతే. గురువు చెప్పిన ఛందస్సుతోటి శిష్యుడు పద్యం రాయడం, అది గురువుగారు రాయలేకపోడం, రాసినా నాసిరకం అవడం, శిష్యుడు గొప్పవాడవుతున్నాడని గురువుకి ఈర్ష్య బయల్దేరడం, గురుధిక్కారం వగైరా వగైరాలు. గాయకులదగ్గిర శిష్యులు చేరడం, ఆట్టే శాస్త్రం చెప్పినా తమర్ని మించిపోతారని వాళ్లకి ఆట్టే చెప్పకపోడం, దాంతో ఓ వాళ్లిళ్లి సభల్ని రంజింపచెయ్యడం, తద్వారా కోపాలు వగైరాలు. ఇల్లాగే, కళ ఒక వ్యక్తియొక్క ప్రతిభని ప్రకటించేది అవడం వల్ల అనుకరణానికి కుదరదు. అందుకనే అనుకరణం హాస్యాస్పదం, పైగా పదిమంది జట్టు కట్టి ఒక ఓమాదిరి రచన ప్రారంభిస్తే, నిలిస్తే ఒకడు నిలిచి తక్కినవాళ్లు బలి అయిపోతారు. ఆ పదిమందీ పంచుగుని ఒకరు చెయ్యనిది ఒకరు చేశారా తగాదా లేదు, పైపెచ్చు అది శ్లాఘ్యం. శాస్త్రంలో సంగతులూ వృత్తాంతాలూ ఉంటాయి గనక, ఏదో ప్రమాణం కుదుర్చుగుని పోటీలు పెట్టవచ్చు. కళ కృతి గనక దానికి విలవగట్టే ప్రమాణం ఉండదు. కాలమే కళని కొలిచేది. అందువల్ల గానకళ, ఉపన్యాసకళ వచనరచనాకళ నాట్యకళల్లోనూ పోటీలు జరిపి తరతమభావం నిర్ణయించడం అసాధ్యం. ఒకవేళ సుసాధ్యం కాకపోతుందా అని, అఖండవ్యక్తులు బయల్దేరి నిర్ణయాలు చేసినా వాటిల్లో న్యాయం దొరకదు. వ్యక్తుల అభిప్రాయాలు కళా నిర్ధారణ చెయ్యలేవు. అందుకని పక్షపాత అభిమానాల్లోనే గాని ఈ నిర్ణయాలు జరగవు. నిర్ణయకర్తల తీర్పు చాలా అసంతృప్తిగా ఉంటుంది. కొందరు చివరికి మెచ్చేది ఆయా శాస్త్రమే గాని అందుతో బయల్దేరవలసిన కళ గాదు. కొన్ని పోటీలు విచారణ చెయ్యగా, వేషధారణపు పోటీల్లో కబుర్లు చెప్పి నవ్వించినవాడికీ, నాట్యంపోటీలో పాడినవాడికీ, ఉపన్యాసపుపోటీలో బల్ల బద్దలుకొట్టినవాడికీ, వచనరచనపోటీలో వ్యాకరణం పాటించినవాడికీ, గానంపోటీలో పీక మంచివాడికీ లేక సరిగమలు మాట్లాడినవాడికీ బహుమతులు రావడం ఎరుగుదుం. "ఏదో ప్రోత్సాహం ఇవ్వడానికి ఏదో ఓటి చేశాం పోనిస్తురూ!" అంటారు కొన్నిచోట్ల. ఏదో ఓటి చెయ్యవచ్చు గాని అన్యాయం చెయ్యకూడదు. మరొక్క విషయం. ముఖ్యంగా సభ ఏర్పడ్డప్పుడు, అనగా అనేక వయస్సుల, వర్ణాల, సంస్కారాల, సంప్రదాయాల స్త్రీపురుషులు ఒకేసమావేశంలో ఉన్నప్పుడు శాస్త్ర - కళల సంబంధం - (విభేదం) గమనించాలి. ఒక గానసభ ఉందనుకోండి. గానశాస్త్రమే తెలిసి, గానకళ లేని

వారు తమరు పుస్తకాలు రాయడమో గానం గురించి ఉపన్యసించడమో, గానపాఠం చెప్ప డమో చెయ్యడం మంచిది. అంతేగాని అన్ని రకాల అందరూ వచ్చి కూర్చున్న సభలో తనకు వచ్చినగానశాస్త్ర పాఠాలన్నీ క్రమం తప్పకుండా సభవారిమీద వడ్డించి ఆగాన శాస్త్రమే గానకళ అనుకుని సభవారు మొత్తంమీద మూఢులున్నా (మళ్లీ గానాన్ని 'పశుర్వేత్తి' అంటాడు) తనుమాత్రం జ్ఞానిన్నీ అవడంచేత వారు తనగానాన్ని మెచ్చుగో లేకపోతున్నారని సమర్థించుగుని, ఇద్దరో ముగ్గురో సభ్యులు గానశాస్త్ర గాన కళలభేదం తనకిమల్లేనే గమనించనివాళ్లు బాగుండదని చెప్పి - 'ఓహో' అంటూండ డం తనికి చాలని మురిసి సభలో గానశా స్త్రం వడ్డించేవా రున్నారు.

ఇది గానవిషయంలో చెల్లిపోతోంది. ఎంచేతంటే ఎంతమనోహరమైన నాదానికీ అర్థము తెలియదు. నాదచిహ్నాలైన స, రి, గ, మ లకీ అర్థం తెలియదు, ఉపాధిగా ఉం డడానికి తేబడే సాహిత్యానికీ అర్థం తెలి యదు. కాని గానంకాక ఇతరవిషయాలైతే ఈసంగతి హాస్యాస్పదం అని తేలుతుంది. పదరచన విషయంలో కవిత్వకళ చేస్తానని సభ యెదటి కొచ్చి ఛందశ్శాస్త్రం అప్పగిం చినా, నాటకకళ చెయ్యడానికి సభయెద టికి వచ్చి నాట్యశాస్త్రం ఏకరువుపెట్టినా, భోజనానికి బారులు తీర్చి కూర్చున్నజనం ఎదట పాకం వడ్డించడానికి వచ్చినవాడు తను ఏయేసాధన సామగ్రి ఏయేవిధంగా వాడితే పాకంఅవుతుందో ఆశాస్త్రం తన కెంత వచ్చునో చెబుతూకూర్చున్నా, ఆయాకవి తాసభ వారికీ, నాటకసభవారికీ, భోజనసభ వారికీ చాలా చిరాకుగా ఉండి జనం లేచిపో తారు; ఎంచేతంటే వీటిల్లో పదార్థాలు కేటా యించి, ఇది విధానం (శాస్త్రం)- ఇది దాని వల్ల నెరవేర్చినక్రియ (కళ) అని తేల్చడానికి ఎక్కువ వీలుండబట్టి. అందుకని గానవిష యంలో శాస్త్ర కళల కేటాయింపు చాలా అవసరం.

శాస్త్రం: "బుద్ధివికాససిద్ధికి సక్రమ మార్గం చూపిస్తుంది. ఐహికాముష్మిక సౌక ర్యాలకి తోడ్పడుతుంది. అభయం చేకూరు స్తుంది. సంఘసమస్యలు పరిష్కరించడానికి పనికొస్తుంది. మానవుల అల్పత్వం మాన వులకి ఎప్పటి కప్పుడు జ్ఞాపకంచేస్తుంది."

కళ: లోకప్రీత్యర్థం శాశ్వతత్వం దాల్చే కర్మ మానవుడు చెయ్యగలడని చెబుతుంది. లక్షలోట్లుగల మానవుడిలో ఉండి నష్టలమైన దివ్యాంశని ప్రకటిస్తుంది. ఒకక్షణంలో అనే కుల్ని రంజింపజేసి, జనాన్ని ఐక్యంచేస్తుంది. సకలమానవ సమత్వం చేకూరుస్తుంది.

శిశిరము

భీమన

ఆకులు రాల్చుకొన్నది; వి
హాయసవీథుల దృష్టి జొన్పి ఏ
కాకినివోలె నిల్చినది;
కాలము తీరినమ్రోడుగా ప్రజల్
వాకొనినారు; నాకుసుమ
వాటిక కింక నవోదయమ్మె రా
దా? కమనీయసుందర సు
ధాపరిసేచన మాచరింపవా?

కాలము మారి; ఆమని వి
కాసము రాలి; మధువ్రతాల పే
రోలగ, మందు కోయిల కు
హూకలగీతము లాగి; తల్లి! నా
పూలవనమ్ము దుఃఖపరి
భూతము కావుట కేమి కర్మమో?
ఈ లుగసానుప్రొద్దు లిటు
లే - యిటనే - వసియించిపోవునో?

పూవులు పూసి నావనము
ప్రొద్దుట దర్శనమిచ్చు - తారకా
పావనమైన పచ్చని ది
వౌకసమా యనిపించి; దేశదే
శావళమానవాది జన
సంఘము లెల్లను నావనంపు క్రొం
దావుల గ్రోలియే తెరచి
నారలు ద్వారము లప్రమత్తులై.

వెన్నెలరేలకోసమయి
వేదనచెందెడి బాలచంద్రుడే
క్రొన్ననదోట నెంచి పరు
గుల్ పరుగెత్తుక వచ్చువాడు - నీ
వెన్నెలరారు కౌగిట వ
సింపగ - తక్కు జగమ్ము కున్క; నం
దన్నవవేళ లవ్వి! ఇంట
బాసితివే? వనదేవతానతీ!

"ఇది శిశిరమ్మె, పుత్రక!" అ
నే ఒక చల్లనిమాట, తల్లి! నా
హృదయము కోరు; "మిక్కిలి ర
హిల్లుటకే, విడబారి పూయనే,
ఇదిమిత నేనె ప్రాబడిన
చిన్గినయాకులు; దిగ్భ్రమోత్సవా
భ్యుదయయశఃప్రదీపనవి
భూతిని వచ్చు నవోదయ మ్మికన్"

అని వచియింపు, మాత! తని
యన్, వసియింతును నిండుటాశతో;
మనమున ముందు వచ్చు మధు
మాసమునే లిఖియించుకొంచు, లే
దనము గడించుకొంచు; భవ
దాత్మరుచిస్మితరశ్మి నేగదా
జనపదముల్ సజీవన వ
సంతములౌ, నవ స్వర్గధామముల్!

కోయిల నేనె నైన, నవ
కోమలరాగము నేనె నైనచో;
నాయెలదోట నొక్కసుమ
వ స్సొనరించి, నిరంతకాంతమై
పూయనె? ఆరనిత్తునె న
వోదయవాహిని? తెన్గువాటికా
ధ్యాయములన్ రసోత్కర సు
ధల్ ప్రవహింపవె నిత్యధారలై?

"శిశిరమే యిది; ఇం కొక్కచిటికలోన
వచ్చుచున్నది మధుమాసవాసరమ్ము;
మ్రోడుమ్రోడుగనే యుండబోదు, సతము;
ఫాల్గునమె నిత్య మిట వసింపదు, కుమార!"

ధ్వని

బొడ్డపాటి కుటుంబరాయశర్మ

అనుభవము లతీతము లగుకొలదియు భావము లభివృద్ధినై, వానివెంట శబ్దజాల మంత వృద్ధియును చున్నను భావములు దాని కతీతములుగ నుండును. అందుచే నొకేశబ్ద మనేకార్థము లాశ్రయింపవలసి వచ్చును. శబ్దము పృథ్వివంటిది. భావము కాలమువంటిది. ఒకటి విశాలము; రెండవది యనంతము. శబ్దప్రపంచమందలి ప్రతి పదమునకు నియమితమైన భావ ముండును. కాని భావప్రపంచ మనంతమని గదా చెప్పికొంటిమి! కనుక నాశ్రయము లేక వ్యక్తీకరణ స్థానమునకై వెదకులాడుకొనుచున్న కొన్నికొన్ని భావములను శబ్దప్రపంచమందలి కొన్నికొన్ని పదము లిముడ్చికొనవలసివచ్చును. అనంతమైనదానికి విశాలమైనదే యాశ్రయమీయ సమర్థము గాని 'అన్యథా శరణం నాస్తి.'

భావము మీరిన భావమనగా, నొకానొక శబ్దము మన మూహించిన తాత్పర్యమును వ్యక్తపరుపలేకపోవుట. మన కొకక్రొత్తభావము కలుగు ననుకొందము. దాని కనువగుపదము సారస్వతమున నుండదు. అప్పుడు మన భావమునకు కొంతసమీపమైన యర్థమునిచ్చు పదము నొకదానిని గ్రహించి, దానియందు మనమాత్మభావమును నిక్షేపింతుము. మనభావమున కనువగునర్థము, శబ్దమీజాలకపోవుటచే 'అనుపపత్తి' యనియు, నొకనియమితార్థముగల పద మర్థాంతరము నిముడ్చికొనుటయే 'వ్యంజనాశక్తి' యనియు, నిట్లిముడించికొనబడిన రెండవ యర్థము 'లక్ష్యార్థ' మనియు నార్యులు వ్యవహరింతురు.

ఆలంకారికపరిభాషలో నీవిషయమును క్లుప్తముగ వ్యక్తీకరింపవచ్చును. శబ్దనియతార్థమగు వాచ్యార్థమున కనుపపత్తికలిగినప్పుడు దానిని నివారించుటకై మనము పరిగ్రహించు రెండవయర్థము లక్ష్యార్థము. వాచ్యార్థము గోచరించినపిదప ప్రకరణమునుబట్టి లక్ష్యార్థముకూడ స్ఫురించుచున్నచో నాయర్థాంతరము వ్యంగ్యము. వాచ్యముకన్న లక్ష్యమే మనోహరముగ నున్నచో నది ధ్వని. ఆలంకారికు లీధ్వనిని వస్త్వలంకార రసపరము లని త్రిధాకరించిరి. వాచ్యముకన్న వ్యంగ్యము మనోహరత కల్గియుండక స్ఫుటముగమాత్రము గోచరించునప్పు డది గుణీభూతవ్యంగ్యము. ఇట్టివే యెన్నియో నంతర్భేదములును, తీనినిగురించి భిన్నాభిప్రాయములును గలవు. వానితో మనకు ప్రస్తుత మగత్యము లేదు. శబ్దమందు మనోహరమైన యర్థాంతరము స్ఫురించునట్లు జేయుటయే ధ్వనియని మాత్ర మెఱిగినజాలును. ఇపుడు ధ్వని నెట్లాలంకారికులు నిర్వచించిరో సూత్రముగ నుదాహరింతును:

"యస్సంయోగవియోగాభ్యాం కరణై రుపజన్యతే,
స స్ఫోటం శబ్దజాశ్శబ్దా ధ్వనయోఽన్యైరుదాహృతాః"
—భర్తృహరివాక్యపదీయము, ౧ కాం. ౧౦౩ శ్లో.

"ఏవంఘంటానాదస్య నీయః అనురణనాత్మోపలక్షితః
వ్యంగ్యోఽప్యర్థః ధ్వని రితి వ్యవహృతః—"
—లోచనము, పుట. ౪౭.

"యత్రార్థః శబ్దో వా తమర్థ ముపసర్జనీకృతస్వార్థౌ,
వ్యక్తః కావ్యవిశేషః స ధ్వని రితి సూరిభిః కథితః."
— ధ్వన్యా. ౧-౧౩.

ఇది యిట్లుండెను.

తమతమ ప్రవృత్తికి విలక్షణముల నభిరుచి విశేషములమూలమున రసభోగమును లభించుకొనుటకు తెనుగు కవులు యత్నములుసల్పిరి. ఒకరు వక్రోక్త్యభిరుచిమూలమున, మఱొకరు వైచిత్ర్యాభిరుచివిధానమున వేఱొకరు ధ్వనిమార్గమున కవితాకన్య హృదయానురాగమును బడయనూహించిరి. కాని కవితాకన్య [illegible] వైచిత్ర్యాదులతో సంభాషించుయువకవి బాహిరమైన తన శరీరసౌందర్యము నాశించు ప్రపంచానుభూతిలేని

పసిపాప యనియు, ధ్వనియుక్తముగ బ్రసంగించునట్టి ప్రౌఢరసికుడు ప్రపంచానుభవమున ముక్కాకలుదేరి, తనయాంతరంగికసౌభాగ్యము వాసించుచున్న ప్రియుడనియు గ్రహించి, ధ్వనికవికే రసోత్పత్తిమూలమున నాత్మార్పణము జేసిన దనవలెను. అయ్యు నితరకవులు తనతిరస్కార వ్యథాభిన్నులు గాకుండునట్లు వారిపై గొంత యనురాగము నటించి వారికి రసానుమితిని (శ్రీశంకుకుని రసనిష్పత్తి) దానముజేసి రేయున్నది. ఇందుచేతనే ఆమె సెబాసు.

ఉపాధ్యాయుడు తాను బోధించుచున్న పాఠము విద్యార్థులమనసునకు బాగుగ పట్టుచున్నదో లేదోయని వారిని వేర్వేర ప్రశ్నించునప్పుడు నిద్రబోవుచున్న యొక కొంటెవిద్యార్థి లేచి 'బాగుగనే పట్టుచున్నదండీ' యని ప్రత్యుత్తరమిచ్చి గురువును తానట్లు మోసగింపగల్గినందుల కెట్టియానందమును పొందునో, యట్టియానందమునే, శబ్దమునకు ప్రప్రథమమున వ్యంగ్యార్థమును బొసగింపగల్గిన బుద్ధిశాలియు నొందియుండును; లేదా! రాగరంజితాంతరంగుడైన యొకానొక రసికుడు తను వలచినకాంతతో నొకటి యుద్దేశించుచు, వేఱొకటి పలికి, యుద్దేశానుకూలమైన ప్రత్యుత్తరము బడసినపుడు సంతసించునంతగ సంతోషించియుండును. ఇట్టి వ్యంగ్యార్థ ప్రయోగమునకు కారణము నరసినచో, దౌర్జన్యముగల యొకానొకజాతి పురుషులచే బాధితుడగు వేఱొకజాతి పురుషుడు స్వజాతీయులకు గూఢవార్తల నంపునప్పుడు, ఒక్కొక పట్టున దీని కలవడియుండవచ్చునని యూహింపదగును. ఇందుకు యుగంధరమహామంత్రిప్రవర్తనయే తార్కాణము. ఒక్కొకవేళయం దిది ప్రియుల (నాయికానాయకుల) ప్రణయసంభాషణయందు నుద్భవించుచుండును.

మఱొకప్పుడిది పండితులయు, వేదాంతులయు వాదప్రతివాదములందు బొడచూపును. సంఘములుగ నేర్పడిన వేదాంతులు తమలో తమకుమాత్రమే వ్యక్తముగావలసిన వేదాంతరహస్యముల నిట్లు ప్రసంగించుచుందురు. సామాన్యమానవుల కిది సామాన్యార్థమునుమాత్రమే యిచ్చును. ఇది మనలో తరచుగ బాలురును బాలికలును మాట్లాడికొను 'క' భాష, 'చ' భాష, 'ఫ' భాషలవంటిది. ఇట్లే ఆయాయి సందర్భానుసారముగ నుత్పత్తిజెందుచున్న ధ్వనినే కవిత్వమునకు జీవమని యార్యులు చెప్పిరి.

ఇచ్చట ధ్వనికిని ఉపమోత్ప్రేక్షాదులకునుగల విభిన్నతను మనము మరువరాదు. సత్యమూహింప నుపమోత్ప్రేక్షాదులు భాషకు పడుగును, పేకయు (Warp and woof) వంటివి. భాషావ్యుత్పత్తిక్రమము నరసినయెడల ఆనాటివారికిసూడ నీయలంకారము లనివార్యము లని మనకు తోచుచున్నది. మానవుడు చేతనాచేతనవస్తువివేకమును, భాషయందు వ్యక్తీకరింపలేక చెట్టుచేమలను, ఆకలిదప్పులను, కొండలను, గ్రహాదుల సమస్తమును మహత్సంబంధముగనే వ్యవహరించినప్పటి యాభాషచే మన ప్రస్తుతవ్యవహారరీతిని వ్యుత్పత్త్యర్థమునందు పరిశీలించినచో నవి చాలవఱకు నుపమోత్ప్రేక్షలుగ కన్పడుట సహజము. 'పుష్పాస్త్రుడు బాధింపదొడగెను' అనునప్పుడు నిరాకారుడైన మన్మథుని మనవలె మానవాకారముగలవానిగ భావనజేయుచున్నాము. సుకుమారములైన పూవుటమ్ములతో మనుష్యుల నేచుట యనునదియు నిట్టిదదే! సుకుమారములైన వస్తువులు మనల నాకర్షించి లభింపనప్పుడు, 'మెత్తనిపులి ధర్మరాజు' అనునట్లు మృదువులయ్యును బాధకలిగించునని మన భావము. ఇట్లే యాహ్లాదకరుడైన చంద్రుడు విరహులకు కంటకుడుగ నుండుట మొదలైనవి. మన పురాణములన్నియు నుపమోత్ప్రేక్షాదులే యనవచ్చును. సంస్కృతవాఙ్మయ మంతయు నిట్టిదే! మనపూర్వీకులకుగల యత్యధిక భావనాబలమే యిట్టి యుపమోత్ప్రేక్షాద్యాలంకారికభాషాభివృద్ధికి ప్రబల హేతువు.

"ఉత్ప్రేక్షోన్నీయతే యత్ర
హేత్వాదిర్నిహ్నుతిం వినా..."
—చంద్రా, ౫. మయూ, శ్లో. ౧౨.

ఇది యుత్ప్రేక్షకు నిర్వచనము. ఉత్ప్రేక్షయందుపమానోపమేయవస్తువులకు తాదాత్మ్యము పోయి, పృథక్త్వము సంభవించుచుండుటచే, భాష యభివృద్ధి

యనుచున్న కొలదియు నుత్ప్రేక్ష యుపమనుండి కల్గుచున్న దినవచ్చును. ఇప్పటికిని Hebrew, Arabic భాషలం దుపమానోపమేయముల కనన్యత్వము గల యుపమయనదగు నలంకారమే వ్యవహారము దున్నదని తజ్ఞులు పల్కుదురు.

"We are yesterday."

"I am prayer."

"All people shall be peace."

ఇట్టి ఉపమోత్ప్రేక్షాదులను "........the muscles and tissues and livin; integuments of the Flesh-garmen, language" అని కార్లైలు పండితుడు చెప్పినను, ధ్వని యుపమోత్ప్రేక్షాదులకంటె దుస్సాధ్యము. వాచ్యార్థముకన్న వ్యంగ్యార్థము మనోహరముగ నుండునట్లు జెప్పబడయే యుండలి కష్టము. ఉపమోత్ప్రేక్షలు పసునను, పేకయు ననుమగాని, భాషాంబరమును దీర్ఘకాలము మననట్లుచేయు 'పురి' వంటిది ధ్వని.

దీనియుత్పత్తి ప్రాశస్త్యములను సాధ్యమైనంత వఱకు వచించితిమి. కనుక నిది సారస్వతమునం దెట్లు ప్రవర్తిల్లుచున్నదో కూడ పరిశీలింతము. శబ్దమున కుండు నట్లే వాక్యమునకును, కావ్యవస్తువునంతకునుకూడ ధ్వని యుండును. ముమ్మొందు ప్రసిద్ధులైన కవుల ముఖ్యముగ కొన్ని పద్యములయందలి ధ్వని సూచింతము. నన్నయార్యుడు గంభీరుడయ్యు, శివికమునకు మధురిమ నొసగు సాధువైన హాస్యమును ధ్వనింపజేయుటయందు దిట్టయనుట కిపద్యమే యుదాహరణము:

"అంగములలోన మే లుత్తమాంగ, మందు
నుత్తమంబులు గన్నుల యుద్విజనుల
కట్టికన్నులు లేవను టంతెకాక,
యుత్తముండు గాఁడె? సద్గుణయుక్తి నరయ."

—ఆది. ఆ. ౫, ప. ౧౧.

ఇందు హాస్య మెంతయో మృదువుగ ధ్వనించుచున్నది. తిక్కయజ్వపద్య మొక్కటి యుదాహరింతము:

"వలలుం డెక్కడఁ జూచె? నొండెస ననే
వ్యాఘ్రాజనుల్ పుట్టవే?
ఫలితంబై వరశాఖలొప్పఁగ, నన
ల్ప్రీతి పంధించుచున్
విలసచ్ఛాయ నుపాశ్రితప్రతతికిన్
విశ్రాంతి గావింపగా
గల యీభూజము వంటకట్టియలకై
ఖండింపగా నేటికిన్."

—విరాట. ఆ. ౨, ప. ౧౩౬.

ఫలప్రాప్తిని పొందుచున్న కార్యమున కుద్రేకముచే విఘ్నము వాటింపవలదని భీముని మందలించిన ధర్మజుని వ్యంగ్యగంభీరోక్తి యిది.

"ఎవ్వనివాకిట నిభమదపంకంబు
రాజన్యమణిరజోరాజి నడఁగు."

—ఉద్యో. ఆ. ౨, ప. ౧౯౧.

ఈ పద్యమున ధర్మజుని ప్రాభవము, ధ్వనిత మగుచున్నది.

ఇక కొంత ప్రచురముగ నీధ్వనిని ప్రయోగించిన యల్లసాని పెద్దనార్య నరయుదము:

"ఇంతలు కన్ను లుండ తెరు
వెవ్వరి వేఁడెదు భూసురేంద్ర! యే
కాంతమునందునున్న జవ
రాండ్ర నెపంబిడి పల్కరించులా
గింతియ కాక, నీ వెఱుఁగ
వే? మును వచ్చినత్రోవ చొప్పు, నీ
కింత భయంబు లే కడుగ
నెల్లిద మైతిమి, మాట లేటికిన్."

—స్వారో. ఆ. ౨, ప. ౪౧.

ఇంతకన్న ఘోరమైనవిషయ ముండదు. దారి గానక దురపిల్లుచున్న యాశ్రోత్రియుడు తన్ను మేల మాడు చున్నాడనుట సాధువా? అప్పటి తనయేకాంతత్వమును, తనయత్యంత భోగ్యత్వమును ధ్వనితము చేయుబడయే వరూధినియాశయము. ఇంత ప్రౌఢత్వ మాంధ్రసారస్వతమం దెక్కడను లేదు.

"చిన్నివెన్నెలకందు" స్వా౯. ఆ. ౨, ప. ౪౩.
"పేరు వరూధిని" ఆ. ౨, ప. ౪౪.
"బహురత్నద్యుతి" ఆ. ౨, ప. ౪౫.
"ఘూకురకైతవకుసుమశరాసన" ఆ. ౨, ప ౪౬.

ఇత్యాది ప్రసంగ మంతయు సర్మగర్భిత మే! అన్నిటను మించిన దిది యొకటి.

"పందనమువంటి మేను మష్యంది నాత
పోవ మ్మహారీ గంద, వన దాఁకె నొప్పు లోలుకు
వదన మస్తద్గ్రహంబు పావనము నేసి
బదలికలు వాసి చనుము......"
—స్వా౯. ఆ. ౨, ప. ౪౭.

అని ప్రవరు నాహ్వానించినది. ఆతని మేను కుంద నమైన తన కేమి? వదన మొప్పులకుప్ప నదైన తన కేమిలాభము? ఇది యద్భుతమైనధ్వని. పిదప వాచ్యము లోనికి దిగినది; అది మన కప్రకృతము. మొత్తముమీద నీఘట్టమునందువలె నెక్కడను ధ్వని రక్తిబొందలేదు.

పింగళి సూరనార్యు డింకొక యుద్దండుఁడు. ఇతని సత్యాసత్యరంభల సవతికయ్యము బహుస్వాభావికము; బహ్వాశ్చర్యకరమును. స్వాభావికము నాశ్చర్య కరముగ చిత్రించుటయే కవిత్వము; అదియే శిల్పము:

"నిను మాయేర్పాటు దనం
తన యనుచున్నది, యెట్లుఁ దప్పదు, సత్యం
బనఁగా, దైవం బనఁగా,
జనులకు లేకున్న నెట్లు జగములు నడచున్?"
—కళా. ఆ. ౩, ప. ౧౮౨.

అని సత్యరంభ పాపము దుఃఖించుచుండ,

"మన చరితంబుఁ జెప్పెను స
మస్తము వేల్పులసాని..."

యని మాయారంభ చమత్కరించి యామె కోపము నినుమడింపజేసెను. ఇక నిటు నటు దోచక యప్పుడు, అచ్చేసిన నారదులను నలకూబరుడు:

"......ఓ
మునివర! యిద్దఱ యథార్థముగఁ బల్కితి రం
చును బల్కితి రెట్లొక్కొ?"......
—ఆ. ౩, ప. ౨౦౪.

"...యిపు డీభావం
బీవనితకు, నీవనితకు నిది యని బయల్
గావించి తథ్యమిథ్యా
భావంబులు మీర దేరుపఱుపఁగ వేఁడెన్"
—ఆ. ౩, ప. ౨౦౯.

అని ప్రార్థింపగా,

"........తథ్య మిథ్యా
భావంబుల కేమి? నీకు భావింపఁగ స్వా
భావిక మే యీయాకృతి?
భావము నిజమెద్ది యీప్రపంచమునందున్?..."
—ఆ. ౩, ప. ౨౧౦.

అని నారదమహర్షి యెంతవ్యంగ్యముగ ప్రత్యుత్తరమిచ్చెనో పరికింపుడు. "నీవు మాత్రము నిజమైన నలకూబరుడవా!" యని యిందు ధ్వని.

కొంతతడ వైనతర్వాత సత్యాసత్య నిరూపణకు దేవసభకు పోవుదమని యథార్థరంభ తీర్మానించెను. కృత్రిమరంభకు తన మర్త్యత్వము తగని ప్రతిబంధక మైనది. కాన బహుబుద్ధికుశలతతో నామె:

"అప్సరస్త్రీలలో నగ్రగణ్యత్వంబు
జగముపశ్లోకితంబుగ వహించి,
యూర్వశీమేనకాద్యుత్తమస్త్రీలు రా
వమ్మ, పోవమ్మ, నా నతిశయిల్లి,
....
"యొప్పనే యింకఁ గడపటు నిప్పికాచి
నాకు పరిచేసికొని, దేవలోకసభకు
నీవునా! నీవునుమ్మని, యేవిధమున
కలహ మాడెద?........."
—ఆ. ౩, ప. ౨౨౮.

అని తప్పించుకొనుటయే గాక,

"నానడకలకును సౌభాగ్యము
కానిది, యిపు డిచటనైన గలహము బ్రతుకె
ల్లైన నసుఁగాని, యికఁ నీ
యాన, ధరణి విడిచి దివికి నడుగటు పెట్టన్."
—ఆ. ౩, ప. ౨౩౨.

అని ప్రతిన బట్టుచున్నది. ఇది యెంత టక్కరి

తనమో పరిశీలింపుడు. ఇప్పుడే కాదు; ఇం కెప్పుడును స్వర్గసుఖము లేదట! తనకు గల్గిన తలవంపు దీనికి కారణ మనుచున్నది. నిజమునకు మనుష్యాంగన [అస త్యవాదిని] యెట్లు దేవలోకపథము పోగలదు? ఈ సంగతిని సూరనార్యు డెంతమనోహరముగ ధ్వనింప జేసెనో చూడుడు. ఇట్టి వ్యంగ్యాభిరుచిగల రచనల కొందఱు తెనుగుకవులు కొన్నికొన్ని సందర్భములందు నడిపించిరి. చేమకూర వేంకటకవిరాజ ప్రణీతమగు విజ యవిలాసమున నుత్తమము, సులభగ్రాహ్యమునగు ధ్వని గలదు. కాని తెనుగుల సారస్వతమం దిది మొత్తము మీద యరుదని యనవచ్చును. ఇక రామరాజభూష ణుని కొంతగ పరిశీలింతము.

ఇతని వసుచరిత్ర యొక ధ్వనివిశేష ప్రధాన మైన కావ్యము. కాని దీనిని చాలమంది శ్లేషకావ్య మనుచుందురు. హరిశ్చంద్ర నలోపాఖ్యానము శుద్ధ శ్లేషకృతి. వసుచరిత్రయందు ప్రయత్నకృతమగు శ్లేష రచనము సకృత్తు. ధ్వనికే పెద్దలు దీనిని పేర్కొం దురు. అస లాకథావస్తువే కొంతవఱకు విలక్షణ మగు ధ్వనిసమన్వితము. కాని యిది మనము పైన పరిశీలించిన రసధ్వని గాదు. ఇతనిది ప్రధానముగ నలంకారధ్వని యనదగును.

బ్రహ్మసందర్శనమునకు లేవు శక్తిమతికిని, బ్రహ్మసందర్శనము జేసికొనివచ్చు కోలాహలునకును, శృంగారరసౌచితికిగాను మనుష్యపరముగ ముఖ్యార్థము నంగీకరింపవలె ననియు, వారి తదనంతరసమాగమమున రసాభాసవిశేషము తిర్యగ్శృంగారమునకుగాను నదీ పర్వతపరముగ ముఖ్యార్థము నంగీకరింపవలె ననియు, 'వసుచరిత్రవిమర్శనము'న తజ్జ్ఞులగు వజ్ఝల చినసీతారామ శాస్త్రిలవారు నుడివియున్నారు. వసుచరిత్ర వ్యాఖ్యాత లగు శ్రీతంజనగర దేవరాజుగా రిట్టియెడగూడ శ్లేష యనియే నుడివిరి. వీరివలెనే శ్లేషమతానుకూల పక్ష వాదులు పెక్కురు గలరు. నవీనాలంకారికుల ప్రకార మిది శ్లేష యనుటకన్న ప్రాచీనుల మతానుసారముగ ధ్వని యనుటయే యుక్తియుక్త మని తోచును:

"అనుకూలకేలనాయుత్తజీవనమైత్రి
నసరి నర్మద బోటియై భజింప,
సూక్తికాకంకణ ద్యుతికలాపము దోఁప
బాహుద కైదండఁ బరిఢవింప,
సను దితారావసంభ్రమసాంద్రయై పారె
పారెకు వేత్రవతి హెచ్చరిక దెల్ప,
గంభీర రసగుంభ సంభృతప్రౌఢిమ
తో సరస్వతి పల్కుఁగోడు గాఁగ,
గులములోఁ బెద్దయు, నమూల్యగుణమణిప్ర
కాండపరిపూర్ణయును గాన గౌరవమున
నఖిలనదులును దనుఁ గొల్వ ననుదినంబు
నలువకొలువున కేఁగు నన్నది యతీంద్ర!

"ఆలీల నమ్మహీనది
నాళీకజుఁ గొల్చి యొక్క నాఁడు ప్రియాళీ
కేళీసంభ్రమ విమలత
రాళీగతు లమర మరలి రా నొకచోటన్.

"సుమనోధివాసభాసురశిఖోన్నతివాఁడు
ఘనసారతిలకవాసనలవాఁడు,
ఘనసంకుమదసాంద్రగండభాగమువాడు
నవపద్మరాగదంతములవాడు,
కలితోపకంఠవక్త్రతమాలికవాడు
హరిచందనచ్ఛాయ నమరువాడు,
తపనీయ మేఖలాధారశ్లథశ్లాఘ్యమువాడు
మణిపాదవలయధామంబువాఁడు,
నవ్యరత్నావళీవిచిత్రాంబరాభి
రామశృంగారములవాడు, హైమగర్భ
గేహమున కేగువాడు కోలాహలాఖ్యుఁ
డాకధరాధీశుఁ డెదురయ్యె నవ్వినకపుడు."
—వసు. ఆ ౨, ప ౧౦౬, ౧౦౭, ౧౦౮.

"బాలకూర్మ విలాసపదములు కాంతరం
భా ప్రతిబింబోరుభవ్యరుచులు,
సరసపైకతసారజఘనసౌభాగ్యంబు
నతనాభిరూపవర్తనమంబు,
బెడగారునరులరొమ్ముప్పిదమును, నామీఁదఁ
జనుజక్కవలనిక్కు చక్కఁదనము,
కమలకోమలముఖకామనీయకము, ను
త్పలమంజులాలోకవిలసనంబు

ఘనఘనాఘనీలవేణీమణుల్, గలతరంగ
తీసమణి నిత్యనిర్మలాకారకాంతి
ధారధారుణ దెదరినంతనె నగేంద్రు
గంభీరధైర్యము కుక్కుగా హరించె."

"ఆకరణిఁ దరంగిణి నగ
లోకేశ్వరుధైర్యమెల్ల లోఁగొనిరా నీ
రాకరగభీర యాను
శ్లోకుఁడు నా గెలువ చెలువు లోఁగొని చనియెన్."

"అలఘుశ్రీనిధి యానగేంద్రతనయా
   డాసైకతశ్రోణికౌ
ప్పులు తెప్పార్పక చూచి చన్న మొదలుం
   బొంగారి పైపై రసం
బులు జృంభించు, భ్రమించు, నాశ్రయము క్రూ
   రుర్మిల్ మించ దీపించును
త్కలికాచాపలముల్ మనోనిబిడదిం
   తాతన్మయత్వంబునన్."

—వసు, ఆ ౨., ప ౧౧౦, ౧౧౧, ౧౧౨.

ఈయీపద్యములనుబట్టి శుక్తిమతీ కోలాహలు లను మనుష్యాకారముం దున్నట్లు మన మెప్పుకొనితీర వలయును. పునస్సమాగమప్పుడు నదీపర్వతార్థము నంగీకరింపవలెను. కాని యిట్టియలంకారధ్వనివలన పాఠకుల కంత యానందము జనింపదు. దీనికి యపార పాండిత్య మవసరమగుటయే కారణము. రసధ్వని సులభగ్రాహ్యమగుటచే తత్క్షణమే యానందము జనించును.

వస్తుధ్వని నర్థముజేసికొనుట మఱియు దుస్సాధ్యము. ఇది కేవలము కథావస్తువు నాశ్రయించి యుండుటచే నాయాయిపాత్రల శీలముల బాగుగ నర్థము జేసికొనినచేగాని ధ్వని స్ఫురింపదు. ఇట్టిది సామాన్యముగ పురాణకవితయం దుద్భవించుచుండును. అయినను పురాణకవిత యంతయు ధ్వనిమయమై యుండితీరవలెనని లేదు.

"......Does that mean that the Epic must be Allegorical? Many thought so. But it is not essential always......Allegory is a beautiful way of inculcating and asserting some special significance in life. But Epic has a severe task and a more impressive one,"—('The Epic,' chapter 3.) అని 'Abercrombie' పండితుడు పల్కెను.

ప్రతిసారస్వతమున మహాకావ్యములందు నిది కొంతకొంతగ గోచరించుచుచేయున్నది. అన్యభాషలందు 'హోమర్, వర్జిల్, మిల్టన్' మహాకవు లిట్టికస్తుధ్వనియందు ప్రముఖు లనదగుదురు. తెలుగునందు స్థూలముగ పురాణకవులనదగు భారత, రామాయణ, భాగవతకర్తలు నిట్టివారే! పురాణము లనదగు నీకావ్యత్రయమును సూక్ష్మదృష్టిని పరీక్షించి చూతుము. సత్యమైన వస్తు వెప్పుడును ప్రకాశించునని భారతము ధ్వనించుచున్నది రామాయణము సత్యాసత్యములకు గుణావగుణములను సంకేతముల నిర్ణయించుకొని వానిని రామ రావణచరిత్రలం దుదాహరించినది. ఇట్టి సత్యాన్వేషణము జేసినట్టి భక్తుని యానందముతో దోహలించుచున్నది భాగవతము. జ్యేష్ఠతాగౌరవానుసారముగ భారతముచే విపులముగ పరిశీలింతము.

నన్నపార్యునిభారతము కొంత చరిత్రాత్మకమును, కొంత సారస్వతసంబంధియు నను పురాణమనవలెను (Historic and literary epic). భాషాసేవార్థము, లోకసంగ్రహార్థమును కొంతగ చరిత్రాంశమగుకథను పురాణముగ నన్నయభట్టారకుడు నిర్మించెను. ఈవిషయమునందు హోమర్ మహాకవితో నితడు పోలును రాజకార్యనిర్వహణ ప్రవీణుడును, మహాలౌకికుడు నగుటచే తిక్కనార్యుని రచనయందు పురాణకవిత రాజకీయ వ్యవహార చాకచక్యమును, సున్నిత సునిశితశృంగార వీరములను క్రమముగ గడించికొన్నది. వర్జిల్ మహాకవికి తిక్కనయజ్వకు నిచ్చట సామ్యమున్నది. ముఖ్యపాత్రలైన కృష్ణునియందు శక్తియు (spirit), నర్జునునియందు భక్తియు (Devotion), కర్ణునియందు పరాక్రమము (Chivalry), ద్రౌపదీదేవియందు వీరమాతృత్వమును, ధర్మజునియందు ధర్మస్వరూపము భ్రాతృప్రేమయు, సుభద్రయందు పుత్రప్రేమానురాగములును కవి మూర్తిభవింపజేసినట్లు దోచును. ఈ విశ్వమండలి

స్థూలద్రవ్యమందు సర్వత్ర శక్తియనునది వ్యాప్తిజెంది యున్నదను సత్యమును శ్రీకృష్ణపాత్రము బోధించుచున్నది (Spirit universally and singly pervades matter). షెల్లీమహాకవియొక్క 'జూపిటర్' మన శ్రీకృష్ణభగవానునికి తుల్యుడే! శ్రీకృష్ణుడు సర్వవ్యాపియగు శక్తిస్వరూపుడగుటవలనికి తార్కాణ మతడు పదునారువేల భార్యల గలవాడయ్యును, నిరంజనుడు, నిర్వికారుడునగు నిత్యబ్రహ్మచారి యనుటయే! వ్యక్తిగతముగ గూడ తిక్కనార్యుని కిట్టి నిర్వికారము, విశ్వవ్యాప్తమునగు పారిహారతత్త్వమే దైవతము.

ఒక అర్జునుని భక్తినియుక్తి సెలవిగనివా రుండరు. కృష్ణునియం దీతనిభక్తికి రాయబార సందర్భమందలి పద్యములే సాక్ష్యములు:

"నీ వొనరింపగ బూనిన ప
నిం గమలోదర కీడువుట్టునే?
కా వనినట్ల యుండి యవు
గార్యము లట్లుపటం బ్రయత్నసం
భావన నీత పౌరుషము
పద్ధతి, తత్ఫలసిద్ధి వొందుచో
దైవముఁ దోడ్పడగ్ వలయుఁ,
దర్యము రెండును నీవినోదముల్."

"హితమిచ్చ్యంగిడి మాకు, ధర్మము తెలం
ట్లుండునం చేను నీ
మతి బోధింప వలంతినే? హితము, ధ
ర్మంబుగ్ విచారించి చూ
చి, తగం బొమ్మని యేది పంచి తది ని
శ్చింతంబునం జేసి, యు
న్నతి బొందంగలవార మై యునికి కృ
ష్ణా! నేడుగా వచ్చెనే?"

ఉద్యో. అ ౩, ప ౭౩, ౮౦

కర్ణునిశీలము పరిశీలించినచో నితడు మిల్టన్ మహాకవియొక్క 'సాటన్'వంటివాడు. 'బుద్ధిః కర్మానుసారిణీ' (Sense of man's nature being contained by destiny) అని పెద్ద లనుచుందురు. కర్ణుడిట్టి దాని నంగీకరింపక పోడుగాని యితనిబుద్ధి కర్మను తిరస్కరింపవలెనని ప్రయత్నించుచుండును. ఇదియే ఇతని పాత్రమందలి రహస్యము. ఇదియే మాయ. ఇతనిని కావ్యకారు డనవలెను. అపరిమితమై (unlimited), యప్రతిరోధకమై (irresistable), యనివార్యమై (undefiable) శక్తి యనునది కర్మరూపమున సర్వతోముఖముగ వ్యాపించియున్నది (There is some general, unlimited, undefiable and irresistable will of universal destiny called Karma). ఇట్లు సర్వత్ర వ్యాపించియున్న కర్మయందు వ్యక్తిగతముగ నియతమైన బుద్ధియనునది యొకటి గలదు (A defined individual will existing in the above). సింహ మున్న గుహలో ప్రవేశించి యాసింహముచే ధిక్కరింప జాలు మత్తకరీంద్రమువలె నీకర్ణునిబుద్ధి కర్మయందు ప్రవర్తించుచు నాకర్మనే ధిక్కరింప జూచుచుండిగాని యున్నది; అనగా కర్ణునిబుద్ధి యనివార్యమైనది యనుభావ్యమని (What cannot be cured must be endured) యూరుకొనదు.

మిల్టన్ మహాకవియొక్క సాటన్ పాత్రము నిట్టిదే! అత డేమనెనో చూడుడు :—

"What though the field is lost?
All is not lost, the unconquerable will
And study of revenge, immortal hate,
And courage never to submit or yield;
And what is else not to be overcome?"

ఇట్లే కర్ణునిదియు హఠబుద్ధి (Tenacious mind).

శక్తిరూపమగు కర్మచే బుద్ధి నియతమగునప్పుడు, అది గడించికొనిన యాయల్పశక్తిచే కర్మరూపమున తన్ను బంధించుచున్న విశ్వవ్యాప్తమగు మహాశక్తిని యెదిరించుటకే కర్ణుడు యత్నించెను; అనగా కర్మకు భావముగ శక్తియున్నది (A sense of man's rigorously contained nature). కాని తనబుద్ధికి మాత్రము కొంతశక్తి లేదా? (A sense of that which contained man) యనుచునూహ కర్ణునకు కల్గినది క్లుప్తముగ చెప్పినచో కర్మకు శక్తి యున్నట్లే తనయాత్మకును శక్తి యున్నదని యెంచి కర్ణుడు శక్తి ద్వైతభావమును (Dualism) ఆపాదించినాడు. వెం

టచే కర్మను దూరముగ నేగాక ప్రతిఘటించి కూడ నిలువనుంకించెను. కర్మ యప్రతిరోధకము (Unmastered). అప్రతిరోధకమైనదానికిని యసాధ్యమైనదానికిని సమాఘాతము (Collision) గల్గినది; కర్ణుడు మరణించెను. భారతమం దితరపాత్రలు కర్మనియత బుద్ధులు (Sense of destiny). కర్ణునియందు కర్మను ధిక్కరించు నాత్మశక్తి (Destined will of man) గలదు. ఇత డాదర్శప్రాయుడగు కర్మశూరుడు. కర్మ సర్వశక్తిగల దగుటచే (Omnipotent) సాధారణముగ పురాణములందలి పాత్రలు దానికి తల యొగ్గుచుండును. కర్మ సర్వశక్తమని యెఱిగియు కర్ణుడు పాండవులతో కయ్యముచే యుత్సహించి కర్మ నతిక్రమింపయత్నించిన ప్రతిఘటనశీలను ధ్వనించుచున్నది. కర్ణ పాత్రం బిది యొక్క ముఖ్య విలక్షణము. ఇతడు లేక భారతమే లేదు. అందుచేతనే మన పెద్దలు 'కర్ణరల భారతము' అనుచుందురు.

ఇక ధర్మజునియందున్న ధర్మప్రియత్వమును, గురుభ్రాతృప్రేమలను విశదీకరించు నీపద్యముల వరయుదము :

"అక్కట లాతులైనఁ బగరైనను
 జంపగ గోర నేల? యొం
డొక్కటి యెంత లేదె? యది
 యొప్పదె! బంధుసుహృజ్జనంబు లా
దిక్కున నున్నవారు, గణు
 తింపక సంపదకై వధించి, దూ
ఱెక్కుట, దోష మందుటను
 నీ దురవస్థల గోర్వవచ్చునే?"—

"మనమున పక్షపాతగతి మాదప
 మానుము, ధర్మనీతివ
ర్తనముల రెండుదిక్కుల హి
 తంబును జెంపును గల్గనట్టిచో
ప్పున, విదురాదిసజ్జనుల
 బుద్ధికిరా, నుచితంబులో డిమె
ల్పునఁ, బరుసందనంబునను,
 భూపతు లెల్ల నెఱుంగ నాడుమీ!"

"తగవునఁ బోక రాజు వెడ
 దంబులు పల్కినయేని, సైఁచి, యొ
ప్పుగ నిలుమీ! గురుత్వము ప్ర
 భుత్వముఁ గల పెద్దవారిమా
ట గొనమి, యాసుయోధనుక
 డన్ నిల్వక మన మెల్ల గారవం
బుగఁ గురువృద్ధపల్కఁ
 పుంజన మెచ్చరే జనుల్."

"సుతువాఁడై, విలయంబు సేకొనక, యే
 చొప్పుం దగం జెప్ప కా
ధృతరాష్ట్రుం డవినీతిఁ జేసినను, సం
 ధింపంగ రాఁ దంచు నే
గ తెగంబాఱకు, తెంపు సేయుదెస, లో
 కంబెల్ల మెచ్చన్ బ్రకా
శితధర్మస్థితి నొందఁ, దా మనము ని
 శ్చింతంబుగాఁ జేయుమీ!"

—ఉద్యోగ. అ ౩, ప ౧౩, ౨౩, ౨౪, ౨౫.

శాంతిపర్వ మందలి (ఆ ౧. ప ౧౯౬-౨౦౩ వఱకు) పద్యము లీతనిగురు భ్రాతృప్రేమల విశదీకరింప గలవు. ఈ రెండుభావములు నీతనియం దవతరించె నన వలెను.

ద్రౌపది వీరమాత, వీరవనితయు ననుటకు స్పష్టముగ రెండేపద్యముల, నవియు ప్రచారమం దున్నవాని నుదాహరింతము :

"వరమునఁ బుట్టితిన్, భరత
 వంశముఁ జొచ్చితి, నందు పాండుభూ
వరునకుఁ గోడలైతి, జన
 వంద్యులఁ బొందితి, నీతివిక్రమ
స్థిరులను పుత్రులన్ బడసి
 తిన్ సహజన్ముల ప్రాపు గాంచితిన్
సరసిజనాభ! యిన్నిటఁ బ్ర
 శస్తికి నెక్కినదాన నెంతయున్—"

—ఆ ౩, ప ౧౦౮

ఇది స్వోత్కర్ష కాదు; సత్యము; స్థూలము; ప్రత్యక్షమును.

మహాశయుల కృషి ప్రారంభము. దీనిని "మూలిక రుజువు" (Drug proving) అందురు.

మూలికరుజువు

మహాశయులు తాము రుగ్మతలను నివారించుటకు వలయు లక్షణములను మూలికలయందు సర్తించితిమని వారు గ్రహించిరి. దీనిద్వారా శాస్త్రయుక్తముగా, సులువుగా, శాశ్వతముగా స్వస్థత చేకూర్పగలమను ధైర్యము చేకూరినది. వీరు వీరిమిత్రుల సహాయముతో "క్వైనా"ను రుజువు చేసి నట్లే ప్రతిమూలికను రుజువు చేయ ప్రారంభించిరి.

వీరు బహుభాగరూకతగా మామూలు ఆరోగ్యమునకు ఎట్లు ఎప్పు డెప్పుడు మూలికసేవించిన తదుపరి ఏయే వ్యత్యాసములు ఒక్కొక్కరియందు కలిగినది వ్రాసిరి. రుజువుచేయు ప్రతివారికి దినదినము తనయందు కలుగు మార్పులు "దినచర్య"అనుపుస్తకము పెట్టి అందు వ్రాయించిరి. ఇట్లు ప్రతిమూలికకు సంబంధించిన వివిధ రుజువుదార్ల పుస్తకములను హానిమాన్ గారు స్వీకరించి, అందరికి సమముగా కనిపించిన లక్షణములను — వారి సంప్రదాయానుసారముగా ప్రథమమున మానసికలక్షణములు, క్రమముగా మెదడు, శిరస్సు, కండ్లు, ముక్కు, నోరు, నాలుక, గొంతుకు – ఇట్లే పాదములవరకు ఆ మామూలికలు సేవించుటచే కలుగుమార్పులను స్పష్టముగా లిఖియించిరి. ఇట్లు రుజువుచేయబడిన మూలికలనుగూర్చి వ్రాసిన గ్రంథమే సారూప్య ఔషధ లక్షణదీపిక.

వీరి జీవితములో వీరి ఆధిపత్యమున రుజువు కాబడి వ్రాయబడిన గ్రంథములు రెండు సంపుటములు. దీనినే మెటీరియా మెడికా ప్యూరా అందురు. ఇది ౧౪౨౭ పేజీల గ్రంథము. కరి తరువాతివారు వీటిని విస్తృతీకరించి చిన్నిచిన్ని గ్రంథములు వ్రాసిరి.

౧౫౦ ఏండ్ల క్రిందట హానిమాన్ గారి కాలమున "క్వైనా"కు ఏలక్షణములు కలవో, ఏలక్షణములుగల రుగ్మతకు అది పనిచేయు నని వ్రాసిరో నేటికిని అది అదే లక్షణములు గల్గి ఆరుగ్మతలకే మందు. ముందుకూడ ఇట్టి వానికే దివ్యౌషధము. ఈవైద్యవిధానము సత్యమగుటచేతను, ప్రకృతిసిద్ధమగు శాస్త్రముపై ఆధారపడుటచేతను కాలానుసారముగా ఇతర విధానముల వలె మార్పు చెందక ఎల్లకాలము ఒకరీతిగానే యుండును. మామిడిచెట్టు వెనక ఇప్పుడు ముందుకూడా మామిడి కాయలు కాయుట ఎంత సత్యమో ఈవైద్యసిద్ధాంతము లును అంత సత్యము. సారూప్యౌషధములు సారూప్య వ్యాధులను నివారణచేయును (Similia Similibus Curentur). "ఉష్ణం ఉష్ణేన శీతలం" అన్న ఆయుర్వేదసిద్ధాంతము దీనికి సన్నిహితము.

రుగ్మతకు కారణము నిరూపించుటకు పెక్కుమంది వైద్యులు అమితముగా శ్రమపడి, ముఖ్యముగా కావలసిన చికిత్సనుగూర్చి తగినంతగా యోచించరు. సారూప్యచికిత్సకు ఈ విచారణ కేవలము కాలము వృథపుచ్చుట. దీనికి పద్ధతిము అటుండ ఇది సిద్ధాంతమునకు వ్యతిరేకము. మన్యపుజ్వరమునుగూర్చియు, అది వచ్చుటకుగల కారణములనుగూర్చియు, పెక్కుమంది పెక్కు అభిప్రాయములను కలిగియున్నారు. దోమ ప్రాంతమందు ఈ జ్వరానికి సంబంధించిన సూక్ష్మజీవులు పుట్టి పెరుగు ననియు, ఒకవిధమైన దోమలు దీనిని మానవ శరీరమందు అంకురింపచేయుననియు కొంతమంది అభిప్రాయము. మరి కొందరు కొన్ని లవణలోపములచే ఇది వచ్చునని చెప్పుదురు. పెక్కుమంది వ్యర్థప్రయాసలోబడి ఇంకను దీనినిగూర్చి చర్చించుచున్నారు. వై... వ్యచికిత్సకు కారణ మవసరమైన కావచ్చును; కాని సారూప్య వైద్యులకు నిజముగా సిద్ధాంతమును అవగాహన చేసికొన్నచో పై కారణములతో నిమిత్తము లేదు.

రోగియే రుగ్మతకు కారణమని మా అభిప్రాయము. యథార్థముగా రుగ్మతకు కారణము రోగి శారీర తత్వమే. పెక్కుమంది ఎట్టి మన్యపుజ్వరమును లేక మన్యప్రాంతమున నివసించుటయే దీనికి కారణము. యథార్థముగా "గెల్సెమియమ్" (Gelsemium) అను మందు జ్వరమును నివారించును. కాని రోగికి గల లక్షణము లన్నియు గెల్సెమియమ్‌యొక్క లక్షణములతో సరిపోయినచో జ్వర మెట్టిదైనను, ఏనామము కలిగినదైనను, అనగా మన్యపుజ్వరమైనను, సన్నిపాత జ్వరమైనను, ఏజ్వరమైననుసరే తప్పక నివారణయగును.

కాని వైరూప్యవైద్యులు అది మన్యపుజ్వరమని ప్రథమమున నిరూపించుకొని, దానికి సంబంధించు సూక్ష్మజీవులను చంపుటకు క్వైనాను ఉపయోగించెదరు. సారూప్యవైద్యులు మూలికల లక్షణములను చక్కగా చదువుకొని రుగ్మతలయందు ఏమూలికల లక్షణములు కలవో తెలిసికొని, ఆయామూలికలను రోగికి ప్రయోగించినచో రుగ్మతయొక్క పేరుతో నిమిత్తము లేకయే, సునాయాసముగా శాశ్వతముగా చికిత్స చేయగలరు. వీరికి కారణముతోగాని, పేరుతోగాని నిమిత్తము లేదు. వీరికి చంపుటకు సూక్ష్మజీవులును లేవు.

"గెల్ సెమియమ్"తో జ్వరము తగ్గినదనుకొనుము. కొలదికాలములో మరల తిరిగి జ్వరము వచ్చిన దీని క్వైనాతప్ప ఇక మందులేదని ఎంచరాదు. ఈశాస్త్రమునందు పాండిత్యముకలవారు రోగియందలి అంతరంగిక లక్షణములనుగూర్చి యోచించినచో రోగి అంతర్గతమున (Psora), సిఫిలిస్ (Syphilis) లేక సైకోసిస్ (Sycossis) దోషములు ఏ రెండుకాని, మూడుకాని కలసి పై చెప్పిన మందును శాశ్వతముగా పనిచేయనివ్వుటలేదని గోచరించును. అప్పుడు ఈ పై భూతములను ఎదుర్కొనుటకు వలయు ఔషధములను తెలుసుకొనవలసియున్నది. ఇట్టి రోగియొక్క అంతరంగిక లక్షణములు తెలుసుకొనలేనిచో సారూప్యచికిత్సావిధానము కడుంగడు కష్టము. ఆ హేతువుచేతనే ఈ చికిత్సా విధానము అంత సులువు కాదనియు, శ్రమపడి పెక్కు వత్సరములు కృషి సలుపవలయుననియు ఆదిని చెప్పియుంటిమి. సారూప్యవైద్యమునకు మూడు ప్రధాన అంశములు కలవు:

(౧) సారూప్యసిద్ధాంతము (Law of similars).

(౨) లఘుమోతాదు. (Minimum Dose).

(3) ఏకమూలిక

ఇవి ప్రధానములు.

రుగ్మత — దానికారణము

అసలు రుగ్మతకు కారణమేమి? ఈవిషయమును గూర్చి చాల దీర్ఘముగా చర్చింపవలసియున్నది. హానిమన్ మహాశయులు దురద (Psora) అన్ని రుగ్మతలకు హేతువనియు, వివిధనామములతో పిలువబడు రుగ్మతలన్నియు నిగూఢముగా, అంతరంగికముగానున్న సోరాయొక్క తాత్కాలిక బహిర్లక్షణమనియు సెలవిచ్చియున్నారు.

సోరా అననేమి? సాధారణముగా పెక్కుమందికి సోరా అనగ చిడుము, దురద ఈ మొదలగు చర్మవ్యాధులని యభిప్రాయము. కాని అది కాదు. చర్మవ్యాధులు కాని, చిడుముకాని దురదకాని సోరా కాదు. కేవలము ఇవి యన్నియు సోరా యొక్క లక్షణములు. సోరా కారకురాలు. దురద, చర్మవ్యాధులు దాని లక్షణములు. దురద యున్నచో సోరా యున్నదని నిరూపింపవచ్చును.

సోరా నిరూపణ :— ఇది పెక్కు రుగ్మతలు కలుగచేయు ఒక విషమను తత్వము. ఇది ఆదిని ఎట్లు కలుగును? మానవుడు ఎంతకాలము భగవంతుని ఆదేశానుసారము సహజముగా ప్రకృతిపై ఆధారపడి సత్ప్రవర్తనతో దయామయుని ఇష్టానుసారము ప్రవర్తించునో అంతవరకు ఏ చిక్కును లేదు. కాని ఎప్పుడు పెడత్రోవనుబట్టి చెడుతలంపులు, చెడుకోర్కెలు, చెడుఉద్దేశములు కలిగి భగవంతుని హంశయను అంతరాత్మకు వ్యతిరిక్తముగా యోచించునో అప్పుడే మానవహృదయమున వ్యత్యాసము ఏర్పడును. ఈ మానసికవ్యత్యాసమే లేక వక్రతయే భౌతిక శరీరముపై పరిణమించి సోరాకు ప్రథమచిహ్నముగా అగుపడుచున్నది. ఈ వ్యత్యాసము ప్రథమమున మనస్సునందు, తరుపరి శరీరోపరిభాగమందు పరిణమిల్లి పెక్కురుగ్మతలకు కారణంబగుచున్నది. ఎంతకాలము మానవుడు ఇట్టి దురాలోచనలు లేక భగవంతుని ఇచ్ఛానుసారము సత్ప్రవర్తకుడుగా నుండునో అంతకాలము ఎట్టి రుగ్మతయుండదు. దయామయుడు మానవులను ఉత్తములుగా సృష్టించినాడు యోగ్యతతో ప్రవర్తించవలెనని ఆయన ఇచ్ఛ. కాని మానవుడు కృత్రిమాలోచనలపాలై ఇట్టి అనివార్యములగు పెక్కురుగ్మతలు పొందుచున్నాడు. ఈ వ్యత్యాసము కేవలము మానసికము; అనగా వక్రత కేవలము ఆలోచనావస్థయందున్నదని తెలియునగు. ఇంకను ప్రవర్తనయందు వ్యత్యాసము లేదు. ఈ మాన

"ఈపెంద్రుకలు పట్టి యీడ్చిన యాచేయి
దొలుతగాఁ దోరిలో దున్నసేను
తను వింతలింతలు తునియలై చెదరి, యా
పటియున్నఁ గానిఁ యుడుకొఱఁగాక,
యాలంపాలఁ బోసఁబడునట్టి చిచ్చే యిది?
పెనుగద పట్టిన భీమసేను
బాహుబలంబును బాటించి గాండీవ
మనునొక విల్లెప్పుడును వహించు
కవ్వడిక్రమంబుఁ గాల్పనే, ఇట్లు బ
న్నములు పడిన ధర్మనందనుండు
సేమ, రాజరాజు పీనుంగుఁ గన్నారఁ
గాన బడయమైతి నే నిఁ? కృష్ణ!
—ఉద్యోగ. ఆ. ౩, ప ౧౧౬.

అసలీమె ప్రవృత్తి వీరోచితము :
"...... సంతతక్షముండు, సంతతతేజుండు
నగుట దోషమందు రనఘమతులు."
— అరణ్య. ఆ. ౧, ప ౨౧౬.

అని ఈమె భర్తలను ప్రోత్సహించిన వీరవనిత. పతివ్రత యంతకుమించి భర్తల నేమని నిందింపగలదు? అతివృష్ట్యనావృష్టులు రెండును దోషములే. ధర్మజునం దున్నది యతిసాత్వికము. అది కొన్నిపట్ల తగనిది. వీరవనితయై యిట్లామె భర్తలను కార్యోన్ముఖుల జేసినది.

సుభద్రాదేవిపుత్రప్రేమాదు లెంతయో స్వాభావికముగ వర్ణింపబడినవి. ఉదాహరణ కొక్కపద్యమును పరిశీలింతము :

"ఈలోక మెల్లఁ బాడిల్లునట్లో లెస్సై
యున్నది నీవు లేమనికిఁ జీకి
నీవు వేగమ గండుమానిసి బంధుల ప్రీతిఁ
బొందఁజేయుట గలవో లె నయ్యొ,
జిష్ణునికొడుకవు కృష్ణునల్లుండ వీ
వరులచేఁ బడుట చోద్యంబుగాదె?
చెలువంపుమేనును జిన్న మొగంబునై
యెప్పుడు పొడసూపె దింకఁ గుఱ్ఱ!
యకట, యుత్తర యొప్పైడునది, మనంబు
దీని కెంతయు మెత్తన, యేను నిన్ను
జేడికొనియెద, వచ్చి యిప్పలఁది వంత
దీపి పరుకొత్తుపలుకులఁ దేర్పవన్న !"
—ద్రోణ. ఆ. ౨, ప ౩౩౬.

ఇట్లే తిక్కనముఖ్యపాత్రలు నొక్కొకభావమునకు మూర్తీభవ మనుధ్వని మనకు దోచును. పరిశీలించినచో రామాయణ భాగవతములందు నిట్టిధ్వనియే వినబడునని చెప్పికొంటిమి.

హరిశ్చంద్రాద్యుపాఖ్యానములందును నిట్టిధ్వని గలదు. హరిశ్చంద్రుడు స్వార్థత్యాగము జేసిన మహాప్రభువు. స్వార్థరహితునకు మిగులునవి ధర్మకామమోక్షములు మాత్రమే! ఈ పురుషార్థత్రయము త్రిమూర్త్యాత్మకముగ హరిశ్చంద్రునకు ప్రత్యక్షమయ్యె నని యీగాథలోని ధ్వని. దశావతారక్రమమందు ప్రాపంచికవస్తుపరిణామమును సూచించు ధ్వని యున్నదని తజ్ఞులు పలుకుదురు. ఇట్టి వ్యంగ్యార్థముచే మిల్టను మహాకవి 'పేరడైజ్ లాస్ట్' (Paradise Lost) నం దింతటను నిండజల్లెను. పాపము (Sin) నకు మృత్యువు (Death) సంతతిగ జెప్పటలో కవిహృదయము స్పష్టము. పరాధికారతిరస్కారము (Rebellion)నకు సాతన్ (Satan) మూర్తీభవము. ఆదాము (Aadam) నందు మానవజాతిస్వభావము రూపుదాల్చినది. ఇట్టిధ్వని యాయాకవు లెన్నుకొనిన కథావస్తువునందే యున్నది. కనుక దీనిని వస్తుధ్వనిగ తెలుపగలము. (పాశ్చాత్యుల **Allegory, Symbolism** లు రెండును మనధ్వనియం దిమిడియున్నవి).

అన్ని యభిరుచులవలెనే వ్యంగ్యాభిరుచియు, కొంతకాలము కవితాసామ్రాజ్యము నఖండముగ నేలినది. కవులు కొంద ఱందలి జీవము పోయినపిదప కూడ దానినే వరించుటయు తటస్థించినది. ఇట్లనుటచే ధ్వని యప్రశస్తమైన దనుట కాదు. ప్రజాభిరుచి వేఱు త్రోవ బట్టినప్పుడిక నది తుచ్ఛముగ నుండెననిమాత్రమే నా భావము. కాని కేవలవాచ్యమాత్రోపనిబంధనము కావ్యముకన్న ధ్వనికావ్య మెుత్తమోత్తమము. ఇది బ్రహ్మానందసచివమైన రసమునకు ప్రాణము. ఈవిషయము పెల్లరును ముక్తకంఠముతో కొనియాడిరి. ఈ ధ్వనికావ్యము నే :

"......But as intensity, the parent of concentration and suggestion is the most important thing in it, I may be allowed to go a little further, neither fluency nor volubility is so essential an attribute as concentration and suggestion. In other words, without concentration and suggestion there can be no great speech. The most important business for a poet is to suggest what he wants to convey to the reader in concentrated potential speach."

అని కెయిట్సో మహాశయుడు ('Keat's View of Poetry,' పుట ౧౧౪ నందు) శ్లాఘించెను.

ప్రపంచమున సమస్త విషయములందు నావశ్యకతచే నుత్పత్తి కలిగి, తిరిగి యుత్పత్తిచే నావశ్యకత యధిక మగు ననియు, నాఁటినాఁటి కాలమునం దాఁటి నాఁటి యభిరుచి నాఁటికనాఁటి యాశించు ననియు పూర్వమే చెప్పికొంటిమి. అనంతరము వచ్చు యుగాభిరుచి, కొల్యదీర్చియుంచి, క్షణకాలమైనను విచారణ చేయకయే, పూర్వాభిరుచికి దేశబహిష్కార శిక్ష విధించును*.

—"తెలుగుల కవితాత్మ"నుండి.

* **Allegory**, **Suggestion**, **Symbolism** మొదలైనవి ధ్వనిభేదములగు వ్యవహారములు.

అన్వేషణము

దామెర రాజగోపాలరావు

ఈదాసిపై దేవ, యింత దయ లేదా!
ఈదీనురాలిపై, సుంత కృప రాదా!!

రేయనక యిలువీడి
ఈయడవి నడుగిడితి,
కనబడదు నీజాడ,
కనులు కాయలు గాచె —ఈదాసి.

దూరాన నీరేయి
హోరనుచు రొదసేయు
యమునారవమె కాని
అదనమే లేదాయె —ఈదాసి.

లీలగా కదలాడు
నీలినీడలు చూచ,
హృదయమ్ములో వెరపు
ఇంతింత యనరాదు. —ఈదాసి.

పండుటాకులు నేల
పవనాహతిని రాల
ఉల్ల మది యేలనో
జల్లు మనునోయీ —ఈదాసి.

నీతిమాలిన దనుచు
నిందించినను నన్ను,
నాథ! నీ పదములే
నమ్మియుంటిని కాద —ఈదాసి.

ఫాన్సీ డ్రెస్ పారేడ్

[లేడీస్ కల్చర్ క్లబ్]

"దీక్షిత్"

౧

ఆదివారం సెలవుదినం కాబట్టి సావకాశంగా పటీరావుకు అలంకరణం చేస్తున్నాను, యిదివరలో వ్రాతమూలకంగా ఒప్పన్నమైన షరతులనుబట్టి.

పటీరావుతో "ప్రణయరాజీ" చేసుకొని జోళ్లు తుడవడం, వాటికి రంగుపూయడం మాత్రం నౌకరీకుర్రవాడికి అప్పజెప్పాను.

పటీరావు శరీరసౌందర్యపోషణ క్రియలు మాత్రము నేను చేస్తున్నాను - సంవాహనముసహా.

కత్తెరతో అలకలు త్రించేశాను. కనురెప్పలకు మేకప్ పూర్తిచేశాను. రేజరుతో కనుబొమలు సవరించాను. బహుజాగ్రత్తగా పెదవులకు రంగు పూశాను. చెవులకు పెట్టుకొనే గుండ్రని బంగారు చక్రాలకు మెరుగుపెట్టి చెవులకు తగిలించాను. చెక్కిళ్లకు రంగు అద్దాను. మెడకు పౌడరు కొట్టాను. తల దువ్వి వదలిపెడితే పటీరావే స్వయంగా ముడి తయారుచేసుకొంది. ఆముడిమీద సినిమావైఖరిని పుష్పాలంకరణం చేసుకొంది.

నిజానికి మన పూర్వులే బుద్ధిమంతులని తోస్తుంది. భార్యలకు యిట్టి అలంకరణాలు వాళ్లే చేసేవారట - ఈ కాలంలో నాగరీకం బలిశడంమూలాన్ని పురుషులు తమ విధ్యుక్తధర్మాలను నెరవేర్చడం లేదు-సౌందర్యోపాసన చేయడంలేదు. నిజానికి ఈ సౌందర్యపోషణకార్యములు భర్త చేయడములో ఉంటే ఆనందము అనుభవిస్తేనేగాని తెలియదు. అందువల్లనే పురుషులందరూ అవసరమైన ప్రయోజనకరమైన యిట్టి సహజధర్మాన్ని విస్మరించకూడదు. కష్టమునకు తగినఫలం ఉండకుండా పోదని పెద్దలంటారు గదా!

అంతే కాకుండా యింకో ప్రయోజనం కూడా ఉంది. వెనక భోజరాజునుగురించి ఒక కథ చెప్పడం కద్దు. కాళిదాసు భోజరాజుభార్యను వర్ణిస్తూ తొడమీద మచ్చను కూడా వర్ణించాడట. ఆ మచ్చ సంగతి భోజరాజుకు మాత్రమే తెలుసును — అంటే స్వయంగా సౌందర్య పోషణ కార్యములలో అతడు కలుగజేసికొనేవా డన్నమాటేనా! కాళిదాసుమీద కోపం వచ్చిందట. భార్యను అనుమానించాడట! చివరకు కాళిదాసు కాళీవరప్రసాదలబ్ధప్రభావు డని తెలిసికొని ఊరుకొన్నాడట. ఈ కథనుబట్టి నేర్చుకోవలసిన నీతి ఏమిటంటే — సౌందర్యపోషణకార్యములూ, సంవాహనక్రియలూ స్వయముగా చేయడమువల్ల భార్యల శరీరముల యందలి సౌందర్య భాగములు అంగుళము

అంగుళము దగ్గిరనుంచీ తాము తెలుసుకొని ఆనందించవచ్చు. సౌందర్య వినాశనకరములైన మచ్చలూ తెలుసుకోవచ్చు. తెలుసుకొని సరియైన మేకప్ అవలంబించి వాటిని సౌందర్యభాగములుగా మార్చవచ్చు. చిన్న కత్తెరతో గోళ్లు కత్తెరించి వాటికి రంగు పూస్తూన్న సమయంలో చెప్పింది పటీరావు ఒక సువార్త.

కల్చరుక్లబ్బు ప్రత్యేకమూ ఆడవాళ్లకొరకేర్పాటైన దేగాని మగవాళ్లకు దానితో ఎంతమాత్రమూ సంబంధంలేదు. మగవాళ్లు క్లబ్బు బంగాళాలో కాలు పెట్టరాదు. చుట్టపుచూపుగా తమవాళ్లని చూడ్డానికైనా పోవీలులేదు. కాని క్లబ్బులో మెంబర్లు చాలామంది వివాహితలైన స్త్రీలే. ఈస్త్రీల భర్తలకు మాత్రం క్లబ్బుప్రవేశం చేయించడం మంచి దని కొందరు మెంబర్లు అభిప్రాయపడ్డారు. న్యాయానికి క్లబ్ పోషణ వారివల్ల నే కదా జరిగేది. చందా లివ్వవలసివచ్చినా విరాళాలు కావలసివచ్చినా మగవాళ్లే కదా తమ భార్యలద్వారా ఆడబ్బు యిస్తూంట.

కాని మరి కొందరు — మగవాళ్లకు ప్రవేశం యివ్వడం ఎంతమాత్రమూ కూడదని వాదించారు. మగవాళ్లబుద్ధి చూపిస్తే అంటించేరకం కాబట్టి అట్టిపని ప్రమాదకరం అనిన్నీ, తమ స్వతంత్రతకు భంగంకలుగుతుం దనిన్నీ, తమ గుట్టుమట్టులు వెల్లడౌతాయనిన్నీ వాళ్లు వాదించారు.

అవివాహితలైన మెంబర్లుకూడా అట్టిది పనికిరా దన్నారు. ఒకవేళ మెంబర్ల భర్తలను క్లబ్బులో ప్రవేశపెట్టినట్టయితే తామున్నూ తమ మగ స్నేహితులను క్లబ్బుకు తీసుకువచ్చితీరుతా మని బెదిరించారు.

తీవ్రమైన వాదన జరిగినపిమ్మట అందరూ ఒక తీర్మానానికి వచ్చారు. ఏడాదికొకమారు, మెంబర్ల భర్తలను, ఉచితమైన సందర్భము చూచి — ఆహ్వానించవచ్చు ననీ, బహూకరించవచ్చు ననీ తీర్మానము.

ఇదీ పటీరావు చెప్పిన సువార్త. ఈయేటి సంవత్సరోత్సవాలకి మా కందరికీ ఆహ్వానం రాబోతోందనీ అందుకు సిద్ధంగా ఉండమనీకూడా పురిగొల్పింది.

"ఈ మహాత్కార్యానికి సిద్ధంగా ఉండడం ఏమిటి?"

"ఏమిటో మీకే తెలుస్తుందిగా, ఎందుకీ తొందర."

గోళ్లకు రంగు పుయ్యడం పూర్తి అయింది.

"ఇంకా ఏమి చెయ్యమంటావు', అన్నాను.

"థాంక్సు, మైడియర్ హబ్బీ—.

ఈవేళకి ఈ అలంకరణం చాలు—. దయచేసి నా బీరువాతలుపు తీసి అందులో చాకలేటురంగు చీర ఉంది తెచ్చి పెడతారా?"

"విత్ ప్లెజర్, మైడియర్."

"దానికి పెట్టుకొనే స్పెషల్ బ్రూచ్ కూడా తెండి."

"ఆల్‌రైట్ మైడియర్ — అదేదో నాకు తెలియదే."

"ఇంకా ఎన్నాళ్లు పడుతుంది తెలుసుకోడానికి? - స్లో - మీారు చాలా స్లో ఈ విషయాలు నేర్చుకోడంలో."

"సారీ డియర్, క్రమేణా నేర్చుకొంటూన్నాగా. — అదేదో ఆ బ్రూచ్ ఎలా గుంటుందో"

"మీ రీలాగ తృణీకారంతో మాట్లాడరాదు—అదేదో ఇదేదో అంటూ— రెస్పెక్టబుల్‌గా మాట్లాడాలి మా అలంకారాల్ని గురించి."

"వెరీ వెల్ మైడియర్ — ఆ అమూల్యమైన, అప్రతిమానమైన, అనన్యసాధ్యమైన, అవాఙ్మానసగోచరమైన—."

"షటప్" అని వటీరావు ఉరిమింది.

"సారీ కళా; సారీ వటీ — క్షమించు అన్నాను" భయంతో.

"డైమండ్ బ్రూచి తెండి."

సరే అని చీరా, బ్రూచీ తీసుకొనివచ్చి యిచ్చినిల బడ్డాను.

"మీరు వెళ్లవచ్చు" అంది.

కొంచెంసేపు అక్కడే నిలబడి నేను చేసిన అలంకరణప్రభావంవల్ల వటీరావు సౌందర్యం ఎట్టివిధంగా పోషింపబడిందో పరిశీలిస్తూ మెచ్చుకొంటూ ఉండగా 'వెళ్లరేం' అంది. వెళ్లాను.

౨

అనుకొన్న ఆహ్వానం వచ్చింది. వటీరావే దాన్ని స్వయంగా తీసుకువచ్చి యిచ్చింది. చిరునామా చూచుకొంటే వింతగా తోచింది. "శ్రీమతి మిసెస్ వి. కే. వటీరావు యమ్మేగారి సహధర్మచర్యులకు" అని వుంది, దాని క్రిందనే వటీరావు దస్తూరీతో నాపేరు వ్రాసి ఉంది.

"మీ క్లబ్బువారికి మాపేళ్లు వ్రాయడమంటే కష్టంగా ఉంటుంది కాబోలు" అన్నాను.

"మాపేళ్లతో యిమిడ్చి రాస్తే చాలదూ? మీ గొప్పకి లోటు వస్తుందా?"

"లోటు వస్తుందనికాదు. కాని—"

"అందుకనే మీపేరు క్రింద రాశాను కదూ."

"నువ్వు రాశావులే; మీ క్లబ్బువాళ్ల సంగతి చెబుతున్నాను"

"మీ పురుషుల వ్రాతలను చూచే మేమూ అలాగ రాస్తున్నాము. స్త్రీలపట్ల మీ నడవడి మీరు మార్చుకొంటే మీకు మేమూ గౌరవం చూపుతాము. ఎంతకాలం మమ్మల్ని భావదాస్యంలో పడి మగ్గమంటారు?"

"నిజమే వటీ—. ఏది ఆహ్వానం ఎలాగ ఉందో చూడనియ్యి."

కవరు విప్పి ఎర్రటిచిన్న కాగితం ముక్క తీసి చూచాను. ఆహ్వానము చిన్న అక్షరాలతో అచ్చువేసి ఉన్నది.

"లేడీస్ కల్చరు క్లబ్ సంవత్సరోత్సవముల సందర్భమున డిశంబరు ౨౭-వ తేదీ "పురుషులదినము"గా ప్రత్యేకించుటకు తీర్మానమైనది గాన మీరు ఆ దినమున క్లబ్బుకు దయచేసి ఆనాడు జరిగే వినోదములలో పాల్గొని మే మొసర్చు సత్కారములగైకొందురని హెచ్చరిస్తున్నాము. దయచేసి ఈ ఆహ్వానము గేటువద్ద చూపండి."

"ఏమి టావినోదాలు? వటీ" అన్నాను.

"చెప్పకూడదు"

"మాదగ్గిర ఎందుకో మీ కారహాస్యాలన్నీ."

"పులులనూ పురుషులనూ నమ్మకూడదని ఒక సామెత ఉంది——."

"మీ కాళ్లబ్బ సామెతా?."

"అవును మాకాళ్లబ్బసామెతే——. మా కాళ్లబ్బ ఒకసబ్ కమిటీని ఏర్పాటుచేసి సామెతలను కూర్చమన్నమాట వాస్తవమే——."

"ఆ సామెతలన్నీ మమ్మల్ని గురించేట కాదా?"

"అవును; ఆ సామెతలన్నీ పురుషుల్ని, గురించే——. ఆపుస్తకంకూడా తయారైంది- అచ్చుకాబోతోంది. ఇక మీ రేం చేస్తారో చేసుకోండి."

"మే మేం చేస్తాము కాని - అందులో కొన్ని సామెతలు రుచి చూపుదూ——."

"తినబోతూ రుచులెందుకూ - క్రమేణా ఆ సామెతలన్నీ మీకు అనుభవంలోకి రాబోతున్నవి కాదూ?"

"అయితే ఆ సామెతలన్నీ మీరు నేర్చుకొని మామీద ప్రయోగిస్తా రన్నమాట—"

"లేకపోతే కమిటీ నేర్పాటుచెయ్యడ మెందుకు - పుస్తకం రాయడమెందుకు - అచ్చువెయ్యడం ఎందుకు?"

"కానీ - ప్రయోగించండి. మేమూ కాక్ సామెతల పుస్తకం, సుమతీశతకం భార్యాహరి, తిరగ వేస్తాము."

"తిరగ వెయ్యండి. బెదిరింపా? మీ బెదిరింపులు చూచి భయపడేవా ళ్లెవరూ లేరులెండి. తాటాకు చప్పుళ్లకు కుందేళ్లా బెదరవు. మగవాళ్ల బీరాలకి మానవతులూ బెదరరు."

"సరేకాని, వదినా, మైడియర్ హనీ, మమ్మల్ని మామూలుగా, పెద్దమనిషి తరహాగా పిలవక "పురుషులదినమం"టూ పేరు పెట్టి తృణీకరించడం న్యాయంగా ఉందా?"

"మీ తాహతుకు సరిపోలేదు కాబోలు పిలుపు —— పోనీ పురుషులదిన మనకుండా మృగములదినమనా ఏమనాలని మీ ఊహ? మీరు పురుషులు కారో?"

"ఆ ప్రత్యేకత ఎందుకంట?"

"మీరు నేర్పిందే."

"అయితే నేను రాను."

"రారూ? రాకపోతే ఏభై రూపాయి లిచ్చుకోండి"

"మధ్య నేను ఎందుకు ఇచ్చుకోవడం?"

"మీరు కాకపోతే నేనే అనుమను."

"నువ్వుమాత్రం ఎందుకు ఇచ్చుకోవడం?"

"తమ భర్తలను తీసుకురాలేని భార్యలు ధరాశైరూపాయిలు జుల్మానా క్లబ్బుకు చెల్లించాలని రూలు."

"చంపేవే! పోనీ మనిద్దరం కలిసి వెళ్దాంలే."

"నేను మీతో రాను."

"రాకూడదని రూలా?"

"రెండు రోజులు ముందునుంచీ మేమంతా క్లబ్బులోనే ఉండాలి."

"నేను రాకపోతే యాభై రూపాయిలు దండుగ ఒకటేనా?"

"నాకు న్యూనత వకటి."

"అయితే వచ్చి తీరుతాను. నా పటీరావుకు, నా సోల్‌కి న్యూనత భరించగలనా?"

"దటీజ్ గుడ్ హబ్బీ."

"అయితే, పటీ, ఆనాటివిశేషాలు కొంచెం నా చెవిని వేయకూడదూ — నీకు సహధర్మచరుణ్ణి — గుడ్ హబ్బీని —."

"కూడదని చెప్పేగా — మీకు మందమతి గాని."

"ఏమైనా బహుమతు లుంటాయా?"

"ఉండకుండా ఉంటాయా?"

"పురుషులదినమున బహుమతు లుంటవన్నమాట, అవునా?"

"చెప్పకూడదన్న మాట, అవునా?"

"డెఫ్, ప్లీజ్ యువర్ సెల్ఫ్ - అయితే ఆనాడు ఏమి డ్రెస్సు వేసుకోవాలో, ఏ విధంగా సంచరించాలో — ఏ మైనా ఇన్‌స్ట్రక్షన్స్ యిస్తావా?"

"సలహా కావాలా మీకు — ఆరోజున సూటు వేసుకొని, హాట్ పెట్టుకోమంటే పెట్టుకొంటారా?"

"అదిగాక యింకా ఏమైనా —."

"ముందర ఈసంగతి చెప్పండి."

"దాని సంగతి తరవాత చూడవచ్చు గాని - యింకా ఏమైనా చెప్పేదుంటే చెప్పు."

"మంచిపిల్లవాడిలాగ వచ్చి, అక్కడ మెంబర్లతో అనవసరప్రసంగాలకి దిగక, కళ్లు తెరిచి ఉండమని సహధర్మచరులకు నా సలహా."

"ఆల్ రైట్ — మై డార్లింగ్."

"మీరు అనవసర ప్రసంగాలలోకి దిగినా, కళ్లు తెరిచి ప్రవర్తించకపోయినా మీమీద నేను డిసిప్లినరీయాక్షన్ తీసుకోవలసి ఉంటుంది."

"రైటో, డియర్."

"ఆడవాళ్ళనిగురించి బహుమర్యాదగా అక్కడ మెంబర్లతో మాట్లాడాలి సుమండీ — నాతో మాట్లాడినట్లు న్యూనతగా మాట్లాడితే —."

"మాట్లాడితే?"

"దేహశుద్ధి అవుతుంది. మా మెంబర్లలో కసరతుచేసినవాళ్లున్నారు, జుజిట్సీ నేర్చినవాళ్లున్నారు, బాక్సింగ్ నేర్చినవాళ్లున్నారు —. మీరు బహు జాగ్రత్తగా ఉండాలి. మీకు అవమానం జరిగితే నాకు చాలాకష్టంగా ఉంటుంది- ఫలానా పటీరావు సహధర్మచారి యీ విధంగా సంచరించి అవమానంపాలయ్యాడనే మాటరాకూడదు."

"నన్ను నిష్కారణంగా యీపులుల మధ్య — బెగ్ యువర్ పార్డన్ - ఈ కత్తుల బోనులో ఎందుకు దూరుస్తావు, కళా!"

"ఆమాత్రం డిసిప్లిన్ నేర్పితేనేగాని మగవాళ్లని పట్టపగ్గాలుండవు - అందుకని."

"సరే జాగ్రత్తగానే ఉంటాను."

"గుడ్డే, డియర్, నేను షాపింగుకు వెళ్లి వస్తాను."

"గుడ్డే — స్వీటీ."

3

౨౫-వ తేదీనే వటీరావు క్లబ్బుకు లేచిపోయింది. మళ్లీ దర్శనం ౨౮-వ తేదీని. ౨౭-వ తేదీని నేను క్లబ్బుకు వెళ్లడానికి సిద్ధపడుతున్నాను. ఉదయాన్నే లేచి స్నానాదికం పూర్తిచేసుకొని ఆసిబెసెంటు భగవద్గీత రెండో అధ్యాయం ఒకమాటు చదివి "ఈ గండం గడిచేవిధం ఎలాగా" అని ఆలోచిస్తున్నాను. ఇంతకీ నాకు బెంగ ఎందుకు? వటీరావు అక్కడ ఉండనే ఉంటుంది. ఏమి వచ్చినా సర్దుకుపోతుందని మనస్సమాధానం చేసుకొన్నాను.

మధ్యాహ్నం ఒంటిగంటకి ఒక చిన్న కారు వచ్చి మాపోర్టికోలో నిలిచింది. నేనూ డ్రెస్సు వేసుకోవడం పూర్తిచేసి నడిచి వెళ్లడమా కారుమీద వెళ్లడమా అని ఆలోచిస్తున్నాను.

చిన్న కారులోంచి ఒక బొమ్మ - పూతబొమ్మ బయటికి ఉరికింది. నావైపు గబగబ వస్తూ "హల్లో మిస్టర్ రావ్" అని కేక వేసింది.

"హల్లో" అని చెయ్యి జాపాను నేను. నా చెయ్యి గట్టిగా పట్టుకొని జాడించి "మీరు నన్నెరగరు కాబోలు. నా పేరు మిస్ హాల్. మిమ్మల్ని క్లబ్బుకు తీసుకు వెళ్లడానికి వచ్చాను. వస్తారా?" అన్నది.

"సంతోషపూర్వకంగా వస్తాను. కాఫీ —లేదా మీకు యిష్టమైతే — టీ పుచ్చుకొంటారా" అన్నాను.

"థాంక్సు అఫ్లీ! టైములేదు. మీరు రావాలి" అని నన్నీడ్చుకుపోయి కారులో కూలవేసింది.

చేతులకి రంగుపట్టుకో లేదుగదా అని చూచుకొంటూ కారులో ఒకమూల నక్కి కూర్చున్నాను.

"గొర్రెలమందను తోలడమన్నా, మగవాళ్లను పిలుచుకు రావడమన్నా మహాకష్టమండీ రావుగారూ."

నేను మాట్లాడలేదు వటీరావు హెచ్చరిక జ్ఞాపకం చేసుకొని.

"ఏమంటారు" అంది. కారు వడిగా పరిగెడుతోంది. ఆడదానివల్ల మాటపడనా అని రోషంవచ్చి "వెనకటిసామెత ఒకటుంది. ఈకాలానికి పనికిరాదు కాబోలు" అన్నాను.

"పూర్వకాలం అంటే మీకు చాలా ఇష్టమని విన్నాను. ఏమిటి ఆసామెత?"

"చీర సింగారించేసరికి ఊరు మాటుమణుగుతుం దని."

ఆవిడకు కోపం రాలేదు. నవ్వింది.

"ఈకాలపుసామెత వేరు" అంది.

"ఏమి టది?"

"పంచకట్టేసరికి పడమటికి పొద్దు చేరుతుందని."

కారు క్లబ్బుగేటుదగ్గిరికి వచ్చి నిలిచింది. మిస్ హాల్ లేచి తలుపు తీసి నేను దిగేదాకా తలుపు తెరిచి పట్టుకొంది. నేను దిగాను. నేను థాంక్సు చెప్పకముందే ఆమె కారులో కూచుంది. కారు కదిలి పారిపోయింది.

నేను సందేహిస్తూ సందేహిస్తూ క్లబ్బులో ప్రవేశించాను. గోడలమీద "నఫరిశెట్టి"ల బొమ్మలు వేలాడుతున్నాయి. వరాండాలో బల్లలూ కుర్చీలూ ఇంగ్లీషు న్యూసుపేపర్లూ ఉన్నాయి. అక్కడ కూర్చో

వడమా లోపలికి వెళ్లడమా? లోపలికి వెళ్ల నిశ్చయించి గుమ్మం దాటబోతే అక్కడ ఒకఅలికులవేణి "హలో యూ" అని అరిచింది. వెనక్కి తగ్గాను. ఆహ్వానం చూశాను. "ఆకుర్చీలు మీకోసమే" అని మాయమైంది.

ఒకకుర్చీమీద కూర్చుని హెల్తు అండు 'ఎఫిషంసీ' పత్రిక తిరగవేస్తున్నాను.

* * *

క్రమక్రమంగా మగభర్తలు ప్రవేశిస్తున్నారు. ఒక్కొక్కరు ఒక్కొక్క బల్లదగ్గర కూర్చుంటున్నారు — అక్కడ వేలాడగట్టిన బోర్డుపలకా ప్రకారం. భర్తలందరూ వచ్చి బల్లలదగ్గిర కూర్చున్నారు. ఒక్కొక్కబల్ల దగ్గిర ఒక్కొక్క అవివాహితమెంబరు వచ్చి కూర్చుని మమ్మల్ని ప్రసంగాలలోకి దింపింది.

నాబల్లదగ్గిర మిస్ హాల్ కూర్చుంది. కొంతసేపు యోగక్షేమాలు మాట్లాడుకొన్నాము. కొంతసేపు వెదర్‌ను గురించి మాట్లాడాము. గాలి, వాన, ఎండలను నేను భూషించడం, ఆవిడ దూషించడం అయిన పిమ్మట కొంత చనువు చిక్కడంమూలాన్ని ఆవిణ్ణి అడిగాను "మిస్ హాల్! మీకు కోపం రాకపోతే ఒకప్రశ్న అడగనా?"

"వెరి వెల్" అంది.

"మీరు చూడబోతే హిందువులాగ ఉన్నారు — మీపేరు—"

"వెల్, మిస్టరు రావ్. మావాళ్లు పూర్వకాలపువాళ్లు. సూపర్‌స్టిషస్ పీపిల్. నాపేరు మొదట వరహాలమ్మ అని పెట్టారు. అది బార్బరస్‌గా ఉండడంవల్ల నేను బియ్యే చదివే రోజుల్లో నాపేరు మార్చుకొన్నాను. ఇప్పటి నాపేరు సి. వి. హాల్. ఈపేరు బాగుండలేదూ?"

"ఎంతో బాగుంది. కాని—."

మిస్ హాల్ వినిపించుకోవడంలేదు. నాకోసం టీ తెప్పించి కలిపి కప్పు నాముందర పెట్టింది. బిస్కత్తులు వగైరాలు ప్లేట్లలో పెట్టి నన్ను తినమని బలవంతంచేసింది. నేను తినకపోతే - ఎంత బాగుందో చూడమని ఒక బిస్కత్తు కొరికి తను తింటూ మిగిలినముక్క హఠాత్తుగా నా నోట్లోకి తోసింది. ఏమి చేసేది, తిన్నాను. టీ తాగాను. మిస్‌చివస్‌గా నాకేసి చూచి హాల్ నవ్వుతోంది. నేను "థాంక్సు" అన్నాను.

వటీరావుజాడ ఎక్కడా కనిపించడం లేదు. ఈకన్యామణి నడిగితే ఏమనుకొంటుందోఅని భయంగా ఉంది. అయినా తెగించి అన్నానుగదా "మిస్ హాల్, పాపం మీరే యాశ్రమంతా తీసుకొంటున్నారు. వటీ రావుగారు..."

"సారీ మిస్టర్ రావ్, నేను మీకు కంపెనీ కీప్ చేస్తూంటే యితరులపేరు ఎత్తుకోవడం చాలా అనుచితమైనపని కాదూ?"

"బెగ్ యువర్ పార్డన్."

ఆవిడ నన్ను క్షమించిందనడానికి నిదర్శనంగా తన అలంకారాలు, తన డ్రెస్సూ, తన వేషమ్మూ ఎంత బాగున్నవో మెచ్చుకోమంది. నేను స్వయంగా అనుభవం సంపాదించినవాడనుకాబట్టి ఎక్స్‌పర్టునట. అందువల్ల నేను అన్నీ మెచ్చుకొన్నాను. అందుకుగాను ఆవిడ నన్నెంతో పొగిడి నావంటివాడు పృథివిలో లేడంది. ఆసంగతి వటీరావుతో కొంచెం చెపుతారా అని అడిగేసరికి ఆవిడకు

కోపం వచ్చింది. ఎందుకో? నా అదృష్టం కొద్దీ ఆ సమయాన్ని ఒక కన్యక బొబ్డు జుట్టుతో ప్రవేశించింది. చేతులతో ఒక ట్రే పట్టుకొంది. ట్రేలో కవర్లున్నాయి. అందరు మగవాళ్ల దగ్గరికీ వెళ్లింది. తలో కవరూ తీసుకొన్నారు. నేనూ ఒక కవరు తీసుకొని లోపలికాగితం లాగి చదవబోతూంటే మిస్ హాల్ మాయమయింది—.

కాగితంలో ఉన్న విషయం యిది—

"పురుషులకు ప్రోగ్రాం — ఫాన్సీ డ్రెస్ పారేడ్.

"మీమీ భార్యలు కొత్త కొత్త వేషాలతో మీకు దర్శనమిస్తారు. వేషాలు బహు జాగ్రత్తగా పరిశీలించి చూడండి. అందులో మీ భార్యలను మీరు గుర్తుపట్టగలరా? మీరు సరిగా గుర్తుపట్టారనడానికి నిదర్శనంగా వేషముతో ఉన్న మీ భార్యలను ముద్దుపెట్టుకోవలసి ఉంటుంది. సిగ్గుపడకండి. ముద్దుపెట్టుకొండి. గుర్తుపట్టినా పట్టకున్నా ఉభయత్రా లాభం మీదే."

నాకు వెన్నులో చలి ప్రారంభమైంది. లేనిపోనిది తెచ్చిపెట్టుకున్నా ననిపించింది. గుర్తు పట్టగలనా లేనా? ముద్దు పెట్టుకోవడం ఎందుకో? ఎవళ్లు సంతోషించడానికి? పోల్చుకోలేకపోతే వటీరావుకు ఏమి కోపం వస్తుందో? తప్పి జారి ఇంకో మెంబర్ని ముద్దు పెట్టుకోవడం తటస్థిస్తే యిక వటీరావుముఖం చూడ్డం ఎలాగ?

ఈ బాధలో పడి కొట్టుకొంటూంటే గంట కొట్టారు. మగవాళ్లందరూ హాల్లోకి రావచ్చునని అనౌన్సు చేశారు. హాలులోకి వెళ్లాము.

హాలులో సోఫాలు, టేబిల్సు, వాటి మీద పువ్వులబుట్టలు, రంగుకాగితాల తోరణాలు, అత్తరువు వాసనలు, పన్నీరు స్ప్రేలు; సోడాలు, టీసెట్టులు — వైభవంగా ఉంది. నాపేరు వ్రాసి ఉంచిన సోఫామీద నేను కూర్చున్నాను. అందరూ ఆవిధంగానే నియమిత స్థలాల్లో ఆసీను లయ్యారు. నాలాగే పురుషులందరూ — ఒకరిద్దరు తప్ప — బిక్క మొహంతోనే ఉన్నారు. మేము ప్రవేశించే సరికి హాలులో ఆడపురుగు లేదు. ఏకొద్దిపురుషులో తప్ప మిగిలినవాళ్లంతా సిగరెట్లు ముట్టించి తమదుఃఖాన్ని, బెంగనూ దిగమింగడానికి ప్రయత్నిస్తున్నారు. నామట్టుకు నేను "తాం స్తితిక్షస్వ భారత" అనే కృష్ణవాక్యం జ్ఞాపకం చేసుకొన్నాను.

తంగున గంటకొట్టారు. మేమంతా ఉలిక్కిపడి నిలువ్రగా కూర్చున్నాము. బొబ్డు జుట్టుకన్యామణి వచ్చి జరగబోయేవిషయం ప్రకటించింది. చల్ మోహనరంగా అనే పాట — అని చెప్పి వెళ్లిపోయింది.

* * *

తెర తొలగించుకొని ప్రథమవేషం ప్రవేశించింది. చక్కగా పాడుతోంది. చంకలో కడవ వుంది. కడవనిండా నీళ్లు ఉన్నాయి. అవి కన్నీళ్లని మేము భావించవలెనని పాటఉద్దేశము.— కంటికీ కాటుకెట్టి కడవా చంకాను బెట్టి కన్నీరు కడవ నిండెనుగదరా చల్ మోహనరంగా — అనేపాట చిరునవ్వుతో మిళితమై వచ్చింది.

ఆస్త్రీ - వటీ రావు కాదుకద! — కంటి నిండా కాటుక పులుముకుంది. పెద్ద కుంకం బొట్టు పెట్టింది. కొప్పు పెట్టింది. ముతక చీర కట్టింది. నవ్వుతూ, నాకేసి చూచి, కను

బాహు లెగరవేస్తూ, ప్రతి ఒక పురుషుణ్ణీ మోహనరంగడిగా భావించినట్లు అభినయిస్తూ పాడింద — బహు చక్కగా పాడింది.

వటీరావుకు అంత చక్కగా పాడడం రాదు కాబట్టి ఆవిడను ముద్దుపెట్టుకోనవసరం లేదనుకొన్నాను.

కాని ఆవిడపాటకు ముగ్ధులై పదిమంది భర్తలూ అమాంతంగా ఆవిణ్ణి ముద్దు పెట్టుకోడానికి లేచారు. ఆవిడ తెరలోకి పారిపోయింది. వాళ్లు కూలబడ్డారు సోఫాల్లో.

* * *

బాబ్డు జుట్టు పద్మముఖి వచ్చి పురుషులకేసి తీక్ష్ణంగా చూచి యీవిధంగా చెప్పింది:

“పురుషులు సరిగా ప్రవర్తించకుంటే పోలీసులకు ఫోన్ చేయవలసి ఉంటుంది కాబట్టి జాగ్రత్తగా మెలగ మని హెచ్చరిస్తున్నాను. వచ్చిన వేషా లల్లా ప్రస్తుతం మీరు పరిశీలనగా చూచి ఆనందించవలెను. వేషము లైనపిమ్మట వేషధారిణు లందరూ మళ్లీ హాలులోకి వస్తారు. అప్పుడు మీ మీ భార్యారత్నములను గుర్తించి ముద్దు పెట్టుకోవచ్చు.— ఇక– కులధర్మపత్ని వేషం - ” అని ప్రకటించి వెళ్లి పోయింది.

ఒక బొద్దుస్త్రీ ప్రవేశించింది. పచ్చచీర అడ్డకట్టు కట్టుకొంది. అందెలు, కడియాలు, అడ్డబాస, నత్తు, రాగిడీ, చంద్రవంకావగైరా ప్రాచీనాభరణాలు ధరించింది. కొప్పు పెట్టుకొంది. పసుపు పూసుకొని, కుంకుంబొట్టు పెట్టుకుంది. కాళ్లకి పారాణి పూసుకొంది. కంటికి దట్టంగా కాటుక పెట్టుకొంది. ఒక చేత్తో చీపురూ ఒక చేత్తో గరిటా పట్టుకొంది. వచ్చి కొంచెంసేపు నిలబడి పురుషులను పరకాయించి చూచి శ్లోకం ఎత్తుకొని శ్రావ్యంగా చదవ మొదలుపెట్టింది. “కార్యేషు దాసీ, కరణేషు మంత్రీ” అనే శ్లోకభాగం అభినయిస్తోంది. కార్యేషు దాసీ అన్నప్పుడు గరిట ఎత్తి చూపింది. కరణేషు మంత్రీ అన్నప్పుడు చీపురుఎత్తి చూపింది. రూపేషు లక్ష్మీ అన్నప్పుడు తనకేసి చూపుకొంది. మిగిలిన అభినయం నాకు బోధపడలేదు. చివరకు “షట్కర్మ యుక్తా కులధర్మపత్నీ” అని ముగించి వెళ్లిపోయింది. ఈవిడ వటీరావు కాదని నిశ్చయించుకొన్నాను. వటీరావు బొద్దుగా ఉండదు.

* * *

బాబ్డుజుట్టు వచ్చి - ౧౮-వ శతాబ్దం పతివ్రత — అని ప్రకటించి వెళ్లి పోయింది.

ఒక ముసలివాడు దగ్గుకుంటూ వస్తున్నాడు, గావంచా కట్టుకొన్నాడు, కుడితిసీ తొడుక్కున్నాడు, బుట్టతల పాగా పెట్టుకొన్నాడు. చేతిలో కర్ర పట్టుకొన్నాడు. రెండవచేతిలో తాడు వుంది — ఆ తాడువెనకే ఒక జవ్వని వచ్చింది. ఆ తాడుకొస ఆ విడ ముక్కు నత్తుకు ముడివేసి ఉంది. కులధర్మపత్ని వేషంవంటి వేషమే ఆ పతివ్రతదీన్నీ- కాని చీపురూ గరిటా లేవు. రెండు చేతులూ జోడించి భర్తకేసే చూస్తూ అతడు తాడు పట్టుకు తీసుకువెళ్లినచోటికి వెడుతోంది. ఎలుగుబంటిని తిప్పినట్లు ముసలివా డావిడను హా లల్లా తిప్పాడు. అప్పు డప్పుడు కర్రతో బెదిరించి పొడిచేవాడు. ఆవిడ ఏమి చేసినా కిక్కురు మన లేదు. భక్తిముద్రతోనే ఉన్నది. వాళ్లు వెళ్లిపోయారు.

వటీరావు ముసలివాడా అని ఆలోచించాను. ఆ ఆలోచనే అసహ్యకరంగా ఉంది. ఇక ఆ పడుచుమనిషి ఎర్రగా ఉంది. వటీరావు చామనచాయ. కాబట్టి ఆవిడ వటీరావు కాదు.

*　　*　　*

వెంటనే బొడ్డుజట్టు కేక వినిపించింది.-

౨౦-వ శతాబ్దం — నేటిస్త్రీ — అని. పచ్చని పట్టుచీర — ఒంటికి అంటుకుపోయే రకం చీర కట్టుకొంది. చేతులూ, మెడా లేని రవిక తొడిగింది. గిరజాల జుట్టు; మెళ్లో ఒకే సన్నని గొలుసు; ఒక చేతికి ఎనామెల్ గాజు; రెండో చేతికి రిస్టువాచీ, మొహానికి పౌడరు పగయిరాలు, కాళ్లకు ఎత్తుమడమల జోడు కళ్లకు సులోచనాలు.

సిగరెట్టు కాలుస్తూ ప్రవేశించింది. బంగారుశలాకలాగ ఉంది. వెనకనే ఆమె, భర్త ప్రవేశించాడు. అతని మీసానికి కట్టిన తాడు ఆవిడచేత్తో పట్టుకుని అతణ్ణి పోలంతా నడిపిస్తోంది. పరాయి తొడుక్కున్నాడు, లాల్చీ వేసుకొన్నాడు. కండువామడత బుజంమీద వేసుకొన్నాడు. కారాకిళ్లీ నములుతూ చుట్ట కాలుస్తున్నాడు — ఆ భర్త.

ఆ నవీనస్త్రీ వటీరావేమో నని అనుమానించాను — అంతే ఎత్తు, అదేరంగు దేహం, అంతేలావు, కాని వటీరావుకు మెడమలదాకా జుట్టు ఉంది. ఈమెకు గిరజాల జుట్టు — అంతే కాకుండా కొంచెం మెల్లకూడా ఉన్నట్లుంది ఈ పిడకు — వటీరావు కాదేమో? అయినా కంఠస్వరం వింటే తేల్చుకోవచ్చునేమో? భర్తవేషం వేసిన యిల్లాలుమాత్రం వటీరావు కాదని నిశ్చయించాను. ఆమీసాలమొహం చూస్తే అసహ్యంగా ఉంది. ఆడవాళ్లు మగవేషాలువేస్తే ఎంతకోతిగా తయారవుతారో అనిపించింది.

నవీనస్త్రీ ఒకరాయి భర్తకిచ్చి "ఇది పుట్టింటారికుండ పుట్టింటారికుండ" అంది. భర్త రాయి చేత్తో పట్టుకొని కిందకు విసిరివేశాడు.

మళ్లీ రాయి చేతికిచ్చి "ఇది అత్తారికుండ అత్తారికుండ" అంది. మళ్లీ రాయి కింద పారేశాడు. మళ్లీ "ఇది పెళ్లాంకుండ పెళ్లాంకుండ" అంది.

భర్త ఆరాయి పుచ్చుకొని నెత్తిమీద పెట్టుకొన్నాడు. తాడు పట్టుకు నవీనస్త్రీ భర్తను తెరలోకి తీసుకుపోయింది.

నవీనస్త్రీకంఠస్వరం వటీరావుది కాదు. కాబట్టి ఆవిడ వటీరావు కాదని నిశ్చయించాను.

*　　*　　*

"దండోరా" అనే బొడ్డుజట్టుపలుకు వినిపించింది.

డప్పుపట్టుకొని వాయిస్తూ ఒకపొట్టి మనిషి ప్రవేశించాడు. లాగుతొడుక్కున్నాడు. జుబ్బా వేసుకొన్నాడు. తలపాగా పెట్టుకొన్నాడు. మొహానికి మసిబొగ్గు పూసుకొన్నాడు.

"ఇందువల్ల సకలజనులకూ తెలియజెయ్యడం ఏమంటే — స్వర్గంలో యిప్పుడు రూల్సు మారినట్లు రూఢియైన వార్తలు వచ్చినవి. పూర్వకాలంలో, మరణించిన భర్తతో సహగమనముచేసే స్త్రీకి స్వర్గం

లభించేదట. నేటికాలంలో కొత్తరూల్సు ప్రకారం మరణించిన భార్యతో భర్త సహగమనంచేస్తే అతనికి స్వర్గం వస్తుంది కాబట్టి ఈ అవకాశం గమనించి పురుషులు స్వర్గప్రవేశానికి ప్రయత్నాలు చేయవలసి ఉంటుందండోహోయి...మరిన్ని పూర్వకాలంలో, యజ్ఞము చేసిన పురుషులకున్నా యుద్ధములో మరణించిన పురుషులకున్నా స్వర్గప్రవేశమే కాకుండా రంభా సంపర్కంకూడా ఉండేదట. నేటికాలంలో కొత్తరూల్సు ప్రకారం పురుషులుగాని స్త్రీలుగాని యజ్ఞయాగాదులు చేయనక్కరలేదు కాని యుద్ధములో మరణించిన పురుషులకు రంభా సంపర్కమున్నా స్త్రీలకు నలకూబర సంపర్కమున్నా కలుగుతుందనే విషయం తెలుసుకోండోహోయి......

చాటింపు అయిన తరువాత డప్పు కొట్టుకొంటూ ఆమనిషి నిష్క్రమించాడు. దండోరామనిషి నటీరావు కాదు. నటీరావు పొడుగు. కంఠస్వరము వేరు.

* * *

మళ్లీ బాబ్డుజుట్టు కన్య ప్రకటనకు బదులు గంట వినిపించింది. పదినిమిషాల విశ్రాంతి పురుషుల కిచ్చినట్లు తెలిసింది. అవివాహితలు వచ్చి మమ్ము సత్కరిస్తున్నారు. పన్నీరు స్ప్రేలు హాలంతా మేఘాలు కట్టాయి. అత్తరులు వర్షాలు కురిశాయి. సోడాలు తాగాము. మళ్లీ కొత్తగా కలిపిన టీలు సేవించాము. లోపలినుంచి గ్రామఫోనుపాటలు వినిపిస్తున్నాయి. మిస్ హాల్ 'మీ భార్యారత్నాన్ని పోల్చుకొన్నారా' అని అడిగింది.

"సారీ, నో" అన్నాను. మళ్లీ గంట కొట్టారు. విశ్రాంతికాలం పూర్తి అయింది.

"యాభై సంవత్సరములనాటి వింత మనిషి" అని బాబ్డుజుట్టు చెప్పి నవ్వుతూ వెళ్లిపోయింది.

"నేను అత్తపిశాచాన్ని; కోడళ్లని కొరుక్కుతింటాను; వాళ్లరక్తం పీలుస్తాను; వాళ్ల కాపురాలకి చిచ్చుపెడతా" అంటూ అరుస్తూ గంతులేస్తూ ప్రవేశించింది ఒక స్త్రీ. చింపిరిజుట్టు, ముడతలమొహం, చేతుల్నిండా గాజులు, మెడనిండా నగలు. చేతులో కాల్చిన గరిట పట్టుకు జళిపిస్తోంది. కొంతసేపు ప్రళయతాండవం చేసి ఆర్చి ఆవిడ నిష్క్రమించింది.

ఈవ్యక్తిని ముద్దుపెట్టుకొనే దురదృష్టం ఎవరికి పడుతుందోగదా అనుకొంటూ ఆవిడ నటీరావు ఎంతమాత్రమూ అయివుండదని నిశ్చయించాను.

* * *

బాబ్డుజుట్టు వచ్చి "ఎరుకలసాని సోదె" అని చెప్పి వెళ్లింది.

గంప నెత్తిమీద పెట్టుకొని, ముతక చీర కట్టి, పూసలపేర్లు మెళ్లో వేసుకొని బుజానికి పిల్లవాణ్ణి (జపాను పిల్లవాడి బొమ్మ) కట్టుకొని ప్రవేశించింది ఎరుకలసాని—.

"ఎరకడుగమ్మ ఎరకడుగమ్మ ఎరకడుగమ్మ తల్లీ! ఎరక చెప్పతా ఎరక చెప్పతానే తల్లీ — చేటలో చేటెడుబియ్యం పోసి తేవే తల్లీ — బియ్యంమీద చెయ్యి పెట్టవే — ఎరక చెప్పతానే తల్లీ" అంటోంది. తెరలోంచి మిస్ హాల్ ఒకట్రేలో పాతకాగితాలు - చేటకు ప్రత్యామ్నాయం తెచ్చి దానిమీద చెయ్యిపెట్టి తనకు ఎరుక చెప్పమంది.

"ఎరకచెప్పతానే తల్లీ — ఎరక చెప్పతా — ను వ్వడిగే ప్రశ్న — నీ మనసులో మణిగిపోయిన ప్రశ్న - నీకడుపులో ఊహ ఏమిటో చెప్పమంటావా తల్లీ — వినవే అమ్మా - నీవు పెళ్లిమీద మనసెట్టుకున్నావే తల్లీ — నీకు మంగళసూత్రంమీద మనసు లేదే తల్లీ! మగవాడిమీద మనసుందే అమ్మా — నీకు పసుపు కుంకుంమీద మనసు లేదే తల్లీ! పౌడరుమీద మనసుందే అమ్మా — నీకు ఇంట్లో వంటింటిగొడవ లేదే తల్లీ! బయట ఉద్యోగాల గొడవ ఉందే అమ్మా — నీకు పెళ్లవుతాది పెళ్లవుతాది - నీకు బిడ్డలమీద మనసులేదు — నీకు కానుపులమీద మనసులేదే తల్లీ — కాంట్రాసెప్టివులమీద మనసుందే తల్లీ! పెనిమిటి ఎర్రగా ఉంటాడా అంటావుగాదటే అమ్మా.

"పెనిమిటి ఎర్రగానే ఉంటాడే తల్లీ, లాగులు తొడుగుతాడే అమ్మా. - కలకటేరు ఉద్యోగం చేస్తాడా అంటావు గాదటే తల్లీ — చెప్పతా, పాతకోక యియ్యవే అమ్మా" అంటూ వెళ్లిపోయింది.

ఎరకలసాని వటీరావు కాదు. వటీరావు లేతమనిషి; ఈమె ముదరది. కంఠస్వరం కూడా భేదించింది అనుకొంటూండగా నాగస్వరం వినిపించింది.

* * *

బాబ్డుజుట్టుపంకజలోచన వచ్చి కాగితం చూచి — ఇక వ్యంగ్యవేషము - అని ప్రకటించి వెళ్లిపోయింది.

నెత్తిమీద పాములబుట్ట పెట్టుకొని పాములవాడు ప్రవేశించాడు. తలమీద ఠీవిగా తలపాగా పెట్టేడు. దానిమీద పక్షి వెంట్రుకలు ఎర్రటివి గుచ్చాడు. షర్టు తొడిగాడు. పంచ కట్టి వెనక్కి బిగించాడు. మెళ్లో పూసలదండా చేతిలో నాగస్వరమున్నూ ఉన్నవి.

వచ్చి బుట్ట కింద పెట్టి బుట్టమూత తీశాడు. అందులో జపాను సెల్లిలాయిడ్ బొమ్మ ఉంది. ఆ బొమ్మ మగబొమ్మ. దాని నెత్తిమీద కాగితపుపాము పడగకట్టి ఉన్నది.

వెంటనే బాబ్డుజుట్టు రెండు అట్టలు చేత్తో పట్టుకు వచ్చింది. ఒక అట్ట చూపింది. దానిమీద "స్త్రీ" అని వ్రాసి ఉంది. ఆ అట్ట పాములవాడి మెడకు తగిలించింది. రెండవ అట్ట చూపింది. దానిమీద "మగవాడు" అని వ్రాసి ఉంది. ఆ అట్ట జపాను బొమ్మ పడగమీద తగిలించి మూకేసి తిరిగి నవ్వి వెళ్లిపోయింది.

అప్పుడర్థమయింది వ్యంగ్యవేష మంటే ఏమిటో మాకు. మగవాడైన పామును, ఆడదైన పాములవాడు నాగస్వరం ఊది ఆడిస్తున్నాడు. తెల్ల ఈశ్వర వేరు ముక్క దానిపడగకు తగిలిస్తున్నాడు. బొమ్మ యిటూ అటూ ఆడుతోంది. కొంతసేపు నాగస్వరం ఊది, పడగ దీసి దానిలో ఉన్న రెండు కోరలను ఊడలాగి పారవేసి, నాగస్వరంతో ఆ బొమ్మను నాలుగు బాది, బుట్టపట్టుకు లేచి పోయాడు పాములవాడు.

పాములవాడు వటీరావు కాదు. భర్త మీద ఆపడ కంత కోపం లేదని నా అభిప్రాయం.

* * *

బాబ్డుజుట్టు వచ్చి "తీర్పులు" అని అనౌన్సు చేసి వెళ్లిపోయింది.

కోర్టుసీను ప్రారంభ మైంది. మేస్రీటు వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. తరవాత ఒక స్త్రీ వచ్చి ఒకపక్క నిలబడింది. ఒకకనిష్టీబు ఒకపురుషుని చేతులకు సంకెళ్లు వేసి తీసుకు వచ్చి నిలబెట్టాడు మేస్రీటు కెదురుగా.

"ఇతడు చేసిన నేర మేమిటి" అన్నాడు మేస్రీటు.

"దేవరా! యితడు అనవసరంగా భార్య నయినన్ను తిట్టడం కొట్టడమున్నూ చేస్తున్నాడు. ఏవిధంగా శిక్షిస్తారో – ఇతడి బాధ పడలేకుండా ఉన్నాను" అని ఆ స్త్రీ ఏడ్చింది.

"ఇందుకు నీ వేమి చెప్పకొంటావు" అన్నాడు మేస్రీటు.

"దేవరా! నేను ముందుగా నాభార్యను కొట్టలేదు. ఆవిడ నన్ను కొడుతూంటే నేను ఆత్మరక్షణకోసం మళ్లీ కొట్టినమాట వాస్తవం - నన్ను కొట్టకుండా చేస్తే నా అంతమంచి వాడు లేడు."

"సరే కొట్టినట్టు వప్పకొన్నావు కాబట్టి నీకు శిక్ష వేస్తున్నాను. ముక్కోణానికి కట్టి యితడికి ముప్పైదెబ్బలు కొట్టండి" అన్నాడు మేస్రీటు.

ఆస్త్రీ, కనిష్టీబూ, పురుషుడూ వెళ్లి పోయారు. అక్కడే ముక్కోణం కట్టి కొడతారేమో అనుకొన్నాను కాని అంతపని జరగలేదు.

ఒకస్త్రీ ఒకపురుషుడూ ప్రవేశించారు.

"ఇత డేమిచేశాడు"అన్నాడు మేస్రీటు.

"దేవరా, ఎంతడబ్బు గడిస్తున్నా అంతా తానే ఖర్చుపెట్టకొంటున్నాడుగాని నా ఖర్చులకోసం ఒకదమ్మిడీఅయినా నాకివ్వడం లేదు. ఈదాస్యంనుంచి నాకు విముక్తి యియ్యాలి" అని ఆస్త్రీ మొరపెట్టుకొంది.

"ఏమంటావు" అన్నాడు పురుషునికేసి తిరిగి మేస్రీటు.

"దేవరా, నాకు వచ్చిన డబ్బంతా సమిష్టికుటుంబానికే ఖర్చు పెడుతున్నాను గాని నే నేమీ మిగుల్చుకోవడం లేదు. నా భార్యకుగానీ డబ్బిస్తే అనవసర కర్చులు చేస్తుందనే భయంతో యివ్వడంలేను——."

"ఏమిటా అనవసరపు ఖర్చులు?"

"దేవరా, బట్టలూ, నగలూ, పౌడర్లూ నాడబ్బుతో కొనివేస్తే సంసారం జరిగేవిధం ఎలాగ?"

"అట్టివి అనవసరఖర్చు లన్నందుకు ముందుగా ఇరవైరూపాయిలు జుల్మానా చెల్లించు. మరిన్ని యికముందునుంచీ నీవు సంపాదించినధన మంతా నీభార్యకే నీవు యియ్యవలసిఉంటుంది. అట్లా చెయ్యనినాడు నీకు ౬ మాసాల కఠినవరకం వేయవలసి ఉంటుంది. ఒప్పకొంటావా?"

"చిత్తం."

భార్యాభర్తలు వెళ్లిపోయారు. మూడో కేసుకు ఒక స్త్రీ ఒక పురుషుడూ ఒక డజను మంది పిల్లలూ ప్రవేశించారు.

"ఇత డేమినేరం చేశాడు?" అన్నాడు మేస్రీటు.

"దేవరా, చూడండి" అని ఆ స్త్రీ అక్కడనున్న పిల్లలందరినీ చూపింది.

"వాళ్లంతా మీ పిల్లలేనా?"

"చిత్తం" అని భార్యాభర్తలు వప్పుకొన్నారు.

"ఇంతమంది పిల్లలను నీ భార్యచేత కని పించిన నేరానికి నీ వేమి సంజాయిషీ చెప్ప కొంటావు?"

"అందుకు బాధ్యత నా ఒక్కడిదేనా, దేవరా!" అన్నాడు భర్త.

మేజిస్ట్రేటుకు కోపం వచ్చింది.

"నీవు చేసిన నేరం ఒప్పుకోకుండా అడ్డప్రశ్నలు కూడా వేస్తున్నావా? నీకు తగినశిక్ష పడాలి —. సంతాన నిరోధానికి సంబంధించిన ప్రతి యింగ్లీషుపుస్తకమూ నీవు చదివి నీభార్యకు పాఠం చెప్పాలి. ఆ సాధ నలు నీవు అన్నీ తెప్పించి యింట్లో పెట్టుకో వాలి. నీభార్యకొరకై ప్రత్యేకముగా ఈ పుస్తకా లుండే భాండాగార మొకటి నీవు తయారు చెయ్యాలి. అంతే కాకుండా నీ పిల్లలకు యిప్పటినుంచీ సెక్సు ఎడ్యుకేషన్ యివ్వాలి. ఇట్లా చేస్తానని ఒక ఇన్‌డెమ్నిటీ బాండు వ్రాసి యియ్యి. వెళ్లు" అని తీర్పు చెప్పాడు మేజిస్ట్రేటు.

కోర్టుసీను ముగిసింది. ఇందులో వచ్చిన వాళ్లెవళ్లూ నటీనటులు కాదని నాదృష్టికి తోచింది.

* * *

"బ్లాక్ గరల్" అని బాల్డుజుట్టుకో మలి పలికింది

ఒకసరోజముఖి డాన్సు డ్రెస్సుతో వచ్చింది. కొంతసేపు డాన్సు చేసింది. తర వాత ఈపదం పాడింది:

రామా రామా రామా రఘురామా
రామా రఘురామా
రాజ్యంకోసం ఆలిని విడిచావా
రామా రఘురామా
ఆలిని అడవులపాలు చేసినావా
రామా రఘురామా
ఆలి విషమ్మె రాజ్య మమృత మాయెనా
రామా రఘురామా
విన్నావా యీనాటి వింతకథనూ
రామా రఘురామా
ఆలికోసమే రాజ్యం విడిచాడు
రామా రఘురామా
మూరుమనుప్రపద్మాక్షిని పట్టాడు
రామా రఘురామా
ఆలికోసమే విడిచా డధికారం
రామా రఘురామా
ఆలి బెల్లమూ రాజ్యమె విషమయ్యె
రామా రఘురామా
వెలిగేవృల్లో వెలిశా డారాజు
రామా రఘురామా
విన్నావా యీనాటి వింతకథనూ
రామా రఘురామా

అని పాడుతూ వెళ్లిపోయింది.

* * *

తరవాత క్రమంగా కోయదాని వేషం, పడవవాళ్ల వేషం, ముసుగు విభూతి అవుపేడ వగైరాలతో వితంతుప్రవేశం వచ్చాయి. చిట్టచివరివేషం "అదర్శప్రాయంగా డ్రస్సు వేసుకొన్న స్త్రీ" వచ్చింది.

ఆ స్త్రీ వచ్చీరావడంతోనే నేను కళ్లు మూసుకోవలసివచ్చింది. ఎందు కంటారా? ఏమి చెప్పను. అదర్శప్రాయంగా డ్రస్సు వే సుకోవడమంటే దిగంబరత్వ మని నే ననుకో లేదు. ఈస్త్రీ నిజానికి, పూర్తిగా దిగంబరి కాదు. కాకున్నా దిగంబరి మాదిరిగానే ఉంది. ఏమిడ్రస్సు వేసుకొంద్లో, వేసుకోనే

లేదో — ఆ దేహానికీ ఆ డ్రెస్సురంగుకీ అవినాభావం సిద్ధించిందో ఏమో తెలియదు.

కళ్లు మూసుకొన్నాను. మూసుకొని కనురెప్ప సందులలోంచిమాత్రం ముఖం కేసి చూస్తున్నాను — ఒకవేళ ఆవిడ వటీరావేమోనని. కాదని ముఖచిహ్నలనుబట్టి నిశ్చయించాను.

* * *

చివరవేషం పూర్తి అయింది. ఇక పది నిమిషాలలో వేషధారిణులు అందరూ హాలులోకి వస్తారు. భర్త లందరూ జాగరూకులై ఉండవలసిం దని బాబ్డుజుట్టు చెప్పి వెళ్లి పోయింది.

౬

ఈ ముద్దు పెట్టుకోవడంసందర్భంలో ఏమి దొమ్మి జరుగుతుందో అని భయపడుతున్నాను. నాబోటిసందేహించే భర్త లొక రిద్దరున్నా మిగిలినవాళ్లంతా ముద్దుకు తహతహలాడుతూన్నట్లు తోస్తోంది. నామట్టుకు నేను ఏమి చెయ్యవలసి ఉంటుందా అని ఆలోచిస్తున్నాను. వేషధారిణులు వచ్చీరావడంతోనే వటీరావును నేను గుర్తుపట్టి ముద్దు పెట్టుకుంటే పేచీ ఉండదేమోనని తోచింది- అయితే నేననుకొన్న మనిషినే యితర భర్తలు కూడా ముద్దుపెట్టుకోవస్తే దొమ్మి జరిగి తీరుతుం దనుకొన్నాను.

అంతేకాకుండా దొమ్మి జరుగుతుం దనడానికి యింకోకారణంకూడా ఉంది. ఏమిటంటే — మమ్మల్నందరినీ పోలీసుభయం చెప్పి కూచోబెట్టి ఆడవాళ్లందరూ యిష్టం వచ్చినట్లు మాజాతినంతనూ దూషించారు. రాగద్వేషాలొక్కమాదిరిగా చూచుకొనే నాబోటివాళ్లు అక్కడ ఎవరూ లేరు కాబట్టి కసితీర్చుకొనే ఉద్దేశంతో భర్తలందరూ ఉండవచ్చు. ముద్దు పెట్టుకొనే సావకాశం చిక్కినప్పుడు కసితీర్చుకోకుండా ఉంటారా? ఉంటే మానవస్వభావానికి వ్యతిరేకంగా ఉంటుంది.

అయితే అన్ని వేషాలూ నిదానంగా చూచానుగదా ఎవరూ వటీరావులాగ లేరే! ఎవరిని ముద్దుపెట్టుకోవడం? ఆనవీనస్త్రీకి వటీరావుపోలిక లున్నా కంటిమెల్ల, కంఠస్వరభేదమూ గిరజాలజుట్టు ఉన్నవిగదా. ఆవిడ వటీరా వెలాగ అవుతుంది. కాకపోతే మరి వటీరావు ఎవరు ?

ఎంతకూ ఊహ తెగడంలేదు. ఏమి చేసేదీ తోచడం లేదు.

చివరకు నిర్ణయానికి వచ్చాను. అందరుభర్తలూ తమభార్యలను ముద్దుగొన్నపిమ్మట మిగిలిన మనిషి వటీరావు అయివుంటుంది కాబట్టి ఆమనిషిని నేను ముద్దుపెట్టుకోవచ్చు ననుకొన్నాను. అందుకొరకై చివరదాకా కనిపెట్టుకు ఉండడం మంచి దని నిశ్చయించాను.

అయితే భర్త లందరూ తమభార్యలనే ముద్దుపెట్టుకోగలుగుతా రని ఎలాగ చెప్పగలము? వారుమాత్రం భార్యలను సరీగా పోల్చుకోగలరా ? అంతేకాకుండా ఒకభర్త ఒక్కస్త్రీనే ముద్దుపెట్టుకొంటా డనేమాట ఎక్కడుంది? తెగించినవాళ్లు చేతికి చిక్కిన మనిషినల్లా ముద్దుపెట్టుకొంటే అప్పుడు చేసేదేమిటి ?

ఇంకోవిషయంకూడా ఉంది. ఈరోజున ఒకప్రైజుకూడా ఉండవచ్చునని వటీరావు సూచించింది. ఆబహుమానం సరిగా ముద్దు పెట్టుకోగలిగినవారికా, పెట్టుకోలేని

వారికా ఎవరికి ? సరిగా ముద్దుపెట్టుకోగలిగితే వేషములో నున్నభార్యను పోల్చుకోగలిగాడని భర్తకు బహుమాన మియ్యవచ్చు. సరిగాముద్దుపెట్టుకోలేకపోతే వేషము దుర్భేద్యముగా వేసుకొన్నందుకు, - భర్తసమేతం గుర్తించలేనంతగూఢంగా వేసుకొన్నందుకు భార్యకు బహుమాన మియ్యవచ్చు. ఇదీ నిష్కర్షగా తేలలేదు.

ఇంతకీ వటీరావుమనస్సు ఏవిధంగా నడుస్తోందో? నేను సరిగాపోల్చవలెననే కోరుకొంటోందో, పోల్చుకోకుండాఉంటే బాగుంటుందని అనుకొంటోందో తెలియడం కష్టంగా ఉంది.

ఈవిధంగా ఆలోచిస్తూండగా బాబ్డు పద్మాక్షి బెత్తం చేత్తో హట్టుకు ప్రవేశించింది. ఆవిడ వెనకే వేషధారిణు లందరూ ప్రవేశించారు. పదముగ్గురు స్త్రీలూ పన్నెండుగురు పురుషులూ వేషాలతోనే ప్రవేశించారు. స్త్రీవేషధారిణులను వేరుగాను పురుషవేషధారిణులను వేరుగాను నిలబెట్టింది బాబ్డుజుట్టు.

గ్రామఫోను పాట పాడుతోంది— "ఎంకీవంటిపిల్ల లేదోయి, లేదోయి, ఎంకీనావం కింక రాదోయి రాదోయి" అని.

బాబ్డుజుట్టు బెత్తం ఎత్తి మాకేసి చూచి యిట్లా చెప్పింది- "భర్త లందరూ దయచేసి మీమీ భార్యలను ముద్దు పెట్టుకోవలెను. తొందరపడి తప్పముద్దుపెట్టుకోవడం కూడదు కాబట్టి భర్త లందరూ నిదానంగా అందరినీ చూచి, వారిలో మీమీభార్యలను పోల్చుకొని ముద్దుపెట్టుకోవలెను. అల్లరి ఎంతమాత్రము కూడదు. నా మాటలు లక్ష్యపెట్టక అల్లరికే మీరు దిగితే తగినచర్య తీసుకోడానికి మే మందరమూ సిద్ధముగానే ఉన్నాము. చెప్పవలసినమాట చెప్పక తప్పింది కాదు గనక చెప్పాను. మీ రేమీ అనుకోవద్దు. మీపట్ల ఎంత సద్భావము చూపుతూ మేము మిమ్ము ఆహ్వానించామో అంత సద్భావమూ మీరు మాపట్ల జూపుతూ ఈ ఉత్సవము నిర్విఘ్నంగా జరిగిందనిపించడానికి తోడ్పడతా రని ఆసిస్తున్నాను. థాంక్సు" అని ముగించింది.

దొమ్మి జరుగుతుం దనేభయం పోయింది నాకు. మిగిలిన భర్తలకూ ఉత్సాహభంగం అయినట్లు తోస్తోంది. అక్కడ స్త్రీలతో దొమ్మియుద్ధం చేయడానికీ పోలీసులను పిలిపించుకోవడానికీ ఎవరు ఒప్పుకుంటారు గనక.

మే మందరమూ నెమ్మదిగా లేచాము. నేను లేచినచోటే నిలబడి ఉన్నాను వేషధారిణులను మళ్లీ పరిశీలిస్తూ! ఒక భర్త ఎరుకసానిని ముద్దుపెట్టుకొన్నాడు. అందరూ చప్పట్లు కొట్టారు.

"రైట్" అంది బాబ్డుజుట్టు. ఒకడు మేస్త్రీటును ముద్దుపెట్టుకోబోయి కనిష్టీబుని ముద్దు పెట్టుకొన్నాడు.

"రాంగ్ — గో బాక్ ప్లీజ్" అంది బాబ్డుజుట్టు.

చల్ మోహనరంగపాట పాడినస్త్రీని ఒకడు తొందరగా ముద్దుపెట్టుకొని బాబ్డుజుట్టుచేత చివాట్లు తిన్నాడు.

ఒకడు నవీనస్త్రీని ముద్దుపెట్టుకొన్నాడు. నాకు ఒకవిధంగా కోపం వచ్చింది.

బాబ్డుజుత్తు "రైట్" అంది. నేను వటీరా వనుకొన్న స్త్రీ వటీరావు కాదు. ఏమి చేశేదింక. ఒకడు "అత్తను"ను ముద్దుపెట్టు

కాని రైట్' అనిపించుకొన్నాడు. అందరూ చప్పట్లు కొట్టారు.

ఒకడు నవీనస్త్రీభర్తదగ్గిరికి వెళ్లి గట్టిగా ముద్దుపెట్టుకొన్నాడు కాబోలు మీసాలూ డాయి. అందరూ నవ్వారు. "రైట్" అంది బాబ్డుజుట్టు.

పతివ్రత భర్తనూ, దండోరా కనకాంగినీ, పడవవాళ్లనూ, వితంతువునూ రైటుగా భర్తలు ముద్దుపెట్టుకొన్నారు. పతివ్రతను, బాలెడ్ గరల్‌ను, ఆదర్శప్రాయమైన బట్టలు కట్టినావిడను రాంగుగాముద్దుపెట్టుకొన్నారు. అందరుభర్తలూ అందరినీ సరిగానో తప్పుగానో ముద్దుపెట్టుకోవడం అయింది. ఒకరిద్దరు తప్పుముద్దుగొన్నవాళ్లు మళ్లీ యింకోరిని ముద్దు పెట్టుకొని చివాట్లు తిన్నారు. ముద్దు పెట్టుకుందా మన్నా నాకు ఆడది లేదు. అయినా వటీరావు ఎవరో తెలియకుండా ముద్దుపెట్టుకోవడం ఎలాగ?

భర్తలలో నే నొక్కడనే మిగిలాను ముద్దుపెట్టుకోనివాణ్ణి. భార్యలలో ముద్దు పెట్టించుకోనివాళ్లు ఎవరూ లేరు!

గ్రామఫోను పాడుతూనే ఉంది "ఎంకీ వంటిపిల్ల లేదోయి లేదోయి" అని. ఆమాట నిజమే. నా వటీమాత్రం ఎక్కడున్నదీ తెలియడంలేదు.

బాబ్డుజుట్టు నాకేసి తిరిగి జాలిగా "వెల్ మిస్టరు రావ్" అంది.

నేను తటపటాయిస్తున్నాను. "మళ్లీ పరిశీలనగా చూచి మీభార్యను కనుక్కోలేరా?" అంది. "చూస్తాను" అని మళ్లీ పరిశీలన మొదలుపెట్టాను.

వటీరావుపోలిక ఉన్నవాళ్లు ఎవళ్లూ కనిపించలేదు. ఎత్తులావులు సరిపోయినా ముఖలక్షణాలు సరిపోవడంలేదు.

"వెల్" అంది బాబ్డుజుట్టు.

"సారీ, నేను కనుక్కోలేను"అన్నాను.

"స్టెపవుట్, వటీ" అని బాబ్డుజుట్టు అనడంతో నే ఆదర్శప్రాయమైన డ్రెస్సు వేసుకొన్నయిల్లాలు ముందుకు వచ్చింది. నేను ముఖం తిప్పుకొన్నాను.

"ఈమారు మీ వటీరావును ముద్దుపెట్టుకోండి" అంది బాబ్డుజుట్టు. ఆశ్చర్యం ఆదర్శప్రాయురాలిని చూచాను. ఆవిడ వటీరావులా లేదు.

"ఆవిడ వటీరావు కాదు. నేను ముద్దుపెట్టుకోను" అన్నాను.

"వెల్ వటీ" అంది బాబ్డు. వటీ వచ్చి అమాంతంగా నన్నే ముద్దుపెట్టుకొంది. ముద్దుపెట్టుకొనే వైఖరిమాత్రం వటీరావుదే అని గ్రహించాను. మరి ఆముఖలక్షణాలు మారడానికి కారణం ఏమిటో?

హాలు హాలంతా గోల అవుతోంది. చప్పట్లు, నవ్వులు, కేకలు, గ్రామఫోనుపాట.

ఆవిడకేసి నిదానించి చూస్తున్నాను. ఆవిడనోటిలోనుంచి రెండు పాడ్‌లు తీసింది. బూరటిల్లిన బుగ్గలు సర్దుకొన్నాయి. ముక్కును చేతితో పట్టుకు ఊడలాగింది. ఆ పెట్టుముక్కు చేతిలోకి వచ్చింది. వటీరావు నవ్వుముఖమూ, బనియను తొడుక్కున్న దిగంబరదేహమూ గోచరించాయి.

"భర్తలందరూ దయచేసి కూర్చోండి" అంది బాబ్డుజుట్టు. అందరూ కూర్చున్నారు.

అయ్యో కొయ్యోడా పాట పాడుతోంది గ్రామఫోను.

అరగంటలో భార్య లందరూ మామూలు వేషాలతో ప్రత్యక్షమై మా పక్క కూర్చున్నారు.

బాబ్జుజుట్టు వచ్చి చెప్పింది—"ఈ కార్యము నిర్విఘ్నముగా జరిపినందుకు భర్తలను మేము ప్రశంసిస్తున్నాము. భర్తలను తీసుకొని రావడములోనూ, వేషములు వేయడంలోనూ భార్యలు చూపిన చాకచక్యమునకు వారికి క్లబ్బు వందనము లర్పిస్తోంది.

ఈనాటి ప్రథమబహుమానము రావు గారిది. మర్యాదగా గుర్తుపట్టలేనని వప్పుకొన్నందుకుఅయునకు బహుమానమివ్వడమైనది. భర్తను భ్రమలో పెట్టిన మిసెస్ వటీరావుకుకూడా బహుమానమున్నది. భర్తలు సరిగా ముద్దుపెట్టుకొన్నందుకు వారికిని, సరిగా పోల్చుకోలేకపోయిన భర్తల భార్యలకునూ కాంసొలేషన్ బహుమతులు."

మా కందరికీ బహుమతులు బాబ్జు కన్యకే పంచిపెట్టింది. నాకు సులోచనాలూ, మంచి కెమెరా బహుమానంకింద వచ్చినవి. వటీరావుకు సెక్సుబుక్కుల దొంతరా, నిలువుటద్దమూ బహుమానాలు.

బాబ్జు కన్యక—"జాతీయగీతం" అంది. అందరమూ లేచాము.ఆడవా ళ్లందరూఅవ్యక్త మధుర కంఠాలతో పాడారు—

"జనగణమన అధినాయక జయ హే,
భారతభాగ్యవిధాతా!"



దర్శన వాఙ్మయము

మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి

[illegible]

సాంఖ్యము

[illegible]

వులు సుఖ దుఃఖములలో మునుగుచు తేలుచు నుందురు. ఇది వెఱ్ఱిభ్రమ. తనకును ప్రకృతికిని కొంచెమేనియు సంబంధము లేదని తెలిసికొన గలుగుటయే మోక్షము. ఇది సాంఖ్యదర్శనము యొక్క ఆదర్శము. ఈ కపిలుడు ప్రాచీనుడని బౌద్ధగ్రంథములు చెప్పుచున్నవి. ఈ సాంఖ్య సూత్రములకు అనిరుద్ధ విజ్ఞాన భిక్షువులు మున్నగువారు వ్యాఖ్యలు వ్రాసిరి. సాంఖ్య మతము క్రీస్తు ఆరంభమున ప్రబలముగా నుండెడిది. భగవద్గీత లోను, భారతములోను ఈ సాంఖ్యమత మభివర్ణింప బడియున్నది జైన బౌద్ధ మతములు సాంఖ్య మతము నుండి పుట్టినవే.

యోగము

సాంఖ్యము, యోగము అప్పచెల్లెండ్రు. సాంఖ్య మతమంత ప్రాచీనము గాదు యోగము. యోగసూత్రములు పతంజలిచే వ్రాయబడెను. ఈపతంజలి మహాభాష్యకర్తయే యని కొందఱ యభిప్రాయము. ఇదియే యథార్థమైనయెడల యోగసూత్రములు క్రీ. పూ. ౨-వ శ. మున రచింపబడి యుండవలయును. భగవద్గీతను బట్టిచూచినచో ఇది ౨-వ. శ. కంటె ప్రాచీనమైన దని తెలియుచున్నది. యోగ సూత్రములను మహాభాష్యకర్తయగు పతంజలి రచింపలే దని యాంగ్లేయుల వాదము. వ్యాసుడీ సూత్రములకు భాష్యము వ్రాసెను. మనుస్మృతి షష్ఠాధ్యాయములో యోగశాస్త్ర విషయములు కొన్ని వర్ణింపబడియున్నవి. భగవద్గీతకూడ యోగశాస్త్ర మనియే వ్యవహరించుచున్నారు. యోగాభ్యాసమువలన నమానుష కృత్యములు చేయ వచ్చుననియు, యోగాసనములు వేయుచుండుటచే నారోగ్యము కలుగుననియు వైద్యశాస్త్రజ్ఞులు నిర్వచించుచున్నారు.

న్యాయ వైశేషికములు

బ్రాహ్మణములలోను ఉపనిషత్తులలోను న్యాయ వైశేషికముల విషయ మేమియు గనబడదు. పాణిని కాత్యాయన పతంజలుల శాస్త్రగ్రంథములలోకూడ వీని విషయ మగపడదు. యాజ్ఞవల్క్య స్మృతిలో న్యాయ మీమాంసలు పేర్కొనబడి యుండుటచే న్యాయశాస్త్ర మించు మించు క్రీస్త్వారంభమున నుద్భవించిన దని చెప్పనొప్పును.

న్యాయసూత్రములు గౌతముడు రచించెను. ఈగౌతమునకు అక్షపాదుడను మఱియొక పేరు కలదు. వైశేషికసూత్రములు కణాదునిచే విరచింపబడినవి. కణముల నేఱికొని తినుచుండుటచే నితని కీనామము వచ్చిన దని శ్రీధరుడు వ్రాసినట్లు జ్ఞప్తి. ఇతని నిజ నామము కాశ్యపుడట. మహేశ్వరుడే కాశ్యపర్షికి ఉలూక (గుడ్లగూబ) రూపమున ప్రత్యక్షమై యీ శాస్త్రము నుపదేశించుటచే దీనికి ఔలూక్య దర్శన మని గూడ నామాంతరము కలదని కొందఱు చెప్పుదురు. పురాణములలో ఉలూకుడు, అక్షపాదుడు, కణాదుడు ననువారు వ్యాసునికుమారు లని వ్రాయబడియున్నది. క్రీ. శ. ౪-వ శతాబ్దమున వాత్స్యాయనుడు న్యాయ సూత్రములకు భాష్యము వ్రాసెను. తన భాష్యముల వైశేషిక దర్శనములోని కొన్నికొన్ని సూత్రముల నక్కడక్కడ నుదాహరించి యున్నాడు. కావున న్యాయ వైశేషిక దర్శనములు రెండును ౪-వ శతాబ్ది కంటె బూర్వమున బుట్టిన వని సుస్పష్టముగా చెప్ప వచ్చును. వైశేషిక దర్శనములో నలతియలతిగా విమర్శించి వ్రాయబడిన కొన్ని సంగతులు న్యాయ దర్శనములో సువిపులముగా విమర్శింపబడియున్నవి. మఱియు న్యాయదర్శనమున ప్రతితంత్రసిద్ధాంత మను నామముతో వైశేషికదర్శనము పేర్కొనబడి యుండుటచే న్యాయముకంటె వైశేషికము ప్రాచీన మైన దని చెప్పవచ్చును. న్యాయములో మాధ్యమిక బౌద్ధమతము పరామర్శింపబడియున్నది. కాన క్రీ. శ. ౩-వ శతాబ్దమున బుద్ధాచార్యునిచే ప్రవర్తింపజేయ బడిన మాధ్యమిక బౌద్ధ మతమునకు కొంచె మించు మించు న్యాయమతము ప్రాచీనమై యుండు ననియు, వైశేషికసూత్రములు క్రీ. శ. ౩-వ శతాబ్దమున పుట్టి యుండుననియు గొందఱు పరిశోధకపండితులు వ్రాయు చున్నారు.

వైశేషికము పది యధ్యాయములుగను, న్యాయము అయి దధ్యాయములుగను విభజింపబడి యున్నవి. వైశేషికమునకు ప్రశస్తపాదుడును, న్యాయ

మునకు వాత్స్యాయనుడును భాష్యముల వ్రాసి యున్నారు. ఈరెండు భాష్యములకును కొంచెము భేదము కలదు. వైశేషిక భాష్యములోని సూత్రము లన్నియు వ్యాఖ్యానింపబడియుండలేదు. వ్యాఖ్యాత సూత్రములుగూడ మాతృకలో నున్నట్లు క్రమముగా లేవు. సిద్ధాంతవిషయములోగూడ మూల, వ్యాఖ్య లకు రెండింటికిని భేదము కన్పట్టుచున్నది. వాత్స్యాయన భాష్య మిట్లుగాక అవిరోధముగా నున్నది. ఈ న్యాయభాష్యమును ఖండించుచు నెవరో యొక గ్రంథము వ్రాసిరి.

చారిత్రపరిశోధకపండితులు ప్రశస్తపాదుడు ౫-వ శతాబ్దివా డనియు, వాత్స్యాయనుడు ౪-వ శతాబ్దివా డనియు నూహించియున్నారు. న్యాయ దర్శనముపై బహువ్యాఖ్యలు బయలుదేరినవి. న్యాయ సూచి యనియు, న్యాయసూత్రోద్ధార మనియు కొన్ని వ్యాఖ్యలు వ్రాసిరి.

న్యాయసారసంగ్రహ మను మఱియొక గ్రంథము కలదు. ఇది బౌద్ధగ్రంథములను జూచి అందలి విషయములను సంగ్రహించి రచింపబడినది. ఇది ఇంతకు పూర్వగ్రంథములవలె పదార్థవిచారముతో ప్రారంభింపక నీగ్రంథము ప్రమాణవిచారముతో మొదలు పెట్టిరి. ఇది బౌద్ధగ్రంథముల ఫక్కియై యున్నది. ఉదయనుడను మఱియొకడు లక్షణావళి, కిరణావళి, కుసుమాంజలి యను పుస్తకములు వ్రాసి యున్నాడు. కిరణావళి ప్రశస్తపాదుని భాష్యమునకు వ్యాఖ్య. అనుమాన ప్రమాణముచే నీశ్వరుడు "కుసుమాంజలి"లో స్థాపింపబడెను. "బౌద్ధధిక్కార" మను మఱియొక గ్రంథము కలదు. అదియు నితనిదే. మఱియు నీ యుదయనుడు ఉద్ద్యోతకరుని న్యాయ వార్తికతాత్పర్యపరిశుద్ధికి వ్యాఖ్యగూడ వ్రాసి యున్నాడు. శ్రీధర పండితుడు ప్రశస్తపాదభాష్య మునకు "న్యాయకందళి" యను వ్యాఖ్య వ్రాసెను. ఈగ్రంథము క్రీ. శ. ౯౯౧-వ సం.లో వ్రాయబడినట్లు ఆగ్రంథమునందే చెప్పబడియున్నది.

ఉదయనునితరువాత ౨౦౦ సం. ల వఱకును న్యాయశాస్త్రమున ప్రసిద్ధ గ్రంథము లేవియు రచింప బడియుండలే దని చెప్పుదురు. ౧౨-వ శతాబ్దమున గంగేశు డనువాడు "తత్త్వచింతామణి" యను నొక గ్రంథము వ్రాసెననియు, నీ గ్రంథమునకు జయదేవుడు ఒక వ్యాఖ్య వ్రాసె ననియు దెలియుచున్నది. ఈ జయదేవుడే ప్రసన్నరాఘవకర్త. గంగేశుడు తన పుస్తకములో హర్షుని పేరు నుదాహరించుటచే ౧౨-వ శతాబ్దివా డని యూహించుచున్నారు. గంగేశుని కుమారుడు వర్ధమానుడు. ఇతడు తత్త్వచింతామణికిని, ఉదయనుని కిరణావళ్యాది గ్రంథత్రయమునకును వ్యాఖ్యానములు వ్రాసియున్నాడు.

నవద్వీపములోని వాసుదేవ సార్వభౌముడు ౧౫-వ శతాబ్దమున తత్త్వచింతామణి కొక వ్యాఖ్యా గ్రంథము రచించినాడట. నవద్వీపమున న్యాయ శాస్త్ర మితనితో ప్రారంభింపబడియుండును. ఇత నికి కృష్ణనందు డనియు, రఘునందు డనియు, రఘునాథు డనియు, చైతన్యు డనియు నల్వురు ప్రసిద్ధ శిష్యులు కలరట. చైతన్యుడు వైష్ణవ మత ప్రవర్తకుడు. రఘునాథుడు సుప్రసిద్ధతార్కికుడు. ఇతడే తత్త్వచింతామణికి "దీధితి" యను నొక వ్యాఖ్య వ్రాసెను. ఈరఘునాథుని శిష్యుడగు మథురానాథుడు తత్త్వచింతామణీ దీధితులకు వ్యాఖ్య వ్రాసెను. ఇతడు గదాధరుని గురువగు హరిరామ తర్కాలంకారునకు సమకాలీను డని కొందఱు వ్రాయు చున్నారు. జగదీశుడు వైశేషికమునకు "ఉపస్కా రము"ను వ్రాసినాడు. వైశేషికములకు గల వ్యాఖ్యల లో నీ "యుపస్కార"మే మొదటిది; సంపూర్ణ మైనది, ప్రసిద్ధమైనదికూడను. ఇతడు ౧౭-వ శతాబ్ది వాడట.

న్యాయ వైశేషికములు రెండింటికిని కలిపి వ్యాఖ్య వ్రాసినవారిలో "శివాదిత్యు" డనువాడు ముఖ్యుడు. ఇతడు "సప్తపదార్థియ" మను గ్రంథము వ్రాసెను. మఱియు న్యాయదర్శనమునకు విజయ నగర బుక్కరాజు కొలువువా డగు చిన్నభట్టి వ్యాఖ్య యొకటి వ్రాసెను. మఱియు తర్కకౌముది యను న్యాయ గ్రంథము ఒకటియు, "తర్కామృత" మను మఱి యొకటియు, "భాషాపరిచ్ఛేద" మని యొకటియు

ననేక గ్రంథములు తర్కములో వెలువడినవి. అన్నంభట్టు తర్కసంగ్రహ మను నొక చిన్న గ్రంథము వ్రాసి దానికి దీపికయను వ్యాఖ్యకూడ స్వయముగా వ్రాసి యున్నాడు. ఈ అన్నంభట్టు ఆంధ్రుడు. ఇతడు ౧౮ - వ శతాబ్దివాఁడని యూహించియున్నారు. ఇతడు అష్టాధ్యాయికి (పాణినీయము) మితాక్షరి యను వ్యాఖ్యకూడ వ్రాసియున్నాడు. ఈ ఆంధ్ర శిరోమణి అన్నంభట్టు న్యాయశాస్త్రమునందే గాక వేదాంత మీమాంసా శాస్త్రములలోగూడ గ్రంథములు రచించి యున్నాడు. ఇతడు వ్రాసిన తర్క సంగ్రహమునకు లెక్కలేనన్ని వ్యాఖ్యలు కలవు. వానిలో నీలకంఠీ యను, న్యాయబోధిని అనునవిమాత్రము సుప్రసిద్ధములు. నీలకంఠుడు ౧౭౪౦ - వ సం. న మరణించె నని చరిత్రకారులు చెప్పుదురు. మఱియు వరదాచార్యులు "తార్కికరక్ష" యను గ్రంథము వ్రాసియున్నాడు. జానకీనాథభట్టాచార్యుడు న్యాయసిద్ధాంతమంజరి యను నొక గ్రంథము వ్రాసెను.

గంగేశుని కాలమునుంచి తర్కము పూర్వ తర్కము, నవ్యతర్కమునను భేదముతో వ్యవహరింప బడుచుండినట్లు తెలియుచున్నది. సాధారణముగా ౧౦-వ శతాబ్దికంటె ప్రాచీనమైన తర్కమును ప్రాచీన మనియు, అటుపిమ్మట పుట్టిన తర్క వాఙ్మయమునకు నవ్యతర్క మనియు వ్యవహారమున్నట్లు తార్కికపండితు లెవరో చెప్పగా వినియుంటిని.

జైమినీయము

వేదమంత్ర భాగమునకు, బ్రాహ్మణమునకు పరస్పర విరోధములు లేకుండునట్లుగా యజ్ఞయాగాది వ్యాపారములు చేసికొనుటకై మీమాంసా దర్శనము పుట్టినది. మద్దన్నన మాత్ర గ్రంథములలోను మీమాంసయే మొట్టమొదటిది. ఇది జైమినిమునిచే వ్రాయ బడినది. కాని సంస్కృత సారస్వతములో జైమినులు చాలామంది కనపడుచున్నారు. సామవేదమునకు జైమినీయ బ్రాహ్మణము, జైమినీయ సంహితయు గలవు. జైమినీయ శ్రౌతసూత్రములును గలవట. ఆశ్వలాయన గృహ్య సూత్రములలో జైమిని నామము కలదు. ఇతియునుగాక వేదాంత శాస్త్రములోగూడ జైమినిపే రచ్చటచ్చట పేర్కొనబడియున్నది. వీ రందఱిలోను మీమాంసాసూత్రకర్త యగు జైమిని యెవడో నిర్ణయించుటకు తగిన యవకాశములు లేవు. మీమాంసలో ౯౧౫ అధికరణములు కలవు. బాదరి, ఆత్రేయ, ఐతిశాయ, బాదరాయణ మున్నగు మునుల పేర్లుకూడ నిందుదాహరింపబడియున్నవి. మీమాంసా సూత్రములు క్రీ. శ. ౨-వ శతాబ్దమున పుట్టిన వని పాశ్చాత్య పరిశోధక పండితుల యాశయము. మీమాంసాసూత్రములకు శబరస్వామి భాష్యము వ్రాసెను. ఉపవర్షుడు మీమాంసా వేదాంతములకు వివరణముల వ్రాసియున్నట్లు చెప్పుదురు. శాబర భాష్యములో నుపవర్షుని పే రుదాహరింపబడియున్నది. వేదాంతసూత్రములకు వివృతిని వ్రాసిన బోధాయనుడే మీమాంసాసూత్రములకుగూడ వివరణము వ్రాసె నని కొంద అందురు. శబరస్వామినిగూర్చి చిన్నకథ కలదు. మొదట నితని పే రాదిత్యదేవు డనియు, జైనులచే సంభవించిన ప్రాణభయమును దప్పించుకొనుటకు శబర వేషమును దాల్చి పలాయితు డగుటచే నితని కీ నామము కలిగె ననియు చెప్పుదురు. ఇది యెంతవఱకు సత్యమో ? ఈశబరస్వామి విక్రమార్కుని తండ్రియని కొందఱు, భర్తృహరి పిత యని కొందఱు, వరాహమిహిరుని జనకు డని మఱి కొందఱు బహువిధములుగా నిర్వచించుచుందురు. ఇతడు క్రీ. శ. ౮-వ శతాబ్ది వాడని కొంద అనిరి. కుమారిలుడును, ప్రభాకరుడును ఈ శాబరభాష్యమునకు వ్యాఖ్యానములు వ్రాసి యున్నారు. ప్రభాకరుని గ్రంథమునకు "బృహతి" యని పేరు. ఈగ్రంథ ముత్సన్నప్రాయము. ప్రభాకరుడు క్రీ. శ. ౭-వ శతాబ్దివాడని ప్రతీతి. ఈతని "బృహతి"కి "ఋజువిమల" యనునొక వ్యాఖ్య కలదు. దీనికర్త శాలికనాథుడు.

మఱియు మండనమిశ్రుడు "విధివివేక" మనియు, మీమాంసానుక్రమణిక యనియు గ్రంథములు వ్రాసియున్నాడు. వీనియందు శాబరభాష్యములోని విషయమంతయు సంక్షిప్తముగా వ్రాయబడియున్నది. శంకరాచార్యులవారి శిష్యుడగు సురేశ్వరుడే మండన మిశ్రుడను నామాంతరము కలవా డని "శంకరవిజయ

ము"న వ్రాయబడియున్నది. ఇది యథార్థమైనచో మండనమిశ్రుడు ౮-వ శతాబ్దివాడై యుండనోపు. మీమాంసాసూత్రములకు పార్థసారథిమిశ్రుడు "శాస్త్రదీపిక" యను నొక వ్యాఖ్యానము వ్రాసియున్నాడు. ఇతడు మాధవాచార్యునికంటె ప్రాచీనుడు. పార్థసారథిమిశ్రుడు తంత్రరత్న మహోదధి యను గ్రంథమున మీమాంసాసూత్ర భాష్యములోని కొన్ని పెద్ద విషయములను విమర్శించెను. వారణాసి యందలి ఖండదేవు డనువతడు మీమాంసాసూత్రములకు భట్టదీపిక యను నొక చిన్ని వ్యాఖ్యను, మీమాంసాకౌస్తుభ మను నొక పెద్ద వ్యాఖ్యను రచించియున్నాడు. ౧౭౦౮ సం. క్రీ. శతాబ్దమున శంభుభట్టు భాట్టదీపిక యను మఱియొక వ్యాఖ్య వ్రాసియుండెను. పిమ్మట మీమాంసాసూత్రములకు మఱియు ననేక వ్యాఖ్యానములు వెలువడియుండెను.

కొందఱు కొంచెఱు కేవలము మీమాంసకు వ్యాఖ్యలు వ్రాయుటవలన విద్యార్థులకు సులభార్థబోధకముకుట లేదని యెంచి వ్యాఖ్యలలోనుండు ముఖ్య విషయముల సంగ్రహించి తేటతెల్లములగు మాటలతో స్వతంత్రముగా కొన్ని గ్రంథములు వ్రాసిరి. ఆగ్రంథములలో ప్రాచీనమైనది మాధవాచార్యుని జైమినీయ న్యాయమాలావిస్తరము. ౧౬-వ శతాబ్దమున అప్పయదీక్షితులు విధిస్వరూపమును విచారించి "విధిరసాయన" మను నొకగ్రంథము సుఖోపయోగినీ వ్యాఖ్యా పురస్సరముగా వ్రాసి ప్రకటించియున్నాడు. శంకరభట్టనునతడు దీనిని ఖండించుచు మఱొక గ్రంథము రచించెను. ఇతడు దీక్షితునకు సమకాలీనుడు. ఇతడు మీమాంసాదర్శనములోని విషయములను సంగ్రహముగా శ్లోకరూపమున వ్రాసి "మీమాంసాసారసంగ్రహ"మను గ్రంథము వ్రాసియున్నాడు. మీమాంసాబాలప్రకాశ మను మఱియొకగ్రంథ మితడు వ్రాసెను. ఆపదేవుడు "మీమాంసా న్యాయప్రకాశము" వ్రాసెను. ఇతడు ౧౭-వ శతాబ్దివాడు. ఇతని కొమారుడు అనంతదేవు డనువాడు న్యాయప్రకాశికకు భట్టాలంకారమను వ్యాఖ్య వ్రాసెను. ఆపదేవునితమ్ముడు శివదేవుడు "భాట్టభాస్కర" మను గ్రంథమున మీమాంసా విషయముల నన్నిటిని సువిస్పష్టముగా విమర్శించియున్నాడు. మఱియు కృష్ణదీక్షితుడు మీమాంసా పరిభాషను వ్రాసెను. వేదాంతాచార్యుడు 'మీమాంసా పాదుక' యను పెద్ద గ్రంథమువ్రాసి మీమాంసాసూత్రములలోని ప్రథమ పాదములోని ప్రథమాధికరణమును విమర్శించెను; మీమాంసామతమునకు వేదాంతముతో సంబంధము కల్పించెను.

వేదములోని పూర్వభాగమగు మంత్ర బ్రాహ్మణములలో వర్ణింపబడిన కర్మలనుగూర్చియు, తత్ఫలితములనుగూర్చియు విమర్శింపబడిన శాస్త్రమునకు పూర్వమీమాంస యని పేరు. కనుకనే దీనికి కర్మమీమాంస యనికూడ నామాంతరము. వేదోత్తరభాగమగు నుపనిషత్తులలో ప్రతిపాదింపబడిన యాత్మనుగూర్చి విచారింపబడిన శాస్త్రమునకు ఉత్తర మీమాంస యని పేరు. దీనికే బ్రహ్మమీమాంసయనియు, శారీరకమీమాంసయనియు, నామాంతరములు. ఉత్తర మీమాంసా సూత్రములు బాదరాయణ కర్తృకములని చెప్పుదురు. బాదరాయణు డనగా వ్యాసుడో? మఱియొకడో? పూర్వోత్తర మీమాంసల వెనుకముందులు నిర్ధరించుట కష్టతరము. పూర్వ మీమాంసాసూత్రమున బాదరాయణుని పేరును, ఉత్తర మీమాంసాసూత్రమున జైమినినామమును కనబడుచున్నది. జైమిని బాదరాయణుని శిష్యు డనికూడ కొందఱు వచించుచున్నారు. ఈపుక్కిటి పురాణకథను బట్టి పూర్వమీమాంస తొలుతటి దని, ఉత్తరమీమాంస తరువాతి దని మనము చెప్పుట సరియైన దగునా? మతము లెప్పుడు పుట్టినను సూత్రములుమాత్రము ఏకకాలముననే వ్రాయబడి యుండవచ్చునని చెప్పవచ్చును. పూర్వోత్తర మీమాంసలు రెండును గలసి యొక్క శాస్త్రమేయని విశిష్టాద్వైతుల యభిప్రాయము.

౮-వ. శ. జీవించియున్న శంకరాచార్యులవారి కంటె పూర్వమే వేదాంతసూత్రములకు వ్యాఖ్యానము వ్రాయబడియున్న ట్లాయన వ్రాసిన భాష్యమువలననే తెలియుచున్నది. బోధాయనువృత్తినుండియు, ద్రవిడాచార్యుని భాష్యమునుండియు వాక్యములు శంకర భాష్యమునందును, రామానుజభాష్యమునందు నుదాహ

రింపబడియున్నవి. పూర్వమీమాంసకుడగు బోధాయనుడు వృత్తి వ్రాసెనని కొందఱందురు. ఇట్లు ౮-వ శతాబ్దికి పూర్వమే అనేకులు వ్యాఖ్యానములు వ్రాసియుండుటచే వేదాంత సూత్రములు క్రీ. శ. ౨-వ శ. మునగాని అంతకు దొల్లిటివాడుగాని రచింపబడియుండవలయును. బోధాయనవృత్తి ననుసరించి రామానుజుడు భాష్యము వ్రాసినట్లు చెప్పియున్నాడు. శంకరాచార్య రామానుజాచార్యుల మధ్య భాస్కరుడును, యాదవుడును రెండు వ్యాఖ్యానములు వ్రాసియున్నారు. వీరి యద్వైతసిద్ధాంతమునకును, శంకరుని యద్వైతసిద్ధాంతమునకు ఈషద్భేదము కలదు. రామానుజులు మొదట నద్వైతిగా నుండి పిమ్మట గురువగు యాదవుని యుపదేశమువలన విశిష్టాద్వైతము నవలంబించెనని కొందఱి వాదము.

శంకరాచార్యులవారు బ్రహ్మసూత్రములకేగాక కొన్ని యుపనిషత్తులకును, భగవద్గీతకును వ్యాఖ్యలు వ్రాసియున్నారు.

౧౨-వ శ.మున రామానుజాచార్యుడు బ్రహ్మసూత్రములకు మఱియొక భాష్యమును వ్రాసియున్నాడు. దీనికే శ్రీభాష్యమనికూడ పేరు. శంకరాచార్యాది అద్వైతులు జీవాత్మపరమాత్మలకు భేదము లేదని చెప్పుదురు. రామానుజాచార్యాది విశిష్టాద్వైతులు జీవాత్మ పరమాత్మలకు అభేదము నంగీకరించియుండలేదు. మఱియు రామానుజుడు పరమాత్మ యనగా విష్ణువేయని అర్థము నొడివెను. ఇట్లే వేదాంతశాస్త్రమునకును, పౌరాణిక మతమునకును ఈయన సంబంధము కల్పించెను. రామానుజులు విశిష్టాద్వైతపరముగా భగవద్గీతకుగూడ చక్కని వ్యాఖ్య వ్రాసియున్నాడు. శ్రీభాష్యముగాక బ్రహ్మసూత్రములకు వేదాంతదీపము, వేదాంతసారము అను రెండువ్యాఖ్యలు వ్రాసియున్నాడు. మఱియు ననేక స్తోత్రములు వ్రాసెను.

వేదాంతదేశికాచార్యులు విశిష్టాద్వైతమున ననేక గ్రంథములు వ్రాసెను. ఇతడు ౧౪-వ శ.మున జీవించియున్నాడు. వానిలో ముఖ్యగ్రంథములు అధికరణసారావళి, శతదూషణి యనునవి. పూర్ణప్రజ్ఞుడను నతడు మహాభారతమునకు ద్వైతపరముగా నర్థము వ్రాసియున్నాడు. ద్వైతులకు పురాణములును రామాయణ మహాభారతములునుగూడ వేదముతో తుల్యములగు ప్రమాణగ్రంథములే. ఈపూర్ణప్రజ్ఞుని గ్రంథములన్నిటికిని కవిసర్వమూల యని వ్యవహారము.

శంకరభాష్యమునకు వాచస్పతిమిశ్రుడు భామతి యను నొక వ్యాఖ్యానమును, ఆనందగిరి మఱియొక వ్యాఖ్యయు వ్రాసియున్నారు. పూర్ణప్రజ్ఞభాష్యమునకు సుదర్శనాచార్యుడు శ్రుతప్రకాశిక, శ్రుతప్రదీపిక యను రెండువ్యాఖ్యలు వ్రాసెను.

బౌద్ధము

ఇది బుద్ధాచార్యునిచే స్థాపింపబడిన మతము. బౌద్ధగ్రంథములు పెక్కులు గలవు.

మాధవాచార్యుడు "సర్వదర్శనసంగ్రహ" మను పేరితో నీమతములన్నియు సంక్షేపించి వ్రాసియున్నాడు. సర్వసిద్ధాంత సంగ్రహమను మఱియొకదర్శనగ్రంథముకూడ కలదు. ఇది శంకరాచార్యులవారు రచించిరని ప్రసిద్ధి. హరిభద్రసూరి యను పండితుడు "షడ్దర్శనసంగ్రహ" మనుపేర నొకదర్శనగ్రంథము వ్రాసియున్నాడు. ఇందు బౌద్ధ, న్యాయ, సాంఖ్య, జైన, వైశేషిక, జైమినియను షడ్దర్శనములను గూర్చియు చార్వాకమతమును గూర్చియు వ్రాసియున్నాడు. ఇందు మొత్తము ౮౮ శ్లోకములు కలవు. ఇది చాల ఉత్తమమగు గ్రంథము. షడ్దర్శనములను గూర్చి వ్రాయుచు చార్వాకమును గూర్చి కూడ దీనిలో నెందుకు వ్రాసెనో తెలియదు.

నే నీవ్యాసము దర్శనములతత్త్వ మాంధ్రులకు సమగ్రముగా దెలుపగోరియు, దీనితత్త్వమింతేయనియు వ్రాయలేదని స్పష్టముగా చెప్పుచుంటిని. నారచనారంభములో నొకయుద్దేశము లేకపోలేదు.

మన ఆంధ్రవాఙ్మయములో దర్శనములనుగూర్చి విమర్శగ్రంథములు లేకపోవుట శోచనీయము. ఇటీవల మాత్రము కొలదిగా సంస్కృతగ్రంథములను గొన్నిటిని శిరోమణు లాంధ్రీకరించిరి. కాని అవి ఆంధ్రుల కంతగా నుపయోగించు రీతిగా వ్రాయబడలేదు. తెనుగులో బౌద్ధమత గ్రంథము లేకొలదిగానో కలవు. సూత్రభాష్యములను బ్రహ్మశ్రీ పురాణపండ మల్లయ్యశాస్త్రులుగారు

తెనుగు చేసి ప్రకటించిరి. అది కొంతవఱకు నుపయోగపడుచున్నది. అట్లు ప్రత్యేకము సంస్కృతగ్రంథములను ఆంధ్రములోనికి ఫోటోవలె దింపక సంస్కృతవాఙ్మయములో వివిధగ్రంథములలో చర్చింపబడిన యొకసాంఖ్యమునుగూర్చి కాని, ఒకవైశేషికమునుగూర్చిగాని, మఱియొకదానినిగూర్చిగాని చక్కగా విమర్శించుచు నాంధ్రములో నొకగ్రంథము వ్రాయవలెను. ఏదర్శనమునుగూర్చిగాని తెనుగులో విమర్శగ్రంథము లేకపోవుట విద్యార్థుల దురదృష్టము. సంస్కృతములోగల సర్వదర్శన సంగ్రహము, షడ్దర్శనసముచ్చయమువంటి గ్రంథము ఒక్కటేనియు తెనుగున వెలువడిన ఎంతయుపకారము? ఎంత భాషావికాసము? ఇట్టి భాషోద్ధారకగ్రంథములు, ఇట్టి శాశ్వతగ్రంథములు తెనుగులోనికి వచ్చినగాని ఆంధ్రభాషకు గౌరవ ముండదు. ఆంధ్రభాషకు అస్తిక్యమే ఉండదు.

ఆంధ్రభారతికి అమూల్యసేవ చేయదలచినవారు దర్శనములనుగూర్చి సువిపులముగా జర్చించుచు నొక పెద్దకోశము త్వరలో వ్రాసి ఆంధ్రుల కర్పింపుడు!

ఆనడుమ "చిత్రగుప్త"లో మల్లాది అవధానిగారు చార్వాకమతమును గుఱించి చిన్నవ్యాసము వ్రాసియున్నారు. దానిలో వారు చార్వాకమతమునకు సంబంధించిన గ్రంథము లేవేని సంపాదించుటకు చాలా ప్రయత్నించితిననియు నట్టి వేవియు లభ్యముకాలేదనియు వ్రాసియున్నారు. అవధానిగారి కిట్టిమతజిజ్ఞాస కలుగుట నాకు చాల ఆనందముగా నున్నది. చార్వాకమునుగూర్చి షడ్దర్శనసముచ్చయములో ౮ శ్లోకములు మాత్రమే కలవు. వానిలో ఇది యొకటి:—

పిబ ఖాదచ జాతశోభనే
యదతీతం వరగాత్రి! తన్నతే,
నహి భీరు! గతం నివర్తతే
సముదయమాత్ర మిదం కలేబరం.

ఈ గ్రంథమునువారు చూచియేయుండి రనుకొందును. దర్శనాభిమానులగు మదారు లిట్టి మతములకు సంబంధించిన భాషాంతరగ్రంథము లన్నిటిని సంగ్రహించి ఆంధ్రములో ప్రకటించి పుణ్యము కట్టుకొనెదరుగాక!*



* సా. సూర్యనారాయణగా రొసగిన సంస్కృతవాఙ్మయచరిత్ర (వ్రాతప్రతి)యొక్క Notes నా యీ వ్యాసమునకు కొంత ఆధారపడినందుకు వారి కెంతయు కృతజ్ఞుడను.

మృత్యంగణము

"సంపత్"

పోవుచుంటిని నేనొక ప్రొద్దుమునుగు
వేళ సంధ్యావిహారమ్ము ;— హేళిబింబ
మస్తమించెను దినలక్ష్మి యాత్మహోళ
జరఠసంధ్యా విశీర్ణావసానదశల.

ఏకతమ పోవు నను జూచి యాంకరాళ
ఘుసృణరేఖా విలిప్త సంకుపితధాత్రి
నిప్పుకలు రాల్చి చీకటికొప్పు విరియ
వికట హాసమ్ముజేసె నాభీలలీల.

ఏను నాలోన పద్యము లేవొ చదివి
కొంచుఁ గడచితి పొలిమేరగూడ నపుడె
ముసురు చీకటి నడచు నాముందె గోచ
రించె సద్యః ప్రసూత బాలేయ మొండు.

కాచుకొన్నది మృతశాబకమ్ము చెంత
ప్రళయతాండవ రుద్రాక్ష భయదకీల
లలమికొనివచ్చు ఘోరదృశ్యములఁ గనుచు
కాఱు చీకటులే మూర్తి కట్టినట్లు.

అప్పు డది శోకసంక్షుభితాంధకార
జఠర మరణాంధ్యమో కాక చరమదశయొ
అచట శోకమ్ము, తిమిరమ్ము లాకృతులుగ
నిలిచి నాయెద చెదర లోఁలికి చూచె.

నాయెడదగూడ — మృత్యువే నప్పుకొంచు
చచ్చిపడియున్న గార్దభ శాబకమును
కొంచె కొంచెముగా కబళించునట్లు
క్రమ్ముకొనివచ్చె నేవొ దృశ్యమ్ము లంత.

ఆకఠోర మృత్యంగణ మాకరాళ
దేవతా శూన్యదృక్కులు, ఆవికార
రూపిణీ మహోగ్రభయద రూక్షరేఖ
లలవికాలేదు చూడఁగ, నిలువలేదు.

పాతసీసాలలో కొత్తపానీయము*

ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి

ఈనాడు తెనుగుదేశంలో ఎక్కడ చూచినా, "కొత్తకవులు – కొత్తకవిత్వం" అనే మాటలతో చెవులు గింగురు మంటున్నాయి.

దేశాన్ని కలవరపెట్టే అనేకసమస్యల్లో ఇది వకటి. కొందరు ఈనాటికవిత్వం చాలా వుత్తమ మైనదనీ, ఇది కేవలం మనకు అపూర్వంగా లభించిం దనీ చెపుతున్నారు.

కొందరు ఇప్పటివారిది అసలు కవిత్వమే కాదనీ, ఏమీా పనిలేక – చేతగాక – ఈ కొత్తవుద్యమంమూలంగా కొందరు పైకి రాబోతున్నారనీ అంటున్నారు.

ఇందులో యథార్థం ఏమిటో క్లుప్తంగా ఇప్పుడు ఆలోచిద్దాం.

మాఘమాసంలో ఒక తోటను చూస్తాం; మళ్లా దాన్ని చైత్రమాసంలో చూడడం తటస్థించిం దనుకుందాం. ఓహో! అప్పు డక్కడ యెంత మార్పు! వసంతలక్ష్మి మృదుపదనాట్యం ఆ తోటలోని ప్రతి చెట్టుకూ నవజీవనాన్ని ధారపోసింది.

పగటిపూట ప్రకృతిని చూడండి; రాత్రి చంద్రోదయ మైనతరువాత అదే ప్రకృతిని చూస్తే కొండకొమ్ము లన్నీ— హిమవత్పర్వత శిఖరాలు; సెలయేళ్లన్నీ – వెండినదులు. స్థిమితంగా ఆలోచిస్తే ఇక్కడ అసలు వస్తువులలో ఏమీన్నీ విపరిణామం రాలేదు. కాని కాలాన్ని బట్టీ, దేశాన్ని బట్టీ ఒక్కొక్క ఉపాధి ప్రబలంగా తెచ్చిన మార్పును అనుసరించి — ఆయావస్తువులు అపూర్వంగా కనిపిస్తున్నాయి. అంతకు తప్ప సృష్టి తలకిందులు కావడం లేదు. ఈ దృష్టితో సారస్వతప్రవృత్తిని గూడా పరిశీలిద్దాం.

పూర్వ సాహిత్యవేత్త ఈ అర్థాన్నే ఇట్లా చెప్పాడు :

"దృష్టపూర్వా అపి హ్యర్థాః కావ్యే రసపరిగ్రహాత్
సర్వే నవా ఇవా భాంతి మధుమాస ఇవ ద్రుమాః."

పూర్వంనుంచీ ఎరిగున్న శబ్దార్థాలే అయినా, ఆయా కావ్యంలోని రసవిశేషములవల్ల అవి అన్నీ వసంతకాలంలోని చెట్లవలె – కొత్త కాంతితో ప్రకాశిస్తాయి అని తాత్పర్యం.

వేదాల్లోనే అద్భుత కవితాబీజములున్నా యని వైదిక సాహిత్య చరిత్రవల్ల తెలుస్తున్నది. వాల్మీకిమహర్షి వైదికభాషను సంస్కరించి వేదాల్లోనుంచే ఛందస్సునూ, అలంకారములనూ, కవితాధోరణినీ గ్రహించి తన ప్రతిభావిశేషముచేత రామాయణ మహాకావ్యాన్ని రచించగా అది అత్యపూర్వంగా కనిపించింది.

మహాకవి కాళిదాసు ఆదికవి రామాయణం ఇచ్చిన పుష్టితో—తనప్రజ్ఞను పడగవలె చరచర విప్పుకొని — నాలుగు నవ్య

* రేడియో ప్రసంగము. 'మద్రాసు, ఆల్ ఇండియా రేడియో' వారి అనుమతిని.

కావ్యములను సృష్టించినాడు. ముందు రామాయణం పుట్టకపోతే రఘువంశం పుట్టి నా ప్రయోజనం లేదు.

భవభూతి, బాణుడు, జయదేవుడు మొదలగు ప్రతిభావంతులయిన సంస్కృత కవులు తమతమ కాలంలో వెనకటి ఉత్తమ సాహిత్యబలంవల్ల కొత్తకొత్త కావ్యములను వ్రాస్తూ వచ్చారు.

ఆంధ్ర సారస్వత యుగకర్త నన్నయ భట్టు ప్రాచీన సంస్కృత కావ్యవాసనను మూలబలంగా తీసుకొని, తననాటి శాసన వాఙ్మయమునూ—దేశీయ కవితాధారనూ—ఆధారం చేసుకొని, భారత సంహితను తెని గించి ధ్రువతారలాగు ప్రకాశించాడు.

పిమ్మట కవిబ్రహ్మ, ప్రబంధపరమేశ్వరుడు మొదలగు ఆంధ్ర సత్కవులు పూర్వ పూర్వ కావ్యముల చేయూతతో ఎప్పటి కప్పుడు నవీనమార్గములు తొక్కి కొత్త ప్రబంధములను నిర్మించుతూనే వచ్చారు.

మన తెలుగు కవులు తమకంటే పూర్వులైన ఆంధ్ర కవులనూ, సంస్కృత కవులనూ ఎంతవరకూ అవలంబముగా చేసుకున్నారో మానవల్లి రామకృష్ణకవి మొదలైన సువిమర్శకులు స్పష్టంగా తమ విమర్శన వ్యాసాల్లో వ్రాశారు. దీనినిబట్టి మనకు ఉత్తరోత్తర కావ్యాలు పూర్వాపూర్వ కావ్యములను అనుసరించి ఆయా కవుల ప్రతిభనుబట్టి నవీనములుగా నిర్మించబడిన వని తేలింది.

ఇరవయ్యో శతాబ్ది వచ్చింది.

ఒక ఉజ్జ్వలమైన భవిష్యత్తు అనతిదూరంలో నిలుచుండి పిలిచింది.

ఒకవైపు విదేశ నాగరికతా — సాహిత్యముల ప్రబల సంపర్కం, సోదర వంగ దేశపు స్వతంత్రభావ ఝంఝామారుతం; ఒకప్రక్కను జాతీయోద్యమ భేరీధ్వని — తెనుగుభూమిని ఉర్రూత లూచడం మొదలు పెట్టినది.

దానితో సారస్వతంలో, సంఘంలో, మతంలో ఒక ఉలికిపడే మెలకువ కలిగింది.

మహాపురుషుడు వీరేశలింగం ఈకాలానికి ప్రముఖత్వమునువహించి సంఘంలోనూ, సారస్వతంలోనూ అమోఘములైన సంస్కారములను ప్రవేశపెట్టి అనేక నూతన రచనలకు పునాదులు వేసినాడు.

అప్పుడు గురజాడ అప్పారాయకవి సిద్ధహస్తం తెనుగు సాహిత్యంమీద పడింది. అంతవరకూ ఒకేగాడిలో పరుగెత్తే కవిత్వ రథాన్ని ఆపి, కొత్త తెన్నులు తొక్కించాడు అతడు. కావ్యకన్యకు పాత తొడవులను పొడ్చి ముత్యాలసరమును మెడలో అలంకరించాడు.

సమకాలికుడు — మహాపండితుడు అయిన గిడుగు రామమూర్తి పంతులుగారి వ్యావహారిక భాషా సింహనాదం అప్పటి నూతన సారస్వతోద్యమానికి మంచిశక్తిని కల్పించింది. పై ముగ్గురు ప్రముఖులవల్లను నవజీవనాన్ని కోరే ప్రతి అణువునకునూ ఒక వికాసమూ, స్వాతంత్ర్యమూ కలిగాయి.

నాటితో ఒక సాహితీసమితులా — ఖండకావ్యములా—కథానికలా—ఏకాంక నాటికలా—, శారదలా – భారతులా — తెనుగునాడంతా ఒక నూతనోత్సాహంతో కలకల లాడిపోయింది.

అప్పటి కొందరు ఈ పునరుజ్జీవాన్ని తిరుగుబాటుగాను, అసమర్థతను కప్పిపుచ్చే సాహిత్య ద్రోహముగాను ఎంచి ఏవేవో అన్నారు.

అంతట,

మెచ్చనంటా వీవు నీ విక
మెచ్చకుంటే మించిపోయెను
కొయ్యబొమ్మల మెచ్చుకనులకు
కోమలుల సౌరెక్కునా—"

అని ఈతరఫునుంచి జవాబులు ఘాటుగా వెళ్లాయి. వెంటనే సారస్వత సనాతనులు చెలరేగి నేటికాలపు కవిత్వంలో చవీ-సారం లేదనీ, నవ్యత లేనే లేదనీ, పుస్తకాలనూ, ఉపన్యాసాలనూ విసరడం మొదలుపెట్టినారు.

అతిశయ నవ్య భావోద్వేగులు పూర్వ కావ్యములు నీచములనీ, నీరసములనీ ఈసడించడం మొదలుపెట్టినారు.

అతని కావ్యముల కడుపు చల్లగా గురజాడకవి అన్నాడు

"కొత్త పాతల మేలుకలయిక
క్రొమ్మెరుంగుల జిమ్మగా"

అనీ,

"మాటమర్మ మెరిగినట్టి
మేటికవుల జాడ లరసి"

అనీ. కవి నోటివెంట ఈ ఘర్షణలను సమన్వయపరచుటకే కాబోలు ఈమాటలు వచ్చాయి.

నవ్యసాహిత్య మనగా ఏనాడూ లేని అభూతకల్పన అని గాదు అర్థం ;— పాత బంగారంతో కొత్తనగలు చేయడం. ఏనాడు సాహిత్య చరిత్రలో నవజీవం వచ్చిన దన్నా ఇదే తాత్పర్యం.

ఈ శతాబ్దిలోని అనేక సంపర్కముల వల్ల సాహిత్యంలో ఎప్పుడూ అనుకోని కొన్ని, కొత్త కావ్యవాసనలు వచ్చి ఒక విలక్షణస్వరూపం ఏర్పడినా - అది సర్వాత్మనా మారినట్టు కాదు.

ఉత్తమ నవకవులు ప్రాచీనకావ్య హృదయములను బాగా బోధపరచుకొని ఈకొత్త మార్గములను పట్టినట్టు తోస్తుంది గాని అసమర్థులై— పాత కావ్యములను చదవలేక— ఆధోరణిలో వ్రాయలేక- ఇందులో దిగినట్లు కనబడడం లేదు ; ఎందుచేతనంటే ఎన్నో పూర్వకావ్యాల సంస్కృతులు ఈనాటి కావ్యాలలో మెరుగులతో కనబడుతున్నాయి. సంస్కృతీయములైన శార్దూలాదివృత్తములు తెనుగుకవితకు ఎక్కువ అనువుగా వుండవని తలచి గురజాడకవి దేశీయవృత్తములను ఆదరించినాడు.

వృషభగతిరగడను తీసుకొని పాదమును పదునాల్గుమాత్రలతో నడిపి చివరి పాదంలో కొన్ని మాత్రలను తగ్గించి

"సత్తునా ముత్యాలసరముల
కూర్చుకొని తేటైనమాటల"

అన్నాడు.

ఈ దేశీయవృత్తమునే ఆయన ఎక్కువ తన కావ్యములో వాడినాడు. తరువాత 'జడకుచ్చులు', 'కృష్ణపక్షం' మొదలైన కావ్యాల్లో ఇది సుప్రతిష్ఠితం అయింది.

మధురగతిరగడను తీసుకుని మూడు పాదాలను శాస్త్రీయంగా నిర్వహించి ఆఖరు

పాదంలో కొన్ని మాత్రలను తగ్గించి గమన విశేషములను కల్పించినాడు.

" మేలిమి బంగరు మెలతల్లారా!
కలువల కన్నుల కన్నెల్లారా!
తల్లుల గన్నా పిల్లల్లారా!
విన్నారమ్మా ఈకథను—"

క్రమేపి తర్వాతి నవకవులు దీన్ని రకరకాల నడిపించినారు.

" మరో ప్రపంచం మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది—"

అనీ

" ఓహో! కిన్నెరసానీ!
ఊహామాత్రములోపల
ఏల నిలువవే జవరాలా!"

అనీ నడచాయి.

ద్విరదగతిరగడను తీసుకొని కొందరు కొంచెం మార్చినీన్ని, కొందరు మార్చకనూ వాడారు. దీని అఖండప్రవాహం నేటి ఖండ కావ్యాల్లో అన్నిటిలోనూ విరివిగా వుంది.

ఈగేయం శుద్ధ ద్విరదగతిరగడ:

" ఊరకే చలియించు ఈరేయి వెన్నెలలు
విగహపికాతరళతరళతంత్రీగతుల. "

బసవరాజువారి ప్రేమతత్వం మొదలైన కావ్యాలు ద్విరదగతులు; కిన్నెరసాని పాటలలో దీని గమనవిశేషాలు ఎన్ని అయినా కనపడతాయి.

చాలావరకు మొంకిపాటలు ఈ తరగతి కిందికే వస్తాయి. " మెనకజల్మంలోన మెవరమో నంటే" అన్నచోట ఒక్క అక్షరం తగ్గిన ద్విరదగతి కొత్తనడక కనపడుతుంది.

ఇప్పటివారు పూర్వచ్ఛందస్సులను గ్రహించి స్వతంత్రంగా తొక్కిన వింత లెన్ను లివి.

కొందరు ఉత్పలమాలాది పూర్వవృత్తములనే వాడి కొత్తతూగును, ఒయ్యారాన్ని చూపించారు:

" నీ వనుకోనులేదు మరి నేనును చెప్పగ లేదుగాని అన్నా! వినవయ్య— "

"రాసులు గాగ జేలపయి రాలుచుపూవులు దూదిదారులే చేసినవి—"

ఆధునికకవులు భాషలోగూడ పాత మాటలతోనే కొత్త సంప్రదాయములను కూర్చినారు.

"ఏమంచిపూవులన్ ప్రేమించినావో", "తెరరెన్ చలిగాలి వెచ్చ, పూలకారుపవళ్లు, చుక్కలరగము, పూలవెన్నెలలు."

వీరి కవిత్వముగూడా చక్కని కొత్త పాతల మేలుకలయిక.

మనుష్యుని రాగద్వేషాలూ, మోదఖేదాలూ, మానావమానాలూ, సుఖదుఃఖాలూ ఎప్పుడూ వకటే; వాటి నెవరూ మార్చరు. మార్చితే రసభంగం అవుతుంది. కవిత్వమునకు ఎప్పుడూ ప్రధానమైనది ఆనందనిష్యందమూ — చమత్కార భావ ప్రదర్శనమూను. ఇది విదేశకావ్యాల్లోనైనా, స్వదేశకావ్యాల్లోనైనా, ప్రాచీన నవీన కావ్యములలోనైనా కనిపించితీరాలి. దీనినే కవులు ముఖ్యలక్ష్యముగా పెట్టుకొని కావ్యాలు వ్రాస్తారు. అనుభవ విశేషముల వల్లనూ, ఉక్తిచాతుర్యమువల్లనూ, చెప్పే పక్కని బట్టీ ఒకొక్కప్పుడు కావ్యశ్రేణికి విలక్షణశోభ వస్తుంది.

మాటలూ, అర్థములూ పూర్వపువే అయినా కూర్పునేర్పువల్ల కావ్యాలను నవ్యములుగా చేయవచ్చు నని సాహిత్యవేత్తలన్నారు.

నేటికవులు ఎప్పుడూ రసానికి ఆశ్రయములుగా ఉండే-ప్రేమ - విరహం - హాసం - రోషం మొదలైన - విషయాలనే తీసుకొని కావ్యాలు వ్రాస్తున్నారు. రాధాకృష్ణ ప్రేమను జయదేవుని గీతగోవిందంలో ఎంత తనివితీర చదివినా నవకవి శృంగారవీథిలోని కొత్తచవికి రసికహృదయం సంతోషపడక మానదు.

ఇప్పటి కావ్యాలలోను ఉపమాది అలంకారాలు లేకపోలేదు; కాని వాటిని చెప్పేవిధానం కొత్తగా వుండవచ్చు.

"కంటి క్రొన్నీటి ముత్యాలు"

ఎంత చక్కనిరూపకం!

"నీటికడుపున దాగి తోట నిదురోయింది."

ఎంత లోతైన అతిశయోక్తి!

"శిలలు ద్రవించి యేడ్చినవి"— అంటే సమాధిగుణం ఎంత చక్కగా అమరింది!

బసవరాజువారి "తాజ్ మహల్" కృష్ణకర్ణామృతంలోని 'వేణీమూలే' అనే శ్లోకం వంటి విషయనిగరణకవిత్వం కాదూ?

అమర్త్య కిన్నెరసానిపాటలు చదువుతూండగా రామాయణంలో భగీరథునివెంట పరుగెత్తే గంగనడకలు జ్ఞాపకం వచ్చాయి.

విక్రమోర్వశీయంలో నదినీ - లతనూ పూర్వశిగా వూహించి పరవశుడయ్యే పురూరవుని వేదనమీదుగా ఈ కృష్ణపక్ష పద్యం ఎంత స్వాదుగా వచ్చింది.

"ఏడ జనిన మనోహారి జాడ లరసి
కలగు హృదయమ్ము నెమ్మది చలనమొందు".

వేదుల, నాయని, కృష్ణశాస్త్రి మొదలగువారి కరుణ ప్రణయకావ్యములను చదువుతూన్నప్పుడు భవభూతి కావ్యాలూ, పండితరాజు భామినీవిలాసం జ్ఞాపకంవస్తాయి. విశ్వనాథవారి కావ్యాలమీద అముక్తమాల్యద స్ఫురింపవచ్చు.

ఇప్పటి నవ్యసాహిత్య ప్రధానాంగములైనఖండకావ్యం, కథానిక, ఏకాంకనాటిక, అనేవి పూర్వం సాహిత్యశాస్త్రంలో చెప్పబడినవే; — కాని ఈక్లృప్త రసవద్రచనలు కొంతకాలం నశించిపోగా వాటిని నవకవులుద్ధరించారు. వేదకాలంనుంచీ ప్రవహించే కవితాస్రవంతి ఒకటే అయినా — ఒకొక్కచోట దానికి అపూర్వశోభ రావచ్చు; కనుకనే నవకవి—

"వేయిసంవత్సరాల్ వెనకాల కవినోయ్
వేయిసంవత్సరాల్ గడిచాక కవినోయ్
ఠిక్కనా తెలుగులా తీర్పునై నానోయ్
ఈనాటి పాటలో ఇమిడిపోయానోయ్"

అంటున్నాడు. కాబట్టి నేటి కాలపు కవిత్వం - కొందరన్నట్టు భాష రాని అపండితుల అర్థంలేని గోష్ఠి కాదనీ, కొందరన్నట్టు ఇది కేవలం పూర్వకవిత్వంతో సంబంధం లేకుండా, పూర్తిగా ఇప్పటివారి ప్రజ్ఞావిశేషంవల్ల సృష్టింపబడిన అపూర్వ సంస్థయున్నూ కాదనీ తోస్తుంది.

ఆ క లి

జంపన చంద్రశేఖరరావు

మూతలు వారు నేత్రముల మూల్గుచునున్నవి ప్రాణవాయువుల్;
చేతుల కందరాక, పరసీమల దాగిన అన్నపూర్ణ వి
ఖ్యాత కరాబ్జమందు కనగాబడ దించుక భిక్షమేని; మి
త్రా! తరియించు టెట్టులో! క్షుధామయ జీవకరాళయామినిన్.

కడుపున రేగు మంటలను కాలె పురా మలసీకృతౌఘముల్,
తడసిన లాభ మేమిటి – వృథా - ఉరరీకృత దాస్యశృంఖలల్
ముడివడు జీవితవ్యథల ముల్గుచు, తేలుచునుండు; కానిచో
గడచునె దేహయాత్ర ఘనకార్తిక చంద్ర కళాస్మితాధ్వమున్.

శశిభృన్మౌళి పదాబ్జరేఖల ఫలప్రస్థాప నైవేద్యముల్
ఒసగం జూతురె కాని, తీక్ష్ణకర ప్రత్యుత్థాపదావాగ్నులన్
వసివాళ్వారు దరిద్రజీవుల క్షుధాప్రాగ్భావ మార్వంగ లే
కిసిరో! భక్తుల మంచు పొంగెదరు సి గ్గేలాగు లేపోయెనో!

పూటకు తిండిలేక ఎటుపోయిన బ్రోచెడువారులేక, హ్రా
త్ప్రాటిత రాజ్యమందు పనిపాటు లోకింతయు గానలేక ఈ
పాటున డిందుమానవుల ప్రాణము గాచగలేక, ఏటికో
బూటక వెఱ్ఱిబోధనల ప్రొద్దులువుత్తురు క్రూరచిత్తులై.

బ్రతికి శల్యావశిష్టులై వసుధ తిరుగు
తోడి వారల కన్నెత్తి చూడకున్న,
చచ్చి, బూదియూ వారి ప్రసంగ మింక
మాసిపోవునటంచు నమ్మంగరాదా?

—'తమోగీతి'నుండి.

—

బువర్ణకము

వక్కలంక శ్రీనివాసరావు

బువర్ణకము ప్రాచీనకాలపు శాసనముల యం దెల్లయెడలను అమహదర్థక ప్రథమా విభక్తి ప్రత్యయముగ లిఖంపబడి యున్నట్లు తోచుచున్నది.

శ్రీ జయంతి రామయ్య పంతులుగారు తమ శాసనపద్యమంజరిలో నీ బువర్ణకమును, "ంబు, మ్ము, ము" ని అమహత్ప్రథమైకవచనపు పరిణామక్రమముగ జూపియున్నారు. బెజవాడ శాసనములో గొన్నియెడల 'ంబు'రూపములతో (మఠంబు, లింగంబు, ఫలంబు మున్నగు చోటులందు) ఛందోభంగ మగును గాన నట 'ంబు' నకు మాఱుగ 'ము' (మఠము, లింగము, ఫలము) అని చదువవలయునని శాసనపద్యమంజరిలో వారు వ్రాసిచ్చినారు.

'ఉ. ఫలం బుపేక్షించిన లింగం బతేసిన పాపమ్బుదమకు'

ఇట 'ంబు' అను దానిస్థానమున 'ము' చేర్చి చదువవలయు నని శ్రీ రామయ్య పంతులుగారి మతముగ దోచుచున్నది. పండరంగని యద్దంకిశాసనములోను, యుద్ధమల్లుని బెజవాడశాసనములోను "మఠంబు, ఫలంబు" మున్నగు వానికి బదులుగా "మఠబు, ఫలబు" మున్నగురీతిని బువర్ణకరూపము పలుతావులయందు గన్పట్టుచున్నది. దీనినిబట్టి పరికింపగా 'ంబు' అను తావున 'బు' అని చదువుటయె యుక్తము కాని, 'ము' అని చేర్చి చదువుట యుక్తము కాదని తోచక మానదు. ఇంతియకాక, యచట ఛందోభంగము లేదనియు, శాసనాక్షరలలోని ఇనేంద్రగణంబులు వేఱువిధము లనియు నెన్నుట సముచితము. "ఫలం బుపే" అను చోట బువర్ణమునకు ముందు సున్న శాసనప్రతిబింబములం దెందును గానరాదు. కాగా, ప్రాచీనకాలమున "ంబు" అను రూపమునకు మాఱుగా 'బు' అను రూపమె యెల్లెడలను నిలిచిన దనకతీరదు. దాన జేసియే నన్నపార్యుడు 'ము'కార యతిని సమ్మతింపని వాడయ్యును 'ము' విభక్తికయతి నంగీకరించి బువర్ణరూపముల నుపేక్షించెనని యూహింపనగును. కాగా బువర్ణకము నీక్రింది పరిణామరూపముగా జూపుట లెస్స యనవనగును.

అమహత్ప్రథమైకవచనము

|

మఠంబు

మఠబు	మఠమ్ము
	మఠము

(ఇట్లే లింగంబు, ఫలంబు మున్నగు రూపముల నెన్నునది.)

పయి నుదాహరించిన చోప్పున "మఠ" శబ్దమునకు "మఠంబు మఠబు, మఠమ్ము, మఠము" అనురూపము లున్నవనుట తెల్లము కదా. ఇందు "మఠంబు" అనునదియే మొదటి రూప మయినట్లును, అది మాఱి "మఠమ్ము" అయినట్లును, అది తేలిచి పలుకుటచేత మఠము

అని అయినట్లును తోచుచున్నది. పలుకు బడి యీవిధముగా మాఱినను, వ్రాతలో మాత్రము 'మఠంబు' అనియే కొంత కాలము మేరకు నిలిచియుండిన దన నగును.

"ఉ. సాగిదీర్చెఁ మఠంబు; అశ్వమేధంబు, ఫలంబు- ఇట్టితావుల 'మఠము, ఫలము' అని చదువుటయే యుక్తము. లేకున్న చో ఛందోభంగమగును."

—శాసనపద్యమంజరిపీఠిక.

శాసనపద్యమంజరిలోని ఈ పైవ్రాత సరికాజాలదు. ఏలయన బరికింపగా బెజవాడశాసనమునను, అద్దంకి తరువోజశాసనమునను "మఠంబు, మఠబు" అని "ంబు, బు" రూపములు రెండునుమాత్రమె ప్రయుక్తములయి యున్నవి. కాని యొక్క అహాదనకరశాసనమున మాత్రము (క్రీ. శ. ౭ - వ శతాబ్దిది) 'పట్టనబు-వక్రబు' — అను రూపములు, కలవు. 'మఠము' అనురీతి మువర్ణకరూపమొక్కటనైనను బ్రయుక్తముకాలేదు. పరిశీలింపగా (ఈవిధమునబట్టి చూచినచో) నాకాలమునాటికి (నన్నయకు బూర్వమున) మువర్ణకరూపము లేనేలేదనియు, నది యర్వాచీన మనియు, ప్రాచీనతమకాలమున 'బు' అను రూపమువఱకే పరిణామము గల్గెననియు స్పష్టమగుచున్నది. ఇక ఛందోవిషయమున ప్రాచీనములగు నిసేంద్రగణములు విజాతీయములని తెల్పియుండుటచే నంతగా లఘువు కావలసివచ్చుచో నట 'మఠబు' అని చదువవలె నని వ్రాయుట యుక్తమును నా కాలమున కర్హమును అయి యుండును గాన నిట "మఠము" అని చదువవలెనని శ్రీ. జ. రా. గారు వ్రాయుట యుక్తము కానేరదని మనవి.

బువర్ణక మిట్లు పయిరీతిని వెలసియుండుటచేతను, దీనినంగీకరింపక నన్నయ తన కాలమునకు దానిస్థానమున వచ్చిన 'ము'వర్ణకము నంగీకరించినవాడగుటచేతను 'ము' వర్ణక'ము'కారముతో నుత్వసహిత ప-ఫ-బ-భలకు యతిమైత్రిని నన్నయ గ్రహించినాడనుట సముచిత మనవలయును. నన్నయ తన గ్రంథమునం దెచ్చటను బువర్ణక ప్రయోగమును ప్రాసస్థానమున జూపి యుండలేదు. చింతామణియు నట్లు చెప్పలేదు. కాగా నన్నయసైతము యతిస్థానములందు 'వనబు' అనియే ప్రయోగించె ననియు, నతనికి మువిభక్తికయతి సమ్మతము కా దనియు నర్వాచీనులగు ఛందోలాక్షణికులు తమ కాలమునకు వెలసియున్న మువర్ణకమునె నన్నయ ప్రయుక్తమని తలచి యట్లు ముఃభక్తికయతి నుపదేశింపగా నది యిట్లుకలిగెననియు ననుట సముచితము. కాని నన్నయ భారతభాగమునం దెచ్చటను 'బు'వర్ణకము బకారప్రాసస్థానమున దొరకలేదు. కాని ంబు, మ్ము, ము — అను వర్ణకములుమాత్రమే వాని గ్రంథమున ప్రాసస్థానమున గన్పట్టుచున్నవి.

ఉ. చ. హిమకరుఁ దొట్టి పూరుభర
తేశకురుప్రభుపాండుభూపతుల్
క్రమమునఁ బంశకర్తలనఁ
గా మహిఁ బొల్చిన యస్మదీయవం
శమునఁ బ్రసిద్ధులై విపుల
సద్గుణశోభితులైనపాండవో
త్తములచరిత్ర నాకుఁ బరి
తంబు వినంగ నభీష్టమెమ్మెయిన్.

—భార. ఆది, ఆ. ౧, ప. ౧౮.

ఆ.కం. అంబాలికకును సుతర,
త్నాంబుధిపాండురవిరాజితాంగుఁడుప్రభవిం

చెం బాండురాజు సురువం,
⟵
శంబు ప్రతిష్ఠింప ధర్మపర్యజ్ఞుం డై.
—భార. ఆది, అ. ౪, ప. ౨౫౭.

౩. కం. అమ్మంత్రము దనదసుహృద,
యమ్మున నక్కన్య నిలిపి.........
—భార. ఆది, అ ౫. ప ౧౯౭.

చింతామణిలో "స్యా దమహాతాం విభక్తా సోశ్చ ము తదుపరి ముబూ ప్రాచామ్" అని 'ము, మ్ము, ంబు 'లు మాత్రమే చెప్ప బడియున్నవి; కాన నన్నయ బువర్ణకమును బ్రయోగించె నను యూహ విశ్వసనీయము కానేరదు. శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రులు గారు బసవపురాణ పీఠికలో ఖండబిందు పూర్వకముగా నీ బువర్ణకము (కొన్ని వ్రాత ప్రతులలో నున్న దని కావలయు) ఉన్నదని యభిప్రాయపడిరి (చూ. బసవపురా. పీఠిక, ౯౫ పుట).

వ ఱ ద

గుజ్జం వేంకట సుబ్రహ్మణ్యం

వఱద వచ్చినది పినాకినీ, రమణీయ
వర్ణన మది రమణి, పవిత్ర మని పెద్ద
లందు, రిల్లు వెడలి ర, మ్మయత్నలభ్య
ములు ప్రకృతివినోదమ్ములె గలవు మనకు.

క్రొత్తనీటిపై వెన్నెల కులుకు విధము
చూచి తీఱవలె; వలపుచౌకళ్ళఁగొన్న
చెలువల కనులవలె మిలమిలమని చిఱు
కెరటములమధ్యఁ జుక్కలు మెఱసిపోవు.

భారతీదేవివీణారవముగతి శ్రుతి
సుభగమౌ మర్మరధ్వని; సోలియున్న
యాత్మ లుత్ప్రేరితములగు నద్భుతముగ.

కాలవాహినిపై స్నేహాకలితజీవ
యుగళిక్రియ జంటజ్యోతుల మగువ మనము
గడలుకొలిపి వీక్షింతము గమనసరణి:
సవిధమున నున్న స్వామిని బ్రవిమలమతిఁ
గొల్చి మరలుకొందము రమ్ము కోర్కె లలర.

జగజ్జ్యోతి

మల్లాది అవధాని

ప్రస్తావన

సుగతుని నిర్వాణానంతరం ఆయనదంతాలను ఆయన భక్తులు భద్రంగా పదిలపరచారు. ఆదంతాలను పూజిస్తూ ఉండేవారు తన్మతావలంబకులు. వాటిని అధిష్ఠానదేవతలుగా భావిస్తూ పట్టణాలనుసైతం రాజులు నిర్మించారు. అటువంటి వాటిలో దంతపురి ఒకటి. ఇది కళింగానికి రాజధానిగా ఉండేది. దీనిరాజు గుహాశివుడు. ఇతడు బౌద్ధమతస్థుడు. అమూల్యమయిన సుగతుని దంతం యీయనదగ్గర ఉన్నది. దానికోసమని యుద్ధాలు అనేకంగా జరిగినవి. ఒకసారి ఉత్తరాది రాజులు కొందరు యీదంతాన్ని బలవంతంగా తీసుకుపోయేటందుకు గుహాశివునిపైకి దండెత్తి వచ్చారు. తనకు పరాజయం తప్పదని గ్రహించుకున్నవాడై గుహాశివుడు దంతరక్షణకుమాత్రం కంకణంకట్టుకున్నాడు. సుగతునిదంతంకోసమని తన ప్రాణాన్ని తృణప్రాయంగా చూశాడు. కూతురు హేమాచలను అల్లుడు దంతకుమారునీ పిలిచి రత్నపేటికలో భద్రపరచిన దంతాన్ని వారికి అప్పగించి దాన్ని సింహళద్వీపం తీసుకుపోయి మహాసేనునకు యిచ్చివెయ్యవలసిందని చెప్పి జడివానలో అర్ధరాత్రినే ఆయిద్దరినీ నావ ఎక్కించి పంపించాడు. ఈకథ క్రీ. శ. ౩౧౨ లో జరిగినదని చరిత్రకారులు వ్రాశారు.—దంతపురం ఏది అనే విషయంలో చరిత్రకారులలో అభిప్రాయభేదాలున్నవి. ఇప్పటి జగన్నాథాలయమున్నప్రదేశమే దంతపురమని శ్రీచిలుకూరి వీరభద్రరావుగారి అభిప్రాయం. కాని కళింగరాజ్యంలో ఉన్న శ్రీకాకుళానికి ౧౪ మైళ్లదూరంలో ముఖలింగక్షేత్రానికి వెళ్లే త్రోవలో దంతపురి అనే కుగ్రామం ఒకటి ఉన్నది. అక్కడనే దంతకోట శిథిలాలు ఉన్నవి. ఉన్నతమయిన దంతకోటప్రహారీ చెక్కుచెదరలేదు. ఆప్రహారీలోపల కొన్నిమైళ్ల వైశాల్యంగల భూమి ఉన్నది. ఆప్రదేశంలో ప్రస్తుతం వ్యవసాయం జరుగుతున్నది. దంతకోటశిథిలాలను నేను చూశాను. అక్కడ రైతులు 'ఇది దంతవక్రుండికోట' అంటారు. పూర్వగాథలతో పరిచయంగల నాయుడు 'ఇది బౌద్ధుల కోట. పూర్వం యిది గొప్పపట్నం. కళింగానికి రాజధాని' అంటాడు.]

[అర్ధరాత్రి. మందగించిన వెన్నెల. పైన చిన్న చిన్న మబ్బుతునకలు కూడుకుంటున్నవి. సముద్రతీరాన వజ్రాలదిన్నె అనే ప్రదేశం దగ్గర వడివడిగా పోతున్న నావ చటాల్న ఆగిపోయినది. సరంగులు ఎంత ప్రయత్నించినా అది కదలలేదు. నావలోనుంచి సరంగులు దిగారు.]

ఒకసరంగు — లాభం లేదు. నావ యిక కదలదు.

ఇంకొకడు — మనంతప్పుదారిలో నావను యీడ్చుకువచ్చాం.

మరొకడు — వెన్నెలయినా సరిగా లేదుగదా. ఎటుపోవడానికీ దారే కనబడదు.

వేరొకడు — ఈగుడ్డివెన్నెట్లో ఎటు నడిపించడానికీ దారీ తెన్నూ కనబడదు. పైన ఆకాశంలో మబ్బులు కూడుకుంటున్నై. మనం బయల్దేరినరాత్రి జడివాన—

మొదటివాడు — నాయనా! ఆరాత్రి వూసెత్తకు. నాగుండె కంప మెత్తగలదు. తుఫానుల్లోసైతం నావను ఎన్నోసార్లు నడిపించాను గాని ఆరాత్రి! అది ఏంరాత్రిరా తండ్రీ.

మూడోవాడు—మల్లాపెద్దవానా లేదు. ఉరుములూ లేవు. ఈదరగాలి చిటపటచినుకులు కళ్లలో పొడిచే మెరుపులబాధ.

నాలుగోవాడు — ఆ రాత్రి గాలిలో దెయ్యాలు సంగీతం తీస్తున్న ట్టనిపించింది నాకు.

మూడోవాడు — ఆరాత్రి దంతనగరంచుట్టూ పిశాచాలు గంతులువేస్తున్నాయా అనిపించింది నాకు.

రెండోవాడు — సముద్రతీరానికి ఆరాత్రి రాజు స్వయంగా వచ్చాడు. చీకటిలో నుంచున్నాడు. తోడుగా ఎవరూ లేరు. స్వయంగా కూతుర్నీ అల్లుణ్నీ యీనావలో ఎక్కించాడు. ఆయనకళ్లల్లో అప్పుడు మీరేంచూశారు ?

ఒకటోవాడు — నేనప్పు డాయనకళ్ల వంక చూడలేదు. ఆకాశంవంక చూశాను. ఆకాశంలో ఒక్కచుక్కయినా లేదు.

మూడోవాడు — నేను సముద్రంవంక చూస్తూవున్నాను. కెరటాలు హోరుహోరని ఏడుస్తూవున్నాయ్ ఆరాత్రి.

నాలుగోవాడు—తామ్రలిప్తిలో మనం బయలుదేరినా ఆరాత్రి తామ్రలిప్తి నాకంటికి దంతనగరమే అయిపోయింది. సముద్రుడు దంతను కబళించేస్తా డనిపించింది.

రెండోవాడు — హాహా! మీరెవరూ గమనించనే లేదూ? రాజుకళ్లలో తొణికిసలాడుతూ నీళ్లున్నాయ్.

నాలుగోవాడు—కూతురుమీద ఎంత ప్రేమ ఆయనకు.

రెండోవాడు — కూతురుమీద ప్రేమ గాదు. ఆయన పదేపదే 'జాగర్త! జాగర్త! పేటిక జాగర్త. దానికోసమనే నాశత్రువుల ఎదట నాప్రాణాలను బలివేస్తున్నా'నని పరమ రహస్యంగా ఆయన కూతురుతో అనడం నేను విన్నాను. అందుకే ఆయన కళ్లలో నీళ్లు.

ఒకటోవాడు—ఆపేటికలో ఏముంది?

రెండోవాడు—అది మనకు తెలీదు.

నాలుగోవాడు — బాతాఖానీలో బడి అసలుసంగతి మరిచిపోయినాం. ఈనావగతేంకాను? లోపల ప్రభువువారు—

రెండోవాడు — నిద్ర లేదు. అమ్మగారితో మాటాడుతున్నారు.

[దంతకుమారుడు నావలోనుంచి దిగాడు. నాలుగురాత్రులనుంచి నిద్రలేనికళ్లు. ఈయనవయస్సు యిరవై అయిదు. గంభీరమయిన వాక్కు.]

దంతకుమారుడు—ఏమర్రా! నావను కదపరేం?

ఒకసరంగు — ఈరాత్రికి మరిలాభం లేదు ప్రభో!

దంతకుమారుడు — ఏమంటున్నారు? తెల్లవారేవరకూ యీదిక్కుమాలిన ద్వీపంలో పడిగాపులు పడవలసిందేనా?

ఇంకోసరంగు — ఈప్రదేశం మంచిది కాదండి. సముద్రంలో ఎగుడు దిగుడు రాళ్లు చాలా ఉండే చోటిది. ఈరాత్రికి యిక్కడ గడిపేసి వేకువనే వెళ్లిపోదామండి.

మరోసరంగు — వెన్నెలయినా సరిగా లేదు ప్రభో!

దంతకుమారుడు — నావలో కాగడాలున్నాయ్ కావర్రా?

ఒకసరంగు — కాగడా వెల్తురు నీళ్ల మీద పడి మెరుస్తుంది. ప్రక్కల ఏముందో దానివల్ల తెల్సుకోవచ్చును గాని ముందు ఏరాతిబండ వుందో ఎల్లాగ తెలుస్తుంది? ప్రభో!

దంతకుమారుడు — [చిరాకుతో] ఈ పాడుతోవను నావను ఎందుకు తెచ్చార్రా మతిమాలినదద్దమ్మలారా! ఈరాత్రి వానగూడా పడుతుందిగాబోల్నే. ఇక మన అవస్థ అడగనక్కర్లేదు.

[నావలోనుంచి హేమాచల దిగి వచ్చింది. వయస్సు యిరవై సంవత్సరాలు. చేతులో రత్నపేటిక ఉన్నది.]

హేమాచల — [భర్తతో] ఎందుకు కేకలు వేస్తున్నారు?

దంతకుమారుడు — ఎందుకేమిటి? చూడు యీగుడ్డి దద్దమ్మలు నావను అడ్డదిడ్డంగా నడిపించి కొనకు యీ అధ్వాన్నపుదీవి దగ్గర పారేశారు. తెల్లారే వరకూ మనం యీ బండరాళ్లపైని జాగరం చెయ్యాలట.

సరంగులు — క్షమించండిప్రభో! వేగుచుక్క పొడవగానే నావను తరలించుకుపోతాం.—

దంతకుమారుడు — నోళ్లు మూసుకోండి. ఇంకా మాటాడతారు?

హేమాచల — [చిరునవ్వుతో] అయితే అంతకోపమెందుకు చెప్పండి. వాళ్లు మాత్రం తెలిసి చేశారా? ఇంకోగడియలో తెల్లవారుతుంది. పోదాం

దంతకుమారుడు — [చిరాకుతో] పోదాం. పోదాం. ఇంకోవారంనాటికి సింహళం చేరుకుంటే మనం అదృష్టవంతులమే. లేక యీలోగానే ఏతుపానయినా మన నావను కడుపున పెట్టుకుంటే ఏబాధాలేకుండా పోతుంది.

హేమాచల — ఎన్నటికీ కాదు. పైన తథాగతుడున్నాడు. దయామయుడున్నాడు. ఆయన కార్యానికి అంతరాయం ఎన్నడూ కలగదు. దేవతలు ఆయనపరిచారకులు. వాళ్లు మన కేఆపదా రానియ్యరు. ఈమాట నాన్నగారు తామ్రలిప్తిలో మనతో చెప్ప లేదా?

దంతకుమారుడు — మీ నాన్నగారు చెప్పినమాట లన్నీ నేను జ్ఞాపకం పెట్టుకుని కూచున్నా ననుకున్నావా?

[పరంసలు దూరదూరంగా వెళ్లిపోతున్నారు.]

హేమాచల — ఎందు కంతచిరాకు ?

దంతకుమారుడు — మన కెందుకు వచ్చిన అవస్థ యిది?

హేమాచల — ఇది అవస్థా ?

దంతకుమారుడు — కాకుంటే ?

హేమాచల—రాత్రులు నిద్రలేకండా భోజనంలేకండా నావలో బడి ప్రయాణం చేస్తూ కాగడాల వెలుగులు నీళ్లలోపడి మెరుస్తుండగా పరమదయాళుడయిన తథాగతుని పవిత్రకార్యం నెరవేరుస్తున్నామనే ఆనందంతో మీ హృదయం తుళ్లిపడుతూ వుండడంలేదా ?

దంతకుమారుడు — నా హృదయం ఆకలితో, నిద్రతో, ఎందుకని తెచ్చుకున్న బెడద యిదంతా అనే దిగులుతో క్రుంగిపోతూంది.

హేమాచల — ఈమాటలు మీ రన వలసినవేనా ?

దంతకుమారుడు — కనకనే అంటున్నాను. ఏమిటీ చాదస్తం ఒకదంతంముక్కకోసమని? —

హేమాచల — [చెవులు మూసుకున్నది.]

దంతకుమారుడు — బుద్ధుడు మహాత్ముడు కావచ్చును. కాని నిర్యాణ మయిపోయిన అతడి దంతంముక్కకోసమని అనవసరంగా నీతండ్రికి యీ యుద్ధాలేమిటి ? ఎవరో మూర్ఖులు ఆదంతం కావాలని అడిగారనుకో. అడిగితే వారికి పారెయ్యరాదూ ? లేదు. దానికోసమని పదిమంది రాజులతో నొక్కడూ యుద్ధంచేసి తన దేశాన్నిప్రజనీ నాశనంచేసి తన ప్రాణాలను తథాగతుని స్మృతికై బలివేస్తాడట. ఎందు కిదంతా ఒక దంతంముక్కకోసం. ఆదంతాన్ని తీసుకుపోయి సింహళంలో వున్న మహాసేనుడికి యిచ్చిరమ్మని మనను పంపించడమెందుకు ?

హేమాచల — తథాగత! తథాగత! ఎటువంటి మాటలు వినవలసివచ్చింది! [ఏడుస్తూ] ఈమాటలన్నీ మీరేనా అంటున్నది? రోజూ యిరవైనాలుగుగంటలూ సర్వజ్ఞుని స్మరణలో కన్నీరు కార్చేమీరేనా ఈమాటలను అంటున్నది?

దంతకుమారుడు — [క్షణం మౌనం] క్షమించు హేమా! ఈ రాత్రి నాలో మారుడు ప్రవేశించి నన్ను మాటాడించుతున్నాడు. నాకు బుద్ధి నశించింది. నిద్రాపిశాచిని మాంత్రికుడు మారుడు నామీదకు విడిచి పెట్టాడు.

హేమాచల — మీరు నిద్రబోతారా ? మరియీపేటిక ? ఇందులో అమూల్యం పరమపవిత్రం దివ్యం పూజ్యం జగజ్జ్యోతి సుగతునిదంతం వున్నదికదా ! దీనిరక్షణభారం మనది. మరచిపోకండేం.

దంతకుమారుడు — నిద్రపోను. కాని నేను నిద్రపోవడమే మంచిది. నామనస్సు నాశరీరానికి అధీనమై తథాగతుని నిందిస్తూ వుంది గనక నేను నిద్రపోవడమే మంచిది.

హేమాచల — ఈ చెట్టునీడలో యిసుకలో క్షణం విశ్రమించండి !

[ఇద్దరూ యిసుకలో కూచున్నారు]

హేమాచల — దంతనగరం శత్రువుల క్రౌర్యానికి ఆహుతి అయిపోవక మానదు.

మళ్లా నేను నాన్నగారిముఖం చూడగలుగుతానా?

దంతకుమారుడు — బహుశః ఆ అవకాశం మనకు కలగదు. దంతపతనానికి పూర్వమే మీతండ్రి ప్రాణం విడిచిపెట్టుతాడనుకుంటాను.

హేమాచల — తథాగతుని కోసమని ప్రాణం అర్పించడం ఎంత ఆహ్లాదకరంగా వుంటుంది.

దంతకుమారుడు — అవునవును.

హేమాచల — సింహళద్వీపం మనం చేరేసరికి ఎన్నాళ్లు పట్టుతుంది?

దంతకుమారుడు — [మనగతలో] అవును.

హేమాచల — మహాసేనుడు దంతంమైని చైత్యం నిర్మిస్తాడనుకుంటాను.

దంతకుమారుడు — ఆఁ.

హేమాచల — ఆకాశమంతా మబ్బులు. ఈప్రదేశమంతా తీగెలల్లుకున్న చెట్లతో నల్లగా ఉంది. అంతటా చీకటి. సరంగులు ఎక్కడికి పోయారో. వాళ్ల అలికిడి అయినా లేదు. ఇదుగో మీరు అప్పుడే నిద్రపోతున్నారా? ఇదంతా ఆమారుడి మాయ. నాకూ నిద్రవస్తూంది.

[రత్న పేటిక తెరిచి లోనుంచి దంతము తీసి కళ్లకు అద్దుకుని తన జడలో దంతాన్ని దాచి రత్న పేటికను యిసుకలో ఉంచినది.]

దొంగలు వస్తే యీరత్నపేటికను పట్టుకపోతారు. కాని పవిత్రదంతం దీన్ని భద్రంగా నావేణిలో దాచుకుంటాను. నాహృదయాన్ని తెరిచే సాధనం వుంటే యెంతబాగా వుండును. అందులో దంతాన్ని వుంతునుగదా! ఈద్వీపంలో పక్షులయినా వున్నట్టులేదే; దొంగ లెక్కడనుంచి వస్తారు? మారుడు క్రూరుడు [ఆలోచిస్తూ నిద్రపోయింది.]

[చెట్లచాటునుండి నాగరాజూ నాగరాణీ అక్కడకు వచ్చారు. పట్టుబట్టలు కట్టుకున్నారు. వజ్రాలభూషలు ధరించారు. వాళ్ల తలలమీద కోహినూరును ధిక్కరించే వజ్రాలు మెరుస్తూ ఉన్నవి. నాగరికతగల జాతి నాగజాతి అనివాళ్ల ఆకృతులే తెలియ చేస్తున్నవి.]

నాగరాజు — ఎవరో ప్రయాణికులు పాపం దారి తప్పి మన ప్రజాల దిన్నెకు వచ్చారు.

నాగరాణి — దారితప్పి వచ్చివుండరు. వజ్రసంపదను దొంగతనంగా తీసుకుపోయేందుకనే నావ చేసుకునిగూడా వచ్చిన విదేశీయులు వీళ్లు.

నాగరాజు — వీళ్లు విదేశీయులుకారు. మొహాలు చూడు. దుస్తులు చూడు. మోసబుద్ధిగలవాళ్లు అంత నిశ్చింతగా నిద్రపోగలరనా నీవూహ?

నాగరాణి — భార్యాభర్తలు వీ ళ్లిద్దరూ అగపడుతున్నారు. అక్కడ లంగరు దించిన నావ వుంది. మరి సరంగులు?

నాగరాజు — వా ళ్లిం కెక్కడ తిరుగుతున్నారో?

నాగరాణి — మన నిశావిహారప్రదేశాల్లో జొరబడినవాళ్లని శిక్షించే ఆచారం ఒకటి వున్నదని మీరు మరచారా?

నాగరాజు — మనశాసనాలు మన ప్రజలకేగాని యితరులకు కాదు. ఈ ప్రయా

ణికులు పడుకుందుకు సౌకర్యాలులేక యిసుకలో పండుకున్నారు. వీళ్లను మననగరుకి ఆహ్వానింతామా ?

నాగరాణి — మీవాళకం నేను గమనిస్తూనేవున్నాను. వచ్చిన దగ్గరనుంచి ఆ అమ్మాయిమొహంవైపే చూస్తున్నారు.

నాగరాజు — [నవ్వి] కవులు యీర్ష్య పురుషుడిలో వున్న దుర్గుణమని కల్లలు రాస్తారుగాని నిజానికి అది స్త్రీలసొత్తు.

నాగరాణి — కల్లిబొల్లిమాటలు చెప్పి నన్ను మోసగించబోకండి! మీరా పిల్లవంక చూడ లేదూ ?

నాగరాజు — చూశాను. లేదని అబద్ధం ఆడవలసిన అవసర మేముంది ?

నాగరాణి — అవును. అదే నేను అంటున్నాను. ఆపిల్లమీద మనసు —

నాగరాజు — చాలించు! నాగరికత గల మనిషి అనరాని మాటలు అంటున్నావు. చూసినంత మాత్రాన వచ్చినప్రమాద మేమిటి ? నాచూపులో ఉన్నదోష మేమిటి ? ఆపిల్ల వయస్సునుబట్టి నాకు కుమార్తెగా వుండతగ్గ దని గ్రహించ లేకపోతివా ?

నాగరాణి — మనసుకి వయసుతో పని లేదు.

నాగరాజు — పోదాం పద యిక్కడనుంచి. మనమాటలుగాని వీరు వింటిరాయనా మనను బర్బరులని వీళ్లు తప్పకుండా పిలుస్తారు.

నాగరాణి — తొందరెందుకు ? ఉండండి. నేను ఒక్కమాట అంటాను కోపగించరుగద !

నాగరాజు — అంటే కోపం తెప్పించే మాట లంటా నంటావు ?

నాగరాణి — అది కాదండీ. నిద్రపోతూవుంది ఆ అమ్మాయి.

నాగరాజు—అవును. అయితే ?

నాగరాణి—ఆపిల్లజడవైపు చూడండి.

నాగరాజు — జడ బాగానే వుంది.

నాగరాణి — మిమ్మల్ని వర్ణించమని నేను చెప్పడంలేదు.

నాగరాజు — అయితే నీ ప్రశ్నపరంపరలకు నే నేం జవాబులు చెప్పాలి ?

నాగరాణి — ఆ పిల్ల జడలో వున్న పువ్వు చూశారా ? తెల్లగా చందమామ మాదిరిగా మెరుస్తూంది.

నాగరాజు — అది పువ్వు గాదనుకుంటాను. బహుశః అదొక వజ్రం కావచ్చును.

నాగరాణి — ఆవజ్రం నాకు కావాలి.

నాగరాజు — కావాలీ ? కావలిస్తే ఎల్లాగ వస్తుంది ?

నాగరాణి — మీరు తెస్తే వస్తుంది.

నాగరాజు — నేను అటువంటి వజ్రాన్ని తేగలనుగాని దాన్నే ఎల్లాగ తెస్తాను?

నాగరాణి — అదే నాకు కావాలి. తెస్తారా లేదా ?

నాగరాజు — వజ్రాలదిన్నె రాణినోట రావలసిన మాటలేకాబోలు నవి.

నాగరాణి — ముందు చెప్పండి!

నాగరాజు — వజ్రాలకు నీకేం కొదవ? ప్రపంచంలో వజ్రాలదిన్నెలో లేని వజ్రాలుంట వనుకోను.

నాగరాణి — పోనియ్యండి తీసుకు రారుగదా ?

నాగరాజు — ఎల్లాగ తీసుకువచ్చేది ?

నాగరాణి — ఆపిల్లా ఆ అబ్బాయీ నిద్రపోతున్నారుగా !

నాగరాజు — అయితే నన్ను దొంగ తనం చెయ్యమంటావా ?

నాగరాణి — దొంగతనం చెయ్యమన లేదే. మెల్లగా ఆపిల్ల నిద్రలేవకుండా జడ లోనుంచి ఆవజ్రం తీసుకురమ్మంటున్నాను.

నాగరాజు — మెల్లగా తీసుకురావడ మంటే దొంగతనంకాదూ ? వజ్రాలదిన్నె అధిపతి నాగరాజు చౌర్యం చెయ్యవలసిన అవసరం ఏం వచ్చింది ?

నాగరాణి — చూడండీ ! ఆవజ్రం ఎల్లాగ మెరుస్తూంది. అటువంటి వజ్రం యీ వజ్రాల దిన్నెలో నే నెన్నడూ చూడలేదు.

నాగరాజు — నిజమే. ఇందాకను మన వజ్రసంపదను తీసుకోవడానికి వచ్చిన తస్కరులు గనకవారిని బంధిస్తామన్నావే! నేనే ఆపని చేస్తే ?

నాగరాణి — మిమ్మల్ని బంధించే దెవడు ?

నాగరాజు — [ఆకసంవంక చూసి] అక్కడ యీనాగరాజుకు రాజయిన రాజరాజొక డున్నాడు వాడు.

నాగరాణి — [వికవిక నవ్వి] చాల్లే వేదాంతం. తీసుకురండి.

నాగరాజు — నాచాత కాదు.

నాగరాణి — కాదూ ?

నాగరాజు — కాదనే చెపుతున్నాను.

నాగరాణి — [కోపంతో చరచర నడుస్తున్నది.]

నాగరాజు — [చేయి పట్టుకొని నిలిపి] ఎక్కడికి కాపరుగు ?

నాగరాణి — సముద్రంలోబడి చస్తాను. ఇం కెందుకీ బతుకు ?

నాగరాజు — నువ్వు చావకు మానసికంగా నేనే చస్తాను.

[జిల్లి హేమాచలజడలోని దంతం తీసుకు వచ్చాడు.]

నాగరాజు — నావొళ్లు వొణుకుతూ వుంది.

నాగరాణి — ఎంత బాగా వుందో.

నాగరాజు — ఇది వజ్రంకాదు !

నాగరాణి — పదండిపోదాం !

[గాలిలోనుంచి 'ఆగండి ! ఆగండి!' అని శబ్దం వినబడ్డది. తరవాత ఆక్కడికి దేవత అయిన గిరిబాల వచ్చింది. ఆమెకు చక్కని రెక్కలు రెం డున్నవి.]

గిరిబాల — [చిరునవ్వుతో] ఆగండి ! ఆగండి ! తోడిదొంగల్లారా! ఎక్కడకు వెళ్లిపోతారు మాహేమాచల ఆభరణం తస్కరించి ?

నాగరాణి — [గిరిబాలతో] నువ్వు ఆయనవైపు చూసి నవ్వుతున్నావు !

గిరిబాల — [నవ్వుతూ] అవును నవ్వుతున్నాను. నాగరాజా ! ఈనాటికి నువ్వు దొంగవయినావా ?

నాగరాణి — [భర్తతో] ఏమిటీ ప్రణయభాగవతం ?

నాగరాజు — ప్రణయం కాదు; నా అంతరాత్మలో ప్రళయం. నన్ను పాతాళానికి త్రోశావు నువ్వు. నా ఎదట్నుంచి పో!

నాగరాణి — నేను పోవాలి! నేను పోవాలి! [రోషంతో ఈర్ష్యతో ఈ అమ్మాయిని చూడగానే నేను పోవాలిగదూ? సరే పోతాను. ఇంకెందుకూ.!

[రోషంతో చరచర వెళ్లిపోయింది.]

నాగరాజు — [తల వంచుకొని దంతాన్ని గిరిబాల చేతులో వుంచి] నన్ను క్షమించండి. నువ్వు ఆమె దశదిశలూ రాజరాజూ అంతా నన్ను క్షమించండి; స్త్రీమాయలో బడి యీ అపరాధం చేశాను.

గిరిబాల — [నవ్వుతూ] ఇది మారుడి మాయ. మారుని వింటినారి స్రోత స్త్రీ. ఆ శబ్దం వినగానే పురుషుడు గంతులువేస్తాడు. సకల ప్రలోభాలకూ మూలం మారునివింటి నారి స్రోత. తథాగతుడే పతితుల నుద్ధరించ గలిగినవాడు.

నాగరాజు — రాణి ఎక్కడకు పోయిందో. సముద్రంలో పడ లేదుగద. వెతుకుతాను.

[వెళ్లి పోయినాడు.]

గిరిబాల — [వికావిక నవ్వుతూ] మారుని జాలం నారీరత్నం. నారీద్వారా పురుషునిపతనం.

[నిద్రిస్తున్న హేమాచల దగ్గరకు వచ్చి]

పావని! ఇదుగో జగజ్జ్యోతి. దీనిని తస్కరించగలిగినవా డెవడు? నేనా? హిమాలయాల్లోనుంచి ఎగురుకుంటూ వచ్చాను. సుగతుని దంతం జగజ్జ్యోతి. అమృతవాక్యాలను నిర్వాణపథాన్ని ఆ దంతకాంతులే ప్రపంచానికి చూపుతూ ఉన్నాయ్. దాన్ని తస్కరించ గలవాడెవడూ లేడు. ఆ కాంతిని మాటుపరచ గల చీకటు లేవీ లేవు. సుగతుని దంతానికి జయం! జయం!

[దంతాన్ని హేమాచల జవలో యథాప్రకారంగా ఉంచినది. తరవాత రెక్కలు రెపరెప చప్పుడు చేస్తూ గిరిబాల ఎగిరిపోయినది.—

హేమాచల దంతకుమారుడూ ఒక్కసారి లేచారు.]

దంతకుమారుడు — ఎంత చక్కటి కల! దంతాన్ని ఎవరో దొంగిలించినట్టూ దేవకన్యక—

హేమాచల — మీరూ చూశారా? అది కల కాదు యథార్థం. సుగతుని కరుణ.

[జవలోనుంచి దంతాన్ని తీసి దాన్ని కళ్లకు అద్దుకుంటూ]

మారజేత! సుగత! జయ జయ!

[తెల్లవారింది. హేమాచల దంతకుమారుడు నావలో కూచున్నారు. వరంగులు వచ్చారు. వాళ్లూ నావ చేరినారు. లంగరు తీసివేశారు. సముద్రంలో నావ వెళ్లిపోతున్నది. వెళ్లిపోతున్న నావలోనుంచి హేమాచలగీతం వినబడుతూ ఉన్నది. దూరాన సాగరాంచలంలో సూర్యోదయం అవుతూ ఉన్నది.]

[హేమాచలగీతిక]

జయతు! అనురవిమలకాంతి!
జయతు! సుగతదంతకాంతి!

కుంభవర్షము

ఇనుమూర్తి బసవరాజు

మొగలిరేకులమించు సొబగైనకండ్లలో
మేఘాలు వెలసినవి
వర్షాలు కురిసినవి
కంటిసీళులై కారు
మబ్బులై మొనసినవి.

జ్యోతులై వెలిగినవి
మెరపులై మెరసినవి
ఖ్యాతి గాంచినయతుల
నీతిబోధన లన్ని

మేఘుడే నగడెను
వాయువే కదలెను
గాలి మబ్బులు కలసి
జగములే సడలెను.

నేత్రాలనూతిలో
నమరియున్నట్టియొక
చెలమయే కలగెను
నీళులే మలగెను

శతసోదరాగ్రజుడు
సాధ్విశ్రీద్రౌపది
వలువ విడ మరచునపు
డాసుదతినేత్రాల......

జమీందారీరైతు విమోచనము:
ప్రకాశం రిపోర్టు

గా. హరి సర్వోత్తమరావు

[ప్రకాశం కమిటీవారు శాసనసభలతీర్మానాల ననుసరించి ౧౯౩౮ సెప్టెంబరులో ఏర్పడిరి. వీరు విమర్శించ వలసినవిషయాలు ఆ తీర్మానాలలో వర్ణించినవి. అవి ఏవంటే, (1) న్యాయశాస్త్రరీత్యా ల్యాండుహోల్డరులకూ రైతులభాగల సంబంధము, (2) శిస్తురేటులు, ముజరా, (3) సర్వే, రికార్డు అఫ్ రైట్సు (నీటివాడ్కలతో కూడ), 'న్యాయమైనశిస్తు' నిర్ణయము, (4) శిస్తుగాక రైతులనుండి చేసే యితరవసూళ్లు, (5) తమ వ్యవసాయమునకు గృహోపయోగమునకు స్థానికమైన స్వభావజనితవస్తువులను రైతులు వినియోగించడము, (6) నీటివసతుల రక్షణ. కమిటీవారు ప్రశ్నావళిని సిద్ధముచేసి అందరికీ పంపిరి. ౬౦౦ మెమోరాండాలు అందుమీద కమిటీకి చేరినవి. కమిటీవారు విశాఖపట్టణము, రాజమండ్రి, తిరుచునాపల్లి, మధుర, మద్రాసులలో ౧౯౩౯ ఏప్రిల్ 30-వ తేదీలోపల వేరువేరు తేదీలలో సమావేశమయి ౩౫౮ మంది సాక్షులను విచారించిరి. తరువాత జిల్లాలనుంచి కలెక్టరుల రిపోర్టులు తెప్పించిరి. ౫౨౨ రికార్డుఫైళ్లు పరిశీలించిరి. తమలో తాము తొమ్మిదిదినములు చిత్తురిపోర్టు విమర్శించి రిపోర్టు వ్రాసిరి. రిపోర్టునుండి భేదపడుతూ తొమ్మండుగురు సభ్యులలో నలుగురు—శ్రీమిర్జాపురము జమీందారు, శ్రీ బి. నారాయణస్వామినాయుడు, శ్రీమహబూబ్ అలీ బేగు, శ్రీ ఏ. రంగస్వామి అయ్యంగారు — వేరుగా వ్యాఖ్యానములు వ్రాసిరి. దీనికి సంబంధించిన రికార్డు ౧౮ సంపుటాలయినది. మొదటిసంపుటము అసలు రిపోర్టు. ఇందులోనే చిత్తుచట్టము (బిల్లు) చేర్చినారు. సాక్ష్యము ౪ సంపుటాలు. అందులో కడాపటిదాంట్లో తెలుగు అరవాలలో ఇచ్చిన వాఙ్మూలాలు ఇంగ్లీషులోనికి తర్జుమాచేసినారు. ఇవిగాక రిపోర్టునకు అనుబంధాలుగా ౨౬ శాసనముల క్రింద ౬౮ ఉల్లేఖనా లిచ్చినారు.

ఈ రిపోర్టు విషయమయి మద్రాసు అసెంబ్లీలోను కౌన్సిల్ లోను వారమునకు పైబడి విమర్శ జరిగినది: తుదకు ఈ రిపోర్టు ననుసరించి బిల్లు పెట్టవలసినదని గవర్నమెంటును కోరినారు.

ఈ సంఘానికి రివిన్యూమంత్రి గా. శ్రీ టం. ప్రకాశం - అధ్యక్షుడు, శ్రీ టి. విశ్వనాథం, పార్లమెంటరీ సెక్రటరీ - కార్యదర్శి. ఇదివరలో పేర్కొనినవారు గాక ఎం. ఎల్. ఏలు శ్రీ ఎం. పల్లంరాజు, శ్రీ పి. ఎస్. కుమారరాజా, శ్రీ బి. వెంకటాచలం పిళ్లెలును, ఎం. ఎల్. సీలు, శ్రీ పి. వి. భోగయ్యపంతులు, శ్రీ బి. నారాయణస్వామినాయడులును సభ్యులు.]

పంచాయతుల ప్రాబల్యము

అనాదికాలంగా మనదేశములో గ్రామములలో సమిష్టిజీవనము బాగా జరుగుతూవచ్చిందనడానికి అనుమానమే లేదు. గ్రామమునందలి పరిపాలనకార్యాలు పంచాయతులు, అటువంటి యితర గ్రామసంఘాలు, తీర్చుకొంటుండేవి. దేశంలో రాజ్యాలేలుకొంటున్నా మనుకొనే ప్రభుత్వాలవారు గ్రామసమూహముమీద పన్నులు వసూలుచేసుకోవడముతప్ప ఎక్కువ జోక్యము కల్పించుకోడము కానరాదు. అందుచేత పంచాయతులు బలీయంగా ఉన్నంతకాలము ప్రభుత్వము పన్నులు వసూలుచేసుకోడముకూడ కష్టముగా ఉండియుండదు. ప్రభుత్వాలపేరుపెట్టి ప్రజలను అపారమైన బాధల పాలు చేయడము సంభవించియుండదు.

కాని మొగలుసామ్రాజ్యపతనమప్పటికే పంచాయతిబలము కొంత తగ్గినది. మహారాష్ట్రుల స్వంతపరిపాలనయందున్న ప్రాంతాలలోమాత్రము పంచాయతులు మంచిస్థితిలో నున్నట్లు తోచును. ఎట్లైతే నేమి, కంపిణీప్రభుత్వ మేర్పడేనాటికి మొగలుబలము కృశించినది, మహారాష్ట్రబలమును కృశించినది.

కంపిణీవారికి కావలసిం దేమి?

కంపిణీవారు విదేశీయులు. వారికి కావలసినది అర్థము. మన గ్రామాల సౌభాగ్యముతోడన వారి కెందుకు? అందుకోసము వారేప్రాంతానికాప్రాంతములో వేలముపాటలు పెట్టి ఎక్కువవసూలు ఎవరిస్తామంటే వారికి పన్నులవసూళ్లు అమ్ముకోడము నీతిచేసుకొన్నారు. వసూళ్లు చేసే దలాలీలుకూడ మారుతూ రావడం సంభవించింది. కంపిణీప్రభుత్వానికి ముందునుంచీ ఉన్నవాళ్లు, కంపిణీప్రభుత్వానికి యుద్ధములోనో పరిపాలనలోనో సహాయముచేసి పదవులు సంపాదించినవాళ్లు, ప్రభువులైనవాళ్లు కొందరు కొందరు అక్కడక్కడ ఉండకపోలేదు. ఏజాడో ౧౫౬౫ లో ప్రతిథ పోగొట్టుకొనిన విజయనగరసామ్రాజ్యపు సంతతివారే నేటివరకు పేరుకు నిలిచియుండగా పర్మనెంటు సెటిల్మెంటునాటికి నూరేండ్లచరిత్రవారు, ౨౦౦-౩౦౦ ఏండ్లచరిత్రవారు ఉండకపోలేదు. కాని కంపిణీ ప్రభుత్వమును చలాయించిన సాహసికు లీపెత్తనాలను తమకు లాభాలు సమకూరినంతసేపే నిలవబెట్టినారు. నిజముగా కంపిణీ ప్రభుత్వకాలము మనదేశానికి అరాజకకాలమని వర్ణించడానికి వీలున్నా వీలులేకపోయినా అది అభాగ్యపుకాల మనిమాత్రము వర్ణింపకతప్పదు. ఆకాలములో రైతులు పడినబాధలు పాశ్చాత్యచరిత్రకారులు వర్ణించి వర్ణించి వాపోయినారు. ఎప్పుడేనిమిషములో తనకంట్రాక్టు ఊడిపోతుందో అనేభీతితో ఉండే పన్నువసూలుదారుడు ఎంత త్వరగా తాను లక్షాధీశ్వరుడు కోటీశ్వరుడు కాగలడో ఆలోచిస్తాడే గాని రైతుబాగోగులు, మేలుకీళ్లు, లాభాలాభాలు, చావుబతుకులు అతని కెందుకు? ఆకారణముచేత ౧౯-వ శతాబ్ద మారంభమయ్యేటప్పటికి దేశమంతటా హాహాకారాలు పుట్టిపోయి, కొన్నికొన్నిచోట్ల రయితులు తమపైబడిన దురవస్థలు సహింపలేక ఊళ్లు ఊళ్లే వదలిపెట్టి తరలిపోవడ మారంభించినారు. ౧౮౦౦ సంవత్సరానికి ముందు జమీందారు లనుకొన్నవారు బ్రిటిషు కంపిణీప్రభుత్వానికి ఏజెంట్లుగా పనిచేస్తూ కల్పించినస్థితి యిది. ఆ దుండగాలను ఫిఫ్తురిపోర్టు, సర్ హ్యూట్ కమిటీరిపోర్టు వగైరాలనుండి సంక్షేపపరచి ౩౬ చార్జీలక్రింద ప్రకాశంకమిటీవారు వ్రాసినారు. అందులో కొన్ని యిచ్చట వివరింపదగును.

౧౮౦౦ కు ముందుస్థితి

(౧) జమీందారులు దురాశాపరులు, సోమరిపోతులు అయిపోయి తాము రైతులను గుత్తదారులచేతులలోనికి అమ్మివేసిరి.

(౨) ప్రజలహక్కులనుగురించి జమీందారులు ఆలోచించక తప్పిపోవడముచేత వ్యవసాయము ఇష్టముతో చేసే వృత్తిగాక కక్కుర్తిపడిచేసే ఆవశ్యకంక్రింద ఏర్పడెను.

(౩) ప్రక్కలలో ఉండే అడవులు చాల ప్రాణాపాయకరంగానూ, ప్రక్క దేశాల మేల్మిగల అధికారం లేకపోవడంచేతను రైతులు వ్యవసాయము బొత్తిగా మానుకోలేదుగాని లేకపోతే మానుకొనియుందురు.

(౪) రాజుల బొక్కసాలను రైతులు నింపుతూ ఉండిరిగాని భూమి బాగుపరచుకోడానికి కాసుపీసము

ద్రవ్యసహాయముగాని ఇతరసంరక్షణగాని జమీందారు నుండి జరిగినదికాదు.

(౨౬) గ్రామకరణాలు, సుత్తదారుల నౌకరులు, బంట్లుఅయిపోయిరి.

(౨౭) రైతులకు జరిగిన అక్రమాలు అన్యాయాలు విచారించే అధికారులు సుత్తదారులే అయిపోయిరి.

(౨౮) మొఖాసాలనీ, మాన్యములనీ, చరాస్తులనీ భూమి అన్యాక్రాంతము అగుచుండినది.

(౨౯) రు.౫౦,౦౦౦ల జమాబంది జరిగితే పదవ వంతు జమీందారులకు శేరీక్రింద సంక్రమించేది; అంటే రు ౫౦ లు.

(౩౦) ఇంకొక నూటికి ౧౨ చొప్పున తమకు తమనౌకరులకు రుసుములని ఏర్పరచి రు ౮౫,౦౦౦ లు వసూలుచేసేవారు.

(౩౧) వివిధవాణిజ్యాలవల్ల మారకంలో తమకు నష్టము కలుగుచుండని నూటికి ౩ చొప్పున బత్తాలు తీసుకొనేవారు.

(౩౨) అన్ని అక్రమపు వసూళ్లు లెక్కవేస్తే, జమీందారీ శేరీగాక, ౫౦ లక్షల జమాబందిమీద రు ౫,౪౦,౦౦౦ మొత్తమయ్యేది. శేరీతోకూడ రు ౧౦,౪౦,౦౦౦ లయ్యేది.

బుజ్జగింపు మాటలు

జమీందారుల కార్యనిర్వహణ యీ రీతిగా ఉండింది. చాలా ప్రాతకాలంనుంచి ఉన్నవారు కొంతమంది ఉండడము, క్రొత్తగా ఏర్పడినవారైనా ఈ విధముగా కొల్లలుగొట్టి బలవంతు లయియుండడం, తమకు బాకీలుపడిన సొమ్ము చెల్లకపోవడము, ఈస్టు ఇండియాకంపెనీవారు వీరి నెవ్వరిని కదిపినా తమమీద తిరుగుబాటులు, పితూరీలు జరుగుతవనే భయము ఉండడం - ఈ కారణా లన్నిటిచేతా గడుసుగా కొలుకులు తప్పించవలెనని వారు ఆలోచనచేసిరి. "మీ రందరూ చాలా కష్టపడుతున్నారు. రైతులూ కష్ట పడుతున్నారు. దేశజీవితము అల్లకల్లోల మయిపోయింది. మాటిమాటికి మేము వేలాలు పెట్టడంచేత భూములూ వాళనమయి పంటలకూ నష్టము కలుగుతూంది. ఉంటుందో ఊడుతుందో అనేభయంచేత నీటివసతులు వగైరాలు మీరు చూచుకోవడం లేదు. గ్రామసౌఖ్యాలు మీకు పట్టలేదు. అందుచేత మేము శాశ్వతంగా మీమీ భూభాగాలమీద ఒకేసారి పన్ను నిర్ణయిస్తాము. మీరూ, రైతులను దానికనీ దీనికనీ పీడించకుండా, నిష్కర్షగా, వ్రాతమూలకమయిన కవులు కమ్మలు వ్రాసికొని వసూళ్లుచేసుకొంటూ నీటివసతులు వగైరాలు చేసి దేశాన్ని బాగుపరచండి" అనే బుజ్జగింపు మాటలతో, నిఖాలసుగా తమకు ఆదాయమురావలెననే దృష్టితో, పర్మనెంటు సెటిల్మెంటు కావించినారు.

దానికి తరువాత ఇంకా పంచాయతీలు గట్టిగా ఉండి గ్రామజీవితము ప్రజలచేతులలోనే కొంతవరకు ఉన్న రాయలసీమవగైరా ప్రాంతాలలో రైతువారీ పద్ధతి యేర్పరచి గ్రామమునసబు, కరణములను ప్రజల నౌకరీనుండి తమనౌకరీలోకి మార్చుకొని కుంపిణీవారు తమ ప్రభుత్వాన్ని గ్రామాలలో పెంచుకున్నారు.

కాబట్టి ఉత్తరసర్కారులలోని పర్మనెంటు సెటిల్మెంటన్నా, రాయలసీమలోని రైతువారీ సెటిల్మెంటన్నా, రెండుసెటిల్మెంటులు కుంపిణీవారు తమ ప్రభుత్వాన్ని మూలమూలకూ వ్యాపింపజేసుకొని గట్టి పట్టు ఏర్పరచుకోడము సులభముగా పన్నువసూలు చేసుకోడము ప్రధానోద్దేశముగా పెట్టుకొని చేసిన పనులు. దీనితోకూడ దేశక్షేమము కలిసివస్తే కలిసిరానీగాక అనడము వారిమనసులో లేదని యెవ్వరూ అనవక్కర లేదు. అనరు. కాబట్టి ఆకాలపు బ్రిటిషుకార్యనిర్వాహకుల మాటలలో ఒకప్పుడు రైతుమీద అపారమైన ప్రేమ కనుపించడమూ ఉంటుంది. ఇంకొకప్పుడు జమీందారులను, కార్యసాధనకోసరము, మంచిగుణము కలుగనీయని ప్రోత్సాహపరచడంకోసరము, 'నీవేనయ్యా ఖామందు' అనడమూ ఉంటుంది. సమయము వచ్చినప్పుడు జమీందారును రైతు లాభానికిగాను గట్టిగా బిగించినచోటూ ఉంటుంది విధిలేనప్పుడు సళ్లు విడిచిన చోటూ ఉంటుంది.

అయిన తరువాతో ?

పర్మనెంటు సెటిల్మెంటు అయినతరువాతనయినా జమీందారులు గౌరవప్రదంగా నడచుకొన్నారా?

తమరైతులను చక్కగా చూచుకొన్నారా ? తరువాత ఎన్ని పేచీ లెన్ని పేచీ లెన్ని పేచీలు ! అందులోనూ ౧౮౫౭ లో ఇండియాలో తిరుగుబాటయినతరువాత బ్రిటిషుప్రభుత్వమునకు జనసామాన్యాన్ని పైకి రానివ్వకూడదనేదృష్టి సహజంగానే కలిగిపోయింది. ధనికులు, సంపన్నులు, రాజులు జమీందారులయెడల గవర్నమెంటువారు స్నేహంగానే నడచుకోవలసివచ్చింది. కాబట్టి మనజమీందారులకు వెనుకటిగుణము ఏల మానుతుంది ? వీరు తామే రాజు లనుకొన్నారు. నిజం చెప్పనీయండి. వీరి కెవ్వరికీ సివిలు క్రిమినలు అధికారాలు పర్మనెంటు సెటిల్మెంటులో ఇవ్వలేదుగదా! బ్రిటిషు ఉద్యోగస్థుల అపు జూచుకొని అందరూ తమకు లేని యీ అధికారాలు చెల్లించినవారేగా ! ఇల్లాంటి సందర్భాలలో ౧౭౯౩-వ సంవత్సరానికి చేటికీ మధ్యన నోరులేని అక్షరంరాని, ఋణగ్రస్తులై, దాసులస్థితిలోనున్న తమరైతులకు వ్యతిరేకంగా బ్రిటిషుకోర్టులు అధికారులు చేసిన తీర్పులనా వీరు తమ హక్కుస్థాపనకు ఆధారము చేసుకొనజూస్తున్నారు! పదితీర్పులు తమవైపుంటే నాలుగుతీర్పులైనా రైతువైపు ఉండనే ఉన్నాయి. పదిమాటలు తమవైపుంటే నాలుగుమాటలు రైతువైపు ఉండనే ఉన్నాయి.

రెండు ఫలితాలు

ప్రకాశం రిపోర్టులో రెండు ఫలితాలు తేల్చినారు. పర్మనెంటు సెటిల్మెంటప్పుడు పేష్కష్ ఎట్లా శాశ్వతమన్నారో, మార్చడానికి రాదన్నారో, అట్లనే రైతు జమీందారుకు అచ్చుకోవలసినశిస్తు శాశ్వతమే, మార్చడానికి రానిదే అన్నా రనడము మొదటిది. భూస్వామి రైతుకాని జమీందారు కాడనడము రెండవది. ఈ రెండు విషయాలనే జమీందారులు ప్రతిఘటిస్తున్నారు.

పెంచే హక్కు

ప్రకాశము రిపోర్టులో చెప్పినట్లుగా రైతు తమ కిచ్చే శిస్తు మార్చరానిదిగా, శాశ్వతముగా నిర్ణయము కాలేదనీ, తాము హెచ్చుగా వసూలుచేసుకొనే హక్కు తమ కున్నదనీ జమీందారులపరంగా వాదన జరుగుతూంది. ఈ కోస్తాలో జమీందారుకట్టే పేష్కష్ మొత్తము ౮౮ లక్షల ౧౦ వేల రూపాయలు. జమీందారులు వసూలుచేసుకొనేది యెంతో తెలుసునా- ౩ కోట్ల ౧౩ లక్షలు. ఇంత హెచ్చు చేసుకోడానికి తమకు హక్కుందనేనా జమీందారు లనడము?

వ్యవసాయపు విస్తీర్ణము పెరిగినప్పుడు, రైతు ఎక్కువ వెలగలపంట పండించినప్పుడు, జమీందారు శిస్తు హెచ్చించవచ్చునని పర్మనెంటు సెటిల్మెంటులో ఏర్పరచినారు. దీని కర్థము చెప్పడములో పాపము జమీందారులంతా తమపరంగానే చెప్పుకొంటారు. కోర్టులు, జడ్జీలు అంతా తమపరంగానే యిదివరలో చెప్పినా రంటారు.

జమీందారులుగాని మరియెవరుగాని ఈసందర్భములో ఒకమాట మరచిపోగూడదు. కుంపెనీప్రభుత్వముదృష్టి తా మనుకున్నంత నిష్కర్షగా ఉన్నదను కోడానికి రాదు. బలవంతులుగా ఉండిన పన్నువసూలుదారులపోరు తామూ తప్పించుకొని దేశానికీ తప్పింతామనేదే వారిదృష్టి. అందువల్ల ఏదైనా ఒకచోట ఒకమాట తమ కనుకూలంగా వారు వ్రాసినారంటే తమకు హక్కు లేకో ఉండినదని దానిని నిలపడానికి వారు వ్రాసినారని అనుకోడము భ్రమ.

నౌకరులే

'రాజులు' అనిపించుకొన్న తమలోని కొందరు 'జమీందారులు' అనేపేరు పెట్టుకోడానికి అంగీకరించడముతోనే వీరు అట్లా తమకు హక్కులు లేవనడము ఒప్పుకొన్నవా రైనారు. ఫోర్టు సెంటుజార్జికోట కట్టుకోడానికి బ్రిటిషువారికి చంద్రగిరిప్రభువు భూమి యిచ్చినాడు. అతనిదే అప్పుడు రాచరికము. కాని ఈదినము ఆనెగొందిలోని వీరంగరాయలు నాకు హక్కున్నది నేను రాజును అంటే అతనిమాట పిచ్చిమాటగా కొట్టివేస్తారు. అట్లే పాపము, బొబ్బిలివారు, వెంకటగిరివారు, ఆనా డేనాడో సైన్యా లుండినవి, పోలీసు లుండినారు, రాజ్యా లుండినవి అంటే ఉండియుండవచ్చును. కాని ౧౮౦౨ లో వీరు జమీందారు

లయి ఆరాచరికమంతా కుంపిణీసాహసికులకు సమర్పించుకొన్నారు. కుంపిణీవారు తక్కువమొత్తానికి శాశ్వతంగా దేశము కొంతభాగాన్ని పన్నువసూలు కిచ్చి వీరిని తమ నౌకరులుగా, ఇతరనౌకరులవలెనే, నియమించుకుంటామంటే ఆశపడి తమ వీర్యాన్ని శౌర్యాన్ని చంపుకొని సైన్యాలను పోలీసులను మానుకొని పన్నువసూలుచేసే ఇతరులవలె తాము కుంపిణీ 'నౌకరు"లుగా ఏర్పడి, ఇతర 'టోలుగేటు గుమాస్తాల' కిచ్చిన 'జమీందారీకితాబు'నే తామూ ధరించినారు. ఈ వేళ ప్రధాని శ్రీ సి. రాజగోపాలాచారి తమ్మును పన్నువసూలుచేసే "నౌకరు" లంటున్నారంటే ఉడుక్కోడ మెందుకూ ? ఆనాటికంటె ఈనాడు తమ "నౌకరీ"కి కొంత ఘనత వచ్చిందని సంతోషించవలె నిజంగా. ఆనాడు తమ్మును పందలను చేసిన కుంపిణీటోపీగాండ్రకు 'నౌకరు' లయితే ఈనాడు రాజ్యమేలే మహాజనసమూహానికి, రైతుజనసంఘానికి 'నౌకరు' లని వారిప్రతినిధినోట అనిపించుకోవడం సత్యంగా గౌరవం గాదా ? ఏ జమీందారైనా హృదయంమీద చేయివేసి సత్యంమీద దృష్టిపెట్టి ఒక్కనిమిష మాలోచించి చూడరే! వట్టిబడాయీ లెందుకు?

ఆనాడు పంచాయతులు, గ్రామసంఘాలు, అంతా నాశనమయి యుండడముచేత తమ్మును గ్రామాలకు పెద్దజేసి బీడు భూములు వగైరాలు తమవశములో ఉంచి, అచ్చట వ్యవసాయం వ్యాపిస్తే, లేదా కొలతపొరపాట్లు వగైరా లుండి విస్తీర్ణము పెరిగితే తిస్తు ఎక్కువ వసూలుచేసుకొమ్మనీ, నీటివసతులు వగైరాలు నీవు కలుగజేస్తావేమో, అట్లా కలుగజేస్తే రైతు కుష్కీ (మెట్ట) పంట వేసుకోడము మాని తరీ (పల్లం) పైరు వేసుకొంటాడేమో, అప్పుడు తిస్తు ఎక్కువ వసూలుచేసుకొమ్మనీ పర్మనెంటు సెటిల్మెంటు అభిప్రాయమేగాని భూమిఖామందు కాబట్టి నీయిచ్చచొప్పున అన్నిలాభాలు నీవే గ్రహించి మ్రింగమని ఆ సెటిల్మెంటు అభిప్రాయం కావేకా దనడము తెలివిగలవా డెవడైనా ఒప్పుకొని తీరవలసిందే. జమీందారు లారీతిగా ప్రజలబాంధవు లయియుంటే యీనా డింతగోలా ఏల పుట్టేది ?

సెటిల్మెంటంటే పన్నువసూలు విధానము

జమీందారులు రైతు ఇవ్వవలసినతిస్తు పెంచ దగిన దని పర్మనెంటుసెటిల్మెంటు చేసేవా రనుకొని యుంటే ఆమాటా వ్రాసేయుందురు. అది వ్రాయలేదే అని ప్రధాని శ్రీ రాజగోపాలాచార్లన్న మీదట జమీందారులు ఆ ప్రశ్న అడుగవలసినది కాదనీ, రైతు ఇయ్యవలసినతిస్తు శాశ్వతంగానే యేర్పరచియుంటే 'శాశ్వతమనేమాట వారికి చెందజేయలేదే' యని అడుగదగినదనీ వాదించ నారంభించినారు.

వీరి యీ యాక్షేపణకు ప్రత్యుత్తరము పైన పేరాలలో రానేవచ్చినది. గవర్నమెంటు పన్నువసూలుకుగాను జమీందారుకు స్వాధీనముచేసిన భూమి మారేది కాదు. అందువలన అతనితోడి కంట్రాక్టులో శాశ్వత మనడము సాధ్యము. రైతుకథ అట్లాంటిది కాదు. అతడు క్రొత్తభూమి సంపాదింపవచ్చును. జమీందారు నీటివసతి చేస్తే 'మెట్ట' పల్లము గావచ్చును. జమీందారే బీడులను రైతుభూమికి చేర్చవచ్చును. కాబట్టి రైతుభూమివిస్తీర్ణము, స్వభావము, స్వత్వము మారితే క్రొత్త అగ్రిమెంటు పుట్టవలసియుండును. శాశ్వత మనేమాట వ్రాయడము అందుచేత సాధ్యము కాలేదు.

కండ్లు మూసికొని స్వలాభమే కోరేవారికి ప్రత్యుత్తరాలిచ్చుకుంటూ ఉండడము సాధ్యముకాదు. అయినా, ఇంకొకవివర మున్నది చూడండి. జమీందారులూ వారిపక్షమువారూ ఇప్పటికైనా 'పర్మనెంటు సెటిల్మెంటు' 'రైతువారీ సెటిల్మెంటు' లనే రెండు పదాలలో ఏమర్థ మిమిడియున్నదో కండ్లు విప్పి పరీక్షిస్తారా ? ఇవి రెండూ సర్కారువారి భూమితిస్తు వసూలుక్రమంలో రెండు విధానాలను సూచిస్తూవున్నవి. ఇది కాదనడము ఎవరికి సాధ్యము గాదు.

ఒకవిధానంలో సర్కారువారు ఒకమనిషిమీద వసూలుచేసే బరువు వేసి అతనివద్దనుంచి మొత్తము రాబట్టుకోవలసినదని నిశ్చయించినారు. రెండవవిధానంలో గ్రామనౌకరులను తామే ఏర్పరచి ప్రత్యక్షంగా తామే వసూలుచేసుకోవలసినదని నిర్ణయించినారు, జమీందారీలోని రైతూ బ్రిటిషు రైతే, రైతువారీ

మండలాలలోని రైతూ బ్రిటిషురైతే. అతనివల్లా సర్కారుకు పన్ను చెల్లవలసిందే. ఇతనివల్లా రైతుకు పన్ను చెల్లవలసిందే. కుంపిణీప్రభుత్వ మున్నప్పుడు ఈ ఏర్పాటు పైలిగంగా చేసినారు. రాణీప్రభుత్వములో రైతును సరంక్షించడానికి కొన్ని సూత్రాలు చేసినారు. ద్వంద్వప్రభుత్వములో శాసనసభలు జమీందారు లాక్రమించుకోడానికి వీలుండింది కాబట్టి తమబలగాన్ని హెచ్చుచేసుకోడానికి పర్మనెంటు సెటిల్మెంటులో చేరని ఇనాములనన్నిటిని రద్దుచేయని శాసనా లుండేవి యుండగా తాము చేసేశాసనము పనికిరాని దయిపోకుండనికూడ విమర్శించుకోగలిగినంతమాత్ర మోపిక లేకుండా, ౧౯౩౫ లో ఎస్టేట్సు లాండు ఆక్టులోనికి తెచ్చి చేర్చుకొన్నారు ప్రకాశంరిపోర్టు మొదటిసంపుటము ౧౧-వ అధ్యాయములో ఈవిషయాన్ని ౩౩ పేజీల గ్రంథమున చక్కగా నిరూపించింది. అది చదివితే విషయములు జమీందారులకు వదలితే వా రెంత విషమ మయిన పరిస్థితులు తెచ్చిపెట్టగలరో అర్థమవుతుంది. ౧౯౩౫ లో వీరు చేసిన ఈ శాసనపరివర్తనానికి ప్రాత శాసనాలే, ఇంకా అములులో ఉండేవే లోబడవలసి ఉంటే వీరిపరంగా జిల్లాకోర్టులు, హైకోర్టులు ప్రీవి కౌన్సిళ్లు ఇచ్చిన తీర్మానాలు కాంగ్రెసు మంత్రివర్గము వారు రద్దుచేస్తూ ప్రజోపయోగముకోసరము క్రొత్త శాసనము పెట్టకూడదా? భూమిపన్ను వసూలు తమ రైతులవద్దనుండియింతే చేయవలసినదని జమీందారులకు శాసనపూర్వకంగా ఉత్తరువువేయడానికి వీరి కధికారము లేదా? తమకు గిట్టకపోతే "అయ్యా, మేము పన్నువసూలూ చేయము, పేష్కషూ కట్టము. మీరే వసూలుచేసుకోండి" అని సర్కారుకు రైతుకు మధ్య తాము నిలవకుండా వెళ్లిపోవచ్చునేగాని పర్మనెంటు సెటిల్మెంటుచేత ప్రభుత్వము రైతును తమ కమ్మివేసినా రనడానికి వీరికి నోరెట్లాడగలదు?

పరిహారమా?

ప్రధాని శ్రీరాజగోపాలాచారి మరియొకవిషయ మందుగూడ జమీందారులకు కలవరము కలిగించినాడు.

'అసలు పన్నులు వసూలుచేసేపని కంట్రాక్టుకు ఇవ్వడమే తప్పు. అది ఆస్తిక్రింద ఏర్పడిం దనడము రెండవతప్పు. దానిని తాకడ మంటేనే అపహరణకార్యక్రమానికి పూనుకొంటున్నా రనడము చిత్రములలో చిత్రము. కాబట్టి రైతుహక్కులు రైతుకు సంక్రమింపచేయమంటే 'మాస్వత్వాలు మీ రూడదీసుకుంటున్నారు. కాబట్టి పరిహార మియ్యండి' అనడానికి వీలులేదు. అసలు మొదటిసన్నదులే తప్పు. జమీందారుల సన్నదులకు అపుగా ఇండియా రాజ్యాంగశాసన మేర్పడినది. ఇండియాకార్యదర్శి ఇష్టముతోగాని పర్మనెంటు సెటిల్మెంటు మార్చరాదన్నారు. లేకుంటే ఈసన్నదులు రద్దుకావలసిందే. పరిహార మియ్యకుండాకూడా రద్దు కావలసిందే అన్నాడాయన.

నిజంగా దేనికి పరిహారము? ఈజమీందారీల కంటే స్వదేశసంస్థానాలు ఎక్కువస్వత్వాలు కలవేకదా! అచ్చట ఏమిజరుగుతుందో జమీందారులు కండ్లు తెరచి చూడవద్దా? ఔంధు సంస్థానాధీశ్వరుడు గ్రామాలలో సర్వాధికారాలు రైతులపంచాయతుల కిచ్చివేసినాడు. తనబొక్కసము వారికి స్వాధీనముచేసినాడు. మొదటిమూడేండ్లు నెలకు రు. ౩౦౦౦/- తన కర్చుకు తీసికొని సర్వము ప్రజలవశముచేసినాడు. తరువాత ప్రజ వోటుచేసే భృతి తీసికోదలచినాడు. ఇతను సంస్థానములో మొదటిసేవకుడుగా సివిల్ క్రిమినలు రివిన్యూ వగైరా అన్నిశాఖలలోను పనిచేస్తాడు. కాబట్టి మొదటి నౌకరుగా గౌరవవేతనము పొందడానికి హక్కు కనిపిస్తుంది.

జమీందారు ప్రజలకు ఒప్పజెప్పే దేమున్నది? ఇతడు చేసే పన్నువసూలు రెడ్డికరణాలు, లేదా, పంచాయతులు చేయనారంభించితే ఇతనికి పని ఏమున్నది? ఏమీ లేదే! ఔంధుసంస్థానాధీశుడే పనిచేస్తూ నెలకు రు. ౩౦౦౦లు కోరుతుంటే ఇతడు — ఏస్వత్వాలు లేనివాడు — ఏమిపరిహారము కోరడానికి వీలున్నది?

ప్రభువు లెవరు?

ఇక శ్రీరాజగోపాలాచార్లు వివరించిన రాజకీయ సందర్భముగూడ చూచుకొని జమీందారులు తమస్థితిగతులు తేల్చుకోవలసి ఉంటుంది. వీరు భూస్వామ్యము తమకు ఉన్న దంటున్నారుగదా! ఒకవేళ ఎన్నడో వీరికి

భూస్వామ్యము ఉందన్నారన్నా రెవరన్న దామాట? ఎవ రిచ్చిం దాభూస్వామ్యము? భూస్వామ్యము రాజ్యా నిది, రాజ్య మేలినవారు కంపెనీవారు, వారు చేసిన సెటిల్మెంటులో ఆభూస్వామ్యము వారు తమ కిచ్చి నారనికదా మీరు వాదించవలెను. రైతువారీయిలాకాలో భూస్వామ్యము కంపెనీవారిదని ఏనాడూ ప్రజ లెప్పుడూ అంగీకరించింది లేదు. భూమిశిస్తు శిస్తేనా? నుత్తా? అనేవిమయములో హారాహోరిగా కర్ణను ప్రభువుకు రొమేష్‌దత్తుకు జరిగినవాదము చదివితే బ్రిటిషు ప్రభుత్వ మును ప్రజలు భూస్వామిగా ఎన్నడూ అంగీకరింపలే దనడము సులభముగా అర్థ మౌతుంది. బ్రిటిషు ప్రభు త్వానికే భూస్వామ్యము లేకపోతే కంపెనీ ప్రభుత్వా నికి భూస్వామ్య మెక్కడిది? వారికిలేని భూస్వా మ్యము జమీందారులకు వా రెట్లిత్తురు? ఇంకొక సంగతి. ఆకంపెనీ ప్రభుత్వమూ నేడు లేదు. కోస్తా లలో ఆ బ్రిటిషు ప్రభుత్వమూ నేడు లేదు. ౧౯౩౫ సంవత్సరపు రాజ్యాంగశాసనములో కోస్తాలకు శాస నాలుచేసే అధికారాలు పూర్ణముగా ఇచ్చిన విమయా లలో (౨౧) భూమి అంటే భూమిలోను భూమిమీదను కల హక్కులు, భూమిశిస్తువిధానాలు, భూఖామందు రైతుసంబంధాలు, నుత్తలవసూళ్లు, వ్యవసాయపుభూమి మార్పు, అమ్మకను, గతి, క్షేత్రముల అభివృద్ధి, వ్యవసాయరుణములు, వలస, కోర్టు అఫ్ వార్డుసు, అదుమానము పెట్టిన జప్తు అయిన ఎస్టేట్లు, నిధనమయిన ద్రవ్యము, (౩౯) భూమిశిస్తు, రివిన్యూ అసెస్‌మెంటు వమూళ్లతో,— లాండురికార్డులు, రివిన్యూపనులకు సర్వే, హక్కుల రికార్డు, రివిన్యూ అన్యాక్రాంతము— ఇన్నియు కలవు. ఈ విమయాలలో కోస్తాప్రభుత్వము తీసుకొనేచర్యకు మితి ఒక్కటిమాత్రము కనిపించును. ౨౯౯ (3) సెక్షను ప్రకారము భూమిశిస్తుసంబంధంగా కలిగిఉండే హక్కులను లేదా స్వతంత్రాలను రద్దుచేసే లేదా మార్చే ఏర్పాటు కల్పించే ఏబిల్లుఅయినా గవ ర్నరు ఇష్టపడి ముందే శాంక్షన్ ఇవ్వనియెడల శాసన సభలలో ప్రవేశపెట్టడానికి వీలులేదు. ఈ శాంక్షన్ విమయములోను కష్టముండదు. ఎందుచేత ననగా బ్రిటిషు ప్రభుత్వమువారు కాంగ్రెసుమంత్రులు అధికారములోకి ప్రవేశించేటప్పుడే అనుదినకార్యక్రమములో గవర్న రులకు ఉండే ఇష్టానుక్రమాధికారములు వారు చలా యించకుండా మంత్రులమాట నడుపురని వాగ్దానము చేసినారు. అయితే ఈవిమయము శాసనముగా ఏర్ప డినతరువాత, పర్మినెంటు సెటిల్మెంటు స్వభావాన్ని మార్చేదిగా ఉంటే గవర్నరు తానుగా దీనికి సమ్మతి యియ్యరా దనియు, ౭౬-వ సెక్షన్ క్రింద గవర్నరు జనరలు సమ్మతికి గాను నిలుపవలసిన దనియు గవర్నరు లకు సెక్రటరీ అఫ్ స్టేటుగారు ౫౩-వ సెక్షన్ క్రింద జారీచేసిన ఇన్‌స్ట్రుమెంటు అఫ్ ఇన్‌స్ట్రక్షన్సు అనే ఉత్తరువుపత్రములో వ్రాసిఉంచినారు. అట్లా గవర్నరు జనరలు సమ్మతికిగాను నిలిపిన శాసనమునకు అతడు గూడ సమ్మతి యివ్వకుండా రాజుగారి సమ్మతికి నిలుప వచ్చును. అప్పుడు రాజుగారు గవర్నరుకు బిల్లుపిల్చిన ౧౨ మాసములలో తమ అంగీకారాన్ని తెలియజేసినచే తప్ప అది శాసనము కాదు. ఇన్ని నిర్బంధా లీ విమయ ములో ఉన్నవి కాబట్టే పర్మనెంటు సెటిల్మెంటు స్వభావాన్ని మార్చడానికి వీలులేనందున దానిని రద్దుచేయడానికి వీలులేకుండా వచ్చిందనీ, లేకపోతే దానిని తుదముట్టించే ఉంపశగినదనీ శ్రీ ప్రధాని చెప్ప వలసి వచ్చినది.

ఈ వాద మంతా యెందుకు?

అందువల్లే శ్రీ ప్రకాశంరిపోర్టు వ్రాసేటప్పుడు ఆ కమిటీవారు తాము రైతుపక్షముగా కోరే హక్కులు (౧) విప్లవపరము కావనీ, (౨) సమానసంపత్తివాదానికి సంబంధించియుండ లేదనీ, (౩) రైతుకు ౧౮౦౨-వ సంవత్సరములో పర్మనెంటు సెటిల్మెంటువల్ల ప్రసా దితమయిన (అ) భూస్వామ్యము (ఆ) శిస్తుశాశ్వ తత్వము నాటినుండి ౬౦ ఏండ్లకు పైబడి సంరక్షిత మయినవనీ, (౪) ఇంగ్లీషుభూస్వామి ఇంగ్లీషు కౌలుదారు మధ్యనుకల సంబంధాలు భారతభూమిలోను భూస్వామి రైతులమధ్యను ఉన్నవనుకొని ఇంగ్లీషుజడ్జీలు పొరబడి తీర్పు లిచ్చి రైతులస్వత్వాలను భంగపరిచినారనీ, (౫) నేడు మద్రాసుశాసనసభ చేసే ప్రయత్నము ఆ తీర్పులు కల్పించిన దురవస్థను, వాని ననుసరించి ౧౯౦౮ లోను ౧౯౩౫లోను మద్రాసు ప్రభుత్వము చేసిన ఆక్టులను సరి దిద్దడము తప్పవేరే కాదనీ, (౬) తాముచేసే ప్రయత్నమే ౧౯౪౮ లో 'క్రౌను' అనేయూరోపియను గవర్న మెంటు సభ్యుడు మద్రాసు టెనెన్సీబిల్లులో చేయ తల పెట్టినాడనీ, (౭) రమారమిగా ఆబిల్లునే తాము కొద్దిమా ర్పులతో పెట్టుకున్నామనీ (౮) తాము చేసే ముఖ్యమైన మార్పులకు రెంటికీ పర్మనెంటు సెటిల్మెంటుకు ఆది

కర్తయయిన గవర్నరుజనరలు కారన్‌వాలీసుమాటలు, ఇతర అధికారులమాటలు, ౧౮౦౨ లో జమీందారులకు, రైతులకు, ప్రజలకు భూమిశిస్తువిషయములో శాశ్వతవ్యవస్థను కలిగించడానికి ఏర్పడిన (అ) పర్మనెంటు సెటిల్మెంటు రెగులేషను (ఆ) పట్టారెగులేషను (ఇ) కరణముల రెగులేషను అనే రెగులేషనుల లోని ఏర్పాటులు అన్నీ అనుకూలములనీ వివరంగా తెలియజేసినారు.

కాంగ్రెసు దృష్టిపథాన్నుంచి ఎంత గట్టిగా మొదటిదినము మాట్లాడినా ప్రపంచములో నడిచే నేటి అభివృద్ధిరాష్ట్రీయప్రగతినిబట్టి చూస్తే తుదకు ఫేక్టరీల యజమానులుకూడ ఏనాటికైనానాడే వాటిని ప్రభుత్వము వారివశము చేసే పరిస్థితులు కలుగుచున్నవి కాబట్టి జమీందారులు భూమియజమానులు మేము మేమని పెనగులాడడ మంత లాభప్రదము కాదని సూచించినా రెండవదినము ప్రధాని శ్రీ రాజగోపాలాచార్ల ప్రత్యేకము లార్డు కారన్‌వాలీసు వ్రాతను తీసికొని సవిమర్శగా దానిని వివరించి రైతుపక్షాన్ని సమర్థించినాడు. పర్మనెంటుసెటిల్మెంటును గురించి ఆ కాలమున ఎవరు మాట్లాడింది తీసికొన్నా జమీందారు పేష్కషు స్థిరపరిస్తే రైతు ఇచ్చే శిస్తు స్థిరమౌతుందనీ, దానివల్ల వ్యవసాయం బాగుపడి ప్రజ బాగుపడుతారనీ కనిపిస్తుంది. కారన్‌వాలీసు అభిప్రాయాన జమీందారు పేష్కషు స్థిరపరచడము మొదటిమెట్టని, రైతుఇచ్చే శిస్తు శాశ్వతంకావడము రెండవమెట్టని ఇంకా ఇతరమెట్లు కట్టవలసినవి కట్టవలసి ఉంటుందని ఉన్నట్లు స్పష్టము. కారన్‌వాలీసుమాట వినండి.

కారన్‌వాలీ సేమన్నాడు?

"భూమి ఎవరు సేద్యముచేసినా, జమీందారు స్థిరంగా ఏర్పడినశిస్తుకు పైన ఏమీ పొందడానికి వీలులేదు. రమారమి అంతటా, స్థిరంగా ఏర్పడినశిస్తు రైతు ఎంత ఇవ్వగలడో అంత పూర్తిమితి చెందిపోయింది. ఇంకొకనికి భూమి ఇచ్చే ఆశతో అదివరకున్న రైతును పొమ్మనే అధికారము జమీందారుచేతిలో పెట్టడమంటే జులుముచేసే అధికార మతనిచేతి కివ్వడమే. అతని కందువలన ప్రయోజనము లేదు." దీని కర్థమేమో అందరికీ విశదమే. రైతును మార్చేసందర్భాలు కలిగినా జమీందారు శిస్తు హెచ్చించడానికి వీలులేదనడమే.

ఖచితమే

ఇంత ఖచితమయిన అభిప్రాయా లప్పుడుండడము చేతనే ౧౮౦౨-వ సంవత్సరపు రెగులేషనులో ౧౩-వ సూత్రములో జమీందారుకుగల పన్నువసూలు అధికారాని కున్న నియమాలు మార్చడానికి గవర్నమెంటువారు అధికారము పెట్టుకొనిరి. రైతును జమీందారు కాల్చి బూడిదచేసి దిగమ్రింగితే ప్రభుత్వానికి రావలసిన యితరాదాయాలకు ఆపదరాదా? అదిగాక రు. ౪౦ లక్షలకోసము ఏప్రభుత్వమయినా తనకుగల పన్నువసూలు హక్కంతా సర్వకాలానికి అమ్ముకొంటుందా? ౪౦ లక్షలరూపాయలు తమకు వస్తుందని జమీందారు పన్నులు హెచ్చించుచూ పోయేటప్పుడు అతనికీ రైతుకూ సంఘర్షణలు కలుగుతుంటే అందులో జమీందారును సంరక్షించడానికి రైతును హతంచేయడానికి ఏప్రభుత్వము పోలీసులను సైనికులను పంపించుకుంటూ ఉంటుంది? జమీందారును ఏర్పరిచిందే పన్నువసూలు కయితే గవర్నమెంటుపోలీసులు సైన్యాలు పోయి ఆ వసూలు చేయవలసివచ్చినప్పుడు ఆజమీందారుతో పని యేమివుంది? పన్నువసూలుచేసే నౌకరీ జమీందారుకిస్తే సర్కారధికారమైన పన్నుపెంపుదలఅధికార మితడు చలాయిస్తాడా? ఇ దెక్కడిన్యాయం? 'ఇవన్నీ కూడదు. మొదటి ఏర్పాటుప్రకారం పన్నువసూలు చేయవలసిందే' అని శాసనము చేస్తామంటే తనకు పరిహారము ఇవ్వమంటాడా? ఆ దెక్కడనుండి వస్తుంది? మళ్లీ రైతే నా యిచ్చుకోవలె. తా నిదివరకూ రైతును కొల్లగొట్టింది గాక తనకు పరిహారమివ్వడానికి ఇప్పటి రైతుప్రభుత్వంచేత రైతును కొల్లగొట్టింప జూస్తాడా? "ఎట్లాగూ బలతరమయిన రైతుప్రభుత్వము రాబోతుంది. తప్పదు. దొరకింది జేబిలో వేసుకొని దూరం కూచుందామని జమీందారు ఆలోచిస్తాడా?" అన్నాడు ప్రధాని శ్రీరాజగోపాలాచారి.

తుదకు ప్రకాశం రిపోర్టును అనుసరించి బిల్లు పెట్టవలసిందని మద్రాసుశాసనసభలవారు ఆమోదించినారు. త్వరలో బిల్లు ప్రవేశపెట్టుతారు. రెండుసూత్రాలందులో ఇమిడిఉండగలవు: (౧) భూమికి ఖామందు రైతు. అడవులు, నీళ్లు, అతనివి, (౨) ౧౮౦౨-వ సంవత్సరములో జమీందారుకు చెల్లుతూఉండినశిస్తే ఇప్పుడు చెల్లవలసినది.

జమీందారులు తుదివరకు పోరాడుతా రనడము నిజము. పర్యవసానము రయితుకు విజయము. కలుగక పోతే కాంగ్రెసుమంత్రు లేమిచేస్తారో చెప్పవలెనా?

అమాయకురాలు

కొడవటిగంటి కుటుంబరావు

౧

"అయితే నీ స్నేహితురాలి పెళ్ళికి ఉండకుండా వెళతావురా, నాయనా?" అన్నది భ్రమరతల్లి వెంకటేశ్వర్లుతో.

"ఎట్లాగు, పిన్నీ? మా క్లాసువాళ్ళంతా బయలుదేరుతున్నారు. రేపే కాలేజీ తెరుస్తారాయెను. వారం ఆలస్యంగా వెళితే పాఠాలు పోవూ" అన్నాడు వెంకటేశ్వర్లు.

"వారానికే ఏం పోతయ్యేంమహా?" అన్నది భ్రమరతల్లి. వెంకటేశ్వర్లు ఏవేవో అభ్యంతరాలు చెప్పాడు. కాలేజీ చదువంటే మాటలు చదువుకాదన్నాడు. రెండు వారాల కొక పుస్తకం చొప్పున అయిపోతుందన్నాడు.

భ్రమర పెళ్ళికి ఉండి పోవటం అతనికి అసలు ఇష్టంలేదు. దాన్ని తనకు కాకుండా మరొకరికిచ్చి ఎందుకు చేస్తున్నారూ? అతను ఒకటి రెండు కథలలో చదివాడు, చిన్నతనంనించీ సావాసంగా ఉండి పెళ్లి చేసుకున్న వాళ్లను గురించి. తనూ భ్రమరా పెళ్లాడితే చక్కగా కథలో జరిగినట్టుంటుందనే అభిప్రాయం అతనిలో అయిదారుమాసాలనించీ — భ్రమర పెళ్లి ప్రయత్నాలు ప్రారంభ మయినప్పటినించీ — బలంగా ఉంటున్నవి. (జీవితం కథల్లోమోస్తరుగా ఉంటే బాగుంటుందనే అభిప్రాయం ఇంకా పాతది వెంకటేశ్వర్లుకు.)

కాని తనకూ భ్రమరకూ పెళ్లికాదని కూడా వెంకటేశ్వర్లుకు స్పష్టమైపోయింది. వారికీ తమకూ శాఖ ఒకటి కాదు. బ్రాహ్మలే, ఎదురిళ్లవాళ్లే; కాని వివాహం జరగటం అసంభవం.

వెంకటేశ్వర్లు ఆ ముక్కతో మనస్సును సమాధానపరుచుకోలేదు. అతనికి కోపం వచ్చింది. తన జీవితంకన్న శాఖావిచక్షణ ఎక్కువనిపించలేదు అతనికి. కాని ఎవరిమీద కోపగించాలో అతనికి తెలియలేదు. అందుచేత అతనికి మరింత కోపం వచ్చింది. ఆ కోపం అతని మనస్సులో పేరుతూ ఉండింది. అది ఇప్పుడు భ్రమరతల్లి మీదికి తిరిగింది.

"పెళ్లికి ఏమని ఉండ మంటుందో ఈవిడ!" అనుకున్నా డతను.

అతను బయటికి వస్తుండగా భ్రమర పరుగెత్తుకుంటూ వచ్చి అతని చేతులు పట్టుకుని నిలవేసి నవ్వు మోహంతో, "ఇవాళ ప్రయాణం మానుకున్నావా, వెంకటేశ్వర్లూ?" అన్నది.

"దేనికీ?" అన్నాడు వెంకటేశ్వర్లు మొహం చిట్లిస్తూ.

"మా అమ్మ నిన్ను ఉండమనలా?"

"దేనికీ?"

"నా పెళ్లికి," అన్నది భ్రమర చిన్నగొంతుతో.

"నే నుండను!" అన్నాడు వెంకటేశ్వర్లు కఠినంగా, తనకోపానికి కారణం భ్రమరేకాని భ్రమరతల్లి కాదని నిర్ధారణచేసుకుంటూ.

"ఉండు వెంకటేశ్వర్లూ—సరదాగా!" అన్నది భ్రమర లాలనగా.

"ఏమని ఉండమంటుందో — ఇంతపని చేసి!" అనుకున్నాడు వెంకటేశ్వర్లు కుములుతూ.

"నీకు కోపం వచ్చిందా?" అన్నది భ్రమర, తన వల్ల ఏదో తప్పు జరిగినట్టుగా.

"నాకెందుకేం కోపం?"

"మరెందుకూ అట్లా ఉన్నావు?"

"నా కేం కోపంలేదు. నా కెందుకూ కోపం?" అని గొణుక్కుంటూ వెంకటేశ్వర్లు వెళ్ళిపోయినాడు.

తనకు కోపం వచ్చిందని భ్రమరకు తెలియటం అతనికి తృప్తికరమయింది. భ్రమర తనకు కోపం వచ్చినందుకు కుమిలి కుమిలి చావాలి! అప్పుడు తనకు హాయిగా ఉంటుంది.

వెంకటేశ్వర్లుకు పదిహేడేళ్లు వచ్చినై. అతనికి భ్రమరమీద ప్రత్యేకించిన అభిమానంకూడా లేకపోలేదు. కాని ఆభావాన్ని ప్రేమ అనటం అతిశయోక్తి అవుతుంది. కాంక్షించకపూర్వం ప్రేమించటం ఎవరితరమూ కాదు. వెంకటేశ్వర్లుకు ఇప్పుడిప్పుడే కాంక్ష అనేది కలుగుతున్నది. అదికూడా అతని మనస్సులో స్ఫుటమైన ఆకారం పొందలేదు. అంతేకాక వెంకటేశ్వర్లు అభిప్రాయంలో కాంక్షకు అతీతమైనదే ప్రేమ. ఆ రెంటికీ తెగని బంధం ఉందని అతనింకా గుర్తించలేదు. భ్రమరను కామించికాదు అతడు పెళ్లాడగోరింది—తనభార్యగా చేసుకుని గౌరవంగా చూడటానికి.

ఎరగదు. ఆమె పదిసంవత్సరాల జీవితంలోను అన్యోన్య దాంపత్యం ఆమె ఎన్నడూ చూసిలేదు.

వెంకటేశ్వర్లు తనపెళ్లికి ఉండననటం భ్రమరకు చాలాఖేదం కలిగించింది. కాని అతనికి కోపం రావటం మరీ దుర్భరమయింది. వెంకటేశ్వర్లుకు తను చాలాసార్లు అదివరలో కోపం తెప్పించింది. కాని ఈసారి అతనికి కోపం రావటం ఏదో విశేషం ఉంది. పూర్వంమాదిరిగా కాకుండా ఈ సారి తన తప్పేదో తనకు తెలియలేదు. తనపెళ్లి వెంకటేశ్వర్లు కిష్టంలేదు; లేకపోతే పెళ్లి కెందుకు ఉండనన్నాడూ? ఆమాట నిర్ధారణ చేసుకున్న తరవాత భ్రమరకు తనపెళ్లి అంటే ఒకవిధమైన అసహ్యం పుట్టుకొచ్చింది. అనేకసంవత్సరాలపాటు వెంకటేశ్వర్లు అనుమతినీ, ఆమోదాన్నీ పాటించిన భ్రమర ఇప్పుడు అలవాటు మార్చుకుని అతని కిష్టంలేని పెళ్లి ఎట్లా చేసుకుంటుంది? కాని ఇప్పుడు వ్యవహారం ఆమెచేతుల్లో లేదు. కొంచెం ముందుగా అయితే, "నాకిపెళ్లి వద్దు, నాన్నా!" అంటే మాతురిమాట వినిపించుకునేవాడే భ్రమరతండ్రి.

౨

భ్రమర అంతకంటేకూడా పాపం, అన్యాయమైనస్థితిలో ఉంది. ఆపిల్లకు వెంకటేశ్వర్లంటే ప్రాణమే కాని ఆ అభిమానం ఎంతగాఢంగా ఉందో ఆమెకే తెలియదు. ప్రేమనుగురించి ఆమెకు మొదలే తెలియదు. తనవివాహవైభవానికి వెంకటేశ్వర్లు నాయకుడు కాదనే జ్ఞానంకూడా ఆమెకు లేదు. తనపెళ్లి బాగా జరగటానికీ జరగకపోవటానికీ ఉన్న తేడా అల్లా వెంకటేశ్వర్లు పెళ్లికి ఉండిపోవటమూ ఉండకపోవటమూ మాత్రమే ననుకున్నది. కాలక్రమాన తను అత్తవారింటికి వెళ్లటమూ అక్కడ కాపరం చెయ్యటమూ ఉంటుందని ఆమెకు తెలుసుకాని, అది తనకు అయిష్టమైనపని అవుతుం దని ఆమె భావించలేదు. తను మరొకరిభార్య అయేకంటే వెంకటేశ్వర్లుభార్య అయితే బాగుంటుం దని ఆమెకు తట్టలేదు. అన్యోన్యతకూ దాంపత్యానికీ ఏమైనా సంబంధం ఉంటుందని—ఉండాలని—ఆమె

3

వెంకటేశ్వర్లు తండ్రి దీనికి సరిగా విరుద్ధం. బుద్ధి తెలిసినప్పటినించీ వెంకటేశ్వర్లుకు తండ్రితో మాట్లాడటానికే హడలు. ఆయన తనపిల్లల ఇష్టాయిష్టాలు కనుక్కునేరకం కాదు.— పొరపాటున తనకు తెలిస్తే వాటికి విరుద్ధంగా ప్రవర్తించేరకం. అట్లా ప్రవర్తించటం పిల్లలకు చాలా మంచిదని ఆయన అభిప్రాయం!

అందుచేత వెంకటేశ్వర్లు తండ్రిదగ్గిరికి పోయి "నేను భ్రమరను పెళ్లిచేసుకుంటాను, నాన్నా" అని అనలేకపోయినాడు. ఎంతో చనువున్న తల్లితోనే అతను ఆ మాట అనటానికి విశ్వప్రయత్నం కావలసి వచ్చింది. "నోరు మూసుకో, ఎవరన్నా వింటే నవ్వి పోతారు!" అన్నది తల్లి వెంకటేశ్వర్లుతో...

వెంకటేశ్వర్లు భ్రమర పెళ్లికి ఉండకుండా వెళ్లి పోయినాడు.

౪

భ్రమర పెళ్లి చిన్నతనపు స్నేహానికి విశేషం అంతరాయం కలిగించలేదు. కాని వెంకటేశ్వర్లు భ్రమరను పూర్తిగా క్షమించలేదు. క్షమించేటట్టుకూడా కనిపించలేదు. తమ ఇద్దరూ పెళ్లి చేసుకుని ఉండవలసిందనీ, అది ధర్మమనీ, మంచి మంచి కథలన్నిటిలోనూ అట్లాగే జరుగుతుందనీ వెంకటేశ్వర్లే భ్రమరకు చెప్పాడు. వెంకటేశ్వర్లు చెప్పినమీదట భ్రమరకు అతని మాట నిజమే ననిపించింది.

"ఎంత పొరపాటు జరిగిందీ!" అన్నది భ్రమర, ఈడుకు మించిన ఆలోచనాశక్తి ప్రకటించటానికి ప్రయత్నం చేస్తూ.

"పొరపాటు నీదే!" అన్నాడు వెంకటేశ్వర్లు. "నువ్వు నన్నే చేసుకుంటానంటే మీ నాన్న ఒప్పుకునేవాడే!"

"నాకెట్లా తెలుస్తుంది, వెంకటేశ్వర్లూ? తెలిస్తే మా నాన్నను అడిగేదాన్నేగా!"

"తెలియకపోవటం తప్పు కాదూ?"

"పోనీ నీకు తెలుసుగా, నువ్వు మీ నాన్న నెందుకడగలేదూ?"

"మా నాన్నా మీ నాన్నా ఒకటేనా ఏమిటి? మా నాన్న చంపేస్తాడు?"

"ఎందుకూ? తప్పేముందీ?" అన్నది భ్రమర ఆశ్చర్యంతో.

వెంకటేశ్వర్లుకు ఏంచెప్పాలో తోచక కోపం వచ్చి వెళ్లిపోయినాడు. భ్రమరకుకూడా కోపం వచ్చింది వెంకటేశ్వర్లుమీద. అతనికి తనమీద ఈ అర్థంలేని కోపమెందుకూ? తన పెళ్లి నాటినించీ వెంకటేశ్వర్లు ఇదేవరస!

౫

భ్రమర రజస్వల అయి అయిదారు మాసాలయింది. బి. ఏ. రెండోఏడు చదువుతున్న వెంకటేశ్వర్లు ఇంటికి వచ్చాడు, డిసెంబరుశెలవులకు. తీరా తమరిద్దరి సావాసానికి అంతంవచ్చేసరికి అతనికి ఆసావాసంయొక్క అవసరం అపరిమితమయింది ఇప్పుడిప్పుడు భ్రమర కంటపడితే అతనికి మతిపోతున్నది. కన్నెచెదరి పొయ్యేటట్టు తయారయింది భ్రమర. అదీకాక వెంకటేశ్వర్లు జరిగిన రెండు మూడు సంవత్సరాలలోనూ ఒకటి రెండు విషయాలు తెలుసుకున్నాడు.

ఈ భ్రమర—ఈ మెరుపుతునక—తనతో ఆడుకుని తనని కొండంతచేసి చూసిన భ్రమరే—కాని, కాదు! ఈమెను పెళ్లాడ లేకపోయినందుకు తను పశ్చాత్తాపపడ్డమాట నిజమేకాని ఇప్పుడు కలుగుతున్న పశ్చాత్తాపాన్ని అది ఎక్కడా పోలదు. ఇప్పటి పశ్చాత్తాపంలో నరకకూపాల తాలూకు తపన ఉంది.

లోకానికి కట్టుపడి భ్రమర తనను తప్పించుకు తిరుగుతున్నది. కాని తనతో వెనకటి మోస్తరుగా సావాసం చెయ్యాలనే ఉంది భ్రమరకు. ఈనాడు పెద్దమనిషి అయినంతమాత్రంచేత ఆమె తమ దీర్ఘస్నేహాన్ని మరిచిపోతుందా? అందుకు పశ్చాత్తాపపడుతుందా?

భ్రమర తనతో మాట్లాడితే తనను ముట్టుకోనిస్తే తనమీద ఆమెకింకా ప్రేమ ఉందని తెలిసినా చాలు ననుకున్నాడు. నిజానికి అతనిహృదయం పగలదీసి చూస్తే అందులో భ్రమర తనభార్య కాకపోయిందే అనే చింత ఏమీ లేదు. అసదాని ఆవశ్యకతమాత్రమే అతనికి తెలుసును — భార్యయొక్క ఆవశ్యకత అతనికి అర్థం కాలేదింకా.

భ్రమరను చూడటానికీ, ఆమెను పలకరించటానికీ వెంకటేశ్వర్లు ఎన్నిపాట్లయినా పడ్డాడు. కాని ఆ పాట్లు కొంతవరకు ఫలించకపోలేదు — అంతతో అతనికి సంతృప్తి కలగనే దన్నమాటేకాని, అతనికి భ్రమర ఏకాంతంగా దొరకాలి. అదిమాత్రం అతనిచేత కాలేదు. దైవాత్తూ ఒకసారి అటువంటి అవకాశం దొరికేటప్పటికి వెంకటేశ్వర్లు దాన్ని వినియోగపరుచుకునేటందుకు సంసిద్ధుడై లేడు.

అతను వాళ్ల వాకిలితలుపు తెరిచి లోపలికి అడుగుపెట్టబోతుండగా భ్రమర బయటికి రావటానికి ఆవాకిలిదాకా వచ్చి అతనికి ఎదురుపడింది. ఆసమయంలో

అక్కడ ఇంకొక రెవరూ లేరు. ఇద్దరూ ఒక్క క్షణం కొయ్యబొమ్మలల్లే నిలబడిపోయినారు ఒకరి నొకరు చూస్తూ.

"వెంకటేశ్వర్లూ!" అన్నది భ్రమర చాలా చిన్న గొంతులో. వెంకటేశ్వర్లు నరాలకు ఎవరో పురి పెట్టుతున్న ట్లయింది. అతను మాట్లాడబోయి గుటక వేశాడు. ఇంతలో ఎవరో వచ్చి వా రిద్దరికీ వాళ్ళ కళ తేర్చారు...

తరవాత కొద్దికాలానికే భ్రమర కాపరానికి వెళ్ళింది.

౬

అటుతరవాత భ్రమర వెంకటేశ్వర్లు మనసులో నించి త్వరలోనే మాసిపోయింది. జరిగిం దంతా ఒక సారి సింహావలోకన చేసి చూసుకుని వెంకటేశ్వర్లు నవ్వుకున్నాడు. ఎథెల్ ఎం. డెల్ కాబోలు రాసిన ఒక నవలలో ఒకకన్య తనకిష్టంలేనివాణ్ణి పెళ్ళాడబోతూ తనకన్యాత్వాన్ని ప్రేమించినవాడికి ధారపోసేస్తుంది. పెళ్ళాడినతరవాత భర్త కానివాడికి తనశరీరాన్ని అర్పించటం ఆమె అభిప్రాయంలో నీతి కాదు. పెళ్ళయిన తరవాత ప్రియుడివంక చూడటం అవినీతి అవుతుందని పెళ్ళికి ముందే ప్రియుడికి తన చాతనయిన సుఖం ఇచ్చింది. భ్రమరకూడా అటువంటినీతి ఏమైనా పాటించి ఉంటే వెంకటేశ్వర్లు తృప్తిపడేవాడేమో. ఇప్పుడు భ్రమర పరగతం — ఉచ్ఛిష్టం.

కాని మళ్ళీ భ్రమర కంటపడినప్పుడు వెంకటేశ్వర్లుహృదయం తటతటలాడింది. అయినా అందులో విశేషం లేదు. ఆమాత్రం చక్కదనాన్ని చూస్తే ఎవరి గుండె అయినా తటతట లాడవచ్చును. పైగా గతాన్ని సంపూర్ణంగా మరవటం ఎవరివల్లా కాదు.

కాపరానికి వెళ్ళినతరవాత భ్రమర ప్రవర్తన మారింది. ఆమె ఇప్పుడు వెంకటేశ్వర్లును చూసి సిగ్గుపడటంలేదు; ఎదురుగా వచ్చి స్వేచ్ఛగా మాట్లాడుతుంది. ఒకవిచిత్రమైన వేదాంతంకూడా నేర్చుకుంది. ఏదో సందర్భంలో ఆమె వెంకటేశ్వర్లుతోనే అన్నది:

"మనం కోరేవన్నీ గొంతెమ్మ కోరికలే. మనం అనుకున్నట్టు అక్షరాలా ఏదీ జరగదు. మనకు వచ్చే సుఖా లేవీ రుచించవు. ఎప్పటికైనా మనకు కలిగిన సుఖాలకంటె మనం ఊహించుకునే సుఖాలే బాగుంటై!"

"ఓయబ్బో!" అనుకున్నాడు వెంకటేశ్వర్లు, ఆమాటలను అతను సహృదయంతో అర్థం చేసుకోకుండానే.

౭

భ్రమర అయిదోతనం సంవత్సరం పైన నాలుగైదుమాసాలుమాత్రమే దక్కింది. టైఫాయిడు జ్వరం వచ్చి ఆమెభర్త మరణించాడు.

ఈవార్త వినగానే వెంకటేశ్వర్లు చాలా విచిత్రమైన ఆలోచనాపరంపరలో పడిపోయినాడు. భ్రమర భర్తను అతను చూడనేలేదు—. పరిస్థితులు అట్లా ఒనగూడినై. తనకూ భ్రమరకూ మధ్య అడ్డంగా ఉండిన ఈఛాయ కాస్తా తొలిగి పోయింది. ఇక కావాలంటే భ్రమర తనదే!

న్యాయంగా ఈఆలోచన రాగానే వెంకటేశ్వర్లుమనసు పొంగి ఉండవలసింది. కాని అట్లా జరగలేదు. అతనికి భయంవేసింది. ఈభావాన్ని అతను విమర్శించుకోలేదు. విమర్శించటం అతని కిష్టంలేదు.

కారణ మేమంటే, భ్రమరను తిరిగి పెళ్ళాడవలసిన బాధ్యత నైతికంగా తనమీద ఉందని అతని అంతరాత్మ చెబుతున్నది. వితంతువును — కొంతకాలం కాపరం చేసిన వితంతువును పెళ్ళాడటానికి అతని అంతర్బుద్ధి ఏమాత్రమూ సమ్మతించటం లేదు. తనకూ భ్రమరకూ మధ్య ఉండిన ఛాయకాస్తా పోయినందుకు అతని కా ఛాయమీద చాలా కోపంగా ఉంది.

కాని తనకు భ్రమరమీద అంతదృఢమైన ప్రేమ లేదని కాని ఆమెను పెళ్ళాడటం తనకిష్టం లేదనిగాని ప్రాణం పోయినా వెంకటేశ్వర్లు ఒప్పుకునేటందుకు సంసిద్ధుడై లేడు. అతని అంతస్సుమాత్రం వలలో చిక్కిన పక్షిమాదిరిగా ఇందులోనించి బయటపడేమార్గం

ఏదైనా ఉందా అని దిక్కులు చూస్తూనే ఉంది. వెంకటేశ్వర్లు అడకత్తిలో వక్క మాదిరిగా ఉన్నాడు.

౮

ఈ పరిస్థితినించి వెంకటేశ్వర్లుని భ్రమరే రక్షించింది. ఆమె తల్లిదండ్రులమాటా దగ్గరబంధువులమాటా విని పించుకోకుండా కేశఖండనం చేయించుకుందిపదోనాడు.

వెంకటేశ్వర్లుఅంతరాత్మ ఒక దీర్ఘనిశ్వాసం వదిలింది. అతను తృప్తిగా ఒక నిట్టూర్పు విడిచి ఊరు కుంటే ఏమై ఉండేదో. కాని వెంకటేశ్వర్లు అక్కడ ఆగలేదు. ఎక్కడ ఆగాలో తెలిసినవాళ్లు బహుకొద్ది మంది. అందులో వెంకటేశ్వర్లు మాత్రం ఒకడు కాడు.

అతను భ్రమరను పెళ్లిచేసుకోవద్దు అని తీర్మా నించుకోలేదు కనక పెళ్లిచేసుకోవటానికి తీర్మానించు కున్నట్టే భావించుకుని భ్రమరమీద మండిపడ్డాడు. ఆమె ఇటువంటి సాహసం ఎందుకు చేయాలి? ఆమె కిక ప్రపంచంలో ఎవరూ లేరా? భర్తను అంతగా ప్రేమించిందా! పోనీ, తనకేం?... ఈ భ్రమరకోసం తను ఎంత బాధపడ్డాడూ! తనకోసమైనా ఆమె మాన వాకారం త్యజించకుండా ఉండవచ్చునే! ఎంతమోసం చేసిందీ!.. తలుచుకుంటే అతనిగుండె పగిలిపోయింది.

౯

భ్రమర పుట్టింటనే ఉంటున్నది. ఆమెకు జీవితం దుర్భరంగా ఉంటున్నది. రోజు గడవదు. ఎక్కడికీ వెళ్లేటందుకు లేదు. ఎవరూ వచ్చి కూర్చుని మాట్లాడనైనా మాట్లాడరు. పాపం, అక్కడికి వెంకటేశ్వర్లుతల్లి రోజూ వచ్చి కాసేపు కూర్చుంటూ ఉంటుంది.

"ఎన్నడూ వెంకటేశ్వర్లు వచ్చి చూడడేం, పిన్నీ? నా కున్నవాళ్లే మీరు. నాదుర్గతికి తగినట్టు మీరుకూడా వదిలేస్తే నే నేమవుతాను? వెంకటేశ్వర్లును రమ్మను. నాకు చూడాలని ఉంది" అన్నది భ్రమర వెంకటేశ్వర్లుతల్లితో.

"ఏమోనే అమ్మా! చిన్నవానివారౌను. ఈవాళ కూడా పట్టెను. సిగ్గుపడతాడేమోనని వాడు రాలేదు. చెబుతాలే!"

"సిగ్గూ, నాపిండమూను! ఇంకా ఈజన్మకి సిగ్గే మిటి? వెంకటేశ్వర్లును తప్పక రమ్మను, పిన్నీ!"...

"ఏంరా, అబ్బాయి. పాపం, భ్రమర నిన్ను చూడాలని కలవరిస్తున్నదిరా. పోయి చూడరాదూ? నాతో వందసార్లు చెప్పింది" అన్నది వెంకటేశ్వర్లుతో తల్లి.

వెంకటేశ్వర్లు కప్పుకన్న ఎత్తుగా ఎగిరిపడ్డాడు.

"చాలా మంచిపని చేసింది! ఇప్పుడా అవతారం నేనుకూడా చూడలేదని దిగులా? నాకు చూపించటానికే గుండు చేయించుకుందేమో కనుక్కోరా!"

కొడుకు ఆగ్రహం తల్లికి అర్థం కాలేదు. కాని ఆవిడ అతనిమాటలుమాత్రం భ్రమరకు చెప్పింది, భ్రమర మాట్లాడలేదు, దీర్ఘాలోచనలో పడ్డది.

౧౦

"నేను మళ్లీ జుట్టు పెంచుకుంటాను, నాన్నా!" అన్నది భ్రమర తండ్రితో.

"అప్పుడంత మొండిపట్టు ఎందుకు పట్టావు, తల్లీ? అట్లాగే పెంచుకో, అమ్మా. ఇంతలో మనకులం పొయ్యే దేమీ లేదులే"!...

నలుగురూ చాటుగా నవ్వసాగారు. మొదట ఆమెయోగ్యతను ఘనంగా చెప్పుకున్నవా రందరికీ తలవంపు లయినట్టయింది. భ్రమర ఇంకేమీ గమనించ లేదు — ఎదుగుతున్న తలవెంట్రుకలు తప్ప.

తను నిజంగా ఎంత అవివేకి! ఎంత తెలివితక్కువది! ఆదివరకు వెంకటేశ్వర్లు తమ ఇద్దరి బాంధవ్యం గురించీ ఎంతస్పష్టంగా తెలియచెప్పాడు! తను అతని విషయంలో ఎంత కృతఘ్నతతో ప్రవర్తించిందీ!... నిజానికి వెంకటేశ్వర్లుకు తను తగినభార్యా? అతను తనలో ఏం చూసి అభిమానిస్తున్నట్టు! అతనికి కోపం రాదా మరి? తనపైనవ్యమైనా సహించగలదుకాని అతని కోపం సహించలేదు.......

౧౧

"భ్రమర మళ్లీ జుట్టు పెంచుకుని చీరెలూ రవికెలూ కట్టుకుంటున్నదే. సాంతం నెగ్గించలేని పనులు

ప్రారంభించకపోతే ఏం ?" అన్నది వెంకటేశ్వర్లుతో తల్లి.

"పెళ్లి అవుతుందని ఆశ పుట్టించేవా!" అన్నాడు వెంకటేశ్వర్లు.

"కొన్నాళ్లు కాపరంచేసి—!"

"ఏమిటమ్మా? బస్తీలెలల్లే ముప్ఫైఏళ్లు వచ్చిన వాళ్లకు మళ్లీ కావటంలా?" అన్నా డతను నిష్ఠురంగా.

ఇంతకూ తల్లికొడుకుల కిద్దరికీ తెలియలేదు, భ్రమరపరివర్తనకు తమకే కారకు లని!

౧౨

వెంకటేశ్వర్లు ఎప్రెంటిస్ చెయ్యటంకూడా పూర్తి చేశాడు. కోర్టు తెరవగానే ప్రాక్టీసుకూడా ప్రారంభించనున్నాడు. అతని వివాహంకూడా స్థిరమయింది. ఏటి అవతలనించి వచ్చింది సంబంధం. వాళ్లు కొద్దిలో జమీందార్లు. రెండు మూడు లంకలుకూడా ఉన్నాయి.

వివాహానికి అంతా సిద్ధమయేవరకూ భ్రమరకు వెంకటేశ్వర్లుపెళ్లినిగురించి తెలియదు. ఆసమయాన ఆమె పినతల్లిగారి ఊరు వెళ్లిఉంది.

తండ్రిరాసిన ఉత్తరంలో ఈవార్త చదవగానే "నేను వెళ్లిపోతాను, పిన్నీ!" అంటూ ప్రారంభించింది భ్రమర. కూతురి ఆదుర్దా పినతల్లికి అర్థం కాలేదు. ఇంకా ఒకనెల రోజులైనా పిల్ల తనదగ్గిర ఉంటుం దనుకుంటున్న దావిడ.

భ్రమర పినతల్లిప్రార్థన వినిపించుకోకుండా ఇంటికి బయలుదేరింది. బండి ఆగగానే ఆమె తన ఇంట్లోకి పోవటానికి బదులు వెంకటేశ్వర్లుగారింట్లోకి వెళ్లింది. ఆమె పెట్టె తీసుకుని బండివాడు కూడా ఆ ఇంట్లోకే వచ్చాడు.

వెంకటేశ్వర్లు వరండాలోనే నిలబడి ఉన్నాడు. అతను భ్రమరవంక ఆశ్చర్యంతో చూచాడు, ఆమెను చూసి చాలా ఏళ్లయింది.

"వెంకటేశ్వర్లూ!"

అతనిప్పుడు గుర్తుపట్టి, "భ్రమరా!" అన్నాడు. మెడమీదిదాకా పెరిగిన ఆమె జుట్టూ, కొద్దిగా చిక్కిన శరీరమూ చూస్తే వెంకటేశ్వర్లుకు "ఉచ్ఛిష్టం" అనేమాట స్ఫురించలేదు. అతని పెదిమలు కొద్దిగా కదిలినై. "నాభార్య!" అనుకున్నా డతను.

"నీపెళ్లి అవుతున్నదని విని వచ్చాను. వెంకటేశ్వర్లూ! నా కెంతో సంతోషంగా ఉంది. నీ పెళ్లికి ఉండటానికి వీలవుతుందో కాదో ఇప్పుడే చూసి పోదామని వచ్చాను."

భ్రమర నవ్వు సంతోషమల్లే కనిపించలేదు వెంకటేశ్వర్లుకి. ఆమె తూలి అక్కడే పడిపోతుందేమో నని అతనికి ఒకక్షణంలో అనుమానంకూడా కలిగింది. కాని ఆమె అతనితో ఇంకేమీ అనకుండా వెనక్కు తిరిగింది.

"మనం ఇక్కడ ఉండటం లేదు. ఆ ఎదుటింటికి వెళ్లిపోతున్నాం, ఆపెట్టె తీసుకునిరా!" అంటూ భ్రమర గబగబా వెళ్లిపోయింది. దించిన పెట్టెను మళ్లీ ఎత్తుకుని బండివాడు ఆమె ననుసరించాడు.

విగ్రహంమాదిరిగా వెంకటేశ్వర్లు అట్లానే నిలబడి ఉన్నాడు.

౧౩

"నాన్నా, నేను జుట్టు తీయించుకుంటాను. మంగలవాణ్ణి పిలిపించు!" అన్నది భ్రమర.

ఆమె తల్లి అందుకుని, "చాల్లే, నీకేమైనా మతి చెడుతున్నదా ఏమిటి?" అని కసిరింది.

౧౪

భ్రమర కళ్లఎదటినుంచి తొలిగిపోయినా వెంకటేశ్వర్లు మనసులోనించి తొలిగిపోలేదు. ఆమె జీవితంలో ఈమధ్య గడిచిన రెండు మూడేళ్ల కాలాన్నీ భగవంతుడు రబ్బరుతో తుడిపినట్టయింది. భ్రమర చిన్ననాటినించీ ఈనాటివరకూ తనదే ననిపించింది అతనికి. భ్రమర కాకుండా మరొకరిని ప్రేమించటం, మరొకరిని ముట్టుకోటం, ముద్దుపెట్టుకోవటం అసంభవం, తనకు భ్రమరే కావాలి!

వెంకటేశ్వర్లు చకచకా తండ్రిదగ్గరికి వెళ్లాడు. తండ్రి తనవంక ఆశ్చర్యంతోనూ అసహ్యంతోనూ చూసి "ఏం"? అనేటప్పటికి అతనినుండె బద్దలైపోయింది. లాభంలేదు; తనకోరిక ఆయనతో చెప్పటం అసంభవం.

౧౫

కనీసం భ్రమరతోనైనా తన అప్రయోజకత్వం చెప్పేస్తే ఆమె ఏదైనా ఉపాయం చెప్పవచ్చునని వెంకటేశ్వర్లు వీధి దాటి భ్రమరఇంట ప్రవేశించాడు. భ్రమర ఎక్కడా కనిపించలేదు. ఆమెతండ్రి ఇంటో ఉన్నట్టు లేదు. తల్లి మడికట్టుకుని వంటింటో ఉన్నది.

"పిన్నీ, భ్రమర ఏదీ ?"

"ఏమో, వాయనా గదిలో లేదూ ? ఊరినించి వచ్చి ఇంకా స్నానమైనా చెయ్యలేదు చూస్తూ!"

వెంకటేశ్వర్లు గదిదగ్గిరికి వెళ్లి "భ్రమరా !" అని పిలిచాడు. సమాధానం లేదు. ఆతను తలుపు నెట్టాడు. దగ్గిరిగా వేసి ఉన్న తలుపులు తెరుచుకున్నై. లోపలిదృశ్యం చూసి వెంకటేశ్వర్లు నిశ్చేష్టుడై నిలబడ్డాడు.

గదినిండా వెంట్రుకలు ! వికారమయిన తలతో భ్రమర పక్కమీనపడి ఎక్కెక్కి ఏడుస్తున్నది. ఆమె భ్రమరఅయి ఉంటుందని వెంకటేశ్వర్లు ఊహించవలిసి వచ్చింది. అత నామెను ఆతలతో గుర్తుపట్టలేదు.

౧౬

వెంకటేశ్వర్లువివాహం వైభవంగానే జరిగింది కాని పెళ్లికి భ్రమర రాలేదు. ఆ అవతారంతో ఎట్లా వస్తుందీ ?

భ్రమరను చేసుకోలేకపోయినందుకు వెంకటేశ్వర్లు తనమనస్సును సులభంగానే సమాధానపరుచుకోకలిగాడు — ఏమంటే భ్రమర జ్ఞాపకం రాగానే అతనికి ఆనాడు చూసిన భ్రమరతల తప్ప చచ్చినా మరొకటి జ్ఞాపకం వచ్చేదికాదు !

పరివేదన

హనుమచ్ఛాస్త్రి

పేర్చుకొనుగాసి మొగిళులు పింజెలగును,
మెఱపుమెఱసినయాశ నిమేషమాత్ర
నంతట మఱింతఁ గ్రమ్ము దుఃఖాంధపటలి,
జీవనవిహాయసమ్ము, భయావహమ్ము.

క్రమ్ముకొనియున్న శోకధారాధరములు,
నల్ల, నల్లనిబండలై, నాశిరమ్ము
బీటులైపోవఁ బాషాణవృష్టిఁ గురిసి
పొడిపొడిగఁ జేయనిమ్ము నాయొడలి నిపుడు.

ఇవ్వి యవ్వియు నాకేల నీదరిద్ర
జీవితమ్ము దుఃఖాంతము చేయుకొఱకు,
అస్మదీయ హృదయకుహరాంతరజ్వ
లితమహాక్షుధాక్షుభితకీలికలు లేవె.

నాది మధురప్రవృత్తి యనాహతములు,
బాధ లివ్వాని భరియింప, వలనుగాదు,
ఈనికృష్టకష్టముల సహింపఁగలిన
శిలల నంతరంగమున దాచికొనలేదు!

ఎన్నిజన్మాలపుణ్యమో యెవ్వఁ డెఱుఁగు,
సర్వకిల్బిషపంకప్రక్షాళకములు,
స్వచ్ఛగంగాస్రవంతీపయఃకణములు,
నర్తనముసేయు నా నయనాగ్రతటుల!

ఫాసిస్టు ఇటలీ; నిరుద్యోగ సమస్య

కొచ్చెర్లకోట సత్యనారాయణమూర్తి

"రాజదండంబునకు వెరచియే లోకంబు స్వధర్మనిరతంబై దాన నుత్తమతేజంబు వడయుచుండు, స్వధర్మాచరణంబు సుఖకరంబైన తపంబు ... రాజు స్వధర్మనిరతుండు గాడేని యతని తేజంబు క్షయించు. కావున నభిషిక్తుండైన గానివాడైన పాలనంబు సేయు నారంభించినవాడగోలె నచ్ఛిద్రుండై స్వధర్మపరతంత్రుండై బుద్ధిశౌర్యతపోబలంబులచే బ్రజ దనప్రజబోలె బాలించుచు దుర్జనుల మహోగ్రకుహేతువులను దండంబులచే భీతులజేయుచు స్వధర్మాచరణంబునకు మరల్పవలె."

— శుక్రనీతిసారము. ౧ అధ్యా.

నేను ఇటలీ, జర్మనీ మొదలైన పశ్చిమదేశాలలో విజృంభిస్తూవున్న జాతీయోద్యమాలు స్వార్థపరమైనవనీ, ఐహికమైనవనీ, పరులఅభివృద్ధిని సహించలేనివనీ, యుద్ధప్రయత్నాలతో నిప్పులు కక్కుతున్నాయనీ, మనిషిరక్తం కళ్ల చూస్తేనేగాని ఆగవనీ మనం అనుకుంటున్నాము. బలంగల దేశాలచేతులలో నలిగిపోయిన జెకోస్లోవేకియా, స్పెయిను, చీనాదేశాల జాతీయతలెడల మనసానుభూతిని తెలుపుతున్నాము. రక్తదాహం మనకు కూడని పని అని భావిస్తున్నాము. కాని జాతీయభావం నేడు మన దేశంలో ఎంత సాత్వికంగా ప్రారంభమైందో, ఇటలీ జర్మనీలలోకూడా ఆదిలో అంత సాత్వికంగానే ప్రారంభమైన దన్న సంగతిని మరిచిపోతున్నాము. ఇటలీలో మేజినీ, జర్మనీలో ఫిష్టు మొదలైన జాతీయనాయకు లందరూ వ్యక్తిస్వాతంత్ర్యంకోసం, పరస్పరసహాయంకోసం సానుభూతికోసం పోరాడినవారే. అందుకోసం, తమ జీవితాలను అర్పించిన ఆ నాయకుల పవిత్రనామాలను ప్రపంచచరిత్ర యెన్నటికీ మరిచిపోజాలదు.

గంగానది శివుడిశిరస్సుమీద పుట్టి భూమికి దిగి సకలకల్మషాలతోను కలిసి తుదకు సముద్రంలో అంతరించి నట్లే, అంతటి పవిత్రస్థానాలలో ఉదయించిన జాతీయోద్యమాలు ఐరోపాఖండంలో నేటికీవిధంగా పరిణమించాయి. కడచిన ఐరోపాయుద్ధంతో జాతీయసమస్య మరీ బిగిసిపోయింది. అంతర్జాతీయవ్యవహారసరళిలో పరస్పరవిశ్వాసాలూ సానుభూతీ నశించి, పరస్పరస్పర్ధా, విరోధాలూ ఏర్పడ్డాయి. నీతినియమాలకు వాటిలో తావే లేకపోయింది. 'ఉద్ధతులమధ్య పేదల కుండ తరమె' అన్నట్లు బలవంతులనడుమ బలహీనుల మనుగడ అసాధ్యమైంది.

విద్యావిషయంలో ఈమార్పు స్పష్టంగా అగపడుతోంది. సామ్యవాదసిద్ధాంతాలకు సూత్రకారుడైన కారలు మార్క్సు అనునతను ౧౮౬౬ లో జరిగిన అంతర్జాతీయసభలో విద్యనుగురించి ఒకగొప్ప తీర్మానాన్ని ఉపపాదించాడు. అందులో అతడు విద్యను (౧) మానసికమనీ, (౨) దేహసంబంధమనీ, (౩) వృత్తులకు సంబంధించిన సాంకేతికమనీ మూడుభాగాలుగా విభజించాడు. నీతికీ, మతానికీ, భగవంతుడికీ అందులో తావే లేకపోయింది!

కడచిన ఐరోపాయుద్ధం కొద్దిగానో గొప్పగానో ప్రపంచాన్ని యావత్తునూ కలవరపరచినా ముఖ్యంగా ఐరోపాఖండాన్ని దహించివేసింది. అందువల్ల మిక్కిలి బాధపడిన దేశాలలో ఇటలీ వకటి. ఇటలీదేశం పేరుకు యుద్ధంలో గెల్చిం దన్నమాటేగాని, కొనఊపిరితో, జీవచ్ఛవమై బైటపడింది. వెర్సైల్సుసంధిలో తనకు మోసం జరిగిందని తెలుసుకుంది. తనప్రజలలో ఐకమత్యం లేదు. రోములో పోపుఅధికారం పెనుముఖంగా

వుంది. పోపునూ, కాథలిక్కుమతాన్ని కూడగట్టుకుని వస్తేనేగాని దేశంలో ఐక్యత ఏర్పడదన్న జ్ఞానం ప్రభుత్వానికి లేకపోయింది. ఆర్థికంగా దేశంలో దుర్భిక్షం ఏర్పడింది. ప్రభుత్వానికి దేశంలో బలమూ లేదు. పలుకుబడీ లేదు. ఐశ్వర్యాభివృద్ధినీ, ఐక్యతనూ నెలకొల్పగల శక్తిసామర్థ్యాలు లేవు. తల కొక దారి, తల కొక మతం, తల కొక వేదాంతం చొప్పున నలుముఖాల చెల్లాచెదరైన జాతిని కూడగట్టుకొనివచ్చి ప్రజల జవసత్వాలను సార్థకంగా దేశాభ్యుదయంకోసం వినియోగించాలి. ప్రజలు అజ్ఞానులై, అర్థం తెలియకుండా మంత్రాలలాగా స్తరుగా జపిస్తూవున్న కమ్యూనిజం, సోషలిజం, మార్క్సిజం, సిండికలిజం, రోమనిజం మొదలైన పిచ్చిపిచ్చి ఉద్యమా లన్నిటినీ నిర్దాక్షిణ్యంగా, అవసరమైతే కత్తితో, అణగదొక్కాలి. దుర్భరమైన ఇట్టిపరిస్థితులలోనుంచి జాతిని ఉద్ధరించగల అవతారమూర్తి అవసరమైనాడు. ఇది సామాన్యమైనవిషయం కాదు. క్రమంగా ఏళ్లతరబడి జరగవలసిన కార్యక్రమం గాని ఒక్కనాటితో ముగిసేదికాదు. జాతిఅభ్యుదయం, జాతిపునరుద్ధరణ, ఇవి ముఖ్యమైన ఆదర్శాలు. వ్యక్తులు తమ క్షేమంకూడా మరిచిపోయి ఆ ఆదర్శాలకు తల లొగ్గవలసిందే. ముస్సోలినీ నాయకత్వంకింద ఫాసిస్టు పార్టీ ఈపనిని చేయడానికి పూనుకుంది.

౧౯౩౦ లో పోపుకూ, ఫాసిస్టుపార్టీకీ రాజీ నామా జరిగింది. స్కూలులలో పిల్లలు ఈ విధంగా చదవడం ప్రారంభించారు.

“మతసిద్ధాంతాలను అనుమానించగూడదు; ఎందుచేతనంటే అవి యథార్థమని భగవంతుడే తెలియజేశాడు. ఫాసిస్టుసిద్ధాంతాలను అనుమానించగూడదు; ఎందువల్లనంటే అవి మేధావియైన ముస్సోలినీ మెదటిలోనుంచి వచ్చినవి.”

ఈ లోపుగా ఫాసిస్టుపార్టీవారు బాల బాలికల సంఘాలద్వారా, యువజనోద్యమాలద్వారా చిన్నవారు నందరినీ తమవైపుకు తిప్పుకుంటున్నారు. తరతరాలు తమ ఉద్యమం నిర్విఘ్నంగా కొనసాగాలని వారి ప్రయత్నం. పరమసర్వంకష ప్రతిభగల ఫాసిస్టునాయకుడు దుర్నిరీక్ష్యప్రతాపుడు. అతడు ఆకాశంలో వెలుగుతూవున్నంతకాలం మరొకరి కచ్చట తా వుండదు. సర్వతోముఖమైన అతనిప్రజ్ఞ ఇతరులపోటీని సహించదు. రోమనుకాథలిక్కుమతానికీ, ఫాసిస్టుపార్టీకీ, ఇటలీలో ఆధిక్యతకోసం, ఎప్పుడో ఒకప్పుడు తిరిగి పోట్లాటలు తప్పవని ఇప్పటికీ అనుకుంటున్నారు.

“పదమూడేళ్ల కాలంలో ముస్సోలినీ ఇటలీదేశాన్ని మిక్కిలి శక్తివంతమైన రాష్ట్రంగా మార్చివేశాడు. ఆ దేశస్థులలో మిక్కిలి ఆకాంక్షాపరులుకూడా ఇంత త్వరలో ఇంతటిమార్పు సాధ్యమని కలలోనైనా ఊహించలేదు” అని షైన్ విల్లు అనే ఫ్రెంచిచరిత్రకారుడు వ్రాశాడు. “ఇంతటి మార్పును తీసుకొని వచ్చిన శక్తి, ఇటాలియనుప్రజల గాఢమైన, యుద్ధానికెప్పుడూ సంసిద్ధంగా వున్న నిరంకుశమైన జాత్యభిమానం.”[1]

ముస్సోలినీయే ఈ ఉద్యమానికి చిహ్నం. కాని అసలు అధికారం అంతా ఇటాలియనుప్రజలది. రాజకీయంగా, ఆర్థికంగా, సాంఘికంగా, శౌర్యస్థైర్యాలలో వలససామ్రాజ్యవిస్తీర్ణతలో ప్రాచీనరోమను వైభవాన్ని, ఔన్నత్యాన్ని, తిరిగి నేడు ప్రతిష్ఠచెయ్యాలి. ఇటలీదేశం అంటే ఐరోపాఖండానికంతకీ తిరిగి సింహస్వప్నం కావాలి. ఇటాలియనుజాతిని ఉత్సాహపూరితమైన స్వార్థత్యాగానికి పురికొల్పిన మహోద్రేక మిదే. మెజీని, గారిబాల్డి, కవూరు, మొదలగు ఇటాలియను నాయకుల నాటినుంచి నేటివరకు దేశభక్తియే ఇటాలియనుజాతిని మేల్కొల్పి వారికి దుర్నిరీక్ష్యమైన తేజస్సును, ప్రతాపాన్ని, జవసత్వాలను సమకూర్చిన మహామంత్రం. ఫాసిస్టుపార్టీ ఇటాలియను జీవితాన్ని పూర్తిగా మార్చివేసిందని చెప్పవచ్చును. కాని ఆమార్పులన్నిటిలోను ముఖ్యమైనది, ఆపార్టీ సాధించిన మహత్తరకార్యాలన్నిటిలోను మిక్కిలిమహత్తరమైనది, దేశమంతటా ఒక్క జాతీయ విద్యావిధానాన్ని స్థాపించడం. అంతకు

1. I. L. Lorwin "What is the International Problem?", P. 143.

పూర్వం విద్యావిధానం, ప్రదేశాని కొక్కతీరుగా వుండేది. విద్యాసంస్కృతులలోను, ఆదర్శాలలోను ఐక్యతగాని, జాతీయభావంగాని లేవు. కాబట్టే రాజకీయంగా మాత్రమే కాకుండా విద్యాసంస్కృతులలో కూడా జాతిని ఐక్యంచెయ్యాలి. కొత్తనీతినియమాలను, ఆదర్శాలను ప్రజలకు బోధించాలి. కొత్తకార్యక్రమాన్ని ప్రజలముందు పెట్టాలి. ఈ ఆదర్శాలు ఎట్టివి? సంఘం అంటే కేవలం వ్యక్తుల సమూహంమాత్రమే కాదు. స్వార్థపరులైన పార్టీనాయకుల చేతులలో కీలుబొమ్మ కాదు. అది సజీవమైన ఒకసంస్థ. దానికీ పుట్టుకా, ఎదుగు బొదుగులూ కలవు. అది జీవించడం ఇప్పటివారికోసంమాత్రమే కాదు; వారిలో కొందరు స్వార్థపరుల స్వలాభంకోసంమాత్రమే కాదు. ఇక ముందు రాబోయే తరతరాల అభివృద్ధికోసంకూడా సంఘం నిర్మితమయింది. అంతమాత్రాన వ్యక్తులలాభం గమనించ నక్కరలేదని కాదు. కాని వ్యక్తులు తమలాభం చూసుకోవడంలో సంఘక్షేమం మరిచిపోతున్నారు. ఫాసిస్టుపార్టీ ఉద్దేశం అది కాదు. వారిఉద్దేశంలో, సంఘక్షేమానికి లోబడి, వ్యక్తులు తమలాభనష్టాలను, క్షేమాన్ని గమనించుకోవాలి. సంఘక్షేమానికి భంగం కలగకుండా వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని యథేచ్ఛగా అభివృద్ధి చేసుకోవచ్చును; అనగా, తమస్వలాభం చూచుకునే పార్టీలకు, కక్షలకు రాష్ట్రంలో తావుండకూడదు. విద్యయొక్క ఉద్దేశం కేవలం వ్యక్తుల లాభం మాత్రమే కాకుండా జనసామాన్యంలో జాతీయభావాన్ని, ఆర్థిక పరిస్థితులను అభివృద్ధిచేయడం కూడాను. దేశం బీదస్థితిలో వుంది. ఇటలీదేశపు జనసంఖ్య ౪ కోట్లు; జాతి ఐశ్వర్యమంతా కలిపి ౨౫ బిలియనుడాలర్లు. తమపొరుగున వున్న ఫ్రాంసుదేశంలో కూడా అదే జనాభా; జాతీయఐశ్వర్యం ౬౦ బిలియనుడాలర్లు. ఇటలీలో ప్రకృతిసిద్ధంగా రాక్షసిబొగ్గు, ఇనుము, నూనె, పత్తి, మొదలైన ముడిపదార్థాల సప్లై తక్కువ. వ్యవసాయమే ప్రధానవృత్తి. కాని మొత్తం నేలలో సగభాగంమాత్రం వ్యవసాయానికి పనికివస్తుంది. వ్యవసాయపు పద్ధతులు బహుపురాతనమైనవి. పండవలసిన పంటలో సగంమాత్రమే పండుతోంది. ప్రజలు బీదవారు. వారికి విద్యాజ్ఞానం తక్కువ. విద్యాభ్యాసానికి అవకాశాలు లేవు. బీదవారు భాగ్యవంతులు అన్న వ్యత్యాసాలు, ప్రజాసామాన్యంయెడల తమ విధ్యుక్తధర్మాలను గుర్తెరిగే జ్ఞానంలేని భాగ్యవంతులు-ఇటువంటి పరిస్థితులవల్ల బీదవారి దారిద్ర్యానికి అజ్ఞానానికి విమోచనం కనపడడంలేదు. దానికితోడు ధరలు వృద్ధులు యుద్ధానంతరం మందగించాయి. నిరుద్యోగ సమస్య అధికమైంది. ప్రజల ఆర్థికపరిస్థితులను అభివృద్ధిచేయడం అవసరమైంది. దేశాన్ని ఆర్థికంగాను, సైనికంగాను సంరక్షించడం అంతకంటె ముఖ్యమైన విషయం. ఆర్థికసంరక్షణ అనేకవిధాలుగా వుంది. ఒకవంక ఆఫ్రికాలో అబిసీనియారాజ్యంకోసం పోరాటం; మరోవంక దేశంలో తిండిగింజపంటలను, అందులోనూ ముఖ్యంగా గోధుమపంటను, అభివృద్ధిచెయ్యడంకోసం దండెత్తడం; ప్రధానవృత్తులకు పరిశ్రమలకు ధనసహాయం చెయ్యడం. కాని ఖజానాలో పైకం లేదు. అందువల్ల ప్రజలందరూ తక్కువ ఆదాయంతో తృప్తిపడి మిగిలినదంతా ప్రభుత్వానికి సమర్పించవలసి వచ్చింది. "ఇటాలియను ప్రజలందరూ దేశంయొక్క ఆర్థికఅభివృద్ధికి తోడ్పడాలి— పెట్టుబడిదారులు తమ పెట్టుబడులతోటే, పనివాళ్లు తమ పనిపాటులతోటే, మేధావంతులు తమ తెలివితేటలతోటి" అని ౧౯౩౨ లో ముస్సోలినీ ప్రకటించాడు. మనుష్యబలాన్ని దేశాభివృద్ధికోసం ఉపయోగించేటందుకు స్కూళ్లలో వృత్తివిద్యకు, వృత్తినిరూపకఉద్యమాలకు, విరివిగా ప్రోత్సాహం ఇస్తున్నాడు. ప్రజలలో జాత్యభిమానం, ఐక్యభావం పెంపొందించడానికీ, ఆర్థికపరిస్థితులను అభివృద్ధిచేయడానికీ, బాలురలోను బాలికలలోను ఫాసిస్టుసిద్ధాంతాలను ప్రచారంచేయడానికీ, స్కూలు ప్రభుత్వంచేతిలో ఒక సాధనంగా ఉపయోగపడుతోంది. అది సహజమే! ప్రతిదేశంలోను నూతన ఉద్యమాలను ప్రచారంచేయడానికి స్కూళ్లు చాలా సహాయంచేయడం మనం ఎరుగుదుము. శంకరుడు, రామానుజుడు, బుద్ధుడు, మొదలగు మతసంస్కర్తలు, ఇటీవల మార్క్సు, లెనిన్ మొదలగు సంఘసంస్కర్తలు బాలుర విద్యకు చాలా ప్రాముఖ్యము ఇచ్చారు. నెపోలి

యనుచక్రవర్తి, తనజీవితంలో చాలా గొప్పయుద్ధాలలో పక్కైన ఆస్ట్రిలిట్జియుద్ధం రేపు జరుగుతుందనగా ఆరాత్రి యుద్ధభూమిలో కూర్చొని ప్యారిసునగరంలోవున్న తన మంత్రికి రిపోర్టు వ్రాసినవిషయాలలో ఒకటి - ఫ్రాంసులో స్త్రీవిద్యను అభివృద్ధిచెయ్యడంనుగురించి. రష్యాలో బొల్షివిక్కులు అధికారానికి వచ్చిన నాలుగోరోజునే విద్యాసంస్కరణను ప్రారంభించారు. మనదేశంలో, నేడు కాంగ్రెసు ఏడురాష్ట్రాలలో అధికారం సంపాదించినవెంటనే గాంధీమహాత్ముడు తనవార్ధా విద్యావిధానాన్ని బైటపెట్టాడు.

నిజమైన జాతీయనాయకులు స్కూలుపిల్లలను గుర్తించకపోలేదు. రష్యాలో అది మంచి 'కమ్యూనిస్టు'లను తయారుచేస్తోంది; జర్మనీలో మంచి 'నాజీ'లను తయారుచేస్తున్నది. అదేవిధంగా అది ఇటలీలో మంచి 'ఫాసిస్టు'లను తయారుచేస్తోంది. ఫాసిస్టుపార్టీవారు స్కూలుపిల్లలకు ఫాసిస్టు ఆదర్శాలమీద అభిమానం కలుగజేస్తున్నారు. స్కూలుపుస్తకాలు ఇటలీకీర్తిని, ఫాసిజంఆధిక్యతను, ముస్సోలినీ గొప్పదనాన్ని ఉగ్గడిస్తున్నాయి. దేశచరిత్రపాఠాలు ఇటాలియను ప్రజల శౌర్యధైర్యసాహసాదులను త్యాగాన్ని దేశభక్తిని వర్ణిస్తున్నాయి. వ్యాయామశాలలు ఇటాలియను సైనికుల ధైర్యస్థైర్యాలను, వినయవిధేయతలను బోధిస్తున్నాయి. సాంఘికశాస్త్రాలు ఫాసిస్టుప్రభుత్వం ప్రజల ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధికోసం పాటుపడుతూవున్న విధానాలను వివరిస్తున్నాయి. మతసంస్థలు ఇటాలియను ఋషుల గొప్పతనాన్ని బోధిస్తున్నాయి [2]. "మంచి" ఇటాలియను జాతీయునికి ఉండవలసిన ("మంచి" ఇటాలియను అంటే వారి అభిప్రాయంలో, ఫాసిస్టుపార్టీలో నమ్మకమైన సభ్యుడు అని అర్థం) లక్షణాలను, అతడు చేయవలసిన ఘనకార్యాలను విద్యార్థులకు నొక్కి చెప్పుతున్నారు; క్లాసులలో ఉపాధ్యాయులచేత చెప్పిస్తున్నారు. ఫాసిస్టుపార్టీయెడల ఉత్సాహంలేని ఉపాధ్యాయులకు ఉద్యోగాలు దొరకటంలేదు. దొరికినా ఎంతోకాలం నిలవటంలేదు. నేటి ఇతర నిరంకుశప్రభుత్వాలలో మాదిరిగానే ఇటలీలో కూడా ప్రభుత్వం యువజనోద్యమాలనుగురించి చాలా శ్రద్ధ తీసుకుంటోంది. నేటిబాలురే, బాలికలేకదా ముందుముందు పౌరులు. ౮ మొదలు ౧౪ ఏళ్లు వయస్సుగలబాలురకు 'గ్రప్పో బలిల్లా' సంఘాలు కలవు. బాలురకు వారి ౧౪-వ ఏట మిలటరీతర్ఫీదులలోను ౧౮-వ ఏట వాలంటరీమిలటరీదళంలోను ప్రవేశం లభిస్తుంది. ఈ సంఘాలఉద్దేశం యువకుల ఆరోగ్యమూ, నీతీ అభివృద్ధిచేయడం. 'బలిల్లా' సంఘంయొక్క ఉద్దేశం విద్యార్థులలో జాతీయతను, దేశభక్తిని, ఫాసిస్టుసిద్ధాంతాలను పెంపొందించడం. అది మతవిద్యను, మతభక్తిని, ఆధ్యాత్మికవిలువలను ప్రోత్సహిస్తోంది. మిలటరీతర్ఫీదుకు అవసరమైన ఆటలను కసరత్తులను ఏర్పాటుచేస్తోంది: ఇప్పటి యువకులను మంచి ఫాసిస్టులనుగా తయారుచేస్తోంది.' [3]

బాలురకున్నట్లే ౮ మొదలు ౧౮ ఏళ్ల వయస్సుగల బాలికలకుకూడా ఇటువంటిసంస్థలున్నాయి. వాటిలో, బాలికలకు ఉచితమైన శరీరవ్యాయామం, సాంఘికకార్యక్రమం, దేశభక్తిపూరితమైన విద్య—వీటిని ఇచ్చి తమ ఇండ్లను చక్కబెట్టుకునే శక్తితోపాటు ఫాసిస్టుపార్టీయెడల, దేశంయెడల, భక్తివిశ్వాసాలను బాలికలకు నేర్పుతున్నారు.

"ఇటలీ దేశపు ప్రకృతిసంపదలోవున్న లోటుపాట్లను సాధ్యమైనంతవరకు సవరించి, ప్రజల దారిద్ర్యాన్ని నిర్మూలించడంకోసం, యువకులకు తగిన సాంకేతికసాధనసంపత్తిని సమకూర్చేఉద్దేశంతో, ఫాసిస్టుపార్టీవారు స్కూళ్లలో వృత్తితర్ఫీదుకు ప్రోత్సాహమిస్తున్నారు." ముస్సోలినీప్రధానియొక్క విద్యామంత్రియైన జెంటైలు అనునతడు ౧౯౨౩ లో ఇటాలియను విద్యావిధానాన్ని పూర్తిగా సంస్కరించాడు. ఆ సంస్కరణలలో వృత్తివిద్యకు చాలా ముఖ్యమైన స్థానం ఇచ్చాడు. ప్రైమరీక్లాసు దాటినతర్వాత స్కూలుచదువులు ప్రజల ఆర్థికాభివృద్ధికి అనుకూలంగా

---

2. S. B. Clough— The objectives of of Education in Facist Italy, Vol. II, P. 185.
3. I. L. Kandel—'Comparative Education,' P. 166.

వుండాలన్నది ఆ సంస్కరణల ముఖ్యసూత్రాలలో ఒకటి.

౬ మొదలు ౧౪ ఏళ్లవయస్సు వచ్చేవరకూ ఇటలీలో పిల్ల లందరికీ విద్య నిర్బంధం. ఇటలీ పాఠశాలావిధానం ఈ క్రిందివిధంగా వుంది:

౧. ప్రవేశతరగతి:

౩ ఏళ్లకాలం: ౩ మొదలు ౬ ఏళ్లు వయస్సు వరకు.

౨. ఎలిమెంటరీ స్కూళ్లు:

౫ ఏళ్లు: ౬ మొదలు ౧౧ ఏళ్లు వయస్సు వరకు: ౧౫ మంది విద్యార్థులు దొరికిన చోటల్లా ఎలిమెంటరీస్కూళ్లు పెట్టవచ్చును. ప్రైవేటు వ్యక్తులు, సంస్థలుకూడా వాటిని నడపవచ్చును. ప్రభుత్వం ధన సహాయం చేస్తోంది. తాత్కాలికంగా పనులు జరిగే, నలుగురు మూగేచోట్లలోనైనాసరే, పొలంపనులు విరివిగా జరిగేచోట్లనైనాసరే, కొల్లవాళ్లు కలుసుకునే చోట్లనైనాసరే, శాశ్వతంగా ఎలిమెంటరీస్కూలు పెట్టడానికి వీలులేని మరిఎక్కడనైనాసరే తాత్కాలికంగా ఎలిమెంటరీ స్కూళ్లను పెట్టవచ్చును.

౩. ప్రత్యేక తరగతులు:

ఐదేళ్లకాలం ఎలిమెంటరీ స్కూళ్లలో చదివి చదువులు ముగించిన విద్యార్థులలో సెకండరీ స్కూలుకు పోజాలనివారికి ప్రత్యేకంగా మూడేళ్లకాలం, అనగా వారి ౧౪-వ యేటివరకూ, వృత్తివిద్యలలో ప్రవేశం కలగచేస్తారు. సామాన్యవిద్యతోపాటు యంత్రాలలో పని, ఇండ్లకు కావలసిన ఎలక్ట్రిక్ పనిముట్లు, వ్యవసాయము, ఏదో ఒక చేతిపని, నౌకాప్రయాణ పద్ధతులు, వంటచేయడం, గృహసంబంధమైన చిత్రకళలు, మరమ్మతులు, లెక్కలు పుస్తకాలు వ్రాయడం మొదలైన పనులలో ప్రవేశం కలుగజేస్తారు.

౪. సెకండరీవృత్తి స్కూళ్లు:

సెకండరీస్కూళ్లలో చెప్పతగ్గవి సెకండరీవృత్తి స్కూళ్లు. వీటిని ౧౯౩౦ లో ప్రారంభించారు. ఎలిమెంటరీ స్కూళ్లలో ఐదేండ్లకాలం చదివినవిద్యార్థులుగాని, ఎలిమెంటరీస్కూళ్లలో చదవకుండానే సెకండరీస్కూలు ప్రవేశపరీక్షను ప్యాసైన ౧౦ఏళ్ల వయస్సుగల బాలురుగాని సెకండరీ వృత్తిస్కూళ్లలో చేరవచ్చును. వీటిలో మూడేళ్లకాలం వృత్తులకు సంబంధించిన చదువులను నేర్పుతారు. ఎలిమెంటరీస్కూలు చదువులను ముగించిన విద్యార్థులకు పరిశ్రమలు, వృత్తులు, వ్యాపారాలు, వ్యవసాయం మొదలైన వృత్తులలో ప్రవేశం కలగచెయ్యడంకోసం ఈస్కూళ్లు ఉద్దేశింపబడ్డాయి. ఆయాప్రదేశాలలో విస్తారంగా సాగుతూవున్న వృత్తులను వ్యాపారాలను అక్కడ స్కూళ్లలో నేర్పుతారు. ఉదా: రేవుపట్నాలలో నౌకలకు సంబంధించినవి, వ్యవసాయం జరిగేచోట్ల ఆవృత్తిని నేర్పేస్కూలులో రెండు మూడువృత్తులను నేర్పడంకూడా కలదు. పెద్దపట్నాలలో అన్నిరకాలస్కూళ్లు వుంటాయి గాని, పరిశ్రమలకు వర్తకవ్యాపారాలకు సంబంధించినవి అధికంగా వుంటాయి. ఈస్కూళ్లన్నిటిలోను ఆడపిల్లలుకూడా చేరవచ్చును. వారికి మూడేళ్లకాలం స్త్రీలకు సంబంధించినవృత్తులను నేర్పేస్కూళ్లుకూడాకలవు. ఇటాలియనులకు ప్రత్యేకానుభవంయెడల మిక్కిలి అభిమానం. విద్యార్థుల కార్ఖానా తర్ఫీదును గురించి చాలా శ్రద్ధను తీసుకుంటున్నారు. సెకండరీవృత్తి స్కూళ్లలో విద్యార్థులు విద్యార్థినులు స్కూలుజీతా లియ్యనక్కరలేదు. మొదట రెండేళ్లలో విద్యార్థులు వృత్తినిరూపక ఉద్యోగిసహాయంతో, తాము ఏయేవృత్తులకు అర్హులో నిశ్చయించుకుంటారు. మూడో యేడు ఆవృత్తులను ప్రత్యేకంగా అభ్యసిస్తారు.

౧౮ఏళ్లు వయస్సులోపు యువకు లందరూ నిర్బంధంగా వారానికి ౪గంటలకాలం ఏదో వృత్తి స్కూళ్లలో వృత్తి విద్యను అభ్యసించాలి.

సెకండరీస్కూళ్లకు పైన యూనివర్సిటీలు, అందుకు సంబంధించిన ఉన్నత సామాన్యవిద్యాసంస్థలు, సాంకేతికవిద్యాసంస్థలు కలవు. వాటిలో చదువుల కయ్యే ఖర్చులు అధికం కాబట్టి భాగ్యవంతుల బిడ్డలు మాత్రమే అక్కడ చదవగలుగుతున్నారు. వాటిలో చదివే విద్యార్థులలో చాలామంది శిల్పశాస్త్రం, ఇంజనీరింగు, జంతువైద్యం, వ్యవసాయం మొదలైన వృత్తివిద్యలను అభ్యసిస్తున్నారు. బహుకొద్దిమంది మాత్రమే పండితవృత్తులను అభ్యసిస్తున్నారు. ఉదా

కారణః ౧౯౨౮-౨౯ లో ౮౪,౧౯౦ మంది విద్యార్థులు ఉన్నతవిద్యాసంస్థలలో చేరారు. వారిలో వేదాంతం, వాఙ్మయం మొదలైన సామాన్యచదువులలో చేరినవారు ౨,౩౭౮ మంది; ప్లీడరీచదువులవారు ౮,౮౩౫ మంది; ౮,౯౮౫ మంది డాక్టరు చదువులలో చేరారు. మిగిలినవారు ఏవో పారిశ్రామికవృత్తులలో చేరారు. సెకండరీవిద్యను, ఉన్నతవిద్యను విద్యార్థులలో వృత్తిజ్ఞానం పెంపొందించడానికి, వివిధశాఖలలో జాతికి నాయకులుగా ఉండతగినవారిని ఏరడానికి ఉపయోగిస్తున్నారు. ఈ విద్యార్థులు ముందు ముందు జాతీయ అభిమానాన్ని, ఆర్థికపరిస్థితులను అభివృద్ధిచేయడానికి సమర్థులుగా వుండాలి. రష్యాలో కమ్యూనిస్టు నాయకులమాదిరిగా ఇటలీలో ఫాసిస్టునాయకులు కూడా ప్రజలలో నిరక్షరాస్యతను పోగొట్టడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇటాలియను స్థానికసంస్థలు వారికి చాలా సహాయం చేస్తున్నాయి. వయసువచ్చినవారిలో నిరక్షరాస్యతను పోగొట్టడంకోసం ఈ మధ్య ఒక ఉద్యమం బైలుదేరింది. ప్రజలకు వ్యవసాయం మొదలైన వృత్తులను నేర్పడంతోపాటు, వారి ఆరోగ్యం అభివృద్ధిచేసి చలిజ్వరం, క్షయ మొదలైన రోగాలను నిర్మూలించడంకోసం గొప్పప్రయత్నాలు జరుగుతున్నాయి. నిరుద్యోగులకు ఏవో వృత్తులను నేర్పి అర్థోత్పత్తిలోకి వారిని ప్రవేశపెడుతున్నారు.

విద్యావిధానంలో ప్రతితరగతిలోను విద్యార్థులకు 'వృత్తిధోరణి'ని, 'వృత్తిఅభిరుచి'ని కలుగజేస్తున్నారు. స్కూలుచదువు ముగిసేటప్పటికి, దేశం యొక్క ఆర్థికపరిస్థితులను అభివృద్ధిచేయడానికి తోడ్పడగల శక్తి సామర్థ్యాలు ప్రతివిద్యార్థికీ కలగాలి. చిన్నప్పటినుంచీ పిల్లల దృష్టిని ఆవైపుకు మరల్చి అందుకు తగిన తర్ఫీదును వారికియ్యాలి. ఇవి ఇటాలియను విద్యాధికారుల ఆశయాలు. "ఆర్థికంగాను, రాజకీయంగాను వృత్తినిరూపకఉద్యమానికి గొప్ప భవిష్యత్తు కలదు. ప్రభుత్వ ఆదర్శాలకు అనుకూలంగా, కార్మికులను తర్ఫీదుచెయ్యడం ఆ ఉద్యమంయొక్క ఉద్దేశం". క్రియలో ఇటలీవిద్యాధికారులు రష్యాలో మాదిరిగా వ్యక్తికే సహాయం చేస్తూవున్నప్పటికీ జాతి అభివృద్ధియే" సంఘక్షేమమే వృత్తినిరూపక ఉద్యమం యొక్క ప్రధానలక్ష్యం.

ఇటలీలో వృత్తినిరూపకఉద్యమం కడచిన ౧౫ ఏళ్లలో బాగా అభివృద్ధిచెందింది. అంతకుపూర్వం అట్టిప్రయత్నాలు లేకపోలేదు. ౧౮౯౩ లో, మార్కోర్టీ అనువాడు, యువకులు తమ వృత్తులను నిర్ణయించుకోవడంగురించి ఒకగ్రంథం వ్రాశాడు. అందులో, వివిధవృత్తులకు ఎటువంటి దైహిక మానసిక లక్షణాలు అవసరం? ఎటువంటి విద్యాజ్ఞానం వుండాలి? వాటిని నేర్పడానికి ఎట్టిస్కూళ్లు తగినవి? — ఇటువంటి విషయాలనుగురించి చర్చించాడు. ఇటీవల అనేక మనస్తత్వపరిశోధకులవల్లా, పరిశోధకసంస్థలవల్లా ఈ విషయంలో చాలా కృషి జరిగింది. కడచిన ఐరోపా యుద్ధంలో గెమెలీ అనేమనస్తత్వపరిశోధకుడు నాయువిమానదళాలలో పనిచేసేవారికి వుండవలసిన మానసికలక్షణాలనుగురించి పరిశోధనలు చేశాడు. మొత్తంమీద మనస్తత్వపరిశోధనలు వృత్తినిరూపక ఉద్యమం అభివృద్ధిచెందడానికి చాలా తోడ్పడ్డాయి. కాని వాటికంటెకూడా వృత్తిస్కూళ్లూ, సాంకేతిక స్కూళ్లూ చాలా సహాయం చేశాయి. ఫాసిస్టుప్రభుత్వం ఈ ఉద్యమానికి ధనసహాయం చేయకపోయినా అనేకవిధాల ఇతరసహాయం చేస్తోంది. ఈ విషయమై విద్యామంత్రి చాలా శ్రద్ధతీసుకుంటున్నాడు. వివిధ స్థానికసంస్థల కృషిని కేంద్రీకరించి ఈ వుద్యమానికి ప్రోత్సాహమివ్వడంకోసం ఒకకేంద్రసంస్థను ఏర్పాటు చేశాడు. దీని అభివృద్ధినిగురించి రిపోర్టుచేయవలసిందని ఈమధ్య ఒకకమిటీను ఏర్పాటుచేశాడు. ఆ కమిటీ చేసిన సిఫారసులు గమనింపతగ్గవి.

౧. విద్యార్థుల వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేయవలసినపూచీ స్కూలుమీద వుంది కాబట్టి వృత్తినిరూపక ఉద్యమాన్ని స్కూలుకు అనుబంధంగా, అందులో ఒకశాఖగా అభివృద్ధిచెయ్యాలి. స్కూలు ఉపాధ్యాయులు ఆయావృత్తులకు సంబంధించిన సంగతిసందర్భాలను విద్యార్థులకు బోధించాలి; విద్యార్థుల 'వృత్తిఅభిరుచులు' మొదలైనవిషయాలను జాగ్రత్తతో గమనించి

వృత్తినిరూపణ సంస్థలకు తెలియచెయ్యాలి; వృత్తులను గురించి విద్యార్థులకు సలహా ఇవ్వడంలో ఆసంస్థలకు తోడ్పడాలి.

(౨) వృత్తినిరూపణ ఉద్యమానికి మన స్తత్వ శాస్త్రం పునాదిగా వుండాలి. విద్యార్థుల ఇష్టాయిష్టాలు అభిరుచులు, తెలివి తేటలు వగైరాలను తెలుసుకోవడంలో ఆశాస్త్ర పరిశోధనమార్గాలన్నిటినీ వినియోగించాలి. అయితే మనస్తత్వపరిశోధనలకన్న, క్లాసులోను కార్ఖానాలోను విద్యార్థి పనిపాటులను, చర్యను, ప్రవర్తనను గమనించడంవల్ల అతణ్ని గురించి ఎక్కువసంగతులు తెలుసుకోవచ్చును. కాబట్టి అతని అభిరుచులను వృత్తిధోరణిని తెలుసుకోవలసిన బాధ్యత ముఖ్యంగా స్కూలుమాష్టర్లమీదా కార్ఖానాల అధికారులమీదా వుంటుంది. వృత్తినిరూపక ఉద్యమాన్ని గురించి వారు అన్ని సంగతులను తెలుసుకోవడం అవసరం. అందువల్ల వారు విద్యార్థులకు ఎక్కువసహాయం చేయకలుగుతారు; ఈ ఉద్యమం అభివృద్ధి చెందడానికి తోడ్పడతారు. మనస్తత్వ పరిశోధనశాల స్కూలుకు తోడ్పడాలి.

మనస్తత్వ పరిశోధనశాలలు స్కూళ్లకు సహాయం చెయ్యడంతోపాటు వివిధవృత్తులను గురించీ, అందుకుపయోగించే లక్షణాలను గురించీ సంగతిసందర్భాలను సేకరించాలి. పరిశోధనలు చెయ్యాలి.

౩. వైద్యపరీక్ష, వృత్తినిరూపక ఉద్యమానికి చాలాసహాయం చేయగలదు. మనస్తత్వ పరీక్షతోపాటు వైద్యపరీక్షవలన విద్యార్థినిగురించి అనేకవిషయాలు తెలుస్తాయి. ఆ విధంగా అతనిలో ఒకవృత్తికి అనుకూలంగాలేని వ్యతిరేక లక్షణాలనుకూడా తెలుసుకోవచ్చును.

౪. ప్రతివిద్యార్థినిగురించిన స్కూలు రికార్డును అతడు పనిలో ప్రవేశించినతర్వాత అతడియజమానికియ్యాలి. ఆ యజమాని ఆరికార్డును విడిచిపెట్టకుండా ఎప్పటికప్పుడు సాగిస్తూవుండాలి. ఆ విధంగా ఆ రికార్డు, పనివాడికీ, యజమానికీ, రాష్ట్రానికీకూడా ఎంతో ప్రయోజనకారిగా వుంటుంది.

౫. యువకులకు వృత్తులనుగురించి సలహా ఇవ్వడంతోపాటు వారికి తగిన నౌకరీలో ప్రవేశపెట్టడంలో కూడా వృత్తినిరూపకసంస్థలు సహాయం చెయ్యాలి.

౬. స్కూలుఉపాధ్యాయులను కూడా వృత్తినిరూపకఉద్యమంలో తర్ఫీదుచెయ్యాలి.

౭. రాష్ట్రప్రయోగంనిమిత్తం ప్రతివ్యక్తీ తన వ్యక్తిత్వాన్ని సాధ్యమైనంతవరకు అభివృద్ధిచేసుకోవాలి. ౧౫ - ౧౮ ఏళ్ల వయస్సుగల యువకులకు యువతులకు వృత్తినిరూపకఉద్యమం అందునిమిత్తం తోడ్పడాలి.

ఇవి, కమిషనుయొక్క ముఖ్యసూచనలు.

ఇటలీలో ఈ ఉద్యమం సాగుతూవున్నవిధం వివరించడానికి ఫ్లారెంసునగరంలోవున్న వృత్తినిరూపక సంస్థను ఉదాహరణగా తీసుకోవచ్చును. ఈ సంస్థ ౧౯౩౦ లో 'లియొనార్డో' డావించే పారిశ్రామిక స్కూలు'లో ప్రారంభింపబడ్డప్పటికీ ఇప్పుడది ఫ్లారెంసునగరంలోవున్న స్కూళ్లన్నిటికీ ఉపకరిస్తోంది. ఆ స్కూల్లో ఎలక్ట్రిసిటీ, రేడియో, టెలిగ్రాఫీ, వాయువిమానయంత్రాలు మొదలైనపనులను నేర్చుకుంటూవున్నవిద్యార్థులున్నారు. ఆ స్కూళ్లలో ఉత్తీర్ణులయే విద్యార్థులు అనేక పారిశ్రామికసంస్థలలో పనిచేస్తున్నారు. ౧౯౩౧-౩౫ లో ఈ సంస్థ ఒక్క డావించీస్కూలులోనే ౨,౭౪౨ మంది విద్యార్థులకు సహాయంచేసింది. ఈ సంస్థ నిర్వహించేపద్ధతులు:

౧. ప్రతివిద్యార్థినీ డాక్టరుచేత సమగ్రంగా పరీక్షచేయిస్తారు. ఏవిద్యార్థి ఏయేవృత్తులకు తగునో, ఏయేవృత్తులకు తగడో ఆవిధంగా తెలుసుకుంటారు.

౨. విద్యార్థి తెలివితేటలను శక్తిసామర్థ్యాలను చేతిపనిలో నిపుణతను అనేకరకాలైన మనస్తత్వపరిశోధనలద్వారా తెలుసుకొంటారు. స్కూలుతరగతులలోను కార్ఖానాలలోను విద్యార్థుల చర్యలనుగురించి ఉపాధ్యాయుల రిపోర్టులను తెప్పించి పరీక్షచేస్తారు. అంతేకాదు విద్యార్థినిగురించి అతడి ఉపాధ్యాయులతో స్వయంగా చర్చిస్తారు.

౩. విద్యార్థి అభిరుచులనుగురించి, కుటుంబ పరిస్థితులనుగురించి, ఆర్థికస్థితిగతులను గురించి విద్యార్థితోను, అతడి తలిదండ్రులతోను స్వయంగా సంప్రతించి అనేకసంగతులు తెలుసుకుంటారు.

సెకండరీవృత్తి స్కూళ్లలో చేరిన కొత్తలోను, అటుపిమ్మట మూడేళ్ల తర్వాతను, విద్యార్థులను వృత్తి నిరూపక సంస్థలలో పరీక్ష చేస్తారు. ఆమూడేళ్లలో కూడా ఉపాధ్యాయుల రిపోర్టులద్వారా విద్యార్థులతో సంబంధం వుంచుకొంటారు. ఒక్కొక్క విద్యార్థి యొక్క వృత్తిఅభిరుచులు, వ్యక్తిత్వం మొదలైన విషయాలలో అభివృద్ధి, మార్పు, ఆగామివృత్తులలో అతడుపొందిన తర్ఫీదు, అందుకు అతనిలో వుండే అనుకూలలక్షణాలు ప్రతికూలలక్షణాలు, వగైరాలనుగురించి తడవ తడవకు తెలుసుకుంటూవుంటారు. స్కూలుచదువు మూడేళ్లూ ముగిసేటప్పటికి ప్రతివిద్యార్థికి ఏదైనా వృత్తిలో ప్రవేశించడమో ఉన్నత సామాన్య లేక, సాంకేతిక విద్యాసంస్థలలో విద్యాభ్యాసం చెయ్యడమో ఇతరరకాలు స్కూళ్లలో చేరడమో—వీటిలో ఏది అనుకూలంగా వుంటుందో దానిని గురించి సలహా ఇవ్వడానికి వృత్తినిరూపకసంస్థ తయారుగా వుంటుంది. ఈవిధంగా సలహా ఇవ్వడంతో పాటు వివిధవృత్తులలో పనిపాటులను గురించి నౌకరీలనుగురించి అందుకు కావలసిన లక్షణాలనుగురించి విద్యార్థులు తెలుసుకోవలసిన విషయాల నన్నిటినీ సేకరించి ఉపన్యాసాలు మొదలైన సాధనాలద్వారా వారికి తెలియచేస్తున్నది. స్కూలువిద్యార్థులకు మాత్రమే కాకుండా తనసలహా కావలసిన ఇతరులకుకూడా సలహా ఇస్తుంది. విద్యార్థులకు తగినవృత్తులను నిరూపించి సలహా చెప్పడం మాత్రమే కాదు; వారావృత్తులలో నౌకరీ సంపాదించి ప్రవేశించడంలోకూడా సహాయం చేస్తుంది. మోటారుబండ్లు నడపడం, గుమాస్తాపని, ఎలక్ట్రికుపనులు, సంగీతం మొదలైన వృత్తులకు అర్హులను నిర్ణయించడంకోసం అనేకరకాల పరీక్షాసాధనాలున్నాయి. ఇతర ప్రదేశాలలో వున్న సంస్థలలో ఇంత విరివిగా కార్యక్రమం అమలులో లేకపోవచ్చును.

వివిధవృత్తులలో నౌకరీలకు కావలసిన లక్షణాలనుగురించి బోధించడంలో ఇటలీదేశం కొంచెం వెనకపడిందని చెబుతారు. ట్యూరిన్ మొదలైన కొన్ని పెద్దపట్నాలలో, యువకులకు వివిధవృత్తులలో అవకాశాలను పెద్దఅక్షరాలతో వర్ణిస్తూ గోడలమీద పెద్దపెద్దకాగితాలు అంటిస్తారు. సెకండరీవృత్తిస్కూళ్లలో మొదటి రెండేళ్లలో విద్యార్థులకు కార్ఖానా తర్ఫీదును ఇచ్చి, కొంత ప్రత్యక్షానుభవం కలగచేస్తున్నారు. పెద్దపారిశ్రామికసంస్థలకు వారిని తీసుకొనిపోయి వాటినిర్మాణక్రమాన్ని వారికి చూపిస్తున్నారు. ౧౯౩౮-౩౯ లో ౩౦ పట్నాలలో సుమారు ౩,౨౫౦ మంది విద్యార్థులు ౧౩౦ సార్లు ఈ విధంగా పారిశ్రామికసంస్థలను సందర్శించారు. రోము, పాదువా నగరాలలో ప్రతిసేమా పై తరగతుల విద్యార్థులలో కొందరిని ఏదో పారిశ్రామికసంస్థలలో వారిచేత పని చేయిస్తున్నారు. ఈ విధంగా వారికి ప్రత్యక్షానుభవం కలుగుతోంది

సాధారణంగా దేశమంతటాకూడా వృత్తినిరూపకపద్ధతులను, మనస్తత్వపరీక్షావిధానాలను, అభిరుచులను గురించిన ప్రశ్నావళిని, విద్యార్థుల అభివృద్ధికి సంబంధించిన రికార్డును ఏటేటా అభివృద్ధిచేస్తున్నారు. ఈ విషయంలో ఐరోపాఖండంలో వున్న ఇతర దేశాలలో మోస్తరుగానే ఇటలీలోకూడా ప్రత్యక్షానుభవమూ, నూతనపరిశోధనలూ ఏకకాలమందే అభివృద్ధి అవుతున్నాయి. యూనివర్సిటీలలోను, ఇతర ఉన్నత విద్యాసంస్థలలోను, వృత్తినిరూపక సంస్థలలోను వృత్తినిరూపక సలహాదారులను తర్ఫీదుచేస్తూన్నారు. అందుకోసం ప్రత్యేకతరగతులున్నాయి. వాటిలో నేర్పేపాఠాలు: (౧) వైద్యశాస్త్రం, (౨) మనస్తత్వశాస్త్రం, (౩) వివిధవృత్తులు అని మూడుశాఖలుగా విభజింపబడి వున్నాయి. వాటిని రోము, మిలాన్, ట్యూరిన్ మొదలైనపట్నాలలో నేర్పుతున్నారు. ౧౯౩౯ లో ఈ విధంగా ౩౦౦ మంది సలహాదార్లు తర్ఫీతయినారు. ముందుముందు ఈ తర్ఫీదును ఇటలీదేశమంతటా విరివిగా వ్యాపింపచేయబోతున్నారు. ఇటలీలో వృత్తినిరూపకఉద్యమం అన్నివిధాలా దినదినాభివృద్ధి పొందుతోంది.

టస్కగీ విద్యాలయము

భాస్కర సుబ్బయ్య

'వార్ధా విద్యావిధాన' సమస్య భారతదేశ విద్యాప్రపంచమున గొప్ప యలజడిని గావించుచున్నది. ఆవిధానముయొక్క సాధకబాధకములు పత్రికలందును, ఉపన్యాసవేదికలపైనను పలుమరు చర్చించబడినవి. కాని యియ్యది మన మనుకొనుచున్నంత నవీనమైనదికాని, మనలో కొంద రూహించునంతటి విప్లవకరమైనది కాని కాదు. దేశాంతరములం దిట్టివిధాన మిదివరకే ఆచరణయందున్నది. ౧౯-వ శతాబ్దాంత్యమునం దుత్తర అమెరికా ఖండమునందలి నీగ్రోజాతివారు తమ జీవితసమస్యను బరిష్కరించుకొనునిమిత్తమై యిట్టి విద్యావిధానము నవలంబించిరి. ఈవిద్యావిషయక పరిశోధనమును దీక్షతో కొనసాగించి దాని కెక్కుడుగ ప్రచారమును ప్రాముఖ్యమును నొసగినవారిలో నగ్రగణ్యుడు బూకర్ టి. వాషింగ్‌టన్ అను మహాశయుడు. అత డేయుద్దేశ్యముతో తన విద్యాలయమును స్థాపించెనో అ దెట్లు ప్రజాదరమును బడసెనో దానిచే దేశమున కెట్టి మహోపకార మొనగూడెనో విచారింతము.

ఉత్తర అమెరికాఖండపు అలబామా రాష్ట్రములోని టస్కగీ (Tuskgee) గ్రామమునం దొకశిథిలగృహంబున ౧౮౮౧-వ సంవత్సరము జులై ౪-వ తారీఖున ౩౦మందివిద్యార్థులతోను, ఒకఉపాధ్యాయునితోడను స్థాపింపబడిన పాఠశాల దినక్రమాభివృద్ధి నొందుచు యిరువదేండ్లు దాటునప్పటికి ౧౪౦౦విద్యార్థులను ౧౧౦ ఉపాధ్యాయులను గల్గి ఆదర్శప్రాయమగు విద్యాసంస్థయని ప్రపంచవిఖ్యాతిని బడసెను. ఈసంస్థమూలముననే నీగ్రోల దైనికజీవనమునం దసమానపరివర్తన మేర్పడి అమెరికాలోని రెండుజాతులమధ్య సుహృద్భావమును గాఢాభిమానమును వృద్ధిజెందెననిన అతిశయోక్తి గాదు.

ప్రారంభమున నీవిద్యాలయము బ్రవేశించిన విద్యార్థులందరునూ కొద్దిగనో గొప్పగనో వ్రాయను జదువను నేర్చినయువకులు. వారదివరలో బానిసలైయుండి తామనుభవించిన దేహకష్టముచే విసిగి వేసారియుండిరి. కావున దానినుండి విముక్తులై చెమటగార్చవలసిన యవసరము లేకనే ఉపాధ్యాయవృత్తివలననో లేక మతప్రచారకులుగనో నీడపట్టున నాల్గుకాసులు సంపాదింపగల్గుటే విద్య నేర్చుటలో వారికిగల ముఖ్యోద్దేశ్యము.

కాని ఉపాధ్యాయుల యభిప్రాయమది కాదు. అక్షరజ్ఞానముకంటె అతీతమైనదియు, దైనికజీవనమున కనుగుణ్యమైనదియు నగు విద్యను నేర్పి విద్యావంతులు పరాధీనులుగాక స్వతంత్రమార్గముల జీవనోపాధి గడింపగలవారిగ జేయుటే విద్యాధికారుల యభిమతము.

హోమరును కంఠస్థముగ నేర్చియు, భూగోళపటమున సహారా ఎడారినిగాని చీనా

దేశపు ముఖ్యపట్టణమునుగాని చులకనగ గుర్తింపగల్గియు, బాలురు తమ ఎదుటనుండు విస్తరిలో ఏపదార్థ మెచ్చట నుండవలయునో నిర్ణయింపజాలని స్థితియం దుండిరి. వారక్షరాస్యులేగాని లోకజ్ఞానశూన్యులు. విద్య వారికి భుక్తిమార్గమునుగాని ముక్తిమార్గమునుగాని కన్పరపకుండెను. గ్రామజీవనము వ్యవసాయవృత్తి వీనియెడ వారికి వైరము పొడమెను. నగరవాసముపై వ్యామోహము జనించెను. కావున వారియందు జనించిన యస్వాభావికరుచులను నశింపజేసి విద్యాభ్యాసానంతరము వారు మరల స్వగ్రామముల కేగి అందు స్వవృత్తి నవలంబించి తాము నేర్చిన నవీనవ్యవసాయపద్ధతులను సోదరకర్షకులకు నేర్పుచు వారి కక్షరజ్ఞానముగూడ నొసగి వారి ఆర్థిక నైతిక ఆధ్యాత్మిక జీవితమును బరివర్తింప జేయగల వారిగ విద్యార్థులను తరిఫీదు చేయదలచిరి.

టస్కగీపాఠశాల స్థాపింపబడిన కొద్ది రోజులకే పరిసరముననున్న వనమొకటి క్రయమునకు రాగా వాషింగ్టను వెంటనే దానిని గొని అందలి పాడుపడిన గదులను శుభ్రపరచి పాఠశాల నచటికి మార్చెను. పిమ్మట అచటిచెట్లను నరకి భూమిని సాగులోనికి దెచ్చుట ఆతని ఆశయము. విద్యార్థుల కాపని ఎంతమాత్రమును నచ్చలేదు. విద్య వ్యవసాయముల కెట్టిసంబంధముగాని వారికి బోధపడలేదు. అట్టిపని తమ ఆత్మగౌరవమునకు భంగకరమైనదని వారెంచిరి. వారిని బాధించు సంశయమును దొలగింపనెంచి వాషింగ్టను స్వయముగ గొడ్డలి చేబూని వృక్షముల నరుక ప్రారంభించెను. బాలురును ఆపనికి పూనిరి. వారి ప్రయత్నఫలితముగ నిరువది ఎకరములు సాగులోనికి వచ్చెను.

ఆపాఠశాలయందు బాలురకు నేర్ప నుద్దేశింపబడిన పారిశ్రామికవిద్య యంతయు వారి తాత్కాలికపు అక్కరలను దీర్చుకొఱకై ప్రారంభింపబడినదే. తినుట కాహార మవసరమగుటచే వారు కృషితో ప్రారంభించిరి. పిదప విద్యార్థులసంఖ్య బెరుగ నూతన భవనములు కావలసివచ్చెను. వాని నిర్మాణమునకు వలయు కలప, యినుము సామానులు ఇత్యాదులను ప్రజ లొసగిన విరాళములచే కొనిపెట్టినను కూలికై వారొక పైసాగాని వెచ్చింపలేదు. అనుదినమును పాఠశాల ముగిసినవెనుక బాలురు పునాదులు త్రవ్వుటలో లేక గోడలు నిర్మించుటలో చేయుచుండిరి. వారిప్రథమ ప్రయత్నఫలితముగ నిర్మింపబడిన భవనములు సొగసుగ లేకపోయినను వాని నిర్మాణమూలమున బాలురు గృహనిర్మాణమునందు నవీనపద్ధతులు నేర్వగల్గిరి. మరియు స్వయంసహాయ సూత్రతత్త్వమును దేహకష్టము చేయుటలోగల ఆనందగౌరవములను వారు గుర్తించిరి. చిరకాలముగ వారి నంటియుండిన దురభిప్రాయములు క్రమముగ నశించెను.

అదేసమయమున యిటుకల తయారు చేయ దలపెట్టిరి. ఈకార్యము కష్టతర మగుటే గాక అసహ్యకరమైనది. దానికితోడు వారి ప్రథమప్రయత్నము లన్నియు విఫలము లగుడు అధికారు లందరు నిరాశ జెందిరి. బాలురలో ననేకులు పాఠశాల వదల నిశ్చయించిరి. కాని బూకర్ వాషింగ్టను మాత్రము ఆశ వదలలేదు. నాల్గవతూరి వారు వేసినగూడు చక్కగ కాలి, యిటు

కలు ఉపయోగకరములుగ నుండెను. కాలక్రమముగ నిది ముఖ్యతమమగు పరిశ్రమమై పరిణమించి గ్రామవాసుల యక్కరలను దీర్చుటకును, వందలకొలది విద్యార్థులకు జీవనోపాయ మిచ్చుటకును దోడ్పడెను. విద్యాలయమునందలి బండ్లు, కుర్చీలు, మేజాలు మొదలగు కలపసామానంతయు బాలురచే తయారుచేయబడినదే. ప్రారంభమున తయారుచేయబడినవి దృఢముగగాని అందముగగాని లేకపోయినను యిానాడవి ఉత్తమోత్తమములై వెలుగుచున్నవి. బాలికలకు నేర్పబడు చేతిపనులలో ప్రధానమైనది చాపలల్లుట. టస్కగీచాపలు దేశవిఖ్యాతములై విరివిగ నమ్ముడుపోవుచున్నవి.

రెండు మూడువత్సరములు దాటినవెనుక బాలబాలికల యుపయోగార్థమై వసతిగృహంబులు నెలకొల్పిరి. వాని నిర్మాణ నిర్వహణమునందును యథారీతిగ స్వయంసహాయసూత్రమునే అవలంబించిరి. కావున క్రొత్తలో సర్వము లోపభూయిష్టములైనవే వంటకములు రుచ్యములుగ నుండవు; ఒకపదార్థము మాడియుండును. మఱొకటి పచనమైయుండదు, మూడవదానిలో ఉప్పెతక్కువ, నాల్గవదానిలో పంచదార లేదు. ప్రతివస్తువులోను ఏదో ఒకలోపము. కాని క్రమముగవా రనుభవజ్ఞాన మలవరచుకొని శుచిగను రుచిగను సకాలమునకు వంటలు చేయ నేర్చిరి.

వివిధ పారిశ్రామికశాఖలు స్థాపించుటలో విద్యాలయమాధికారుల యుద్దేశ్యములు నాల్గు విద్యార్థులలో నధికసంఖ్యాకులు అన్నవస్త్రాదికములకేని నోచుకొననివారు. కష్టించి పైకము నార్జించునవకాశము వారికి కల్పించుట మొదటియుద్దేశ్యము. విద్యావంతులు తమనిర్మాణకళానైపుణ్యముచే ప్రజల వాంఛితములు దీర్పగలవారిగ నొనర్చుట రెండవది. స్వయంకృషిచే జీవనోపాయము నార్జింపగల మనియు తమ సుగుణసంపత్తివలనను జ్ఞానాధిక్యముచేతను బరులకు మార్గదర్శకులుగ నుండగల మనియు విద్యార్థులలో నాత్మవిశ్వాసము గల్గించుట మూడవది. వారు కాయకష్టము సేవగించుకొని దానినుండి తప్పించుకొన బ్రయత్నింపక దాని బ్రేమించున ట్లొనర్చుట కడపటి యభిప్రాయము. వారి యీయుద్దేశ్యము లన్నియు నీడేరెననుటలో సందేహము లేదు.


కించిత్తైన ద్రవ్యవసతిలేని బీదవిద్యార్థుల ఉపయోగమునకై ౧౮౮౯-వ సంవత్సరమున నొకరాత్రి పాఠశాలను స్థాపించిరి. అందు ప్రవేశించువారు పగలు ౧౦ గంటల కాల మేదేని పరిశ్రమయందు పాల్గొని రాత్రులలో ౨గంటలు వ్రాయను జదువను నేర్వవచ్చును. వారివేతనములలో నధికభాగము పాఠశాలాధికారులు తమస్వాధీనమం దునుచుకొని అట్లు రెండేండ్లలో ప్రోగైనధనమును తదనంతరము వారు పగటిపాఠశాలలో జదువ వినియోగింతురు. ప్రథమమున నీరాత్రిపాఠశాలయందు జేరినవారిలో ననేకులు క్రమముగ ఉన్నతవిద్య నభ్యసించి గొప్పఉద్యోగములను బడసి వన్నెకెక్కిరి.

బీదలు ధనికు లనియు బాలురు బాలికలనియు నేలాటిభేదమును లేక టస్కగీపాఠశాల ప్రవేశించు ప్రతివ్యక్తియు నేదేని యొకచేతిపని నేర్చుట యవసరము. ఈ నియమమే వార్థావిద్యావిధానమునందలి మూలసూత్రము విద్య దైనికజీవనమున కనుగుణ్యముగను.

భుక్తిమార్గదర్శకముగను నుండవలయుననుట యీ సూత్రమునకు పునాది. టస్కగీవిద్యార్థులు తమ నిర్మాణకళాకౌశలముచే ప్రపంచ ఆర్థిక నైతిక సౌభాగ్యాభివృద్ధికి తోడ్పడిరి. కావున ప్రజలు వారియెడ గౌరవభావము కన్పరచిరి.

టస్కగీవిద్యాలయాధికారులు మతవిద్య యొక్క ఆవశ్యకతను మరువలేదు. పాఠశాల యందు ప్రార్థనలు సకాలమునకు జరుపుచుండిరి. బైబిలును ప్రతివాడును బఠింపవలయు. కాని అందలిసూత్రములను కంఠస్థముగ నేర్చుటతో దనివిజెందక తమ దైనిక జీవనమును వానికనుగుణ్యముగ పరివర్తించుకొనసాగిరి. పరోపకారప్రాశస్త్యమును జాటుటలో అచ్చటి ఉపాధ్యాయులే బాలురకు ముఖ్యులగు మార్గదర్శకులు. స్వార్థమును సంపూర్ణముగ బరిత్యజించి సతతము బాలుర శ్రేయస్సునే గోరుచు ఎంతటికష్టమునకైగాని వెనుదీయక రాత్రింబవళ్లు వారుపాటు బడుచుండిరి. అనుదినము నిట్టిత్యాగశీలురను గాంచునెంతటి స్వార్థపరాయణునికేని త్యాగబుద్ధి పొడమకపోవునా?

కడపటిమాట. ఎంతటి ఉత్తమోత్తమమగు విద్యావిధానమైనను సర్వకాల సర్వావస్థలందును ఉపకరింపదు. కాల దేశానుసారముగ మనపద్ధతులను మార్చుకొనుట శ్రేయస్కరము. ప్రభుత్వోద్యోగములకై యాసించి నేర్చిన విద్య యీనాడు నిరుపయోగముగ బరిణమించినది. ఉద్యోగముల సంఖ్య అల్పము; వాని కాసించువారి సంఖ్య అధికము; అందలిఫలితము విద్యావంతుల లాఘవము. మఱియు నిదివరకు విద్యావంతులు ప్రత్యేకజాతివారై యుండిరి. పండిత పామరులమధ్య అనురాగము సున్న. అందుకు కారణము వారు పరస్పరము ప్రత్యేక ప్రపంచములలో మెలగుట; తాము ఒకరిపై నొకరు ఆధారపడి యున్నామని వారు గుర్తింపరైరి. ఈదోషములను దురభిప్రాయములను దొలగించుకొటకై నూతన విద్యావిధానమవసరము. వార్ధావిధాన మందుల కుపకరించునని ఎల్లరవిశ్వాసము.



వేంకటరాయశాస్త్రులవారి సొంత యనుభవము:

స్వతంత్ర నాటకములు

వేదము వేంకటరాయశాస్త్రి

శ్రీ శాస్త్రులవారి యుపన్యాసములయందును, నాటకములయందును మెండుగా హాస్యరసము స్ఫురించుచుండు ననువిషయము ఎల్లవారును ఎఱింగినదే. ఇందులకు మొదటికారణము శాస్త్రులవారే. వారి మాటల ధోరణి యట్టిది. గొప్ప వ్యాకరణవిషయములను గుఱించి యుపన్యసించునపుడు సయితము శ్రోతలు కడుపులు చెక్కలగునట్లు నవ్వవలసినదే. మాటవడియు, తడవుకొనక జవాబుచెప్పుటయు శాస్త్రులవారికి సహజగుణములు. శాస్త్రులవారి నాటకములు లోకస్వభావానుకరణములు. లోకవృత్తానుకరణమున శాస్త్రులవారిది మొదటిచేయి. మాటలును చేష్టలును ఇతరులవి అట్లె అభినయించి చూపగలిగినశక్తి వారిది. శాస్త్రులవారి నాటకములు అంత ప్రసిద్ధిచెందుటకు గల ముఖ్యకారణములలో పాత్రోచితభాష ప్రధానమైనది. సాయెబులు, చాకళ్లు, మంగళ్లు, పామరులు, విద్యావంతులు, బాలురు, స్త్రీలు, అరవలు మొదలైనవారి గ్రామ్యభేదములను మెలకువతో కనిపట్టి తమ నాటకములలో ప్రయోగించి యున్నారు. జిల్లా గ్రామ్యభేదముల నన్నిటిని వారి గ్రామ్యదేశనిరసనమను వ్యాసమునందు చూడవచ్చును.

ఈ గ్రామ్యభేదముల నన్నిటిని శాస్త్రులవారు బాల్యమునుండియు కనిపట్టుచు వచ్చినారు. వారికి బాల్యమందే కృష్ణా గోదావరి విశాఖపట్టణము జిల్లాలలో నుండుభాగ్యము కలిగినది. శాస్త్రులవారి తండ్రిగారు వేంకటరమణశాస్త్రులవారు బాల్యమందే నెల్లూరు వదలి కంచిలో నివర్తి వేంకటరామశాస్త్రులవారికడ చదివి, మొదట మదరాసులో, వెనుక కాకినాడ, నరసాపురము, పోదూరు, విశాఖపట్టణము, రాజమహేంద్రవరము మొదలైన ప్రదేశములలో సంస్కృతాంధ్రపండితులుగా నుండి, వైయాకరణపతంజలి యని ప్రఖ్యాతిగాంచిరి. వేంకటరాయశాస్త్రులవారి బాల్యమంతయు నీప్రదేశములలో గడచినది. బాల్యము నుండియు కంటబడిన వస్తువును కనులార, చెవులబడిన వానిని చెవులార చూచి విని ఆనందించి ఉత్తరకాలమున గ్రంథస్థములం జేసినారు. ఆ సునిశితబుద్ధికి అన్నియు జ్ఞాపకములే. రసాత్మకవాక్య మేది ఆయన చెవిని బడినను మఱి ఆ హృదయమును వీడదు. ఆంధ్రదేశమును వర్ణింపను ఆంధ్రప్రతిభను లోకమునకు చాటను వారికి బాల్యమందే ఆశ జనించినది; ప్రతాపరుద్రీయ బొబ్బిలి యుద్ధనాటకములందు రూపుదాల్చినది.

ప్రతాపరుద్రీయనాటకరచనాబీజము వారిహృదయమున వారి యొనిమిదవయేటనే పడినది. ప్రతాపరుద్రీయనాటక ప్రథమ ముద్రణావతారికలో నిట్లు వ్రాసినారు. "ఓరుగంటి ప్రతాపరుద్రమహారాజును తురకలు ఢిల్లీకి ఖయిదు కొనిపోయిన కథ లిఖితముగాని ముద్రితముగాని నాకెచటను దొరకలేదు. నే నెనిమిదేండ్ల వయసున నుండఁగా మా నాయనగారు వేదము వేంకటరమణ శాస్త్రులవారు తమ మిత్రబృందములో నీకథను ప్రస్తుతించునపుడు నేనును వింటిని. వారు చెప్పుటలో ఆకథ అరగంటకూడ పట్టలేదు. ఇటీవల నేను జనవినోదినీముద్రణాధికృతుఁడనై యుండఁగా ౧౮౮౮ సంవత్సరమున ఈకథను నాకుఁ దోచినట్లు విరివిచేసి యల్లి కథారూపమునఁ బ్రచురించియుంటిని. పిమ్మట ౧౮౯౭ సంవత్సరము జూలై నెలలో దానిని నాటకోచితముగా రూపుచేసి ఈ నాటకమునందలి గద్యభాగమును మాత్రము వ్రాసి నా మిత్రులకుఁ జూపితిని......"

వేంకటరమణ శాస్త్రులవారికి వేదాంతులు నలుగురు శిష్యులుండిరి. ఒకరు ముసల్మాను, రెండవవారు చాకలి, మూడవవారు క్రిశ్చియన్, నాలుగవవారు బ్రాహ్మణులు. వీరు నిరంతరము వారితో గోష్ఠిసలుపుచుండువారు. సాయెబుగారు తమమతగ్రంథములలోని సంగతులు చెప్పుచు 'ఆ అరాబియాదేశంలో వఖ్ పఖీర్' అను నీతీరున మాటాలాడుచుండువారు. ఆ యెనిమిదేండ్ల వయసున సాహెబుగారి మాటలు శాస్త్రులవారికి వింతగా కనబడినవి; హృదయమున నెలకొన్నవి. ఇట్టి సాయెబుల నెందఱనో కనియే ప్రతాపరుద్రీయమందలి ఆ మహమ్మదీయ పాత్రభాషితములను వ్రాసితి మని వారే చెప్పియున్నారు.

శాస్త్రులవారికి ఆంధ్రాభిమానము హెచ్చు. పుమారు ద్రావిడులయింట బుట్టినారు; తెలుగువారియింట పెరిగినారు. వారు ఆత్మకథ వ్రాయనెంచి అందులకు వ్రాసికొన్న చిత్తులో నిట్లు వ్రాసియున్నారు. "మదీయ నరసాపురారు చరిత్రము—ఉపనయనమునకు మునుపటిది. ఉపనయనము గర్భాష్టమమున మల్లయ్య పాశెములో. పులిపాక లచ్చన్నబాబుగారు, శేషమ్మపిన్నిగారు, పరమ్మ పిన్నిగారు, చంద్రమ్మత్తయ్య, — వారికి గోసమృద్ధి, పేరిన హయ్యంగవీనము, చక్రకేళియరంటియాకు. వంటరుచి ౧౨ సంవత్సరముల యనంతరము కూడ యథాపూర్వముగానే యుండుట. నెమళ్లగొప్ప యారామము. మానాయనగారు కాపురమున్న యింటివారును పులిపాకవారే. కోడలో కూఁతురో అన్నపూర్ణమ్మ. అత్తగారు రవణమ్మ. ఆమెకు కుడిచేతి బొటనవ్రేలికి రెండుగోళ్లు. ఇరువురును వితంతువులే. ఇంటియద్దె రు ౧. వారు రాత్రి చేసికొను ఉప్పుపిండిగాని రొట్టెగాని నా తమ్ములకు తప్పదు. ఈ చెప్పిన మూఁడు కుటుంబములును అభేదప్రతిపత్తితో అత్యంత మైత్రితో నుండినవి. వారి యాయింటికి పిశాచ ప్రథ.................."

'విద్యానాథుడు — ఓరి పడవవాండ్రూ, ఓ సాయెబులూ, పుణ్యము కట్టుకోండి, చచ్చితిని చచ్చితిని! మొసలి! మొసలి! మొసలి!' లోనుగాగల విద్యానాథుని ప్రతాపరుద్రీయనాటకవాక్యము శాస్త్రులవారికే సొంత యనుభవము. రాజమండ్రికి పోయిన వెనుక బోటు షికారులు మొదలుపెట్టిరి. ఒక్కొకప్పుడు రాత్రులుసయితము ఇంటికి రాకయే తిరుగువారట. వీరికి వేంకటసుబ్బయ్యగారని తమ్ములొకరు (శ్రీ. శ్రీ. వేంకటాచలముగారికన్న పెద్దలు) ఉండి బాల్యమున ౨౫ యేటనే గతించిరి. వారికిని శాస్త్రులవారికిని వయసున రెండేండ్లే భేదము. ఒకమారు శాస్త్రులవారును వారి తమ్ములును కొందఱు స్నేహితులతో ఈతపందెములు వేసికొని ఆవలిగట్టునకు ఈదసాగిరి. కొంతదూర మీదునప్పటికి ఆ స్నేహితులు ఒకరొకరుగా వెనుకకు జారుకొనిరి. తుదకు శాస్త్రులవారును వేంకటసుబ్బయ్యగారును మిగిలిరి. వీరికి అభిమానము ఎక్కువ. వెనుకకు పోవుట పరువుతక్కువ యని యీదుచునే యుండిరి. లోతు, నేలకు కాలు అందదు. ఇందులో శాస్త్రులవారికి ఈత రాదు. వారి తమ్ములకుమాత్రము వచ్చును. వారు వీరిని పట్టుకొని ఈదుచుండిరి. శాస్త్రులవారిధోవతి వీడిపోయి కాలికి చుట్టుకొన్నది. ఇక ఆ యీతయు అసాధ్యమే. అంతట వారు తమ్మునితో 'ఒరేయి, నన్ను వదిలివేయి, నేను చచ్చిపోతాను. నాకు ఈ దినం గండం. నువ్వెందుకు నా కోసం చచ్చిపోతావు' అనిరి. "ఆ. మిమ్మల్ని వదలిపెడతానా" అని వేంకటసుబ్బయ్యగారు మెల్లగా కాలికి నేల తగులువరకు కొనిపోయిరి. అక్కడ సరిగా కంటివరకు నీరు. ప్రవాహము వేగముగా లాను చుండెను. అలసిపోయినారు. వాస్తవముగా శాస్త్రులవారు తాము నాఁడు చనిపోవుచున్నామనియే తలంచినారు. ఇంతలో దూరములో నొకపడవ కనబడినది. 'పడవోయి పడవ, ఓరి పడవవాండ్రూ, పుణ్యము కట్టుకోండి, చచ్చిపోతున్నాము' అని గట్టిగా అరచిరి. రెండు పర్యాయములు వీరిమాటలు వారికి వినబడలేదు. తర్వాత విని, వీరు గుడ్డను పిండివిసరగా చూచి పడవవాండ్రు వచ్చినారు. 'ఏం బ్రాహ్మలయ్యా, ఏంపనయ్యా గోదారిలో' అని కసరుచు ఎక్కించుకొనిరి.

ఇదంతయు జ్ఞాపకముంచుకొని విద్యానాథునికి చేర్చి ప్రతాపరుద్రీయములో సంవిధాన మల్లితి మని పలుమార్లు చెప్పియున్నారు. గోదావరితో వారి సంబంధ మట్టిది.

కంఠభీమ

ప్రతాపలో జెట్టివాడు 'నీవు కంఠభీమవు ఏమనుకొన్నావో? పట్టుకుంటే వదలను' అని శిష్యులను మాటికి ముందు బెదరించుచుండును. విశాఖపట్టణములో శాస్త్రులవారు నివసించినయింటి పొరుగింటి యూతడు ముసలివాడు తన పడుచుభార్యను ఈ వాక్యమునే పలికి నిరంతరము బెదరించుచుండువాడట. జ్ఞాపక ముంచుకొని జెట్టివానికి తగిలించినారు.

బొడ్మిక్

బొబ్బిలి యుద్ధనాటకములో ఐదవయంకమున సిఫాయీలు తిరుగబాటు చేయుచున్నారనియు, సారాయి లేనిది వారు యుద్ధము చేయలేరనియు, ఒక సిఫాయి బస్సీకి నివేదించును.

'బస్సీ—మామాటగా బొడ్మిక్‌తో చెప్పి వారికి సారాయి మామూలుకొలత ప్రకారము ఇమ్మని చెప్పను'

అని చెప్పును. ఈ బొడ్మిక్ అనుపేరు విశాఖపట్టణములో నొక సారాయి దుకాణదారుని కుండెను. మొదట విన్నప్పుడు తమాషాగా నుండినందున సమయము దొరికినప్పుడు ప్రయోగించినానని చెప్పియున్నారు.

పేరిగాడు

శాస్త్రులవారు ౧౮౭౫ సంవత్సరము ఎఫ్. ఏ. పరీక్షయందు తీర్ణులైన యనంతరము మొదట శ్రీకాకుళములో కడపటియొజ్జగా నియమింపబడిరి. కొలది కాలమునకే చోడవరము తాలూకాస్కూలు ప్రధానోపాధ్యాయులైరి. ఈ స్కూలులో ప్యూను పేరు పేరిగాడు. ఈ పేరిగాడు నిత్యము స్కూలుకురాక సెక్రెటరీగారియింట నౌకరి చేయుచుండువాడట. ఎప్పుడయినను స్కూలుకు వచ్చినా వరాండాలో బల్లపై పరుండి నిద్రపోవువాడట. శాస్త్రులవారు వానికి బుద్ధిచెప్ప దలంచినారు. అన్నిపనులును స్కూలులో విద్యార్థులుగాని ఉపాధ్యాయులుగాని చేసికొనవలసి యుండెను. పూర్వముండిన హెడ్మాస్టరు సెక్రెటరీగారికి భయపడుచుండెను. శాస్త్రులవారు మాటికిముందు తమ యుద్యోగమునకు రాజీనామా నిచ్చెదమని బెదరించుచుండువారు. ఒకదినము పేరిగాడు నిద్రపోవుచుండగా బెత్తముతో వానివీపున, కాళ్ళమీద దెబ్బలువాయించి వానికి కనబడక మరల వచ్చి తరగతిలో పాఠము చెప్పసాగిరి. 'ఓయమ్మో! ఓయిబాబో! నన్నెవరో కొట్టేశారండీ, చంపేశారండీ' అని వాడు పెద్దగోడు చేయసాగెను. ఉపాధ్యాయులందఱును వచ్చిరి. 'నువ్వు చేస్తాండే ద్రోహానికి నిన్ను వెంకటరమణమూర్తి శిక్షించాడు, పో, ఎవడితో పోయి చెప్పుకుంటావో చెప్పుకో' అని శాస్త్రులవారు వానిని స్కూలునుండి తఱిమివేసినారు. శాస్త్రులవారిని బదులుకొట్టునంతటిశక్తి వానికి లేదు. వెంటనే పోయి సెక్రెటరీగారికి చెప్పుకొనెను. సెక్రెటరీగారు శాస్త్రులవారిని తమయింటికి వచ్చి సమాధానము చెప్పవలసినదని ఆజ్ఞాపించిరి. 'మేము సెక్రెటరీగారి యింటికి రాము. కావలసియుంటే వారే మాయింటికిగాని, స్కూలుకుగాని వచ్చి మాట్లాడవచ్చును' అని శాస్త్రులవారు బదులు చెప్పిపంపిరి. సెక్రెటరీ ఆయూరిలో పలుకుబడి గలిగినవాడైయుండెను. తుదకు శాస్త్రులవారికి లొంగిపోయెను. పేరిగాడును స్కూలునౌకరీ చక్కగా చూడసాగెను.

ఈ పేరిగాని నామధేయమే ప్రతాపరుద్రీయమందలి చాకలివానికి శాస్త్రులవారు తగిలించినారు.

స్వారస్యపుద్రాడు

ప్రతాపరుద్రీయములో పేరిగానిని కొని ప్రతాపరుద్రమహారాజును చేయుదురు. అతని ఎదుట కొందఱు వైణికులును గాయకులును వచ్చి తమ విద్యను ప్రదర్శింతురు. ఆ సమయములో మంత్రులు వానిజుట్టుకు ఒకదారము గట్టి పాట విశేషముగా స్వారస్యముగా నున్నప్పుడంతయు లాగింపించుచుండిరి. దారము లాగినప్పుడంతయు పేరిగాడు స్వారస్య మభినయించుచుండెను. మధ్యలో నీ త్రాడు తెగెనుకూడ.— ఇది యెల్ల శాస్త్రులవారు ఒకానొక జమీందారుని చరిత్రమని చెప్పియున్నారు. వారే జనవినోదినిలో నిట్లు వ్రాసియున్నారు. "గానరసము భోక్తగా నెఱుఁగని యొకరాజునొద్దికి గొప్పగాయకుఁ డొకఁడు పాడ రాఁగా, గానమందు మహాపండితురాలైన రాణిగారు, రాజుగారిని ఒక కిటికీయొద్ద కూర్చుండఁబెట్టి వారి

జొట్టునకు ఒకదారము గట్టి తాను కిటికీయొద్ద గోడ చాటున (ఈకాలపు పంకావానివలె) కూర్చుండి గాయకుని పాటలో విశేషించి స్వారస్యము అగపడి నప్పుడెల్ల దారమును లాగుచుండెను. వెంటనే రాజు గారి తల యూఁగుచుండెను. గాయకుఁడు రాజుగారి రసజ్ఞతకు ఆశ్చర్యపడి ఆనందించి మఱియు మఱియు హెచ్చుగా ఇంకను స్వారస్యముగా పాడసాగెను. స్వారస్యపుదారము మూలముగా రాజుగారితల మఱి మఱి ఆడసాగెను. ఎక్కువ యూఁపుచేత ఆ దారము పుటుక్కున తెగెను. అంత నా రాజు గాయకునితో "ఆపివేయి పాట నిలుపు, స్వారస్యపుదారము తెగి పోయినది" అనెను. గాయకుఁడు దానియర్థమును గ్రహింపలేరక పాటమాత్రము మాని భ్రాంతుఁడై నలుదెసలు చూడసాగెను. ఈలోపున రాణిగారు ఒక పళ్లెములో బహుమాన మంపిరి. దానిని రాజుగారు గాయకుని కిచ్చిరి. గాయకుఁడు సంతోషించి స్వారస్య పుదారము తెగిన రహస్యమును తెలిసికొనలేకయే వెడలి పోయెను. ఈ కథలంబుతోలద్వారా కాలక్రమమున బైటఁబడెను."

ఆనంద బాష్పములు

నేరిగారు మాటికిముందు 'నీపాటకి ఆనంద భాష్పాలు అక్కరలేదా యేంటి 'అని కంటికి కర్పూర శలాక అంటించుకొనును. దానిరహస్య మిది. 'మతి యొక రాజు గానరసజ్ఞుఁ డనిపించుకొనుటకై పాట విను నప్పుడెల్ల మిరియాలకలికము కన్నులలో వేసికొని బాష్ప ములు తెప్పించుకొనెనఁట. ఆ సంగతి వారికొట్టసి లెక్కలలో ఆనందబాష్పములకు అరపలము మిరి యాలు అని వ్రాయఁబడియుండెనఁట. ఆ లెక్కలవలన ఆయనయొక్క రసజ్ఞత బయలుపడెనఁట.'

శాస్త్రిలవారు జంగముపాటలు వినుటకు చెవికోసి కొనెడివారు. వానిపై వారికి ప్రీతిమెండు. బాల్యములో జంగముపాటలు, ముష్టివారిపాటలు, పడవవాండ్ర పాటలు ఒడలు తెలియని యావేశముతో విని కంఠస్థములం జేసినారు. తమనాటకములలో రసాత్మకమైన యీగ్రా మ్యోక్తులకు ఎక్కువ తావొసంగినారు.

శాస్త్రిలవారు తమ స్వతంత్రనాటకములలో స్వయముగా నగపడుచున్నారు. వీనిలో వారి కలము అడ్డులేక సాగినది. తమ యనుభవమంతయు గుప్పించి నారు. తాము బాల్యమునుండియు విని ఆనందించిన ఆ గ్రామ్యభేదముల నెల్ల ప్రయోగించినారు. తాము సాక్షాత్తుగా వినిన వాక్యములను సయితము పాత్ర భాషితములలో చేర్చినారు. ఈవ్యాసమందు చూపిన వానివంటి విశేషములను ఎన్నిటినేని చూపవచ్చును.



'గురువుగారు'

'అనూరాధ'

ఆయనగారి తాలూకు చెప్పుల్లాంటి పద, ప్రయోగ రాసుల్ని నేను నోట కరుచుకుని తిరగలేదు.

ఆయన్ను వెంటబడి వోః ధూపం వేసి, శుశ్రూష చేసి ఆయన్ని మెప్పించి, ఎప్పుడో ఏనాడో వారికి నా పురాకృత పుణ్యపరిపాకం వలన అమాంతం ప్రేమ పొంగి బుస్సలు కొట్టగా ఆకరుణం కనిపెట్టి గురుకీలకాలు చెప్పించుకోనూ లేదు.

కన్యాశుల్కంలో కరటకశాస్త్రిశిష్యుళ్లాగా చిడప్పాకుక్కులు గోకి కాళ్లు పిసకనూ లేదు.

ఉన్న సంగతి చెప్పొద్దూ —

అంతో ఇంతో 'సాహిత్య - గుల' నాకున్న మాట నిజం: సాహిత్యంవిషయంలో వోః తీరనిదాహం ఉన్నమాటా వాస్తవమే. ఎన్నిరోజులు చదివినా ఆతృష్ణ తీరకపోవటమూ నిజమే. ఇదీ మహానుభావా నాకున్న లోటూ.

— నాకంటె పెద్దవాడు అనే గౌరవంతోటీ, సాహిత్యలోకంలో ప్రతిష్ఠితప్రతిష్ఠుడనే నమ్మకంతోటీ, ఆయనరచనలు నాకు అంతో యింతో బాగుండబట్టీ నేను ఆయనంటే పరిమితాదరాతిశయం చూపించిన మాట, చూపించేమాటా ముమ్మాటికీ నిజం.

కాని—

అంతమాత్రానికే వ్యక్తికి గురుగౌరవం తనకాపాదించుకోటం అంటేమట్టుకు చెప్పొద్దూ భలే కాలుకొస్తుంది. కొన్నాళ్లు కలిసి తిరగ్గానే – గురువూ – శిష్యుడూ ఐ, వెంటనే వొకరికి వొకరు పచ్చిగడ్డివేస్తే భగ్గుమనే స్థితికి రావటంమాత్రం

నాకు సుతరామూ యిష్టంలేదు. ఈ తట్టు గోల ఎంతదాకా దేకిందంటే గురుశిష్యభావం అంటేనే నాకు అరికాలిమంట నెత్తికొచ్చేదాకా వొచ్చింది.

మా కిద్దరికీ తొలిపరిచయం కాఫీహోటల్లో.

ఆనెల 'భారతి'లో నా వ్యాసమూ ఉంది. ఆయనకథా ఉన్నది. మేము పరస్పరం అప్పటికి ఎరిగున్నప్పటికీ – పరిచయాలు లేకపోబట్టి వొకరొకరం పలుకరించుకోటంలేదు.

ఆలోటు కాస్తా మా 'శ్రీ...' గారు తీర్చి యిహ కిందామీదా పడండి అన్నట్లు మాచేత వోః అంటే వోః అనిపించి చక్కాపోయారు. – అదెంత దుర్ముహూర్తమో-మరి తలవనితలంపుగా మళ్లీ మళ్లీ కాఫీతాగినట్లు లత కలిసి పెనేసుకునిపోయింది.

కొన్నాళ్లు మేం గుర్రం - కళ్లెం. శ్రావణం - భాద్రపదం. మైత్రావరుణులం, యుగళతారలం, కవలపిల్లలం. రోజూ సాయంత్రం కలుసుకోడం. పికారుకు వెళ్లి దారంతటా, సారస్వతవాతావరణంలో నేల విడిచిన సాము

చేసి, పట్టీలు కొట్టి ఎవరిగూటికి వారు చేరు కోడం మామూలైంది.

మావి రెక్కాడకపోతే డొక్కాడని స్థితిగతులు గనక డ్యూటీ తట్టతగలేసి — ఈగొడవల్లోకి దూకుతూండేవాళ్లం. ఐనా మాయిద్దరికీ బోలెడన్ని అభిప్రాయభేదాలు వొస్తూనేవుండేవి. నేనే వీలునుబట్టి తగ్గి — కాలానికి ఆక్సిజ నిస్తూవొచ్చేవాణ్ణి. ఆయన తత్వం మొదటినుంచీ వొకటే: తా నెక్కిరిస్తే హాస్యం: త న్నెక్కిరిస్తే ఇన్‌సల్ట్! ఇదీ. అంచేత నేను తగ్గుకొస్తూంట. ఆయనా ఇది కనిపెట్టి 'శిష్యుడు' మంచిదారి కొస్తున్నాడు అనుకుని వుండాలి.

వోరోజు తెలుగు సారస్వతం సంగతి వొచ్చింది. ఖర్మం చాలక అందులోనూ 'కథల — వ్యథ' వొచ్చింది. నా అభిప్రాయం అడిగితే

'అందరూ మహానుభావులే' అన్నాను.

"అః! అల్లాంటే ఎల్లాగోయ్ మఱీ!"

"ఏం ఎంచేత కాగూడదూ!"

"అది కాదు. నీకు నచ్చిన మంచికథ కుల్ని చెప్పూ?"

"దృష్టం కిమపి లోకేఽస్మి న్న నిర్దోష మనిర్గుణం!"

"అమ్మమ్మ! ఎంతమా టన్నావ్!"

"...........................

"చెప్పవోయ్ — మీకారు కుర్రవాళ్ల అభిప్రాయాలే కావాలి!"

"అంధరూ బాగానే రాస్తారండి!"

"పోనీ వ్యక్తులపేర్లుగాకాక కథలపేర్లుగా చెప్పు."

"ఎల్లాఅయితేనేం- ఇదే, తేలిక! మీకూ ... మీకథల్లో — కోకడాబు చెయ్యరండి. అది మినహా మీకథలు ఫస్టూ". బాగానే ఉంటాయి."

"బాగానే వుంటాయీ - బాగా ఉండవూ..."

"................"

"ఎన్నిసార్లు నీకు కాఫీ పోయించానోయ్! నాకథలన్నా మెచ్చుకోలేవ్ నువ్వూ..."

— నాకష్టం వేసింది కాఫీకీ — ...సంబంధ మేమిటీ...?

ఊరుకున్నాను యింకా యేమంటాడో అని.

"ప్చ్! లోకంలో మంచి లేదోయ్! - ఊఁ! యింకా...?"

"దీక్షితులు, చలం, శిరోమణి, రామకృష్ణశాస్త్రి, శివరామశాస్త్రి, కుటుంబరావు...."

"అవును గానీ - దీక్షితులకథల్లో పెడగోగీ లేదూ?"

"ఆమాటకొస్తే - మీకథల్లో లేదూ!"

— చిన్నబుచ్చుకున్నాడు: యిహ తెగేట్టుంది. నా శాయశక్తులా ప్రయత్నించి సంభాషణ మార్చి యింకోలోకంలో పడ్డాము.

౨

'ఊఁహూఁ' ఇంతవర కొచ్చిందటే మొదలు. ఇదేమిట్రా ఇట్టా చేశావుటవరకూ అనిపించు కోడంవరకూ వొచ్చింది నా స్తితి.

ప్రతిస్నేహితుడూ నన్ను చూట్టంతోనే ఆశ్చర్యభూతిని చూసినట్లు చూట్టం సాగించాడు మరి రామని ప్రచారం ఐందో...?

రామ్మూర్తి, బెజవాళ్లో కనబడి: ఏంరా? 'న—'ను పట్టుగుని 'నీవూ బాగా రాస్తావు?' అన్నావుట. ఏం న్యాయం? అన్నాడు. అమ్మ-య్య పొగమబ్బులు విడిపోయాయి. ఇ-దా అనుకున్నాను. రామ్మూర్తి మళ్లా అందుకున్నాడు. "ఆయన వెంట పడి గురువు గారు గురువుగారని ... నువ్వూ ఏదో శాస్త రాయగానే ముచ్చిలిగుంట మాపులు చూశావుట. ఆయన చెప్పుకుని వలవల. ప్చ్! బాగు ల్లేదురా అబ్బీ..."

—ఎంతమందికని సంజాయషీ చెప్పను? కాకినాళ్లో అనంతరం, తేనాల్లో కుటుంబ రావూ వొహా రేమిటీ? లోకం అంతా కోడై కూస్తుంటే—;

ఏమీ పాలుపోలేదు చెప్పొద్దూ...

—పనిమీద బందరు వెళ్లాలిసొచ్చింది. నిద్రపోతూన్న విడివిడికొంపలూ, కళ్లు నులుముకుంటూన్న బజార్లూ, శ్మశాననీరవంతో పత్రలూ ఆపూరులంటే గుర్తుకొస్తై. శాస్త్రిగారింటి కెళ్లాను. 'మంచి — చెడ్డ' చెప్పుకునే చోటు శాస్త్రిగారంటే!

కలుసుకున్నప్పుడు స్మృతిలోకంలోకి పోయి కొన్ని సంవత్సరాలు వెనక్కు వెళ్లి కబుర్లు చెప్పుకుని కొన్ని సంవత్సరాలకు సరిపోయే నిషాహుషారు తెచ్చుకుంటాను ఆయనదగ్గర్నించి.

మేడమీద కూచ్చుని అగ్నిముఖంచేసి మాట్లాడుతున్నారు శాస్త్రిగారు. మాటా మాటామీద ఈ ప్రసంగమూ వచ్చింది ... ఉన్న దున్నట్లు చెప్పాను. ఆయన వోటే నవ్వు. 'కాఫీ'కి కథ మెచ్చుకోలేదేం? కాపిటల్' అన్నాడు — — చాలా యిదయ్యాడు. 'ఏమోయ్ పోనీ నువ్వోపని చెయ్యవోయ్! ఆయనరచనల్ని మెచ్చుకుంటే కాఫీ బాకీలు తీరుస్తాడేమో కనుక్కోవోయ్. నేను సైతంసిద్ధపడతాను' అన్నాడు రావు, రాజూ వొచ్చారు అప్పుడే.—వాళ్లూ యీవిషయమే తెచ్చి శాస్త్రిగారు చెబితే నవ్వుకున్నారు.

మధ్యాహ్నం కాఫీతో గొంతుకతడపడానికి హోటలుకు పోతే అక్కడ 'న—' గారూ కలిశారు. ఎప్పు డొచ్చారంటే ఎప్పు డొచ్చా రనుకున్నాం. 'న—' తెల్లారుఝామున మల్లెపూవులా వున్నారు.

"ఇల్లా వున్నా రేమండీ—?"

"ఈమధ్య కొంచెం సుస్తీచేసిందోయ్?"

కొంచెం ఊహ స్ఫురించింది.

"ఊఁహూఁ! అనుకుంటూ నేవున్నాను."

"ఏం? ఏం?"

హాల్లో! అంటూ రామ్మూర్తీ, కుటుంబ రావుతమ్ముడు కృష్ణమూర్తీ (సినీమాహాలు పనిమీద వొచ్చారట) కలిశారు.

కొంటెల్లో కొంటె — కృష్ణమూర్తి అందుకుని "మాష్టారూ! శిష్యుడు మళ్లీ ఎలా కలిశాడు?"

మాస్టారు వినిపించుకోలా.

"ఏమోయ్ ఎల్లా అనుకుంటున్నావోయ్?"

—నవ్వాను.

"ఎందుకోయ్ నవ్వుతావ్? చెప్పూ?"

"అబ్బె — ఏంలేదండి."

"మా బాబుగా చెబ్దూ."

"మరేంలేదండీ! నా జాతకంలో గురువు మకరాన పరమనీచలో వున్నాడు. అంచేతో ఏమోమరి ... శిరోమణిని అడగాలి...! నాకు గురువులు అచ్చిరాలేదు. — పైకి అనకూడని హాంశ కాబట్టి ఎవరితోనూ చెప్పలేదు. భలానాశాస్త్రిగారు ... కాలం చేశారు. (తొంభై ఏళ్ల తొక్కు పోయ్రామరి! అట్లా అతి కాను) నారాయణరావు గుంటూరుఉద్యోగుర్రు రాయిమయింది చెప్పండి? గణ్డాలశాస్త్రి గుడికదూతురు లేచిపోలా? ప్చ్! నాకు తెలుస్తుందీ? బాబూ తెలుసు. పుస్తకంబట్టి చదువు కోటీశుబుద్ధా శిష్యుణ్ణనుకున్నా, నాకు గురువులని ఎవ్వరనుకున్నా ఏదో—దెబ్బ తింటూనే వొచ్చార్రు."

"మరి మీరుకూడా గురు - గౌరవానికి పోటీచేశారాయె."


"ఎప్పుడో బెడిసికొడుతుం దని అనుకుంటూనే ఉన్నాను."

'స' గారు వాడిలిపోయారు: రామ్మూర్తి, రావు, శాస్త్రీజీ ప్రళయ నిశ్శబ్దంతో లోలోపల నవ్వుతూన్నారు. కృష్ణమూర్తి ఉందుకుని" అది నిజమే: కొవ్వూరు చదవబోతే - ఏమయిందోయ్! మీ మాస్టర్ను గోదావరిలో మొసలిపట్టుకుందీ - ?" అంటూ రాజేశాడు!

మాస్టర్ గారికి తూన్పా పడమరా తెలియలా -

'నాయనా! నా ప్రాణాలు నిలిచి - ఉద్యోగం పోకుండా ఉంటే - నీ గ్గురువును కాను బాబోయ్ శిష్యుణ్ణి' అంటూ చేతులు మ్చుకున్నాడు.

'శాస్త్రిగారు, గండం - గడిచిన 'టీపార్టీ కింద' బిల్లు మాస్టరుగారిచేతే యిప్పించారు.



నగ్న నర్తనము

దేశిరాజు కృష్ణశర్మ

౧

నగ్న నర్తనం, నగ్న నర్తనం
నగ్న నర్తనం, నగ్న నర్తనం.

సాయం సంధ్యలో చల్లగాలిలో
మసక చీకటిలో కొసరు కాంతిలో
మబ్బులు క్రమ్మిన మింటి మేడలో
రోదసీ గహ్వర అవరోధంబులో
గన్న నర్తనం, నగ్న నర్తనం.

రాగరక్తిమము రాగిలు తెరపై
జీవరక్తిమము మొగ్గలు వేయగ
జీవఘోషలో ఘణుతులు కళలుగ
జీవనాటకము నాట్యవస్తువుగ
నాట్యంబాడిరి నగ్నసుందరులు.

౨

నగ్నసుందరులు, నగ్నసుందరులు.
సుందరవర్తుల మంథరగమనలు
స రి గ మ ప ద ని స సంజ్ఞాభంగిమ
సాగిపోవుచూ వీగిపోవుచూ
గీతిగీసినటు గ్రీవాభంగిమ
పోతపోసినటు భ్రూవిక్షేపం
కరగిపోసినటు ఒరగిపోవుచూ
తరుగుచు, విరుగుచు, తక్కుచు, తారుచు
చిందునృత్యమూ, జీవకల్లిమూ
చిలుకుచు త్రిప్పుచు
జాతిగుర్రమయి కతను ద్రొక్కుచు
అరణి, పేరణి, హల్లీసకములు
ధమ్మాళీపద ధౌరేయంబులు
ఆటల పాటల ఆలాపంబుల
ఊహాకాశపు ఓలగమంతా
ఊగిపోయినది, సురిగిపోయినది.

నిండుజవ్వనము నిగనిగలాడగ
తళతళలాడే దేహకాంతిలో
ప్రతిఫలించినది, విస్తరించినది
ఆశారూపము, ఆశకు ఫలితము.

పిడికెడు నడుమూ, పెద్ద పిరుదులూ
అలనల్లల్లన ఆడిపోవగా
విసవిసవిస వీగిపోవగా
మంచిచెడ్డలూ మాయంబయినవి.

భేదభావములు వేరైపోవగ
సురుగులు తిరిగిన చూపు లన్నియును
లోతుబాడ్డులో లోపలి దిగువగ
గిరగిరగిర తిరిగిపోయినవి.

3


నగ్న నర్తనము, భగ్న వర్తనము
నగ్నరూపమూ, భంగపాటుగా
లోకవర్తనముపై తెర ఎత్తగ
నగ్నర బరతట నాట్యం బోడను.

ప్రపంచమార్గం ప్రచండమార్గం.
బ్రహ్మాండమంతా ప్రమాణభేరి
ప్రపంచసౌధం త్రాపిడిపడ్డది
మూలమూలగా మూలుగుతున్నది
మతాలదాష్ట్యం, మానుషదాష్ట్యం
మనసులు విప్పిన నగ్నమానవులు
దాష్ట్యము తెలిసిన ధర్మవర్తనులు

నగ్నరూపులై నాట్యంబాడుచు
ప్రమాణభేరికి జయంబు గొట్టుచు
బ్రహ్మాండమంతట బాటలు దిద్దిరి.

రాగము తిప్పిన భంగపాటులో
మనకచీకటిని మూసుకపోయెను

పెద్దలనీతి, ఎద్దడీవర్తన
ఒరపిడిమార్గం, నరవడిదోపిడి
సంజమబ్బులకు చాటుగ నాట్యము
మబ్బుటుబ్బులకు మాయము కాగా
యథార్థదృశ్యం యథార్థలోకం
యథార్థజీవిని నిలిచిపోయితిని
తూర్పున చంద్రుడు తొంగిచూచెను.
పడమట భానుడు ఫక్కున నవ్వెను.



నాట్యం-ఆంధ్రులు

వి. వి. ఎల్. ప్రభాకర్

[శ్రీ వి. వి. నరసింహారావుగారు వృద్ధిలోకి రావలసిన చిన్నవారు. సహజంగానే వారికి నాట్యంలో అభిరుచి అలవడింది. ఇంతవరకు వారు చాలాచోట్ల నాట్యప్రదర్శనాలిచ్చారు. నాట్యకళాభిమానులూ, రసజ్ఞులూ వాటిని చూచి మెచ్చుకొని ఆనందించారు. ఏగురువుదగ్గరా నేర్చుకోకుండానే ఇంతటి ప్రజ్ఞ ఆయన చూపగలిగినప్పుడు తగిన గురువువద్ద ఈవిద్యను అభ్యసిస్తే ఆయన ప్రతిభా, ప్రజ్ఞా ఇంకా ఎంతగా రాణిస్తుందో. ప్రతిభాశాలి ఆయన. ఆయనదగ్గరున్న ఈప్రజ్ఞను, ప్రతిభను గమనించి ఆయనకు ప్రోత్సాహమివ్వడం ఆంధ్రుల కనీస ధర్మం.—భా. సం.]

ముందుకు రాదలచుకునేవాడెవడూ, వెనక్కి చూడనేచూడడు. ఒకవేళ చూస్తాడో, అంతముందుకొచ్చినవాడూ క్షీతలాగ వెనక్కి వెనక్కి నడిచాడన్నమాటే. కోతి దగ్గరనుంచి బయలుదేరి నిచ్చెన లెక్కి ప్రమోక్ష వైకుంఠందాకా వచ్చి తటాలున పెద్దపాము నోట్లోపడి తోకచివరకి వచ్చి మళ్లీ ఆకోతి సాన్నిధ్యానికే వస్తాడు వైకుంఠపాళీ ఆటగాడు. గతసౌభాగ్యాలని తలచుకొని పొంగిపోయి తృప్తిపడి కాళ్లుచాచుకొని కూర్చోవడం కన్న ప్రస్తుతదుస్థితిని చూసి క్రుంగిపోయి తేలడానికి యత్నించడం బాగుపడేవాడి లక్షణం.


పూర్వకాలంనుంచి యిప్పటివరకూ, ఆంధ్రులు నాట్యకళవిషయంలో చేసినకృషి మనహిందూదేశానికి తెలియలేదు. అంతవరకూ ఎందుకూ! 'మద్రాసువారు' అనేగాని ఆంధ్రులనేవ్యక్తులు కొందరున్నారనేసంగతే మొన్నటిదాకా ఇతరరాష్ట్రాలవారికి తెలియనే తెలియదు. ఆమాటకొస్తే స్వతస్సిద్ధంగా ఉన్న తమప్రతిభను తెలుసుకోలేక ఇతరులప్రతిభ గోరంత వున్నా కొండంత చేసి లేనిపోని సిగ్గుచేత ఒక చీకటిని సృష్టించుకునేరకం (inferiority complex) మన ఆంధ్రులు.

చాలాకాలంనుంచి మనఆంధ్ర దేశంలో నాట్యంలో ప్రఖ్యాతి పొందినవారు కూచిపూడి భాగవతులు. వారిలో బ్రాహ్మణులూ ఉన్నారు. కాని చాలావరకు కళావంతుల సంఘానికి చెందినవారే. వారందరూ ప్రాచీన భరతశాస్త్ర సంప్రదాయాన్ని అనుసరించారు. కాని తగినపోషకవర్గం లేకపోవడం, దానివల్ల ఉన్న ఉత్సాహం తగ్గిపోవడం, అదీకాక సంఘసంస్కరణంవల్ల (మంచిపనే అనుకోండి) కళావంతులకి వివాహాలు జరుగుతూ ఉండడం — వీటన్నిటిచేత, ఆంధ్రనాట్యం క్షీణించడం ప్రారంభించింది. ఇప్పటికళావంతుల వీధిమేళాలు ఎంత అసందర్భంగా ఉంటున్నాయో చూస్తూనేవున్నాం.


పూర్వం మనవాళ్లలో చతుర్విధగ్రీవాభినయాలు, నవవిధశిరోభేదాలు, అష్టవిధ


శ్రీ బి. వి. నరసింహారావుగారి నాట్యభంగిమములు *







* శ్రీ నరసింహారావుగారి ఛాయాచిత్రములు శ్రీ పిఠాపురం కుమారరాజావారి అనుమతిని.









భావ రాగ తాళాలకి కట్టుపడి శాస్త్ర ప్రకారంగా అభినయించేది ఈ భరత నాట్యం. ఇది అద్భుతమైనది, కష్టమైన దిన్నీ.

౨. కేరళ దేశంలోని "కథాకళి" :- దీనికీ భరతనాట్యానికీ ఎంతో తేడా లేదు. ఇది భావతాళప్రధానం. ఇందులో నాట్యం చేసేవారు సంగీతం స్వంతంగా పాడరు. వెనక వాద్యాల సహాయంతో, మూగాభినయమే చేస్తారు.

3 గుజరాతులోని "గర్బా" నాట్యం:— ఇది భావరాగప్రధానం. దీనిలో సంగీతానికి ప్రాముఖ్యం ఎక్కువ. విలాసవతులైన స్త్రీలే తరచుగా ఈ నాట్యం చేస్తారు. గోపికలు యమునకి స్నానానికి వెళ్లడం, రాసక్రీడ, గోపికావస్త్రాపహరణం మొదలైన ప్రేమతత్త్వానికి చెందిన ఖులాసాఘట్టాలనే, శృంగారరసం చిప్పిల జేస్తున్న పాటలు పాడుతూ, కొంతమంది స్త్రీలు ఏకమై అభినయిస్తారు.

౪. అస్సాము రాష్ట్రంలోని "మణిపురా" నాట్యం :- ఇది భావప్రధానం. రాగతాళాలు పాటించడం అంత ముఖ్యం గాదు. ముఖంతోను, ఇతరావయవాలతోనూ వ్యక్తపరచదలచుకొన్న భావాన్ని అభినయించాలి. దీనికి భావనాశక్తి చాలా కావాలి. మొగ్గ పుష్పించడం, నీళ్లు తోడడం, వీణావాద్యం, చిన్నచిన్న పిట్టకథలు మొదలైనవి వట్టిసంజ్ఞల(Dumb action)వల్ల, గుర్తుల (symbols)వల్ల తెలియ బరచాలి.

౫. కోయవాళ్లు మొదలైన అనాగరికజాతుల నాట్యం(Rustic dance):- దీనికి ఒకపద్ధతి అంటూ తరచుగా ఉండదు. ఆ అనాగరకులు పండుగల్లోను, పెళ్లిళ్లలోను, వేట నుంచి జయంగా వచ్చాక ఆనందంగా ఉన్నప్పుడూ, ఆడవాళ్లూ మగవాళ్లూ కలిసి, చెడత్రాగి నాట్యం చేస్తారు. కొందరు ఊరకే గంతులు వేస్తారు. కొందరు కూనురాగాలు తీస్తారు. కొందరు డప్పులు మొదలైనవి వాయిస్తారు.

నరసింహారావునాట్యం పైరకాలలో వేటిలోనూ పూర్తిగా చేరదు. ప్రతిరకంలో ఉన్న ముఖ్యలక్షణాలు గ్రహించి, తనస్వప్రతిభవల్ల క్రొత్తవన్నెలు పెట్టి, ప్రత్యేకమైన ఒకనవ్యనాట్యాన్ని సృష్టించాడు. భరతనాట్యంలో ఉన్న విసుకుపుట్టే కుస్తీపట్టు భాగాలు వదిలేసి, రక్తి కట్టే సున్నితమైన శాస్త్రభాగాలు, కథాకళిలో ఉన్న అవయవాలవెంపు, గర్బానాట్యంలో ఉన్న విలాసం, ప్రేమతత్వం, మణిపురానాట్యంలోని అద్భుత భావప్రకటనాశక్తి, కొండనాట్యంలోని అమాయిక ఆనందతత్వం, - ఇవన్నీ కూడ దీసుకుని, ఒకక్రొత్తసృష్టి చేశాడు నరసింహారావు.

నరసింహారావు బి. యే. ప్యాసయి, బి. యిడి. అవుతున్నాడు. ఆంధ్రభాషలో మంచిప్రవేశం ఉంది. బాగా పాడతాడు. నాటకరంగంపైన పేరుగలవాడే. అతని నేత్రాలు మొదటినుంచీ అభినయంలో చాలా చురుకుగా పనిచేశాయి. తాళంలో నిధి. అతనినాట్యం భావప్రధానం. ప్రతిమల్ని కళ్లలో కట్టేస్తాడు. విదేశనాట్య గ్రంథాలు బాగా చదివి, ముఖ్యంగా వాళ్ల సునిశితం

అయిన నడక (Rhythm)అలవరచుకుని బాగా ఉపయోగించుకున్నాడు. అదీకాక మనపూర్వనాట్యగ్రంథాలు - భరతశాస్త్రం గోపాలకృష్ణయ్యగారి గ్రంథాలు - వంగీయులగ్రంథాలు - అన్నీ క్షుణ్ణంగా అరిగించుకున్నాడు. గ్రీకుస్టాట్యూలని చూసి వాటి అంగసౌష్టవం సంపాదించాడు. అజంతా ఎల్లోరా వంటి దివ్యనిర్మాణాలని చూసి వాటిఅంగనిర్మాణపద్ధతులు కనిపెట్టాడు. నందలాల్ గారి మహాచిత్రాలు చూసి నవీనపోకడలు ప్రారంభించాడు. ముఖ్యంగా ముఖంతోనే భావం వ్యక్తీకరించడంఅనేది అతనిపద్ధతి. అందుచేత అతని నాట్యాన్ని అనంతంగానూ ఉషారుగానూ చూస్తాంకాని ఊపిరి బిగపట్టి దేముడాఅంటూ కుస్తీచూసినట్లు చూడం. ఇతనినాట్యాన్ని ౨౦-వ శతాబ్దపు 'నవ్యనాట్యసృష్టి' అనాలి.

ఆంధ్ర దేశంలో నాట్యకళ చదువుకున్నవారిలో వ్యాపించనేలేదు. నాట్యం అనగానే మనవాళ్ల తప్పుబుద్ధులలోకి భోగంమేళమే జ్ఞాపకంవస్తుంది. సత్కుటుంబిరాలైన ఏ స్త్రీయేనా నాట్యంచేసిందంటే, ఇదికులభ్రష్టురాలయింది, భోగంవృత్తిలోకి దిగింది" అనేవారు. ఈలాంటి నీచస్వభావాలు చూస్తే జాలేస్తుంది నాకు. పురాణకాలంలో, ఉత్తర, ఉష, మొదలయిన ఉత్తమస్త్రీలు బాగా నాట్యంచేసేవారని చదువుకున్నాం. మొగలులకాలంలోనూ, కృష్ణదేవరాయలకాలంలోనూ, సత్కుటుంబస్త్రీలు, అంతఃపుర కాంతలు సైతం నాట్యంచేసేవారు.

౨౦-వ శతాబ్దంలో అన్నికళలతోపాటు,నాట్యకళకికూడా పునరుజ్జీవం కలిగింది. విద్యాధికులూ, ఘనకుటుంబీకులూ అయిన స్త్రీపురుషులు ఈకళని చేపట్టారు. అస్సాములోనూ, బెంగాలులోనూ స్త్రీలెందరో ఛాందసకుటుంబాలలోసైతం) ముఖ్యంగా నాట్యవిద్య నేర్చుకుంటున్నారు. అక్కడ పెళ్లి సంబంధాలు కుదిర్చేటప్పుడు, అందం ధనం కన్నా ముందుగా, నాట్యం వచ్చునో రాదో అని చూసితీరతారు. ఇది అక్కడ తప్పు కాదు సరిగదా, సుగుణంగాకూడా చూస్తారు. ఆఖరికి దాక్షిణాత్యులు, మలబారువారు సైతం దానిని అవలంబించారు. కాని మన ఆంధ్రులు ఇంకా వెనకనేఉన్నారు. ఈమధ్యనే, కొంచెం మంచిదారిలోకి వస్తున్నారు.

మన దేశంలో ఉదయశంకర్, గోపీనాధ్, సహానాదేవి సాధనబోస్, మేనక, అజూరి మొదలైన నాట్యకళానిధు లున్నారు. వారు ప్రజల ప్రోత్సాహంచేత ధనసంపదచేత, విదేశాలలోనూ పేరు సంపాదించారు. మనవాడైన బి. వి. నరసింహారావు వాళ్లకన్న ప్రతిభలో ఏవిధంగానూ తీసిపోడు; ఇంకా కొన్ని విషయాలలో వాళ్లను మించాడేమోకూడాను. జయదేవునివంటి మహాభక్తులగీతాలు, టాగూరువంటి ప్రసిద్ధనవకవుల నవ్యప్రేమగీతాలూ, అతను పాడి అభినయిస్తుంటే, స్వర్గంలో వున్నట్లుంటుంది. నాట్యకళాభిజ్ఞులు కొందఱు నరసింహారావు నాట్యం చూస్తుంటే, అజంతా శిల్పకల్పనలు స్ఫురిస్తున్నా యన్నారు. భావప్రకటనలో ప్రాణంపెట్టడమే, దానికి కారణం. ఈపాటికి విదేశాలలోనూ ఇతనికీర్తి వ్యాపించియుండవలసిందే. కాని అలా జరగడంలేదు. ఇంకో ముఖ్యకారణం నిర్ధనత. దానికి కారణం మన ఆంధ్రుల తత్వంలో ఉన్నలోటే.

ఆంధ్రులు తమగొప్ప తెలుసుకోలేక అడుగంటుతున్నారు. తమవా రెవడేనా పైకి

వస్తున్నాడంటే, వాణ్ణి అణిచేస్తారు, ఏ బాల సరస్వతో రాగిణీదేవో వచ్చి నాట్యంచేస్తోందంటే, మనవాళ్లు ధనవర్షం కురిపించేస్తారు. మననరసింహారావువంటివాళ్లు నిజంగా అంతకంటెవెయ్యిరెట్లు గొప్పనాట్యం చేసినాసరే "ఓరీ! వీడేనా? ఏడిసినట్లుంది" అని సణుగుతారు. దమ్మిడీయేనా ఇవ్వరు. బెంగాలీ వాళ్లని చూసి మనం బుద్ధితెచ్చుకోవాలి, సిగ్గుపడాలి, వాళ్లలో గోరంత గొప్పవాన్ని కొండంత చేసి, బ్రహ్మరథం పట్టి, నక్షత్ర లోకంలోకి ఎత్తేస్తారు. పోనీ మనం అలా చెయ్యనే అక్కర లేదు! నిజంగా ప్రతిభ ఉన్న ఆంధ్రులనైనా ప్రోత్సహిస్తే అంతే చాలు. అలాకాక ఫలాని ఆసామి అద్భుతంగా నాట్యంచేసాడంటే ఉడుక్కుని భరించలేక అసలుసంగతి వదిలేసి "వీడు త్రాగుతాడురా: వీడితల్లి పిడకలమ్ముకునేదోయ్" అని రకరకాలగా చంటిపిల్లలలాగ ప్రవర్తిస్తున్న మన ఆంధ్రుల్ని ఎందర్నో చూసాను.

ఉదయశంకర్ కున్నట్లు ఒక నాట్యసంఘం, ప్రక్కవాద్యాలు, విలువైనదుస్తులు రసం గ్రహించి ధన సహాయంచేసే రసికులు గొప్పను సాటించే 'మోడరన్ రెవ్యూ' లాంటి పత్రికలు, అసూయలేక వాళ్ల వాళ్ల ప్రతిభను కీర్తించే, ఆంధ్రులు - ఇవన్నీ సమకూడి, ఈపరికరాలన్నిటితోటి నరసింహారావుకూడా విదేశయాత్రలు చేసాడంటే అక్కడివారు ఇతన్నికూడా బ్రహ్మరథం పట్టి ఉదయశంకర్ తాతలాగ చూడకపోరు.

మనఆంధ్రుల్లోనూ పిఠాపురం యువరాజావారివంటి కళోపాసకులు లేకపోలేదు. అటువంటివారు ఏకళనేనా ప్రోత్సహించడానికి తగిన విద్యాధనసంపదలు కలవారు. వారే పూనుకొని మహాప్రతిభాశాలియైన నరసింహారావుని విదేశాలకి పంపి అతనిసాయముతో ఒకనాట్యకళాపాఠశాలను(ఉదయశంకర్ త్వరలో చెయ్యబోయేలాగ) ఆంధ్రదేశంలో స్థాపించి నాట్యగౌరవాన్ని అస్సాములోలాగ వ్యాపింపచేస్తే కళకలవారికి, కళని ప్రోత్సహించిన వారికి, భరిస్తున్న దేశానికికూడా పేరు వస్తుంది. అసలు ఈపని ఆంధ్రవిశ్వకళాపరిషత్తే చేసియుంటే బాగుండును.

నాట్యకళానిధి నరసింహారావు నాట్యకళోద్ధరణానికి నాట్యప్రపంచంఅంతా సంచరిస్తే నాట్యాకాశం అంతలోనూ ధృవతారగా మారిపోతాడు.

* * *

కవికుమారుల స్వర్ణ సువర్ణోపాయనము

[ఈ నడుమ రాజమహేంద్రవరం గవర్నమెంటు ట్రెయినింగుకాలేజి నాటక సంఘంవారి యాజమాన్యమున ప్రదర్శింపబడిన "అనార్కలి" నాటకమున నాయకపాత్రధారి శ్రీ బి. వి. నరసింహారావుగారి పాత్ర నిర్వహణవిధానమును, వారి భరతనాట్య కౌశలమును చూచి :]

జనుల ఆంగిక విన్యాసఫణితినుండి, భాష స్పష్టతకై పుట్టి ప్రబలె ననుట,
మెగిరిపోవును నీ నాట్య మింత చూడ, సరిగ నది భాషకంటెను స్పష్ట మగుట.

ఒకమారు సాంధ్యరాగోజ్జ్వలసుందరశ్రీ దోచు నవచంద్రరేఖవోలె
ఒకమారు సారామవికచపల్లవశోభ గ్రసియించి పాడు పికాంగనవలె
ఒకమారు నీలాంబుదోల్లసద్దర్శనోదారయై యాడు మయూరివోలె
ఒకమారు స్వర్ణప్రభోద్దీప్తతను నిండి చలనంబు గలుగు పాంచాలికవలె
రమ్యముగ రంగమందు నలంకరించు - కాని అపూర్వంబుగా నాట్యఘనత జూపి
చూపరుల హృదయంబులఁ జూరగొంటి - వింక నుతియింపగా పల్కులెట్లు వచ్చు?
— శ్రీపాదలక్ష్మీనారాయణమూర్తి

*　　　*　　　*

కణమై, కూపకమై, హ్రదంబయి, నిసర్గస్రోతమై, కుల్యయై,
ధునియై, భంగవిభంగఫేనమయి, అత్యుద్వేలకల్లోలమై,
జనితావర్తకమై, ప్రశాంతగతియై సర్వోర్వరాత్మాభినం
దన గంగావిమల ప్రవాహములుసూ! తన్నాట్యరేఖాగతుల్.

ఆంగిక సాత్త్వికక్రియలయందు, మనోహర నూత్నభావప
ర్యంగణ మాచరించెడి మహానటు డాతడు కంఠమెత్తి పా
డ, గలకంఠకంఠనిబిడ ప్రసవ గ్రసనానురక్తకో
కాంగికవృత్తి బట్టబయలౌ; పికరాజును మిన్నదూలెడుక్

అనటనావిలాసగతి, యానవమోహనమందహాసరే
ఖానియమంబు, లా మధురకంఠము, నాబహుళాంగహారసం
ధానక కౌశలంబు, ప్రథితంబగు తన్మహనీయభంగిమ
శ్రీ, నిరుకించుచుఙ్ బలవరించెద; నెంతగ హత్తుకొన్నవో!

మనమున బుట్టుభావము క్రమంబున మోమున దేర్చి, చేతన
వ్వన నొడిఁబుచ్చి, ఆంగికపు ప్రోపున బెంచి, లతాంతపంక్తి మె
చ్చని స్వకరాంగుళీ రుచులసాకి, పదాంగద కింకిణీక్వణ
క్వణముల వియ్యమందు మృదుగానమునం దలరించు, నట్టిషో!
— 'రాజేశ్వరులు'

పుస్తక సమీక్ష

శాంతినికేతనం

[ఉపదేశికులు : శ్రీ రవీంద్రనాథఠాకూర్. అనువాదకులు, ఆకురాతి శ్రీ కృష్ణమూర్తి, చలమయ్యగార్లు. ప్రకాశకులు : ఆకురాతి చలమయ్యగారు, సూపరింటెండెంటు, శాంతికుటీరం, పిఠాపురం, తూర్పుగోదావరి జిల్లా. ధర. రెండు రూపాయలు.]

"జాలరంధ్రాప్తి సిలావిస వక్కి నాకె
పాలన్నోక్తి శిప్వాచె పావం పావం"

—శ్రీ వల్లత్తోలు నారాయణ మీనన్.

[కిటికీలోనుంచి పడుతూన్న వెన్నెలను పాలను కొని పిల్లి...అతికష్టంగా నాకుతోంది.]

—శివితమంతా ఇంతే ఐ, వేసటేలేని సత్యాన్వేషణంలో, శ్రద్ధానికీ సంఘర్షణల్లో, రోమేరోలా, గాంధీ, అరవింద, రవీంద్రులు విజ్ఞాన వ్యాఖ్యాతలుగా నిలచారు.

వారు పలికే ప్రతిపలుకూ...ఎండిపో వాసనపోని పొగడ పూలుగా వుండటంలో ఆశ్చర్యంలేదు.

'క్షురస్య ధారా...నిశాతా, దురత్యయా, దుర్గం పథః' అన్న మూక్తిని గుర్తుకు తెచ్చే, గాంధీ, అరవిందోల ధోరణికన్న, 'కవి – మహర్షి' ఐన రవీంద్రుని వాణీ, ప్రబోధాన్ని చంద్రోదయంలాగు, సత్యాన్ని కవిత్వ ధోరణుల్లో మలచి, ఉపదేశిస్తుంది.

—వారంవారం శిష్యదూడామణులకు చేసిన ధర్మ ప్రసంగముల సమూహం వంగవాణిలో, 'శాంతి నికేతనం'గా గ్రథితమైంది. దానికి తెలుగు సంతరించే ప్రస్తుతగ్రంథం...!

'ఓం' కారంతో ప్రారంభించి 'తేన త్యక్తేన భుంజీథాః' అన్న ఈశావాస్యంలోని గంభీర్యాన్ని: అవగాహన చేసుకుంటూ, వెన్నెట్లో పడవ ప్రయాణంలా, రసహర్మ్యాన్ని మననంచేసుకుంటూ అంతరాత్మ తపోవనాన్ని చేరట్లం...కావ్యప్రయోజనం! అని మనం చూచాయగా అనుకోవచ్చును.

'తపోవన' ప్రాప్తికూడా ఐ, హృదయపరిపక్వత సిద్ధించాక, నాసాగ్రనివాసరసికుణ్ణి, తన్ను, తానే అనుభవిని...సోహంమార్గము పోయి,

'జ్యోతిరహం' అని తేల్చుకుని, "మాహం బ్రహ్మ నిరాకుర్యాం,మా మా బ్రహ్మ నిరాకరోత్"అని త్రికరణ శుద్ధిగా అనుకుంటే గ్రంథప్రయోజనం పూర్తి అవుతుందని మనం నిశ్చయించుకోవచ్చును.

ధర్మసాధని ప్రచారంలో...ఈ గ్రంథంలోని కొన్ని వ్యాసాలు తెలిగింపబడినవి. కడమవి తీరకగా. శ్రీ మహర్షి వెంకటరత్నంనాయుడుగారి పీఠికా, [ఆంగ్లంలో, ఆంధ్రంలోనూ] పీఠికాపుర మహారాజుకు అంకితసందర్భమూ, పుస్తకపు 'వన్నె — వాసి'కి అండగా నిలచినవి.

వంగవాణికి తెనుగుసంతరింపు గనుక, వంగసమాస ధోరణుల మేళవాన్ని మనం నుండే పోల్చుకుంటాము.

ఈ తెనుగుద్వారా ఆ అంతర్వాణి ప్రబోధాన్ని దగ్గరకు చేరగలం.

శ్రీ రుక్మిణీనాథశాస్త్రి.

శ్రీ కళాసిద్ధి

కవి : శ్రీపతి త్ర్యంబకరావు, బెజవాడ.
పుటలు ౧౦౪ : వెల ౧-౦-౦.

ఈ కావ్యములోని ఇతివృత్తము దేవీభాగవతము నుండి గ్రహింపబడింది. ఒక చిన్నకథను తీసుకొని అయిదాశ్వాసాల కావ్యం రసవంతంగా అల్లడమే కవి కల్పనాప్రతిభకు తార్కాణము. కావ్యం ఎక్కువ భాగం ప్రాచీనకావ్యపద్ధతిలోనే నడచింది. దీనిలోని కవిత్వం చాలావరకు నారికేళపాకంలోనె ఉందని చెప్పవచ్చు. ఈకవి కవితాశక్తికి,పాండితీవిభవానికి ఈయ నకుగల 'ఆశుకవికేసరి, అవధానధురంధర' ఇత్యాది

చిరుదాహశే ప్రమాణము. ఈ గ్రంథంలోని రీతి చాలా మంచిది. ధార అవర్గళంగా సాగింది. ఈకవి సంస్కృతాంధ్రముల మంచి పలుకుబడి గలవాడు. కవిత్వంలో ఎన్ని పోకడలైనా పోగల శక్తిమంతుడు. పూర్వప్రయోగాలలో ఆరితేరినవాడు.

ఈ కావ్యానికి 'శ్రీకళాసిద్ధి' అనుపేరు పెట్టడంలో కవి ప్రాచీనధోరణిలో సంస్కారము, అభిమానము కలవాడని ద్యోతకమవుతుంది. శ్రీవిశ్వనాథ సత్యనారాయణగారి తొలిపలుకుతో ఈ కావ్యప్రాశస్త్యము ఇనుమడించింది. టీకాకారులు చెప్పినట్లుగా, కావ్యనాయకునితోబాటు గ్రంథకర్తకుకూడా ఈ కావ్యంతో కళాసిద్ధి ఐనదనే మా అభిప్రాయము.

ఈ కవికళాదృష్టి ప్రాచీనమనే చెప్పవచ్చు. అక్కడక్కడ కొన్ని ప్రయోగాలు వీరగ్రాంధిక వాది కాదనిపించినా, శైలిలో, పోకడలలో పూర్వులకు దూరము కాదు.

ప్రకృతి వర్ణనలు సహజమై కవియొక్క సృష్టిపరిశీలనాశక్తిని తెలియజేస్తున్నవి. మాదిరికి :

"మను మనుమంచు బిందువుల సేలకుఁ దార్పఁ
గన్నె తీవగమి చెట్టాటలాడ
వరవిచ్చు క్రొవ్విరి తేఁటితో తెమ్మెర
కోడెగాడు రహస్యగోష్ఠి సలుప
విరి రేఁగు తల్లుల రొమ్ములలోనఁ బాలుంగు
పూవులు గారానఁ గునిసియుండఁ
గెంపు క్రొందాలింపు నింపగా సెలయేటి
పసఁతి హాయిగ పాటపాడఁ బూవ
వరుణు మణిమకుట ప్రభ లఖిలలోక
తతి రజోరాగమాలికా ప్రతతి ముంప

నిదురచాకుక్క దక్కుచు నుమస్పదతి పీణ
లలితభూపాలరాగస్వరమ్ము గూర్ప."

ఈయనసీసపద్యాలు శ్రీ నాథుని సీసపద్యాల్ని అందుకొంటున్నవి. పదాలంకారంలో కొన్ని పద్యాలు రామరాజభూషణుని పద్యాలతో తులదూగు తున్నవి.

"ఆపాదమస్తకం బపరంజితభుకులా
తభుకులో చిత్రలీలలు రచించు........."

(శ్రీ కళాసిద్ధి)

"ఏరాజు భూరితేజోరుణాలోకంబు
లోకంబు తమము నిరాకరించు........."

(వసుచరిత్రము)

గ్రంథకర్తకు ఆముక్తమాల్యద అంటే మిక్కిలి ప్రీతేమో అనిపిస్తుంది. వర్ణనల్లో ఈకావ్యాన్ని పోలు తుంది. శ్రీ కృష్ణదేవరాయలవారి కవితవలె వీరి కవన ములో బిగువు, పటుత్వం కనిపిస్తున్నవి. జటిల సంస్కృత సమాసభూయిష్ఠమై ప్రౌఢత్వంలో 'శ్రీకళా సిద్ధి' ఆముక్తమాల్యదను మరపిస్తుంది.

"తతకిరీటవిచిత్రితచిరత్నరోచులు
వదనాబ్జముకు వింతపసల సీన......"

"పటహకాహళముఖస్ఫుటనినాదం బిలే
శ్వరపత్తనప్రదేశమ్ము దెలుప......"

....

నగరుశేర ధరాంగనాపాయకుండు."

ఈపై పద్యాలు ఆముక్త మాల్యదలోని,

"పన్నిటితో గదంబము నేసి పూసిన
మృగనాభిపస రాచనగరు దెలుప......

అర్థిసభ్యాంతరాంతః పురాంతరమున
భోగినీసంగతికి రాజు వోవుచుండె"

అనే పద్యంవలె స్వభావోద్ధంగా, హృదయంగమంగా వున్నవి.

ముందు ముందు ఈ గ్రంథకర్త ఇంత కంటె కొంచెం లేలికభావంలో ఇంకా ఈలాంటి కావ్యాలు సృష్టించాలని మా కోరిక.

వ. రంగయ్య.

ము స ల మ్మ

[గ్రంథకర్త : చిలుకూరి నారాయణరావుగారు, ఆత్రేయాశ్రమము. అనంతపురము - వెల ఒక అణా.]

'తమకోసం తలిదండ్రాదులను
తలవరిగే భూతలములోపల
పరులకొరకు తేను ప్రాణం విడిచే
వా రున్నారా ? కన్నారా ?'

అను ప్రశ్నకు సమాధాన మీముసలమ్మ కథ. బుక్కరాయల రాజ్యములో చిక్కప్ప వొడయరు బుక్కరాయ సముద్రమను చెరువును త్రవ్వించెను. వర్షాకాలములో నా చెరువు పొంగి పొరలి పట్టణమును జుట్టుముట్టెను. గంగాభవాని యొక్క మూసలమ్మపై నావేశించి నరబలి గోర నూరిలోనున్న బసివిరెడ్డికోడలు ముసలమ్మ ఆత్మత్యాగము చేసి యూరికొరకు దన ప్రాణము లర్పించెను. చెరువు గండిలో ముసలమ్మ శవముపైన రాళ్లు వట్టి వేసి పూడ్చగా నాభాగమునకు ముసలమ్మ కట్ట యను పేరు వచ్చినది. ఈపేరని 'ముద్దులనమ్మ' యను ముసలమ్మ ముసలమ్మలుగూడ చూపించని త్యాగము చూపించుటయే ఇందుముఖ్యాంశము. ఏడుదరుకోడళ్లు గలిగిన ముసలిదైనను ప్రాణముమీది తీపితో జావునకు భయపడు నత్తగారికి ముసలమ్మ వేదాంతబోధ యొనర్చుటయే పుస్తకములో రసవంతమైన పట్టు. కాని, శ్రీ బాయమునకున్న బాలిక వేదాంతబోధ యొనర్చుట 'చిన్ననోట పెద్దమాట' యని యనిపించక మానదు. ఈ

చిన్న పాత్రము బొబ్బిలికథ ఫక్కిలో వ్రాయబడినది. శైలి మిక్కిలి యందముగా నున్నది. చక్కని దేశీయములగు తెలుగు పదములు కూర్చుటలో నారాయణరావు గారు సిద్ధహస్తులు. పూర్వగాథలనుగురించి వ్రాసిన ఇటువంటి పాటలు ఆంధ్రవాఙ్మయములో నశించగా మిగిలినవి జానపదులవద్ద నున్నవి. చిరస్మరణీయము లగు పూర్వగాథల నీ విధముగ రచించినయెడల నాంధ్రలోకమున శాశ్వతముగ నుండగలవు.

చెల్లమాంబ

[గ్రంథకర్త: పెమ్మరాజు లక్ష్మీపతి గారు వలయువారు చెంగల్వల చిట్టిపంతులుగారు, భీమవరమునకు వ్రాయవలెను.]

ఈపుస్తకమునందు భర్తతో సహగమన మొనర్చిన ఆంధ్రసాధ్వీమణి చరిత్రము గేయరూపమున రచింపబడినది. చెల్లమాంబ రాయకుదురు గ్రామవాస్తవ్యుడైన చెంగల్వల తిమ్మయ్య భార్య. ఆమారివారి యాడుబడుచు. ఈమె క్రీ. శ. ౧౮౨౪ సంవత్సరమున కార్తికపౌర్ణమినాడు భర్తతో సహగమన మాచరించినది.

ఇందు కథ కవిశక్తియుక్తుల చేత గ్రంథరూపమెత్తినదిగాని లేకున్న మూడు ముక్కలలో చెప్పవచ్చును. ఇందు మొదటి యధ్యాయమున, భర్తృ మరణానంతరము చెల్లమాంబ యూరిలో పసుపు కుంకుమ పంచిపెట్టుచు నూరివారందరును తోడురా భర్తశవము వెంట బోవుటయు, మూడవ యధ్యాయమున సహగమన మరికట్టగించు పోలీసుల నదలించి, భర్తృపూజ యొనర్చి భర్తతో పాటు చితిహోత్రమున కాత్మార్పణ మొనరించుకొనుటయు వర్ణింపబడినవి. రెండవ యధ్యాయమునందు చెల్లమాంబ పూలపడవపైన సంసారసాగరమును దరించి స్వర్గమునకు బోవుట కవి తనయూహా ప్రపంచమున సృష్టించినాడు. ఈయధ్యాయమునందు కథ యొకయడుగైనను ముందునకు నడువదు. కాని పాఠకు లేమాత్ర మజాగ్రత్తగ నున్నను కవియొక్క భావనా ప్రవాహమున గొట్టుకొనిపోక తప్పదు. ఈయధ్యాయములోని కవితామాధుర్యములో తన్మయులై

మాంబను మోక్షమునకు బంపిన పాతకమహోశయులు మూడవ యధ్యాయములోని మొదటి గేయమునందు ఎల్లుటోసీలవారు సహగమనము నాపుటకు వచ్చిరని చదువగనే మెలకువగాంచి దిగ్భ్రమతో కథావృత్తాం తముకొరకు వెనుకటి పుటలను వెదుకవలసిన యవసరము రాకమానదు. ఈరెండవ యధ్యాయమున కవియొక్క యూహాచమత్కారముతోపాటు కవితాపాటవమును దక్కినచోట్లకన్న వన్నెమీరియున్నది. కొన్నిచోట్ల గేయములు విశ్వనాథ సత్యనారాయణగారి కిన్నెరసాని పాటలను స్మృతిపథములోనికి దెచ్చుచున్నవి. మచ్చున కొకటి చూడుడు:

కన్నీరుతో వలపు పన్నీరుతో పాల
మున్నీరులో గలియు మిన్నేరువలె మెరసి
మిన్నంటి తనువుగని వెన్నంటి కడువడిగ
నడిపించినది - చెల్లమాంబా - ఆపూల
పడవ నల్లన - చెల్లమాంబా.

కొంచెమించుమించు ఈవిధముగానున్న కిన్నెరసాని నృత్యమును జూడుడు.

తలిరో ర్పుతో - నీటి
యల నూర్పుతో - అంద
ములమార్పుతో - కిన్నె
రటుతూలి యిటుతూలి
చిగుపుటందాలతో - నగవుటందాలతో
నిండుగా ప్రవహించెనే - పువ్వుల్ల
చెండులా చెలువొలికెనే.

మన కావ్యములో చెల్లమాంబ రాజశాసనమును లెక్కపెట్టక బహిరంగముగా సహగమన మాచరించినది. అటంకపరుప వచ్చిన రక్షకభటులు సైతము చెల్లమాంబ కంటె యొఱుపునకు వెఱచి యా పతివ్రతామతల్లిని సమీపించుటకు సాహసింప లేకపోయిరి. రాజశాసనము నకు చెల్లమాంబ యొసగిన సమాధానమును జూడుడు:

"నారాజు, నావలపు రారాజు తిమ్మయ్య,
కుంఫిణీవారి కిది సత్తెరుగ రాదయ్య;
రాజెవరు? నను పోవరాదనుచు శాసింప
రా తీతడనె - చెల్లమాంబా - రాజ్యముకు
రాణి నేననె - చెల్లమాంబ".

ఈ సమాధాన మామెకు భర్తపై గల గౌరవాభి మానములను దెలియజేయును.

భయమునందలి బలవంతమైన యారచామువలన గాని దుఃఖాతిశయముచేత మైమరచిగాని చెల్లమాంబ సహగమన మొనర్పలేదు. భర్తయందు గల ప్రేమాతి శయముచేత భర్తృమరణానంతరము తన జీవితము వ్యర్థమనుకొని సహగమనము కావించెను. ఆమెనోటనే వెడలిన మాటలను గమనింపుడు:

'దీప మారినవెనుక తేజంబు మిగులునా?
పూవు రాలినవెనుక తావి తా నిలుచునా?'

కవిగారు పీఠికలో చెల్లమాంబ తత్త్వజ్ఞానాను భవముతో సహగమన మొనర్చినదని వ్రాసిరి కాని చెల్లమాంబ కట్టి తత్త్వజ్ఞానానుభవ మున్నట్లు కావ్యము నందు గన్పడదు. ఒకవేళ నున్నను తత్త్వజ్ఞానులకు సహగమన మనవసరముగదా!

గేయము లన్నియు నుత్సాహ పూరితములు. ఆవేశములో కవి యొడలు మఱచి పాఠకులను మఱపించి నాడు. యతినియమము పాటింపబడుటచేత గేయము లందు నడకసొంపు హెచ్చైనది. శైలి సంస్కృతాంధ్ర పదములతో నాయాచోటులకు దగిన ట్లున్నది. ఈకవి రసవత్తర కావ్యముల రచించి ఆంధ్రలోకమున కర్పించునని తలచుచున్నాము.

వెంపటి శ్రీనివాసమూర్తి.

పత్రికాస్వీకారము

"ప్రబుద్ధాంధ్ర" — సంపాదకులు: శ్రీపండిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు.

జనాదరం తక్కువయి, చాలాకాలంనుంచి ఆగిపోయిన ఈ పత్రికకు మంచి ఆసరాదొరకి ఇప్పుడు అది పునర్దర్శనమివ్వడం ఆంధ్రాభిమానులకందరికీ ముదావహమయిన విషయం. శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రిగారి వలె ప్రతీవిషయాన్నీ, ప్రతీసమస్యనూ ఆంధ్రదృష్టితో [illegible]ంచి, మంచిచెడ్డలూ, లాభనష్టాలూ తర్కించి,

నిర్భయంగా, నిర్మొహమాటంగా వ్రాయగలవారూ, చెప్పగలవారూ మన దేశంలో చాలా అరుదు. ఇటువంటి సందర్భంలో ప్రబుద్ధాంధ్ర మళ్లీ వస్తోందంటే సంతోషించనివా రుండరు. ఆంధ్రరాష్ట్రోద్యమ ఉత్సాహం వెనుకబట్టిన ఈరోజులలో మరల తమ ఉద్బోధనలతోను, తీవ్రవ్యాఖ్యలతోను ఆంధ్రులకు చురుకుపుట్టించడానికి ఈ పత్రిక ఉండడం ఎంతేనా అవసరం. దీనికి ఆంధ్రులు తగిన ఆదరాభిమానాలు చూపి పోషిస్తారని నమ్ముతున్నాము. వెనుకటి సంచికలవలెనే ఈ సంచిక కూడా ఘాటయిన, తీవ్రమయిన వ్యాఖ్యలతోటీ, చక్కని కథలూ వ్యాసాలతోటి అలరారుతోంది.

గ్రంథస్వీకారము

అమ్మ:— మాక్సిం గోర్కీ వ్రాసిన 'మదర్' అను గ్రంథమునకిది అనువాదము. అనువాదకులు: శ్రీ వడ్డాది లింగరాజుగారు. కొత్త బుక్ డిపోవారిచే ప్రకటితము. వెల ౧—౮—౦.

చీనా — జపాను, జెకోస్లొవేకియా—జర్మనీ:— రచయిత కె. రంగాచార్యులుగారు. విజయనగరమందలి రామానుజాచార్య విద్యాసమితివారి ౧౩-వ ప్రచురణము. వెల సమితి చందాదారులకు ౦—౪—౦. ఇతరులకు ౦—౬—౦,

ఐదు ఏకాంకములు:— గ్రంథకర్త: కృష్ణ శర్మగారు. నవజీవన గ్రంథమండలిలోని ప్రథమ పుష్పము. శ్రీకాకుళమునందలి రైతాంగ ముద్రణాలయములో శ్రీశివరావుగారిచే ప్రకటితము. వెల ౦—౪—౦.

కమ్యూనిజానికే జయం:— ఆదర్శ గ్రంథమాల వారి ౧౮ వ ప్రచురణము. డిమిట్రాఫ్ వ్రాసిన దానికి అనువాదము. అనువాదకుడు: నవయుగ తాంతియాగారు — ఎలమర్రు — కృష్ణాజిల్లా. వెల ౦—౧—౦.

తిరుగుబాటు:— గ్రంథకర్త: మునిమాణిక్యం నరసింహారావుగారు. ఇదియు పై మండలివారి ౧౮ వ ప్రచురణము. వెల ౦—౪—౦.

మాలపిల్ల:—కర్త: గద్దె లింగయ్యగారు. కృష్ణాజిల్లా ఎలమర్రులోని ఆదర్శ గ్రంథమండలివారి ౧౬ వ ప్రచురణము. వెల ౦—౪—౦.

మనసంపద:— క్రోపాట్కిన్ వ్రాసినదానికి గద్దె లింగయ్యగారు అనువాదము కావించిరి. కృష్ణాజిల్లా — ఎలమర్రునందలి ఆదర్శగ్రంథమాలలోని ౧౫-వ గ్రంథము. వెల ౦—౧—౦.

కోకిల:— సంపాదకుడు: నండూరు శేషాచార్యులుగారు: బెజవాడలోని కౌశిక గ్రంథమాలయందలి ప్రథమ పుష్పము. వెల ౦—౮—౦.

కొన్ని కొత్త పద్యాలు:— ప్రణేత: టంగుటూరి శ్రీరాములుగారు. వావిళ్లవారి ప్రెస్సులో ముద్రితమైనది. వెల రు. ౦-౪-౦.

మదరాసు ఋణస్థుల సహాయపు ఆక్టుమాన్యుయల్:— గ్రంథకర్త: బందా కనకరాజుగారు. పశ్చిమ గోదావరిజిల్లా, ఏలూరులోని రామా అండ్ కంపెనీవారివల్ల ప్రచురింపబడినది వెల ౧-౪-౦.

'మైసూరు మే':— మైసూరు విషయమై హిందీభాషలో వ్రాయబడిన గ్రంథము. లేఖకుడు: గురువాళశర్మగారు. మద్రాసునందలి దేశీరాజ్య సాహిత్య మందిర్ వారిచే ప్రకటితము. వెల ౦—౮—౦.

ప్రాక్టికల్ రిజువెనేషన్ ఇన్ మెన్ అండ్ విమెన్. ఇంగ్లీషు గ్రంథము. రచయిత: డాక్టర్. కె. వి. మాథ్యూగారు. శ్రీమతి అనీ మాథ్యూస్ గారి వలన ప్రచురింపబడినది వెల రు. ౩-౧౨-౦.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty St., Madras. Editor:— S. Sambhu Prasad.